www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



కొ..క్కొ..క్కో.. కోట్లు

- పండగ మూడు రోజులూ జోరుగా పందేలు
- పేకాట, గుండాటల్లోనూ తెగిన కరెన్సీ కట్టలు
- 400 కోట్లు దాటిన కాకినాడ జిల్లా పందెం
- మిగతా జిల్లాల్లో రూ.100 కోట్లు దాటించేశారు
- ఎన్నికల ఏడాదిలో వైసీపీ నేతల బరితెగింపు
- బరులవద్ద ఓట్ల హడావుడి.. ఏరులైన మద్యం

కృష్ణా జిల్లా ఈడుపుగల్లులో అట్టహాసంగా ఉన్న ఓ బరి

3

బుధవారం | 17-1-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 272 |

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, శుక్లపక్షం; తిథి: సప్తమి రా. 10.08 తదుపరి అష్టమి; నక్షత్రం: రేవతి తె. 3.35 తదుపరి అశ్విని; వర్జ్యం: సా. 4.07 నుంచి 5.38 వరకు; దుర్ముహూర్తం: మ. 12.03 నుంచి 12.48 వరకు; అమృతఘడియలు: రా. 1.17 నుంచి 2.49 వరకు;

విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

పీసీసీ పగ్గాలు షర్మిలకే

ఏఐసీసీ ప్రకటన

- అధిష్ఠానం సూచనతో గిడుగు రాజీనామా
- సీడబ్ల్యూసీ ఆహ్వానితుడిగా నియామకం
- పార్టీ పునర్నిర్మాణం, పూర్వవైభవానికి కృషి: షర్మిల
- షర్మిలకు బాధ్యతలపై ముందే చెప్పిన 'ఆంధ్రజ్యోతి'



న్యూఢిల్లీ/అమరావతి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): అనుకున్నదే జరిగింది! 'ఆంధ్రజ్యోతి' చెప్పిందే నిజమైంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సోదరి వైఎస్ షర్మిల రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలిగా నియమితులయ్యారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఈ నిర్ణయం తీసుకున్నారంటూ... మంగళవారం కాంగ్రెస్ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ అధికారిక ప్రకటన విడుదల చేశారు. ఆమె నియామకం వెంటనే అమలులోకి వస్తుందని పేర్కొన్నారు. షర్మిలకే ఏపీ కాంగ్రెస్ పగ్గాలు అప్పగిస్తారని డిసెంబరు 26నే 'ఆంధ్రజ్యోతి' వెల్లడించింది. పీసీసీ అధ్యక్షురాలిగా మంగళవారం

మిగతా 11వ పేజీలో...

షర్మిల.. కొత్త చరిత్ర

- ఏపీసీసీకి తొలి మహిళా సారథి.. పీసీసీ చీఫ్‌గా నాడు తండ్రి.. నేడు తనయ
- ఏ పదవీ లేకుండానే సారథ్యం.. ఏపీలో జాతీయ పార్టీల సారథులిద్దరూ మహిళలే
- వారిద్దరూ మాజీ సీఎంల కుమార్తెలు.. ఒక కుటుంబం నుంచే 2 పార్టీలకు సారథులు
- అన్నవి అధికార రాజకీయాలు..చెల్లెలివి విపక్ష బాధ్యతలు

11

ఇక జగన్‌పై ప్రత్యక్ష దాడి!

- షర్మిలే ఆలంబనగా కాంగ్రెస్ పోరాటం!
- వైఎస్ అభిమానులను సొంత గూటికి తీసుకురావడమే లక్ష్యం
- జగన్‌ను వీడుతున్న అసంతుష్టులకు ప్రత్యామ్నాయంగా షర్మిల



నాసిన్ ప్రధాన భవన సముదాయం.. బటన్ నొక్కి ప్రారంభిస్తున్న ప్రధాని మోదీ. పక్కన గవర్నర్ నజీర్, సీఎం జగన్

రాముడి మాటే మా బాట

సుపరిపాలనకు రామరాజ్యమే ప్రేరణ

అధర్మంగా వస్తే ఇంద్రప్రస్థమైనా వద్దని శ్రీరాముడు అన్నారు

- అధికారులు దీనిని గుర్తుంచుకోవాలి
- పన్నుల వ్యవస్థలో సంస్కరణలు తెచ్చాం
- ఆ ఫలితాలు నేడు మన కళ్లముందున్నాయి
- 25 కోట్ల మంది పేదరికాన్ని జయించారు
- ప్రజలు చెల్లించే ప్రతి పైసా వారి సంక్షేమానికే
- సుపరిపాలనకు 'నాసిన్' సరికొత్త కేంద్రం
- ఆధునిక పన్ను వ్యవస్థే దీని లక్ష్యం: ప్రధాని
- దేశంలోనే అతిపెద్ద నాసిన్ క్యాంపస్ ప్రారంభం

"రామరాజ్యంలో ప్రతి పౌరుడు చెప్పేదీ వింటారు. అంటే, అందరికీ ప్రాధాన్యం ఇస్తారు. అందుకే రామరాజ్య వాసుల్లారా ఉన్నతంగా ఆలోచించండి. న్యాయం కోసం పోరాడండి. అందరినీ సమానంగా చూడండి. బలహీనులను రక్షించండి. ధర్మమే అన్నింటికంటే ఉన్నతమైనదని గుర్తించండి!" - ప్రధాని మోదీ


పుట్టపర్తి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): సుపరిపాలనకు రామరాజ్యమే అసలైన నిదర్శనమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. దేశానికి ఆధునిక పన్ను వ్యవస్థను అందించడమే కస్టమ్స్, పరోక్ష పన్నులు, మాదక ద్రవ్యాల నియంత్రణ జాతీయ అకాడమీ (నాసిన్) లక్ష్యమన్నారు. శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలం పాలసముద్రం గ్రామంలో ఏర్పాటైన దేశంలోనే అతిపెద్ద నాసిన్ క్యాంపస్‌ను మంగళవారం ప్రధాని మోదీ

మిగతా 2వ పేజీలో...

రాష్ట్రానికే తలమానికం 'నాసిన్'

టీడీపీ టైంలో శ్రీకారం.. ఇప్పుడు ప్రారంభం

17ఏపై చెరో మాట!




- స్కిల్ కేసులో చంద్రబాబుకు వర్తింపజేయడంపై ద్విసభ్య ధర్మాసనంలో భిన్నాభిప్రాయాలు
- విస్తృత ధర్మాసనానికి చంద్రబాబు కేసు!
- చీఫ్ జస్టిస్‌కు నివేదిస్తూ నిర్ణయం
- 17ఏ వర్తిస్తుంది.. కేసు అక్రమం
- ముందుగా అనుమతి తీసుకోవాల్సిందే: జస్టిస్ బోస్
- పాత నేరాలకు వర్తింపజేయలేం: జస్టిస్ బేలా త్రివేది

న్యూఢిల్లీ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) టీడీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం చంద్రబాబుపై సీఐడీ దాఖలు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ కేసుకు అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 17ఏ వరిస్తుందా? లేదా?... ఆయనపై కేసు చెల్లుతుందా? లేదా? ఈ అంశంపై సుప్రీంకోర్టు ధర్మాసనంలోని ఇద్దరు న్యాయమూర్తులు భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తంచేశారు. దీనిపై తగిన నిర్ణయం తీసుకోవాలని సుప్రీం ప్రధాన న్యాయమూర్తికి నివేదించారు. వెరసి... దీనిపై విస్తృత ధర్మాసనం తదుపరి విచారణ జరిపే అవకాశముంది. సవరించిన అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 17ఏ ప్రకారం తనపై కేసు నమోదుకు సంబంధిత అథారిటీ నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలని... సీఐడీ దీనిని పట్టించుకోలేదని... కేసును కొట్టివేయాలని చంద్రబాబు దాఖలు చేసిన పిటిషన్‌ను అంతకుముందు హైకోర్టు తోసిపుచ్చింది. దీంతో... ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ బేలా త్రివేదిలతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. గత ఏడాది అక్టోబరు 17వ తేదీన రిజర్వు చేసిన తీర్పును... మంగళవారం వెలువరించింది. అయితే... దీనిపై ఇరువురు

మిగతా 11వ పేజీలో...

చరిత్రలో ఎన్నడూ లేనన్ని దొంగ ఓట్లు



- వైసీపీ నేతల చేతుల్లోకి ఆర్వోల లాగిన్, పాస్‌వర్డ్
- ఇష్టానుసారంగా ఓటరు జాబితాల తారుమారు
- ఈసీకి కేస్ స్టడీగా చంద్రగిరి ఓటర్ల వివరాలు
- వైసీపీ నేతలకు డబ్బులు ఎలా వస్తున్నాయో?
- ఓడిపోతామన్న భయంతో కుప్పంలో అరాచకాలు: బాబు

3


పట్నంలో అశాంతి

● ఆమె రాజకీయ కుటుంబం నుంచి వచ్చారు.. అత్తింటివారు కూడా ఉన్నత అధికార కొలువులు నిర్వహించారు. అయినా ఎమ్మెల్యేగా తన 'మార్క్' చూపించలేకపోతున్నారు. ప్రజలకు అందుబాటులో ఉండరు. తరచూ ఢిల్లీ వెళ్లి వస్తుంటారు. 'పట్నం'లో అంతా ఎమ్మెల్యే పీఏలదే రాజ్యం. సిఫారసు లేఖ సహా ఏ పని కావాలన్నా వారికి ముడుపులు ఇవ్వాల్సిందే. ఇసుక అక్రమ తవ్వకాలకు సహకరిస్తూ కమీషన్లు దండుకుంటున్నారు. ఇందులో ఎమ్మెల్యేకూ వాటాలు అందుతున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. ఇక నియోజకవర్గంలో కాంట్రాక్టులన్నీ ఎమ్మెల్యే బంధువర్గానికే.

● 'ముఖ్య నేత'కు భర్త సహకారం

గతంలో ఎమ్మెల్యే భర్త కీలక స్థానంలో ఉన్నప్పుడు వైసీపీ 'ముఖ్య నేత'కు సహకారం అందించారని.. ఆ పరిచయంతో ఆమెకు టికెట్ ఇచ్చారని ప్రచారం జరుగుతోంది. ఇప్పుడు కుమార్తె అత్యున్నత సర్వీసు అధికారిణిగా మరో రాష్ట్రంలో పనిచేస్తున్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యేపై తీవ్ర వ్యతిరేకత ఉన్నా.. ఆ కుటుంబంతో భవిష్యత్ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఆమెను ఏమీ అనలేని స్థితిలో వైసీపీ అధిష్ఠానం ఉన్నట్టు సమాచారం.

ప్రజలకు దూరంగా మహిళా ఎమ్మెల్యే



- అక్రమార్జనలో పీఏలు తలమునకలు
- ఏ పని కావాలన్నా సొమ్ములివ్వాల్సిందే
- వారి ద్వారా ఎమ్మెల్యేకూ వాటాలు
- ఇసుక అక్రమ రవాణాలో కాసుల పంట
- వంశధార నుంచి నిత్యం ఒడిసాకు
- కాంట్రాక్టు పనులన్నీ బంధువర్గానికే
- అక్రమాలకు ఎమ్మెల్యే పరోక్ష సహకారం
- సొంత పార్టీలోనే తీవ్ర వ్యతిరేకత

(శ్రీకాకుళం-ఆంధ్రజ్యోతి)

2014 ఎన్నికల్లో ఓటమి చెందారు. 2019 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆ నియోజకవర్గానికి పేరుకే ఎమ్మెల్యే. అక్కడ పెత్తనమంతా పీఏలదే. ఎమ్మెల్యే తరచూ ఢిల్లీ వెళ్లి వస్తుండడం.. నియోజకవర్గంలో పాలన పీఏలకు అప్పగించేయడంతో వారే షాడో ఎమ్మెల్యేగా మారారు. ప్రజలు తమ సమస్యలు విన్నవించుకోవాలన్నా, ఏదైనా పని కావాలన్నా ఎమ్మెల్యేను కలవాలంటే ముందుగా వారి అనుమతి పొందాలి. కాంట్రాక్టు పనులు గానీ.. అధికారులతో పనులు గానీ ఏది జరగాలన్నా ముడుపులు

మిగతా 12వ పేజీలో...

దావోస్‌కు బైబై!

విశ్వవేదికపై పెట్టుబడుల ఆకర్షణకు తొలి నుంచీ నిరాసక్తత

- చలి వల్ల వెళ్లడం లేదని గత ఏడాది ప్రకటన
- ఈ ఏడాది మొత్తానికే చాప చుట్టేసిన సర్కారు
- 'టికెట్ గల్లంతు' గందరగోళంలో ఐటీ మంత్రి
- ఏపీ అంటేనే పారిశ్రామికవేత్తలకు హడల్
- అడ్డగోలు కమీషన్లు ఇచ్చుకోలేక ఇతర రాష్ట్రాలకు
- విశాఖలో వ్యాపారాలు చేయలేనని స్వయంగా వైసీపీ ఎంపీ వెల్లడి

పెట్టుబడులపై జగన్ సర్కారు పలాయనం

- ఒక్కసారే దావోస్‌కు వెళ్లిన జగన్
- పెట్టుబడుల్లేవుగానీ వివాదంగా ముగిసిన పర్యటన
- అక్కడా అదానీ, షిరిడీ సాయిలతోనే ఒప్పందాలు



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడంలో తన నిరాసక్తతను రాష్ట్ర ప్రభుత్వం మరోసారి బయట పెట్టుకుంది. దావోస్ వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సులో పాల్గొనాలంటూ వచ్చిన ఆహ్వానంపై ముఖ్యమంత్రి జగన్ ఈసారీ మౌనం దాల్చారు. దావోస్‌లో విపరీతంగా చలి ఉండటం వల్ల అక్కడకు వెళ్లలేకపోతున్నామని గత ఏడాది పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ ప్రకటించడం పారిశ్రామిక వర్గాలను విస్మయపరిచింది."మైనస్ 14 డిగ్రీల ఎముకలు కొరికే చలిలో స్నానం చేయడం కష్టం" అని అప్పట్లో మంత్రి సెలవిచ్చారు. ఈ ఏడాది

మిగతా 3వ పేజీలో...



10

సుమిత్ జిగేల్

- ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో 27వ ర్యాంకర్‌పై సంచలన విజయం
- గ్రాండ్‌స్లామ్‌లో సీడెడ్‌ను ఓడించిన రెండో భారతీయుడు
- ప్రత్యర్థిని వరుస సెట్లలో మట్టికరిపించి రెండో రౌండ్‌కు

'విశాఖ ఉక్కు'పై మరో కుట్ర

11

- 1500 మంది ఉద్యోగుల తొలగింపునకు ప్లాన్
- కొత్తగా వలంటరీ సెపరేషన్ స్కీమ్.. ఎలాంటి ఆర్థిక ప్రయోజనాలు లేకుండా ఇంటికి పంపేసే యత్నం
- వైద్యం, బీమాతో సరి.. 2లోగా నివేదికకు ఆదేశం

రాముడి నోటి మాటే.. 'లేపాక్షి'!


లేపాక్షిలోని ఏకశిలా నంది

- విజయనగర రాజుల కాలంలో నిర్మితం
- ఆలయంలో అణువణువూ కళాఖండమే
- పైకప్పు లోపలి వైపు తైలవర్ణ చిత్రాలు...
- ప్రధాని రాకతో మరింత ప్రాచుర్యం!
- అతి పెద్ద ఏకశిలా బసవయ్య విగ్రహం
- నేటికీ మిస్టరీగానే వేలాడే స్తంభం


అయోధ్య రామమందిరంలో బాల రాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠకు ముహూర్తం ఆసన్నమైంది. ఈ సమయంలో రామాయణంతో సంబంధం ఉన్న లేపాక్షి వీరభద్రస్వామి ఆలయాన్ని ప్రధాని మోదీ మంగళవారం సందర్శించారు. దీంతో ప్రస్తుతం అందరి దృష్టి లేపాక్షి ఆలయంపై పడింది. ప్రధాని రాకతో ఈ ఆలయం మరింత ప్రాచుర్యం పొందుతుందని భావిస్తున్నారు. శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం నియోజకవర్గ కేంద్రానికి సుమారు 14కి.మీ. దూరంలో ఉన్న ఈ ఆలయంలో అణువణువూ ఓ కళాఖండమే. క్రీ.శ. 1528 నుంచి క్రీ.శ. 1549 వరకు ఆలయ నిర్మాణం జరిగిందని ఇక్కడి శాసనాల ద్వారా తెలుస్తోంది. ఆలయంలో మొత్తం 878 స్తంభాలు ఉన్నాయి. ఇందులో 246 స్తంభాలపై శిల్ప కళాకృతులు అప్పటి శిల్ప నైపుణ్యానికి నిలువెత్తు సాక్ష్యం. ఆలయం పైకప్పు లోపలివైపు గీసిన అద్భుతమైన తైలవర్ణ చిత్రాలను చూడటానికి రెండు కళ్లూ చాలవు. భారత, రామాయణ, శివపురాణాల్లోని ప్రముఖ ఘట్టాలను చిత్రీకరించారు. వీటిలోని డిజైన్లను నేటికీ కలంకారీ కళలో వాడుతున్నారు.

ఏడు ప్రాకారాల అద్భుత కట్టడం

లేపాక్షి వీరభద్రస్వామి ఆలయం ఏడు ప్రాకారాలతో భారీ ఎత్తున నిర్మించారు. మొదటి ప్రాకారంలో గర్భగుడి, రెండో ప్రాకారంలో నాట్య కళామండపాలు ఉన్నాయి. మూడో ప్రాకారంలో ధ్వజస్తంభం కనిపిస్తుంది. మిగిలిన నాలుగు ప్రాకారాలు శిథిలమయ్యాయి. గర్భగుడికి పడమర దిశలో ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన నీటి కొలను ఉంది. ఆలయంలోని పెద్ద ఉగ్ర గణపతి విగ్రహం ఆకట్టుకుంటుంది. రెండో మహాద్వారాన్ని దాటితే నాట్యమంటపం వస్తుంది. దీనిని ఎనిమిది జతల ఉత్తమ అశ్వాలు కట్టిన రథంలా తీర్చిదిద్దారు. గుడికి పడమర దిశలో ఆంజనేయ మండపం ముందున్న బండపై నిరంతరం నీరు ప్రవహించే (సీతాదేవి పాదం) పాదం, తాండమేశ్వర లింగం మరో ఆకర్షణ. దేశంలో ఉన్న 108 శైవక్షేత్రాల్లో లేపాక్షి వీరభద్రాలయం ఒకటిగా చెబుతారు. వీరభద్రస్వామి ఉగ్రుడు కాబట్టి, ప్రవేశ ద్వారానికి కొంచెం పక్కన గర్భాలయాన్ని నిర్మించారు. దీనికి ఆగ్నేయ దిశలో ఉన్న ఎత్తయిన శివలింగానికి కవచంగా ఏడు శిరస్సులతో నాగేంద్రుడు మూడుసార్లు చుట్టుకొని ఉన్నట్లు దర్శనమిస్తాడు. ఆలయంలో నాట్యమండపం పైకప్పు నుంచి ఒక పెద్ద స్తంభం వేలాడుతూ ఉంటుంది. దీనినే అంతరిక్ష స్తంభం అని కూడా అంటారు. గర్భగుడి ముందు నేలకు తాకీ తాకనట్లుగా ఉండే ఈ స్తంభం ప్రత్యేక ఆకర్షణ. ఈ స్తంభం ఎలా వేలాడుతోందనే రహస్యాన్ని ఇప్పటికీ ఎవరూ ఛేదించలేకపోయారు. దీని కింద చేతి రుమాలుని ఇటు నుంచి అటు తీసుకోవచ్చు.

సీతాపహరణాన్ని అడ్డుకునేందుకు యత్నించిన జటాయువు రెక్కలను రావణుడు ఖండించాడు. తన భార్య కోసం గాలిస్తూ ఆ మార్గాన వెళ్తున్న శ్రీరాముడికి కొన ఊపిరితో ఉన్న ఆ పక్షి కనిపించింది. గాయాలతో బాధ పడుతున్న జటాయువును రాముల వారు 'లే.. పక్షీ.' అన్నారు. అప్పటి నుంచి ఆ ప్రాంతానికి 'లేపక్షీ' అనే పేరు వచ్చిందని, కాలక్రమేణా అది 'లేపాక్షి'గా మారిందని పురాణ గాథ.

విజయనగర రాజుల్లో ఒకరైన అచ్యుతరాయల వద్ద కోశాధికారిగా పనిచేసిన విరూపణ్ణ... తన కులదైవమైన వీరభద్రుడి పేరుతో లేపాక్షి ఆలయాన్ని రాజు అనుమతి లేకుండా నిర్మించాడు. ఆయనంటే గిట్టనివారు ఈ విషయాన్ని రాజుకి చేరవేశారు. దీంతో రాజు విధించబోయే శిక్షను తనకు తానుగానే విరూపణ్ణ విధించుకున్నారు. తన రెండు కళ్లను పెకిలించుకుని, ఆలయ దక్షిణ భాగంలో ఉన్న గోడకేసి విసిరికొట్టాడట. ఇప్పటికీ ఆ గోడపై ఎర్రటి గుర్తులు కనిపిస్తాయి. అవి విరూపణ్ణ కంటి రక్తపు మరకలేనని విశ్వసిస్తారు. అలా ఆ ప్రాంతానికి లోప అక్షి (కళ్లు లేని) పేరు వచ్చిందని, కాలక్రమంలో అదే లేపాక్షి అయిందనీ చెబుతారు.


లేపాక్షి వీరభద్రుడికి హారతి ఇస్తున్న ప్రధాని మోదీ

లేపాక్షి బసవయ్య రాజసం

లేపాక్షికి తూర్పు నుంచి ప్రవేశ మార్గంలోనే, ఆలయానికి ఈశాన్య దిశలో లేపాక్షి-హిందూపురం ప్రధాన రహదారికి ఆనుకొని అతి పెద్ద ఏకశిలా నంది విగ్రహం ఉంటుంది. దీనిని 'లేపాక్షి బసవయ్య' అంటారు. బసవయ్య మెడలో పూసల హారాలు, గంటలు, రిక్కించిన చెవులు, లేవబోతూ కాలుని సరిచేసుకుంటున్న భంగిమ, మెడలో గండభేరుండ హారం, రాయలవారి రాజ ముద్రిక చూపరులను ఆకట్టుకుంటాయి. నందికి 29 గంటలు ఉన్న మెడపట్టీ, దానిపై 18 మువ్వల పట్టీ, దానిపై 27 రుద్రాక్షల మాలను చూస్తే.. సాక్షాత్తు బసవేశ్వరుడిని చూసినట్లే ఉంటుంది.

వైభవంగా లేపాక్షి ఉత్సవాలు

సినీరంగంలో మంచి గుర్తింపు పొందిన చిత్రాలకు లేపాక్షి నంది పురస్కారాలను అందజేస్తున్నారు. 2021లో ఢిల్లీలో జరిగిన గణతంత్ర దినోత్సవాల్లో లేపాక్షి శకటాన్ని ప్రదర్శించారు. ఈ శకటంపై ఏకశిల నంది విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. లేపాక్షి శిల్పకళ, ఆలయ విశిష్టతను తెలియజేసేందుకు కాంగ్రెస్ హయాంలో లేపాక్షి ఉత్సవాలు జరిపారు. గత టీడీపీ హయాంలో ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ప్రత్యేక చొరవ తీసుకొని అత్యంత వైభవంగా మరోమారు ఉత్సవాలను జరిపించారు.

- హిందూపురం

లేపాక్షి శిల్పసంపద

మహాద్భుతం: మోదీ

- వీరభద్ర స్వామికి స్వయంగా హారతి

హిందూపురం, జనవరి 16: భారతీయ చారిత్రక, పురాతన వైభవానికి లేపాక్షి నిదర్శనమని, ఇక్కడి శిల్పసంపద మహా అద్భుతమని ప్రధాని మోదీ అభివర్ణించారు. శ్రీసత్యసాయి జిల్లాలోని చారిత్రక, పర్యాటక కేంద్రం లేపాక్షిని మంగళవారం ఆయన సందర్శించారు. పుట్టపర్తి నుంచి హెలికాప్టర్‌లో మధ్యాహ్నం 1.30 గంటలకు లేపాక్షికి చేరుకున్నారు. అక్కడినుంచి రోడ్డు మార్గాన వీరభద్రస్వామి ఆలయానికి వెళ్లారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. మోదీ స్వయంగా స్వామికి హారతి ఇచ్చారు. కాసేపు ధ్యానంలో కూర్చున్నారు. ఆలయ విశిష్టతను ఆయనకు అర్చకులు వివరించారు. ధర్మవరం మండలం నిమ్మలకుంట కళాకారులు ప్రధాని కోసం ప్రత్యేకంగా తోలుబొమ్మలాటను ప్రదర్శించారు. రామాయణంలోని జటాయువు ఘట్టాన్ని తోలుబొమ్మల ఆట ద్వారా వీక్షించిన మోదీ పరవశించిపోయారు. రంగనాథ రామాయణంలోని శ్రీరామ పట్టాభిషేకం, శ్రీరామ సంకీర్తనలను కళాకారులు ప్రదర్శించారు.


పాలసముద్రం నాసిన్ ముఖద్వారం

రాష్ట్రానికే తలమానికం 'నాసిన్'

- టీడీపీ హయాంలో శంకుస్థాపన
- మోదీ చేతుల మీదుగా ప్రారంభం

పుట్టపర్తి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన నాసిన్(నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్, ఇన్‌డైరెక్ట్ ట్యాక్సెస్ అండ్ నార్కోటిక్స్) పేరు ప్రస్తుతం దేశవ్యాప్తంగా మార్మోగుతోంది. శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలం పాలసముద్రం గ్రామ సమీపంలో ఏర్పాటైన ఈ ప్రఖ్యాత శిక్షణా కేంద్రాన్ని ప్రధాని మోదీ మంగళవారం ప్రారంభించారు. పాలసముద్రం వద్ద ఏర్పాటైన నాసిన్‌కు ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి. రాష్ట్ర విభజన తర్వాత అనంతపురం జిల్లా అభివృద్ధిపై అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టి పెట్టారు. జిల్లాను పారిశ్రామిక హబ్ చేయాలని నిర్ణయించారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలైన నాసిన్, భారత్ ఎలక్ట్రానిక్స్ డిఫెన్స్ సిస్టమ్ ఇంటిగ్రేషన్ సముదాయాన్ని(బెల్) జిల్లాకు తీసుకురావడంలో సఫలీకృతులయ్యారు. వాటి ఏర్పాటుకు చకచకా భూములు కేటాయించారు. 2015, ఏప్రిల్ 11న అప్పటి సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి అరుణ్‌జైట్లీ నాసిన్ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. తర్వాత ఆరేళ్లపాటు పనులు నెమ్మదించాయి. గత రెండేళ్లుగా కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించడంతో నిర్మాణాలు వేగం పుంజుకున్నాయి.

తొలి అతిపెద్ద శిక్షణ అకాడమీ

దేశంలో మొట్టమొదటిసారిగా 1996లో హరియాణాలోని ఫరీదాబాద్‌లో 23 ఎకరాల్లో తొలి నాసిన్‌ను ఏర్పాటు చేశారు. కేంద్ర కార్యాలయంగా ఫరీదాబాద్ ఉండగా.. ఢిల్లీ, చెన్నై, కోల్‌కతా, ముంబైలో జోనల్ కేంద్రాలు ఉన్నాయి. పాలసముద్రం వద్ద 503.10 ఎకరాల్లో ఏర్పాటైన నాసిన్ దేశంలోనే రెండోదిగా నిలిచింది. విస్తీర్ణం పరంగా అతిపెద్దది. దక్షిణ భారతంలో తొలి అకాడమీగా నిలిచింది. ఇక్కడ యూపీఎస్సీ పోటీ పరీక్షల్లో ఎంపికైన ఇండియన్ రెవెన్యూ సర్వీసెస్(ఐఆర్ఎస్) అభ్యర్థులకు శిక్షణ ఇస్తారు. పరోక్ష పన్నుల రంగంలో సామర్థ్యాన్ని పెంపొందించే అంశాలపై శిక్షణ ఇస్తారు. ఇందులో జీఎస్టీ, కస్టమ్స్, సెంట్రల్ ఎక్సైజ్, సేవాపన్నుల వసూలు, మాదక ద్రవ్యాల నియంత్రణ, యాంటీ మనీల్యాండరింగ్, సైబర్ సెక్యూరిటీ, మేధో సంపత్తి తదితరాలను బోధించనున్నారు.

రాముడి మాటే మా బాట

(మొదటి పేజీ తరువాయి)

ప్రారంభించారు. 'అయోధ్య'లో రాముడి ప్రతిష్ఠకు రంగం సిద్ధమవుతున్న నేపథ్యంలో.. 'నాసిన్' ప్రారంభోత్సవ వేదికపైనా మోదీ రాముడి మాట, రాముడి బాట, రాముడి పరిపాలనను పదేపదే గుర్తు చేశారు. తప్పుడు మార్గాన్ని అనుసరించేవారిపట్ల కఠినంగా వ్యవహరించాలని దిశా నిర్దేశం చేశారు. అధికారాలను వివేకంతో వినియోగించాలని సూచించారు. ఈ విషయంలో శ్రీరాముడి జీవితం నుంచే ప్రేరణ లభిస్తుందన్నారు. "తాను తలచుకుంటే సాగరం అడుగునున్న నేలను కూడా సొంతం చేసుకోగలనని... కానీ, అధర్మమార్గంలో ఇంద్రప్రస్థం లభించినా స్వీకరించబోనని శ్రీరాముడు లక్ష్మణుడితో చెప్పారు" అని మోదీ వివరించారు. చిన్నచిన్న ప్రలోభాలతో కర్తవ్యాన్ని మరచిపోతున్న అధికారులను చూస్తున్నామని, అందుకే విధి నిర్వహణ సమయంలో శ్రీరాముడు చెప్పిన ఈ మాటలను తప్పక గుర్తుంచుకోవాలని నిర్దేశించారు. "నాసిన్ కేంద్రం సుపరిపాలనకు సరికొత్త కేంద్రంగా మారనుంది. దేశంలోని వ్యాపార, పరిశ్రమలకు నూతన దిశ కల్పించనుంది" అని తెలిపారు. నాసిన్‌లో శిక్షణ పొందుతున్న ఐఆర్ఎస్(ఇండియన్ రెవెన్యూ సర్వీసెస్) అధికారులను అమృత కాలానికి నేతృత్వం వహించే 'కర్మయోగుల అమృత బృందం'గా అభివర్ణించారు. "ప్రజాస్వామ్యంలో రాజులు ఉండరు. ఇక్కడి పవిత్ర లేపాక్షిలో వీరభద్రస్వామి ఆలయానికి వెళ్లి రంగనాథ రామాయణం వినే భాగ్యం నాకు కలిగింది. భక్తులతో కలిసి భజన, కీర్తనలో పాల్గొన్నాను. ఈ సమీపంలోనే శ్రీరాముడికి జటాయువుతో సంవాదం జరిగిందని చెబుతుంటారు. అయోధ్యలో శ్రీరాముడి భవ్యమందిరంలో ప్రాణ ప్రతిష్ఠకు ముందు నేను 11 రోజుల అనుష్ఠాన దీక్షలో ఉన్నాను. ఇలాంటి పుణ్య సమయంలో ఇక్కడ దేవుడి ఆశీర్వాదం పొంది ధన్యుడినయ్యాను. ప్రస్తుతం దేశమంతా రామ మయమైంది. రాముడి భక్తిలో అంతా మునిగితేలుతున్నారు. సుపరిపాలనకు శ్రీరాముడు నిదర్శనం. రామరాజ్య పాలనే అసలైన ప్రజాస్వామ్య పాలన అని మహాత్మాగాంధీ కూడా చెప్పారు' అని మోదీ తెలిపారు.

రామరాజ్యంలో వలే పన్నుల వ్యవస్థ...

రామరాజ్యంలో పన్నులు ఎలా ఉండేవో గోస్వామి తులసీదాస్ వివరించారని, సూర్యుడు భూమి నుంచి నీటిని సంగ్రహిస్తాడని, మళ్లీ అదే నీరు మేఘాలుగా మారి వర్షం రూపంలో తిరిగి భూమిపైకి చేరుతుందని మోదీ తెలిపారు. మన పన్నుల వ్యవస్థ కూడా అలా ఉండాలని సూచించారు. పన్నుల రూపంలో వచ్చే ప్రతి పైసా తిరిగి ప్రజా సంక్షేమానికి వినియోగించాలని స్పష్టం చేశారు. ఇదే ప్రేరణతో తాము గత పదేళ్లుగా పన్నుల వ్యవస్థలో అనేక సంస్కరణలు తీసుకొచ్చామని తెలిపారు. సంస్కరణల ఫలితంగానే నేడు దేశంలో రికార్డుస్థాయిలో పన్నులు వసూలవుతున్నాయని చెప్పారు. తమ డబ్బు సద్వినియోగమవుతుండటం దేశంలోని పన్ను చెల్లింపుదారులంతా చూస్తున్నారన్నారు. అందుకే పన్ను చెల్లించేందుకు సంతోషంగా ముందుకు వస్తున్నారని తెలిపారు. అలా గత కొన్నేళ్లుగా పన్నులు చెల్లించేవారి సంఖ్య క్రమంగా పెరుగుతోందని తెలిపారు. ఇదే సుపరిపాలన అని, ఇదే రామరాజ్యం సందేశమని చెప్పారు.

10 లక్షల మంది అనర్హుల పేర్లు తొలగించాం..

తోటమాలి మొక్కలను ఏ విధంగా కాపాడుతుంటాడో, వాటికి పోషణ అందిస్తాడో, వాటికి అందాల్సిన పోషణను లూటీ చేసే కలుపుమొక్కలను ఏ విధంగా తొలగిస్తాడో అదే విధంగా ప్రభుత్వం, అధికారులు నిరుపేదలకు ఆసరాగా నిలవాలంటూ గోస్వామి తులసీదాస్ పద్యాన్ని, తాత్పర్యాన్నీ మోదీ వివరించారు. అలాగే సూర్యుడు అంధకారాన్ని అంతం చేస్తాడని, వాతావరణాన్ని శుద్ధి చేస్తాడని, వర్షం కురవడానికి సాయపడతాడని తెలిపారు. గత పదేళ్లలో పేదలు, రైతులు, యువత ఇలా ప్రతిఒక్కరికీ ఆ విధంగా తాము సాయమందించామన్నారు. గత పదేళ్లలో సుమారు 10 లక్షల అనర్హుల పేర్లను రికార్డుల నుంచి తొలగించామని చెప్పారు. దేశంలో తొమ్మిదేళ్లలోనే 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడటం చరిత్రాత్మకమన్నారు. భారతదేశంలో పేదరికం తగ్గిపోగలదనే మరో శుభ సమాచారం అయోధ్యలో 22న ప్రాణ ప్రతిష్ఠకు ముందుగా దేశ ప్రజలకు అందిందన్నారు. మోదీ సత్యసాయి బాబాతోపాటు పలువురు ప్రముఖులను గుర్తు చేసుకున్నారు. కాగా... అత్యంత వెనుకబడిన ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రపంచస్థాయి సంస్థను నెలకొల్పడం గర్వకారణమని ముఖ్యమంత్రి జగన్ అన్నారు. ఇందుకోసం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ ఎంతో కృషి చేశారని కొనియాడారు. ప్రధాని మోదీకి, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో గవర్నర్ అబ్దుల్ నజీర్, రాష్ట్ర మంత్రులు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



వర్చువల్ విధానంలో స్థానిక గిరిజన మహిళతో మాట్లాడుతున్న మోదీ
ప్రధాని మోదీతో మాట్లాడుతున్న స్వాబి గంగ

ఆదివాసీల సంక్షేమమే ధ్యేయం

- అల్లూరి జిల్లా గిరిజనులతో ముఖాముఖిలో ప్రధాని మోదీ

అరకులోయ, జనవరి 16: ఆదివాసీల (పీవీజీటీ) సంక్షేమమే కేంద్ర ప్రభుత్వ ధ్యేయమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఐటీడీఏ పరిధిలో గల అరకులోయ మండలం కొత్తభల్లుగుడ గిరిజనులతో సోమవారం ఆయన వర్చువల్‌గా నిర్వహించిన సమావేశంలో ముచ్చటించారు. ప్రభుత్వ కార్యక్రమాలు మారుమూల గిరిజనులకు చేరితేనే నిజమైన అభివృద్ధి అని మోదీ స్పష్టం చేశారు. అర్హులైన ఆదివాసీలకు సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. పేదల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గిరిజనాభివృద్ధికి కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించిన అనంతరం కొత్తభల్లుగుడ పంచాయతీ గద్యాగుడ గ్రామానికి చెందిన స్వాబి గంగతో ప్రధాని ముఖాముఖి సంభాషించారు.

ప్రధాని: స్వాబీ గారు పీఎం జన్‌మన్ పథకం గురించి ఎలా తెలిసింది?

స్వాబి గంగ: అధికారులు అవగాహన సదస్సు పెట్టి తెలియజేశారు.

ప్రధాని: స్వాబీ గారు పీఎం జన్‌మన్ పథకం వల్ల ఏ లబ్ధి పొందారు?

గంగ: సార్... జన్‌మన్ పథకం ద్వారా పీఎం ఆవాస్ యోజన పథకం ద్వారా ఇల్లు, జలజీవన్ మిషన్ ద్వారా కొళాయి, పీఎం జన ఆరోగ్య పథకం కింద కుటుంబసభ్యులకు ఆయుష్మాన్ భారత్ కార్డులు, పీఎం ఉజ్వల యోజన కింద ఉచిత గ్యాస్ కనెక్షన్ కోసం పేరు నమోదు చేసుకున్నాను. ఈ పథకాలన్నీ మంజూరు చేశారు.

ప్రధాని: స్వాబీ గారు... అరకు కాఫీకి అంతర్జాతీయ గుర్తింపు వచ్చింది కదా.. మీరెలా ఫీలవుతున్నారు? మీరు చాలా బాగా మాట్లాడుతున్నారు? రాజకీయ నాయకులు స్క్రిప్టు పట్టుకొని మాట్లాడతారు?

గంగ: సార్.. మా గిరిజనులు పండిస్తున్న కాఫీకి అంతర్జాతీయంగా గుర్తింపు రావడం సంతోషంగా ఉంది. గతంలో మేము కాఫీ పంట దళారులకు విక్రయించి నష్టపోయే వాళ్లం. ఇప్పుడు గ్రేడింగ్ చేసి ఆన్‌లైన్‌లో మార్కెటింగ్ చేస్తూ మంచి ధర పొందుతున్నాము సార్.

వెంటిలేటర్‌పై సీపీఎం నేత తమ్మినేని!

- ఉదయాన్నే గుండెపోటు.. హైదరాబాద్‌కు తరలింపు



హైదరాబాద్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): సీపీఎం తెలంగాణ కార్యదర్శి తమ్మినేని వీరభద్రం గుండెపోటుకు గురయ్యారు. హైదరాబాద్‌లోని ఏఐజీ ఆసుపత్రిలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉందని, చికిత్స అందిస్తున్నట్లు వైద్యులు తెలిపారు. సోమవారం రాత్రి గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్ మండలంలోని తెల్దారుపల్లి నుంచి ఖమ్మంలో ఆసుపత్రికి తరలించి వైద్యసేవలు అందించారు. మంగళవారం ఉదయం గుండె నిపుణుల సూచనల మేరకు ఆయన్ను వెంటిలేటర్ సపోర్టుతో హైదరాబాద్‌లోని ఏఐజీ హాస్పిటల్‌కు తరలించారు. ఆయన గుండె అసాధారణ స్థాయిలో కొట్టుకుంటోందని, మూత్రపిండాలు పనిచేయకపోవడం వల్ల ఊపిరితిత్తులలో ద్రవం చేరడంతో ఇన్వేసివ్ వెంటిలేషన్ ఏర్పాటు చేయాల్సి వచ్చిందని ఆస్పత్రి వర్గాలు నేడొక ప్రకటనలో పేర్కొన్నాయి. తమ్మినేనికి ప్రస్తుతం రక్తపోటును మెరుగుపరిచేందుకు మందులతో చికిత్స అందిస్తున్నట్లు వైద్యులు వివరించారు. క్రిటికల్ కేర్ నిపుణులు, కార్డియాలజిస్టులు, ఎలక్ట్రోఫిజియాలజిస్టులు, నెఫ్రాలజిస్టులు, పల్మోనాలజిస్టులతో కూడిన మల్టీ డిసిప్లినరీ బృందంతో పాటు డాక్టర్ సోమరాజు, డాక్టర్ డీఎన్ కుమార్ మార్గదర్శకత్వంలో చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. తమ్మినేని ఆరోగ్యం గురించి ఆందోళన అక్కర్లేదని పార్టీ నాయకులు, సానుభూతిపరులు ఆసుపత్రి వద్దకు రావొద్దని సీపీఎం తెలిపింది.

అయోధ్యలో సుందరకాండ

మైసూరు బాల రాముడికే పట్టాభిషేకం.. అయోధ్య గర్భగుడి కోసం ఎంపిక చేసిన ట్రస్ట్

ప్రతిష్ఠాపన క్రతువులు ప్రారంభం

బెంగళూరు, జనవరి 16(ఆంధ్రజ్యోతి): అయోధ్యలోని రామమందిరంలో ప్రతిష్ఠించనున్న బాల రాముడి విగ్రహంపై సస్పెన్స్ వీడింది. మైసూరు శిల్పి అరుణ్ యోగిరాజ్ చెక్కిన విగ్రహాన్ని గర్భగుడిలో ప్రతిష్ఠించడానికి ఎంపిక చేసినట్లు శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు ప్రకటించింది. గత 70ఏళ్లుగా అయోధ్య రామమందిరంలో పూజలందుకుంటున్న రామ్‌లల్లా విగ్రహంతో పాటు ఈ నూతన విగ్రహం కూడా కొలువుదీరనుంది. ఐదేళ్ల బాలుడిగా, నిలబడిన భంగిమలో 150కిలోలకు పైగా బరువున్న కొత్త విగ్రహాన్ని గర్భగుడిలోని ఆసనంపై ఉంచుతామని ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ తెలిపారు. ఈ విషయం తెలియగానే యోగిరాజ్ ఉద్వేగానికి లోనయ్యారు. తాను చెక్కిన బాలరాముడి విగ్రహాన్ని చూసినప్పుడల్లా తన తండ్రి గుర్తుకు వస్తారని తెలిపారు. ఇప్పుడు ప్రపంచం మొత్తం బాలరాముడి విగ్రహాన్ని చూసి తరించనుండటం తనకు పట్టలేనంత సంతోషం కలిగిస్తోందన్నారు.

నేడు అయోధ్యకు రామయ్య విగ్రహం

అయోధ్యలోని రామమందిరంలో బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠకు సంబంధించిన పూజా కార్యక్రమాలు మంగళవారం నుంచి మొదలుపెట్టినట్లు ప్రధాన అర్చకుడు ఆచార్య సత్యేంద్ర దాస్ తెలిపారు. తొలిరోజు 16న ప్రాయశ్చిత్త పూజ, సరయూ నది ఒడ్డున దశవిధ స్నానం, గోపూజ, విష్ణుపూజ నిర్వహించారు. పూజా కార్యక్రమాలను 121 మంది ఆచార్యులు నిర్వహిస్తున్నారు. అనుష్ఠానానికి సంబంధించిన కార్యకలాపాలను గణేశ్వర్ శాస్త్రి ద్రావిడ్ పర్యవేక్షిస్తూ, సమన్వయం చేస్తున్నారు. కాశీకి చెందిన లక్ష్మీకాంత్ దీక్షిత్ ప్రధానఆచార్యుడిగా వ్యవహరిస్తున్నారు.


అయోధ్య గర్భగుడి తలుపులు

మందిరంలో మంగళవాయిద్య ఘోష

రామమందిరం ప్రతిష్ఠా కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఆలయ ప్రాంగణంలో భారతదేశ శాస్త్రీయ మంగళ వాయిద్యాలను వాయించనున్నట్లు ఆలయ ట్రస్ట్ తెలిపింది. 22న ఆలయంలో వాయిద్య ప్రదర్శన కోసం దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన సంగీత విద్వాంసులను ఎంపిక చేసినట్లు ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ తెలిపారు.

శాస్త్రం ప్రకారమే...: మఠాధిపతులు

అయోధ్యలో ఆలయ నిర్మాణం పూర్తి కాకుండానే ప్రాణ ప్రతిష్ఠ నిర్వహించడం సరికాదంటూ పలువురు పీఠాధిపతులు ఇప్పటికే అభ్యంతరాలు వ్యక్తం చేశారు. అయితే ఈ కార్యక్రమం శాస్త్రాలకు అనుగుణంగానే ఉందని కొందరు మఠాధిపతులు మద్దతు పలుకుతున్నారు. గుజరాత్‌లోని సోమనాథ్ ఆలయంలో ప్రాణ ప్రతిష్ఠ జరిగే సమయానికి దాని నిర్మాణం కూడా పూర్తికాలేదని గుర్తుచేస్తున్నారు. దూధేశ్వర్ మందిరానికి చెందిన మహంత్ నారాయణ్ గిరి మాట్లాడుతూ... సోమనాథ్ ఆలయంలో పవిత్ర కలశం, ధ్వజస్తంభాన్ని ప్రాణ ప్రతిష్ఠ పూర్తయిన 14 ఏళ్ల తర్వాత ఏర్పాటు చేశారని తెలిపారు. అయోధ్యలో వేడుక శుభసమయంలో జరుగుతోందని, దేశవ్యాప్తంగా నెలకొన్న ఆనందకరమైన వాతావరణానికి ఆటంకం కలిగించే పనులేవీ చేయొద్దని కోరారు.

22న కోల్‌కతాలో సామరస్య ర్యాలీ

రామమందిర ప్రతిష్ఠ రోజున కోల్‌కతాలో అన్ని మతాల ప్రజలతో కలిసి 'సామరస్య ర్యాలీ' నిర్వహిస్తామని పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ప్రకటించారు. ఈ ర్యాలీ... వివిధ మతాల ప్రార్థనాలయాలను స్పృశించి పార్క్ సర్కస్ మైదాన్ వద్ద ముగుస్తుందన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ ఇలాంటి ర్యాలీలు నిర్వహించాలని పార్టీ శ్రేణులకు ఆమె పిలుపునిచ్చారు.

అయోధ్యలో వెలిగిన 108 అడుగుల అగరుబత్తీ



అయోధ్య రాముడికి గుజరాత్ నుంచి భక్తులు కానుకగా పంపిన 108 అడుగుల అగరుబత్తీని మంగళవారం వెలిగించారు. భారీ జనసందోహం 'జై శ్రీరామ్' నినాదాలు చేస్తుండగా శ్రీరామజన్మ భూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ మహంత్ నృత్య గోపాల్ దాస్ దీన్ని వెలిగించారు. 108 అడుగుల పొడవు.. మూడున్నర అడుగుల వెడల్పుతో 3,610 కేజీల బరువున్న ఈ బాహుబలి అగరుబత్తీ ధూపం నుంచి వచ్చే సువాసన సుమారు 50 కిలోమీటర్ల వరకూ వ్యాపిస్తుందని నిర్వాహకులు తెలిపారు.

శ్రీకృష్ణ జన్మభూమి సర్వేపై సుప్రీం స్టే



అలహాబాద్ హైకోర్టు ఆదేశాల నిలుపుదల

న్యూఢిల్లీ, జనవరి 16: మథురలో శ్రీకృష్ణ జన్మభూమిని ఆనుకొని ఉన్న షాహీ ఈద్గా మసీదు కాంప్లెక్స్‌లో శాస్త్రీయ సర్వే జరపాలంటూ అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను అమల్లోకి తీసుకురాకుండా మంగళవారం సుప్రీంకోర్టు స్టే విధించింది. కోర్టు కమిషనర్ పర్యవేక్షణలో సర్వే జరిపించేందుకు అంగీకారం తెలుపుతూ గత నెల 14న అలహాబాద్ హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. మందిరాన్ని కూలగొట్టి మసీదు నిర్మించారంటూ హిందూ పక్షం చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు..ఆ విషయాన్ని తేల్చేందుకు న్యాయస్థానం పర్యవేక్షణలో కోర్టు కమిషనర్ ద్వారా సర్వే జరిపించేందుకు ఆమోదం తెలిపింది. ఆ సర్వేను మరో ముగ్గురు న్యాయవాదుల బృందం పరిశీలిస్తుందని కూడా తెలిపింది. కట్టడానికి ఎలాంటి హాని జరగకుండా సర్వే జరపాలని స్పష్టం చేసింది. దీనిని సవాలు చేస్తూ ముస్లిం పక్షం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. విచారణ జరిపిన జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాల ధర్మాసనం.. సర్వే నిర్వహించకుండా స్టే విధించింది. అయితే ఇదే అంశంపై హైకోర్టులో దాఖలైన ఇతర కేసులు కొనసాగుతాయని స్పష్టం చేసింది. హిందూ పక్షం దాఖలు చేసిన పిటిషన్ విచారణార్హతను సవాలు చేస్తూ ముస్లిం పక్షం వేసిన కేసుపైనా ముందుకు వెళ్లవచ్చని తెలిపింది. కోర్టు కమిషనర్‌ను నియమించాలంటూ హిందూ పక్షం దాఖలు చేసిన పిటిషన్‌లో అస్పష్టత ఉందని, ఆ కారణంగానే స్టే విధిస్తున్నట్టు తెలిపింది. దీనిపై అభిప్రాయాలు చెప్పాలంటూ హిందూ పక్షానికి నోటీసులు పంపిస్తామని తెలిపింది. ఈ నెల 23లోగా సమాధానం ఇవ్వాలని ఆదేశించింది.

జ్ఞాన్‌వాపీ నీటి కొలను శుభ్రతకు ఓకే

వారాణసిలోని జ్ఞాన్‌వాపీ మసీదు ఆవరణలో ఉన్న వజూ ఖానా (నీళ్ల తొట్టి) పరిశుభ్రతకు సుప్రీంకోర్టు అనుమతి ఇచ్చింది. హిందూ మహిళలు దాఖలు చేసిన వినతి మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్, జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్ర ధర్మాసనం ఈ ఆదేశాలు ఇచ్చింది.

లోకం తీరు



రామాలయ ప్రతిష్ఠ

రాజకీయ కార్యక్రమం!

- బీజేపీ, ఆర్ఎస్ఎస్ అలా మార్చేశాయి
- అందుకే మేం వెళ్లడం లేదు: రాహుల్



కోహిమా, జనవరి 16: అయోధ్యలో రామాలయ ప్రతిష్ఠాపనను ఎన్నికల వేళ బీజేపీ రాజకీయ కార్యక్రమంగా మార్చేసిందని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. ఈ కార్యక్రమం ప్రధాని మోదీ, ఆర్ఎస్ఎస్ చుట్టూనే తిరుగుతోందన్నారు. ప్రతిష్ఠకు హాజరు కారాదని కాంగ్రెస్ నాయకత్వం తీసుకున్న నిర్ణయాన్ని గట్టిగా సమర్థించారు. ఈ నెల 14న మణిపూర్‌లోని తౌబల్‌లో ఆయన ప్రారంభించిన 'భారత్ జోడో న్యాయ్ యాత్ర' సోమవారం నాగాలాండ్‌కు చేరుకుంది. మంగళవారం రాహుల్ మీడియాతో మాట్లాడారు. 'ఈ నెల 22న జరిగే ఈ ప్రతిష్ఠాపనను ఆర్ఎస్ఎస్, బీజేపీ పూర్తిగా రాజకీయ కార్యక్రమంగా మార్చేశాయి. అందువల్లే దీనికి హాజరు కానని మా అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పష్టం చేశారు. పీఠాధిపతులు కూడా ఇది రాజకీయ కార్యక్రమమని చెప్పారు. అందుచేత దీనికి మేం హాజరవడం కష్టం. అయితే రామాలయాన్ని సందర్శించదలచుకుంటే నిరభ్యంతరంగా వెళ్లవచ్చని మా భాగస్వామ్య పక్షాలకు, పార్టీలోని వారికి స్పష్టం చేశాం. ఓ వేడుకను మా రాజకీయ ప్రత్యర్థులైన ప్రధాని, ఆర్ఎస్ఎస్ స్వాధీనం చేసుకుని ఎన్నికల కార్యక్రమంగా మార్చారు. దీనికి ఎన్నికల రంగు ఇచ్చారు. దీనికి మేం హాజరు కావడం సాధ్యం కాదు' అని వివరించారు. 'ఇండియా' కూటమి పటిష్ఠంగా ఉందని.. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడిస్తుందని రాహుల్ ధీమా వ్యక్తంచేశారు. కూటమిలో చిన్న చిన్న మామూలు సమస్యలుంటే పరిష్కారమవుతాయన్న నమ్మకం తనకు ఉందని.. కలిసికట్టుగా పోరాడి ఆర్ఎస్ఎస్, బీజేపీని ఓడిస్తామని చెప్పారు.



జగ్గన్నతోటలో కొలువుతీరిన ఏకాదశ రుద్రుల ప్రభలు, పంటకాలువను దాటిస్తున్న గంగలకుర్రు అగ్రహారం రుద్రప్రభ

కన్నుల పండువగా ప్రభల తీర్థం

అంబాజీపేట, జనవరి 16: సంక్రాంతి ఉత్సవాల్లో మూడో రోజు కనుమ సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జి ల్లాలో ప్రభల తీర్థాలు మంగళవారం వైభవంగా జరిగాయి. అంబాజీపేట మండలం మొసలపల్లి శివారు జగ్గన్నతోటలో జరిగిన ప్రభల తీర్థానికి సుమారు రెండు లక్షల మంది ప్రజలు తరలివచ్చారు. అంబాజీపేట, అయినవిల్లి, అమలాపురం మండలాల 11 గ్రామాల నుంచి ఏకాదశ రుద్రులతో పాటు వివిధ రూపాలతో తీసుకువచ్చిన ప్రభలు జగ్గన్నతోటలో కొలువుతీరాయి. ఏకాదశ రుద్రుల శకటం గత ఏడాది దేశ రాజధాని ఢిల్లీ పెరేడ్‌లో ప్రదర్శించడంతో జగ్గన్నతోట ప్రభల ఉత్సవం ఖ్యాతి ప్రపంచ నలుమూలల విస్తరించింది. దీంతో దేశ, విదేశాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి భక్తులు ఏకాదశ రుద్రుల ప్రభలను దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ప్రభలను విశేషాలంకరణలతో ముస్తాబుచేశారు.



ఎ.రంగంపేటలో జల్లికట్టు వేడుకలు

సంక్రాంతి సంబరాల్లో భాగంగా తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం ఎ.రంగంపేట గ్రామంలో మంగళవారం జల్లికట్టు అట్టహాసంగా నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటల తరువాత ప్రారంభమైన జల్లికట్టు 2.30 గంటల వరకు జరిగింది. వంద ఎద్దులు, 15 దొడ్ల పశువులను అల్లిలోకి వదలగా వాటికి కట్టిన బహుమతులను చేజిక్కించుకోవడానికి యువకులు పోటీ పడ్డారు. పశువులను నిలువరించే క్రమంలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. -చంద్రగిరి

కైలాసవాహనంపై శివపార్వతులు



శ్రీశైలం, జనవరి 16: మకర సంక్రాంతి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజు మంగళవారం శ్రీశైలం భ్రమరాంబ సమేత మల్లికార్జునుడు కైలాసవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే సోమవారం సంక్రాంతి రోజున స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం కన్నులపండువగా సాగింది.

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి

తిరుమల, జనవరి16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం నైవేద్య విరామ సమయంలో కుటుంబ సమేతంగా ఆలయంలోకి వెళ్లిన ఆమె ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. అనంతరం రంగనాయకమండపానికి చేరుకున్న న్యాయమూర్తిని వేదపండితులు ఆశీర్వదించగా అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.



ఆలయం వద్ద కుటుంబ సభ్యులతో జస్టిస్ జ్యోతిర్మయి

సూర్యనారాయణకు ముందస్తు బెయిల్

- మంజూరు చేసిన సుప్రీంకోర్టు
- ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంపై ఆగ్రహం

న్యూఢిల్లీ, జనవరి 16(ఆంధ్రజ్యోతి) ఏపీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణకు సుప్రీంకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. వాణిజ్య పన్నుల శాఖ ఆదాయానికి గండికొట్టారనే ఆరోపణలతో సూర్యనారాయణపై జగన్ సర్కార్ దాఖలు చేసిన కేసులో ఆయనకు ముందస్తు బెయిల్ మంజూరు చేస్తూ సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భూయన్ ల ధర్మాసనం మంగళవారం తీర్పునిచ్చింది. ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించడంతో సూర్యనారాయణ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. గతేడాది సెప్టెంబరు 15న సుప్రీంకోర్టు ఆయనకు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. ఆ తర్వాత కేసు రెండు సార్లు విచారణకు వచ్చినా రాష్ట్ర ప్రభుత్వం నుంచి సరైన స్పందన లేకపోవడంతో ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. మంగళవారం మరోసారి ఈ కేసు విచారణకు రాగా, సూర్యనారాయణ పలుకుబడి గల వ్యక్తి అని, ముందస్తు బెయిల్ ఇస్తే సాక్ష్యాలు తారుమారయ్యే ప్రమాదం ఉందని ప్రభుత్వ న్యాయవాది వాదించారు. కాగా, ప్రభుత్వ న్యాయవాది తప్పుడు సమాచారం ఇస్తున్నారని, సూర్యనారాయణను ఒకే సారి విచారణకు పిలిచారని ఆయన తరఫు న్యాయవాది సిద్దార్థ లూథ్రా సుప్రీంకోర్టు దృష్టికి తెచ్చారు. ఒకేసారి విచారణకు పిలిచామని రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాది కూడా అంగీకరించారు. దీంతో విచారణ కు సహకరిస్తున్నారని అంటూనే భిన్నమైన అంశాలు ఎలా ప్రస్తావిస్తారని ధర్మాసనం నిలదీసింది. సెప్టెంబరు 15న ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను సవరిస్తూ ముందస్తు బెయిల్ మంజూరు చేసింది.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

యల్లనూరు, జనవరి 16: అనంతపురం జిల్లా యల్లనూరు మండలం దంతలపల్లి గ్రామానికి చెందిన రైతు ఇంద్ర సేనా రెడ్డి(46) అప్పుల బాధ తాళలేక మంగళవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంద్ర సేనారెడ్డి మూడున్నర ఎకరాల్లో చీనీ పంటను సాగుచేశాడు. దిగుబడి రాకపోవడంతో తీవ్రంగా నష్టపోయాడు. అప్పులు రూ.16 లక్షలకు పైగా పేరుకుపోయాయి.

చరిత్రలో ఎన్నడూ లేనన్ని దొంగ ఓట్లు

వైసీపీ నేతల చేతుల్లోకి ఆర్వోల లాగిన్, పాస్‌వర్డ్: బాబు



గ్రామ దేవతకు చంద్రబాబు దంపతుల పూజలు

తిరుపతి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): "రాష్ట్రంలో అడ్డూ అదుపూ లేకుండా ఓటరు జాబితాలను మార్చేస్తున్నారు. దేశ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ఓట్ల తారుమారు జరుగుతోంది. వైసీపీ నాయకులు ఓటమి భయంతో టీడీపీ సానుభూతిపరుల ఓట్లను తీసేస్తున్నారు. దొంగ ఓట్లను నమోదు చేస్తున్నారు" అని టీడీపీ అధినేత చంద్రబాబు ధ్వజమెత్తారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం స్వగ్రామమైన చంద్రగిరి మండలం నారావారి పల్లెకు వచ్చిన ఆయన సోమవారం తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో చంద్రగిరి నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి పులివర్తి నానిని మార్గమధ్యంలో చంద్రబాబు పరామర్శించారు. అనంతరం చంద్రబాబు మీడియాతో మాట్లాడుతూ ఓటర్ల జాబితాల తారుమారు విషయంలో వైసీపీ నేతలు అనుసరిస్తున్న వైఖరిపై నిప్పులు చెరిగారు. "ఎక్కడ చూసినా వైసీపీ నేతలు దుర్మార్గంగా దొంగ ఓట్లు చేరుస్తున్నారు. ఇటీవలే తిరుపతి కలెక్టర్, ఎస్పీలను ఎన్నికల కమిషన్ సీరియస్‌గా హెచ్చరించింది. పారదర్శకంగా పనిచేయలేకపోతే రాజీనామా చేయండి, లేదంటే సెలవు పెట్టి వెళ్లమంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది" అని అన్నారు.

స్వగ్రామంలో నారా వారి సందడి

సంక్రాంతి పండుగ కోసం స్వగ్రామమైన చంద్రగిరి నియోజకవర్గంలోని నారావారి పల్లెకు వచ్చిన చంద్రబాబు, ఆయన కుటుంబ సభ్యులు సందడి చేశారు. సోమవారం ఉదయం 10.30 గంటలకు సంప్రదాయ పంచెకట్టు ధరించి తన సతీమణి భువనేశ్వరి, కుమారుడు లోకేశ్, మనవడు నారా దేవాన్ష్‌లతో కలిసి గ్రామ దేవత దొడ్డి గంగమ్మకు, కులదైవం నాగాలమ్మకు చంద్రబాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తన తల్లిదండ్రులు నారా ఖర్జూర నాయుడు, అమ్మణ్ణమ్మల సమాధుల వద్ద నివాళులర్పించారు. ఆదేవిధంగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నందమూరి కుటుంబ సభ్యులు కూడా పాల్గొన్నారు.

భారీ తప్పిదాలు

చంద్రగిరి మాదిరిగానే మరో ఎనిమిది నియోజకవర్గాల్లో కూడా ఓటర్ల జాబితాల్లో భారీ తప్పిదాలు జరిగినట్టు గమనించామని చంద్రబాబు అన్నారు. ఎన్నికల సమయంలో అధికారుల బదిలీలు కూడా పారదర్శకంగా లేవన్నారు. "వలంటీర్లు పార్టీలకు కొమ్ముకాయకూడదు. తిరుపతి ఉప ఎన్నిక సమయంలో పెట్టిన కేసులను అధికారులు వదిలేశారు. తుది ఓటరు జాబితా వస్తేగానీ మేమిచ్చిన ఫిర్యాదులపై స్పష్టత రాదు. పోలీస్ వ్యవస్థ భ్రష్టుపట్టింది. వారు సరిగ్గా వ్యవహరించివుంటే సమస్య వచ్చేదికాదు. రాష్ట్రంలో అత్యధిక మెజారిటీతో నన్ను గెలిపించే కుప్పంలో కూడా నేరాలు, ఘోరాలు పెచ్చుమీరాయి. ప్రజల్ని భయభ్రాంతులకు గురిచేస్తున్నారు" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తున్న అంగన్వాడీల న్యాయమైన సమస్యలను పరిష్కరిస్తామని చంద్రబాబు చెప్పారు. వారిపట్ల వైసీపీ ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోందని అన్నారు.

రేపు అనేది లేదనుకున్నారు!

"వైసీపీ నాయకులకు డబ్బులు ఎక్కడ నుంచి వస్తున్నాయో అర్థం కావడంలేదు. ఎప్పుడూ చూడని విధంగా మనీ పవర్, భూకబ్జాలు, దోచుకోవడాలు, ఆ డబ్బులతో ప్రజల్ని మభ్యపెట్టే విధంగా కానుకలు పంపిణీ చేయడం వంటివి చేస్తున్నారు. ఇవి అవినీతికి, అక్రమాలకు, దౌర్జన్యాలకు పరాకాష్ఠ. అధికారుల లాగిన్, పాస్‌వర్డ్ వైసీపీ నేతల చేతుల్లోకి వెళ్లిపోవడంతో ఓటర్ల జాబితాలను తారుమారు చేస్తున్నారు. పోలింగ్ బూత్‌లు, నియోజకవర్గాలు మార్చారు. కరుడుకట్టిన నేరస్థులు, ఉగ్రవాదుల కంటే దారుణంగా వ్యవహరిస్తున్నారు. రేపు అనేది లేదనుకుని బరితెగిస్తున్నారు. అవకతవకలపై అధికారులకు స్పష్టంగా తెలియజేశాం. చంద్రగిరిని కేస్ స్టడీగా తీసుకోమన్నాం. ఎన్నికల విధులు బాధ్యతాయుతమైనవి. తప్పులు చేస్తే జైలుకుపోతారు. టీచర్లు, సీనియర్ ఉద్యోగులను ఎన్నికల విధుల్లోకి తీసుకోకుండా వైసీపీకి కావాల్సిన సచివాలయ సిబ్బందిని తీసుకుని అక్రమాలకు తలుపులు తెరిచారు. ఇవన్నీ ఇకపై జరగవు. వారిని ఇంటికి పంపించాలని ప్రజలు నిర్ణయించుకున్నారు" అనితెలిపారు.



బొడ్డవర నుంచి చిట్టంపాడుకు కట్టెలకు మృతదేహాన్ని కట్టుకుని తీసుకుని వెళ్తున్న దృశ్యం

ఎస్.కోట నుంచి బొడ్డవర మైదాన ప్రాంతానికి బైక్ మీద మృతదేహాన్ని తీసుకెళ్తున్న భర్త

బైక్‌పైతెచ్చి... కట్టెకు కట్టి..

మృతదేహం తరలింపు

- వారం వ్యవధిలోనే బిడ్డ, భార్య కన్నుమూత
- విజయనగరం జిల్లాలో గిరిపుత్రుడి ఘోష
- కొన్ని రోజుల క్రితం తల్లీబిడ్డా అనారోగ్యం పాలు
- రోడ్డు బాగాలేక డోలీలో మోసుకుంటూ ఆస్పత్రికి
- అస్పత్రిలో చికిత్స పొందుతూ పసిబిడ్డ మృతి
- కోలుకున్న తల్లి ఇంటికి... తిరగబెట్టిన అనారోగ్యం
- సంక్రాంతి రోజున పరిస్థితి విషమించి చనిపోయిన వైనం

శృంగవరపుకోట రూరల్, జనవరి 16: కన్నబిడ్డ చనిపోయి వారం రోజులు.. ఇంతలోనే బాలింత అయిన భార్యా కన్నుమూసింది. గుండె పగిలి తన్నుకువస్తున్న దుఃఖాన్ని పంటి బిగువున భరిస్తూ... భార్య మృతదేహాన్ని బైక్‌పై పెట్టుకుని ఇంటిబాట పట్టాడా భర్త. సగం దూరం వెళ్లిన తర్వాత బైక్ కూడా వెళ్లలేని దుస్థితి. అక్కడి నుంచి ఒక కట్టెకు మృతదేహాన్ని కట్టుకుని మోసుకుంటూ ఇంటికి చేరిన దీనస్థితి. విజయనగరం జిల్లాలో ఒక గిరిపుత్రుడు ఘోష ఇది. జిల్లాలోని శృంగవరపుకోట మండలం గిరిశిఖర గ్రామమైన బొడ్డవర పంచాయతీ పరిధిలోని చిట్టంపాడు గ్రామానికి చెందిన బాలింత మాదల గంగమ్మ, ఆమె ఆరు నెలల పాప అనారోగ్యం పాలయ్యారు. ఈ నెల ఐదో తేదీన వారిద్దరిని గంగమ్మ భర్త గంగులు తోటి గిరిజనుల సాయంతో డోలీపై ఐదుకిలోమీటర్లు మోసుకుంటూ మైదాన ప్రాంతానికి తెచ్చారు. అక్కడి నుంచి ఎస్.కోట సీహెచ్‌సీకీ తరలించారు. గంగమ్మ ఆరోగ్యం కుదుటపడడంతో ఆమెను డాక్టర్లు ఇంటికి పంపేశారు. చిన్నారి ఆరోగ్యం క్షీణించడంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించగా ఈనెల 7న చిన్నారి మృతి చెందింది.

ఇప్పుడు తల్లి కూడా మృతి..

చిన్నారి తల్లి గంగమ్మ(26)కు అనారోగ్యం తిరగబెట్టింది. సోమవారం డోలీ ద్వారా మైదాన ప్రాంతానికి తీసుకెళ్లి... అక్కడ నుంచి విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గంగమ్మ చనిపోయింది. ఆస్పత్రి నుంచి మృతదేహాన్ని ఆటోలో శృంగవరపుకోట తీసుకుని వచ్చిన తర్వాత.. బొడ్డవర కు రావడానికి ఆటో డ్రైవర్ నిరాకరించాడు. దీంతో గంగమ్మ మృతదేహాన్ని తన స్నేహితుడి ద్విచక్రవాహనంపై పెట్టుకుని బొడ్డవర రైల్వేస్టేషన్ వరకు తీసుకొచ్చి, అక్కడి నుంచి రెండు కట్టెలకు కట్టుకుని ఊరికి తరలించామని భర్త తెలిపాడు.

వైసీపీ నేతలు హామీ నిలబెట్టుకుని ఉంటే...

గిరిశిఖర గ్రామానికి రహదారి సౌకర్యం కూడా లేదు. గ్రామానికి రోడ్డు వేయిస్తామని వైసీపీ నేతలు పోయిన ఎన్నికలకు ముందు హామీ ఇచ్చారు. వారు ఆ హామీ నిలబెట్టుకుని ఉంటే తమ ప్రాణాలకు భరోసా ఉండేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో ఎవరైనా అనారోగ్యం పాలైతే, ఒక కర్రకు దుప్పటికట్టి దాన్నే డోలీగా మార్చుకుని మైదాన ప్రాంతానికి మోసుకుని వచ్చి.. అక్కడ నుంచి ఆసుపత్రులకు తీసుకెళ్లడం పరిపాటిగా మారింది. ప్రాణాలు పోయిన ప్రతిసారీ అధికారులు, ప్రజాప్రతినిధులు రోడ్డు వేయిస్తామని చెప్పడం... తాము నమ్మి ఓట్లు వేయడం.. వారు ఆ హామీని గాలికి వదిలేయడం పరిపాటిగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విధినిర్వహణలో గాయపడి సైనికుని మృతి

- సైనిక లాంఛనాలతో స్వగ్రామంలో అంత్యక్రియలు



ఐలవరంలో శ్రీరాములు తండ్రికి దేశ పతాకాన్ని అందజేస్తున్న ఆర్మీ అధికారులు, శ్రీరాములు(ఫైల్)

భట్టిప్రోలు, జనవరి 16: దేశ రక్షణలో విధి నిర్వహణలో ఉండగా ప్రమాదవశాత్తూ గాయపడి చికిత్స పొందుతూ ఆర్మీ సైనికుడు మృతి చెందాడు. బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలం ఐలవరం గ్రామానికి చెందిన పప్పుల శ్రీరాములు (33) 15 రోజుల క్రితం లడఖ్‌లో మంచు కొండల మధ్యలో పడిపోయాడు. తీవ్రంగా గాయపడి కోమాలోకి వెళ్లిన అతను చండీఘర్‌లో చికిత్స పొందుతూ ఈ నెల 13 తేదీన మృతి చెందాడు. శ్రీరాములు భౌతికకాయాన్ని సోమవారం రాత్రి స్వగ్రామం ఐలవరం తీసుకువచ్చారు. సుబేదార్ మేజర్ మునిచంద్ర ఆధ్వర్యంలో ఆర్మీ అధికారులు, సిబ్బంది మంగళవారం ఉదయం సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. శ్రీరాములు భౌతికకాయంపై ఉంచిన భారతదేశ పతాకాన్ని తండ్రికి అందజేశారు. శ్రీరాములుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

దావోస్‌కు బైబై!

(మొదటి పేజీ తరువాయి)

ఏకంగా ఈ పర్యటనకు రాష్ట్ర ప్రభుత్వం చాప చుట్టేసింది. 2022లో తొలిసారి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన రెడ్డి దావోస్ సదస్సులో పాల్గొన్నారు. ప్రత్యేక విమానంలో లండన్‌లోని పిల్లలను చూడటానికి దావోస్ సదస్సును సాకుగా చూపించారని అప్పట్లో విమర్శలు వచ్చాయి. దావోస్ పర్యటనను ఆయన తూతూమంత్రంగా ముగించారు. రాష్ట్రానికి కొత్తగా ఒక్క కంపెనీనీ ఆకర్షించలేకపోయారు. పెట్టుబడులు తీసుకురాలేకపోయారు. అక్కడ కూడా .. తన మిత్రుడు గౌతం అదానీ .. సొంత జిల్లా కడపకు చెందిన షిర్డిసాయి ఎలక్ట్రికల్స్‌తో ఒప్పందాలకే పరిమితమయ్యారు. దీంతో ముఖ్యమంత్రి దావోస్ పర్యటన వివాదాన్ని కొనితెచ్చిందేగానీ .. రాష్ట్రానికి విదేశీ పెట్టుబడులను తీసుకురాలేకపోయిందన్న వ్యాఖ్యలు అప్పట్లో వినిపించాయి. దీని ప్రభావమో ఏమోగానీ, ఆ తర్వాత ఏడాది, తాజాగా ఇప్పుడు దావోస్ పర్యటనకు జగన్ దాదాపుగా బై..బై చెప్పేశారు. మరోవైపు, పొరుగు రాష్ట్రం తెలంగాణ క్రమం తప్పకుండా దావోస్ సదస్సులో పాల్గొంటోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తాజాగా దావోస్‌లో పర్యటిస్తున్నారు. భారీ పెట్టుబడులే లక్ష్యంగా పలు సంస్థలతో ఒప్పందాలు చేసుకుంటున్నారు. దావోస్ ఆహ్వానంపై జగన్ ఒక్కమాట కూడా మాట్లాడడం లేదు. ఎన్నికల్లో తనకు టికెట్ దక్కుతుందో లేదోనన్న గందరగోళంలో మంత్రి గుడివాడ అమర్నాథ్ ఉన్నారు. దీంతో దావోస్‌పై ఆసక్తి ఆయనలో కనిపించడం లేదు. ప్రతిపక్ష నేత చంద్రబాబు కేసుల్లో న్యాయస్థానం ఇచ్చిన తీర్పులపై వైసీపీ కేంద్ర కార్యాలయం ఆదేశాల మేరకు మాట్లాడే పనిలో బిజీగా ఉన్నారు.

ఊపు లేదు.. ఊసూ లేదు..

సార్వత్రిక ఎన్నికలకు ముందు రాష్ట్రంలో పెట్టుబడులవాతావరణం తమకు అనుకూలంగా ఉండేలా అధికారపక్షం ప్రయత్నిస్తుంది. అందులోభాగంగా విదేశీ భారీ పరిశ్రమలతో ఒప్పందం చేసుకోవడం ద్వారా యువతను ఆకర్షించాలని చూస్తుంది. దీనికి భిన్నమైన వాతావరణం ఇప్పుడు రాష్ట్రంలో కనిపిస్తోంది. సర్కారుకు ఎలాగూ యువత ఉపాధి, ఉద్యోగ కల్పనపై ఆసక్తి లేదు. మరోవైపు ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు స్వదేశీ పారిశ్రామిక సంస్థలూ ఉత్సాహం చూపడంలేదు. విశాఖలో వ్యాపారాలు చేయలేనని వైసీపీ విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ స్వయంగా ప్రకటించారు. హైదరాబాద్‌కు వ్యాపార కార్యకలాపాలను షిఫ్ట్ చేయనున్నట్టు ఆయన చెప్పడం అప్పట్లో కలకలం రేపింది. పెట్టుబడులు పెట్టి కంపెనీలు నడపగలం, ఉద్యోగాలు ఇవ్వగలంగానీ వైసీపీ నేతలకు అడ్డగోలుగా వాటాలు, కమీషన్లు ఇచ్చుకుంటూ తిరగలేమని ఎక్కువమంది పారిశ్రామికవేత్తలు చెబుతున్నారు. అందువల్లే పొరుగు రాష్ట్రాల వైపు వారంతా చూపు సారిస్తున్నారు.

కొ..క్కొ..క్కో..కోట్లు



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ ముమ్మిడివరం మండలం రాజుపాలెంలో నిర్వహిస్తున్న కోడి పందాలు

పండగ మూడురోజులూ జోరుగా పందేలు

(ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్)

సంక్రాంతి పండగకు కోడి కూత కోట్లు దాటింది. ఎన్నికల ఏడాది కావడంతో వైసీపీ నేతలు బరుల్లో బరి తెగించారు. గుండాట, పేకాట, కోడి పందేలను దగ్గరుండి నిర్వహించారు. పోలీసులు వీటిపై కన్నెత్తి చూడకుండా ఒత్తిళ్లు తెచ్చి.. బెట్టింగురాయుళ్లకు అండగా నిలబడ్డారు. కాకినాడ జిల్లాలో భోగి, సంక్రాంతి, కనుమకు కోడిపందేలు, గుండాట వ్యాపారం ఏకంగా రూ.450 కోట్లు దాటేసింది. ఇందులో 200 కోట్లు ఒక్క కనుమ రోజే పందేలు సాగాయి. గుండాటే రూ.250 కోట్లకు పైగా ఉంటుంద ని అంచనా. కాకినాడ జిల్లాలోని పలు మండలాల్లో కోడి పందాల బరుల్లో ఒక్కోదాని నుంచి రూ.లక్ష వరకు పలు స్టేషన్లకు మామూళ్లు వెళ్లాయి. వీటిని స్థాని క వైసీపీ నేతలే మధ్యవర్తులుగా ఉండి పంపకాలు జరిపారు. మంత్రి రాజా నియోజకవర్గం తునిలో కోడిపందేలు అడ్డులేకుండా సాగాయి. హైవేవెంబడి, గ్రామాలు, తోటల్లో పందాలు, గుండాట నిరాటంకంగా జరిగిపోయాయి. పశ్చిమగోదావరి జిల్లాలో ఈ ఏడాది కోడి పం దేల్లో డిజిటల్ లావాదేవీలు నిర్వహించారు. భీమవరం సమీపంలోని పెదమీరంలోనే పెద్దమొత్తంలో పందేలు నిర్వహించారు. ఒకే ఒక్క పందెంలో రూ.3 కోట్లు చేతులు మారాయి. ఆ బరిలోకి వెళ్లడానికి ప్రత్యేకంగా గుర్తింపు కార్డులు ఇచ్చా రు. కాళ్ల మండలం సీసలి బరిలో ఒక్కో పందెం రూ.40 లక్ష ల వరకు పలికింది. మూడు రోజులపాటు ఈ జిల్లాలో తెలంగాణ, కర్నాటక, తమిళనాడు, రాయలసీమ ప్రాంతానికి చెంది న పందెం రాయుళ్ల జోష్ కనిపించింది. సంక్రాంతి మూడు రోజుల్లో రూ.20 కోట్ల మద్యం అమ్మకాలు సాగాయి. విభజిత తూర్పుగోదావరి జిల్లాలో సుమారు రూ.100 కోట్ల పందేలు సాగాయి. హైటెక్ లెవల్లో పందేలు వేశారు. ఒక్కో బరికి పోలీసులకు రూ.2 లక్షల వరకూ ముట్టినట్టు ప్రచారం జరుగుతోంది. కోనసీమలో ప్రభల ఉత్సవాల ముసుగులో అశ్లీల రికార్డింగ్ డ్యాన్సులు జోరుగా సాగాయి. పందెంబరులు తిరునాళ్లను తలపించాయి. కోడిపందాలు, గుండాటల్లో సుమారు రూ.100 కోట్ల మేర చేతులు మారిన ట్టు సమాచారం. కోనసీమలో వందకి పైగా కీలక బరులతో పాటు వందల సంఖ్యలో డింకి పందేలు జరిగాయి. కాట్రేనికోన మండలం గెద్దనపల్లి మెగా బరి వద్ద సీఎం జగన్‌తో పాటు ఆయా ప్రాంతాలకు చెందిన ప్రజాప్రతినిధుల ఫొటోలతో కూడిన భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు కోడి పందాలను ప్రారంభించి డబ్బు లు కాసి మరీ గుండాట ఆడారు. కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి పలుచోట్ల పందాల్లో పాల్గొని ప్రజలను ఉత్సాహపరిచారు.



పంతం నెగ్గించుకున్నారు...!

బాపట్ల జిల్లాలో పండుగవేళ కోడి పందాల నిర్వహణ విషయంలో పాలకపార్టీ నేతలు తమ పంతం నెగ్గించుకున్నారు. కోట్ల రూపాయల నగదు చేతులు మారగా నిర్వాహకులుగా మారిన వైసీపీ ద్వితీయశ్రేణి నేతలకు బరులు కాసుల వర్షం కురిపించాయి. రాత్రిపూట ఫ్లడ్ లైట్లు వేసి మరీ మూడు రోజుల పాటు జరిపిన కోడి పందాల్లో కరెన్సీ కట్టలు తెగింది. కాగా, కోడి పందేలకు వెళ్లి వస్తూ రేపల్లెకు చెందిన ఒకరు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఘటన 216 జాతీయ రహదారిపై సోమవారం జరిగింది. వేమూరు మండలం జంపని శివారులో అదే రోజు జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడగా ఒకరి పరిస్థితి విషమంగా ఉండడంతో గుంటూరు ఆసుపత్రికి తరలించగా ప్రాణాపాయం తప్పింది.

రఘురామ రాకపై వైసీపీ రగడ

పార్లమెంట్ సభ్యుడు కనుమూరు రఘురామ కృష్ణంరాజు పశ్చిమగోదావరి జిల్లా భీమవరం పట్టణ శివారున నిర్వహిస్తున్న కోడిపందేల శిబిరానికి వెళ్లి అక్కడ టీజర్ ఆవిష్కరణలో పాల్గొన్నారు. దీనిపై వైసీపీ నాయులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. రెబల్‌స్టార్ ప్రభాస్ అప్ కమింగ్ సినిమా టీజర్‌ను దర్శకుల బృందం కోడిపందేల శిబిరంలో ఏర్పాటుచేసిన స్క్రీన్‌పై ఆయన ఆవిష్కరించారు. దీంతో ఉండి నియోజకవర్గానికి చెందిన అధికార పార్టీ ప్రముఖుడు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆయనను ఇక్కడకు ఎందుకు ఆహ్వానించారంటూ నిర్వాహకులను నిలదీశారని సమాచారం. కోడి పందేల శిబిరాన్ని నిలుపుదల చేయించారు. ఇలా సుమారు గంట సేపు కొనసాగింది. తరువాత ఈ పొరపాటుకు నిర్వాహకులు వైసీపీ నాయకులను బ్రతిమిలాడటంతో తిరిగి పందేలు కొనసాగాయి.

రూ.7లక్షలు గెలుచుకున్న వైద్యుడు

తీరప్రాంతంలోని 216 జాతీయ రహదారిలో భారీ బరులు ఏర్పాటుచేసి కోడి పందేలు నిర్వహించారు. ఇందులో ఐదు పందేల్లో బాపట్ల జిల్లా రేపల్లెకు చెందిన ఓ ప్రముఖ వైద్యుడు రూ.7 లక్షలు గెలుపొందారు. కాగా, ఏలూరు జిల్లా పెదవేగి మండలం కొండలరావుపాలెంలో మూడు ముసుగు పందేలు వేశారు. కోడిని బరిలో దించేవరకు దాని వివరాలు పందెగాళ్లకు తెలియకుండా ముసుగు వేస్తారు. పందెం కోళ్లకు కూడా ముందుగా కవ్వింపు చర్యలు ఉండవు. నేరుగా బరిలో కత్తి కట్టుకుని పోరాడతాయి. కొండలరావుపాలెంలో వేసిన మూడు పందేల్లో రెండు పెదకడిమికి చెందిన సొసైటీ అధ్యక్షుడు చల్లగొళ్ళ వెంకటేశ్వరరావు గెలుచుకుని.. రూ.మూడు లక్షల విలువైన బుల్లెట్ (రాయల్ ఎన్‌ఫీల్డ్) వాహనాన్ని అందుకున్నారు. ఆయనకు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి బుల్లెట్ వాహనం తాళాలు అందజేశారు. పందేల బరి వద్ద కోసాట, గుండాట, పేకాట భారీ ఎత్తున జరిగింది. బరుల వద్దే మద్యం బహిరంగంగా విక్రయించారు.

బరిలోనే మంత్రి జోగి బర్త్‌డే

ఉమ్మడి కృష్ణా జిల్లాలో కోడిపుంజులు కత్తులు దూస్తే, పొట్టేళ్లు పోట్లాటకు కాలు దువ్వాయి. మూడు రోజులపాటు సాగిన సంక్రాంతి సంబరాల్లో మొత్తంగా రూ.900 కోట్ల వరకు పందేలు జరిగినట్టు తెలుస్తోంది. జగ్గయ్యపేట నుంచి మచిలీపట్నం వరకు ఖాళీగా ఉన్న ప్రదేశాలు, తోటల్లో కోడిపందేలు, పొట్టేళ్ల పందేలు, పేకాట, గుండాటలు జోరుగా నిర్వహించారు. బాపులపాడు మండలం అంపాపురంలో భారీగా బరులను ఏర్పాటు చేశారు. కంకిపాడు మండలం ఈడ్పుగల్లు, ఉయ్యూరు మండలం బోళ్లపాడులోని బరి దగ్గర మంత్రి జోగి రమేశ్ కేక్ కట్‌చేసి పుట్టిన రోజు జరుపుకొన్నారు. నూజివీడు నియోజకవర్గంలోని తెలంగాణ సరిహద్దు గ్రామాల్లో పందేలు విచ్చలవిడిగా సాగాయి. ఏలూరు రూరల్ జాలిపూడిలో పందేల్లో చనిపోయిన పుంజు(కోజా) కోసం బరుల వద్ద క్యూ కట్టారు. మూడు వేల నుంచి ఐదువేల వరకు ధర పలికింది.

ఒంగోలు ఎంపీగా పోటీ చేయను

- అంతిమంగా జగన్ నిర్ణయానికి కట్టుబడి ఉంటా: వైవీ సుబ్బారెడ్డి

ఒంగోలు, జనవరి 16: 'ఒంగోలు లోక్‌సభ నుంచి పోటీ చేయనని పలు మార్లు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి చెప్పాను. పోటీచేసే వ్యక్తినే అయితే 2019లోనే కంటిన్యూ అయ్యేవాడిని' అని ఒంగోలు మాజీ ఎంపీ, టీటీడీ మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి స్పష్టం చేశారు. సోమవారం తన నివాసంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. 'ప్రత్యక్ష రాజకీయాలకు గ్యాప్ రావడంతో పార్టీ పనులు చూస్తున్నా. జగన్ పక్కనే ఉన్నందున పార్లమెంట్‌కు ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీచేయనని చెప్పా. అయితే పోటీ విషయంలో అంతిమంగా సీఎం తీసుకునే నిర్ణయాన్ని శిరసా వహిస్తా. సీనియర్ నేతలు పార్టీని వీడటానికి వారి వ్యక్తిగత కారణాలు వారికి ఉన్నాయి. ట్రాక్ రికార్డు ప్రకారం ఎంపీ, ఎమ్మెల్యే సీట్లు ఇస్తారు. మార్పులు, చేర్పులకు సంబంధించి పండుగ తర్వాత ఫైనల్ అవుతుంది. సీటు రానివారికి అసంతృప్తి ఉంటుంది. వారికి నచ్చజెబుతున్నాం. షర్మిల కొత్తగా కాంగ్రెస్ పార్టీలోకి రావడంతో మాకొచ్చిన ఇబ్బందేమి లేదు. ఆమెను దృష్టిలో పెట్టుకొని మార్పులు చేసేదేమీ లేదు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మరణంపై గతం నుంచి అనేక అనుమానాలు ఉన్నాయని వైవీ తెలిపారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

విస్తరిస్తున్న యుద్ధం

ఇరాక్‌లోని ఇజ్రాయెల్ నిఘా కేంద్రాన్ని ఇరాన్ సోమవారం ధ్వంసం చేసింది. గాజా యుద్ధం ఆరంభమైన తరువాత ఇజ్రాయెల్ ప్రయోజనాలను ఇరాన్ నేరుగా దెబ్బతీయడం ఇదే తొలిసారి. కుర్దిస్థాన్ రాజధాని ఎర్బిల్‌లో అమెరికా రాయబార కార్యాలయానికి అతిసమీపంలో ఉన్న ఇజ్రాయెల్ గూఢచర్య సంస్థ మొసాద్ ప్రధాన కార్యాలయాన్ని నేలమట్టం చేయడమే కాక, ఇరాన్ ప్రయోగించిన క్షిపణుల కారణంగా కొందరు ఇరాకీ పౌరులు కూడా హతమయ్యారు. అమెరికా అధికారులకు ఏ నష్టమూ వాటిల్లకున్నా వారి రాయబార కార్యాలయం కూడా కొంతమేరకు దెబ్బతిన్నదని వార్తలు వస్తున్నాయి. ఇది ఇరాక్ సార్వభౌమత్వంమీద దాడి అంటూ ఇరాక్ తీవ్రంగా ప్రతిస్పందించింది. యెమెన్‌లోని హౌతీ స్థావరాలమీద అమెరికా, బ్రిటన్ యుద్ధవిమానాలు దాడులు జరిపిన తరువాత, ఇరాన్ చర్యతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత హెచ్చాయి.

గాజాలో ఇజ్రాయెల్ యుద్ధానికి ఆదివారం నాటికి వందరోజులు పూర్తయ్యాయి. గాజా ఘోరాన్ని అడ్డుకోవడమే లక్ష్యంగా, హమాస్ పక్షాన హౌతీలు ఎర్రసముద్రంలో వాణిజ్యనౌకలపై దాడులు చేస్తున్న విషయం తెలిసిందే. హౌతీలను అణచివేసేందుకు అమెరికా బ్రిటన్‌లు జరుపుతున్న వైమానిక దాడుల్లో హౌతీలు ఎంత దెబ్బతిన్నారో తెలియదు కానీ, ముడిచమురు ధర మరింత పెరిగింది. ప్రపంచ నౌకారవాణాలో 15శాతం ఈ మార్గం ద్వారా జరుగుతుంది. రెండునెలల్లో హౌతీల దాడులు ఐదురెట్లు హెచ్చి, పెద్ద పెద్ద షిప్పింగ్ కంపెనీలు ఇటుగా పోవడమే మానుకున్నాయి. భారతదేశానికి వస్తున్న రెండు నౌకలమీద కూడా గతంలో వీరు దాడులు చేశారు. రాజధాని సహా యెమెన్‌లోని అత్యధికప్రాంతాలు హౌతీల ఏలుబడిలోనే ఉన్నాయి. ఎర్రసముద్రం తీరంమీద వారికున్న ఆధిపత్యం కారణంగా వాణిజ్యనౌకలు క్షేమంగా నడవాలంటే హౌతీలను దెబ్బకొట్టాల్సిందే. కానీ, హౌతీలకు ఆర్థిక, ఆయుధ సహకారం ఇరాన్‌నుంచే అందుతున్నదని, ఇరాన్ ఆశీస్సులున్న హిజ్బుల్లా దీనికి సైనికశిక్షణనిస్తున్నదని పాశ్చాత్యదేశాలు నమ్ముతున్నప్పుడు ఇలా ఓ నాలుగురోజులపాటు వైమానికదాడులు చేస్తే హౌతీలను నాశనం చేయడం సాధ్యమేనా? ఇరాన్ అందించే ఇంటలిజెన్స్ సమాచారం ఆధారంగానే హౌతీలు వాణిజ్యనౌకలను నాశనం చేయగలుగుతున్నారని అంటున్నప్పుడు కేవలం హౌతీలమీద వైమానికదాడులతో లక్ష్యం పూర్తిగా సిద్ధిస్తుందా?

హమాస్ పక్షాన నిలిచిన హౌతీలను నాశనం చేసేందుకు ఇజ్రాయెల్ తరఫున అమెరికా, దాని మిత్రదేశాలు ఈ యుద్ధానికి దిగాయి. అమెరికా ఆర్థిక, ఆయుధ అండదండలతో ఇజ్రాయెల్ సాగిస్తున్న మారణకాండ వాటి పరిభాషలో ఆత్మరక్షణ. హమాస్ దాడిలో చనిపోయినవారికంటే, ఇప్పుడు ఇజ్రాయెల్ దాడిలో వందలరెట్లు మరణించినా ఆ యుద్ధం వాటిదృష్టిలో న్యాయమైనదే. గాజాలో కాల్పుల విరమణ జరగక, మానవసాయం అందక వేలాదిమంది చనిపోతున్న స్థితిలో ఆ హననాన్ని ఆపడానికే తాను ఎర్రసముద్రాన్ని లక్ష్యంగా చేసుకున్నానని, పాశ్చాత్యదేశాలమీద ఒత్తిడితేవడమే తమ లక్ష్యమని హౌతీలు చెబుతున్నారు. ఇజ్రాయెల్ తరఫున కాల్పుల విరమణ ప్రతిపాదనలన్నింటినీ వీటో చేస్తున్న దేశాలు వీరిమీద ఇప్పుడు యుద్ధం చేస్తున్నాయి. హౌతీలమీద అమెరికా, దాని మిత్రదేశాలు చేస్తున్న దాడులు ఉపరితలంలో ప్రపంచవాణిజ్యాన్ని పరిరక్షించడంగా కనిపించవచ్చు. కానీ, ఇజ్రాయెల్ మీద అంతర్జాతీయంగా ఒత్తిడిపెంచే మరో ప్రయత్నాన్ని ఆదిలోనే తుంచివేసి, గాజాలో అది యథేచ్ఛగా తన ఊచకోత కొనసాగించుకోడానికి వీలుకల్పించే వ్యూహంగా చాలామందికి అనిపిస్తోంది.

అంతర్జాతీయ న్యాయస్థానంలో దక్షిణాఫ్రికా వేసిన కేసు ఇజ్రాయెల్ పరువు ప్రతిష్ఠలను పూర్తిగా దిగజార్చింది. గాజాలో జరుగుతున్నది 'జినోసైడ్' అంటూ, మధ్యంతర ఉత్తర్వులతో ఇజ్రాయెల్‌ను నిలువరించాలన్న అభ్యర్థనతో దక్షిణాఫ్రికా కేసు అత్యధిక దేశాల మనోభిప్రాయానికి ప్రతీక. భద్రతామండలిలో ఇజ్రాయెల్‌ను అమెరికా రక్షించుకువస్తున్నది కానీ, ఇటీవలి ఐక్యరాజ్యసమితి ప్రతినిధుల సభలో ఓ నలభైదేశాలు మినహా 153దేశాలు గాజాలో తక్షణకాల్పుల విరమణకు అనుకూలంగా ఓటువేశాయి. హౌతీలకు ఇప్పుడు సౌదీ అరేబియాతో ఏ పేచీ లేదు కనుక, వారు పూర్తిగా తమ శక్తిసామర్థ్యాలను అమెరికా దాడులను తిప్పికొట్టడానికి వెచ్చిస్తున్నారు. ఆ దాడుల్లో ఒక యుద్ధనౌక దెబ్బతిన్నా అమెరికా పరువుపోతుంది. అధ్యక్ష ఎన్నికల ముందు జోబైడెన్ వీరంగం వేయడం, ఆ బీభత్స ప్రతీకారదాడులతో ఘర్షణ మరింత విస్తరించడం పశ్చిమాసియాను మరింత ప్రమాదంలోకి నెట్టేస్తుంది.

'సుప్రీం' లక్ష్మణరేఖ!

రాజ్యాధినేతలే పక్షపాత ధోరణితో అన్యాయంగా నేరస్థుల కొమ్ము కాస్తే కంచే చేను మేసినట్లవుతుంది. గుజరాత్‌లో 2002లో ఘోరమైన గ్యాంగ్ రేపు సంఘటనలో (బిల్కిస్ బానో కేసు) ముంబై సెషన్ కోర్టు పదకొండు మందికి 2008లో యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. ముంబై సెషన్స్ కోర్టులో ఈ కేసు రావటానికి కారణం నిష్పక్షపాత విచారణ కోసం సుప్రీంకోర్టు 2004లో ఈ కేసును గుజరాత్ రాష్ట్రం నుంచి సీబీఐకి బదిలీ చేయటం. ముంబై న్యాయస్థానంలో న్యాయ విచారణ జరిగిన తర్వాత నిందితులకు శిక్ష విధించారు. అసలు కథ అప్పుడు మొదలైంది. గుజరాత్ బీజేపీ ప్రభుత్వం కాలం చెల్లిన 1992 లోని పాలసీని పరిగణనలోకి తీసుకొని శిక్షపడిన నేరస్థులకు క్షమాభిక్ష ప్రసాదించింది. సుప్రీంకోర్టు ఈ సంవత్సరం జనవరి 8న తీవ్రమైన పదజాలంతో ఈ చర్యను తప్పుపట్టింది. నేరస్థులను రెండు వారాలలోపు జైలుకు వెళ్ళాలని ఆదేశించింది. ఈ సంఘటన మన న్యాయ వ్యవస్థ ఎంతగా న్యాయానికి కట్టుబడి వున్నదో అద్భుతంగా తెలియజేస్తున్నది. జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ యుజ్జల్ భయాన్‌లతో కూడిన బెంచి స్పష్టంగా గుజరాత్ ప్రభుత్వానికి శిక్ష కాల పరిమితిని తగ్గించి క్షమాభిక్ష యిచ్చే అధికారం కానీ, పరిధి కానీ లేదని తేల్చి చెప్పటం విశేషం.

నిజానికి పదకొండు మంది నేరస్థులలో ఒకడైన రాధేశ్యామ్ భగవాన్‌దాస్ షా హైకోర్టును తప్పుదోవ పట్టించేందుకు నిజాలను కప్పిపుచ్చి 2022లో క్షమాభిక్ష ఆర్డరు సంపాదించుకున్నాడు. గుజరాత్ హైకోర్టు అప్పటికే రెండుసార్లు అప్పీలు చేసినప్పుడు ఈ కేసు మహారాష్ట్ర న్యాయ పరిధిలోకి వస్తుందని, గుజరాత్ జ్యూరిస్‌డిక్షన్‌లోకి ఇలాంటి విన్నపాలు తీసుకోవటం చట్ట సమ్మతం కాదు అని సుప్రీంకోర్టు తేల్చి



చెప్పింది. ఆ తర్వాత కూడా గుజరాత్ ప్రభుత్వం నేరస్థులకు ఇలా క్షమాభిక్ష ఇవ్వటం పక్షపాత వైఖరికి పరాకాష్ఠ. సుప్రీంకోర్టు ఈ నిర్ణయం తీసుకోకపోయినట్లయితే చట్టాన్ని, న్యాయాన్ని సమాధిచేసినట్లయ్యేది. సరైన సమయంలో ఈ తీర్పు రావటం ముదావహం. ఒకవిధంగా ఈ తీర్పుతో మన దేశంలోని న్యాయస్థానాల వన్నె పెరిగినట్టయింది. చట్టానికి కట్టుబడి తీర్పులు ఉండవేమోనన్న అనుమానపు పొరలను ఈ తీర్పు తొలిగించినట్లయింది.

అంతేగాదు ప్రభుత్వాలు క్షమాభిక్ష ప్రసాదించటం లాంటి విచక్షణాధికారాన్ని ఏ విధంగా వినియోగించుకోవాలో కూడా మరోసారి సుప్రీంకోర్టు కుండబద్దలు కొట్టి పాలకులకు చెప్పినట్లయింది. గుజరాత్ ప్రభుత్వం తనకు లేని అధికారాన్ని దుర్వినియోగం చేసి ప్రజాస్వామ్యానికి తలవొంపులు తెచ్చింది. నిందితులనూ, నేరస్థులనూ సంస్కరించటంలో తప్పు లేదు. కానీ ఈ నేరస్థులు సమాజాన్ని, విలువలను లెక్కచేయని రీతిలో ఘోరాతి ఘోరమైన మానభంగానికి తలపెట్టటమే కాకుండా, ఆ కుటుంబ సభ్యులను కిరాతకంగా చంపారు. ఇలాంటివారు ఉరిశిక్షకు అర్హులు. కానీ సంస్కరించే ధోరణిలో కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష విధించటమే ఒక విధంగా వారిని మంచి మార్గంలో పెట్టటానికి చేసిన ఆలోచనగా భావించవచ్చు. కానీ 'దయగల' ప్రభుత్వం ఈ రీతిలో మరిన్ని నేరాలు చేసేవిధంగా వారికి క్షమాభిక్షను అందించటం వల్ల భవిష్యత్తులో వారు మరింత రెచ్చిపోయే ప్రమాదం ఉంది. అదీగాక క్షమాభిక్ష ఇవ్వటానికి కొన్ని మార్గదర్శకాలు ఉన్నాయి. అవన్నీ పరిగణనలోకి తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. క్షమాభిక్ష దొరక్కపోతే ఇలాంటి శిక్షబడ్డ వారు సుమారు 14ఏళ్ళు జైలులో ఉండాలి. అందుకనే నేరస్థుడికీ నేరస్థుడికీ ఈ విచక్షణాధికారాన్ని ఉపయోగించటంలో తేడాలు ఉంటాయి. క్షణికావేశంలో తలపెట్టిన నేరం, అసంకల్పిత ప్రతీకార చర్య లాంటి వాటిల్లో కొంతలో కొంత విచక్షణను ఉపయోగించవచ్చు. క్షమకు ఎవరు అర్హులనేది ప్రభుత్వాలు అనేక కొలతబద్దల ఆధారంగా మానవీయ కోణంలో, సంస్కరణను దృష్టిలో ఉంచుకొని నిర్వహించాలి. చట్ట ప్రయోజనాలకు, సమాజానికి జరిగే హానిని దృష్టిలో పెట్టుకోకుండా అధికారం ఉంది కదా అని బరితెగించి నచ్చినవారికి మేలు చేయటానికి చట్టాన్ని ఉపయోగించుకునే ప్రయత్నం చేస్తే ప్రజలూ, కోర్టులూ చూస్తూ ఊరుకోవు. విచక్షణాధికారానికి సుప్రీంకోర్టు లక్ష్మణరేఖ గీయటమే కాకుండా ప్రభుత్వాలకు హద్దులు ఏర్పరచటం న్యాయచరిత్రలో ఒక చెరిగిపోని పేజీ.

మోదీ బ్రహ్మాస్త్రం–విపక్షాల పాశుపతాస్త్రాలు



దళితులు, ఆదివాసీలు, వెనుకబడిన వర్గాలకు సామాజిక న్యాయం అందించేందుకు కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు చిత్తశుద్ధితో కృషిచేస్తాయని నమ్మకం కలిగించనంతవరకూ అణగారిన వర్గాలు మతం వెల్లువలో కొట్టుకుపోకుండా విపక్షాల వైపు మొగ్గు చూపే అవకాశం లేదు. ఇందుకు ఇండియా కూటమి కనీస ఉమ్మడి ఎజెండాను ఏర్పర్చుకోవాలి. జయప్రకాశ్ నారాయణ్ లాగా వివిధ వర్గాలను, కులాలను సమీకరించగలిగిన శక్తి ప్రతిపక్ష నేతల్లో ఎవరికైనా ఉన్నదా? 2024 ఎన్నికలను మండల్, కమండల్ పోరాటంగా మార్చే సైద్ధాంతిక శక్తి ప్రతిపక్షాలకు ఉన్నదా?

దేశంలో ఇప్పుడు అంతటా అయోధ్య సంరంభం కనిపిస్తోంది. ఇంటింటికీ అక్షింతలు, రామమందిరం ఫోటోలు పంచిపెడుతున్నారు. ఉత్తర భారతంలో అనేక దేవాలయాల్లో పూజలు ఉధృతంగా జరుగుతున్నాయి. ఉదయం లేవగానే ఎక్కడి నుంచో భజనలు వినిపిస్తున్నాయి. ఢిల్లీలోని పలు కాలనీల అపార్ట్‌మెంట్ సొసైటీల్లో రామభక్తులు జనవరి 22న సంబరాలు నిర్వహించనున్నారు. దేశ రాజధాని అంతటా ఒక వైపు మోదీ, మరో వైపు శ్రీరాముడి చిత్రంతో పోస్టర్లు వెలిసాయి. మీడియాలో అయోధ్యపై ప్రత్యేక కథనాలు పుంఖానుపుంఖాలుగా వస్తున్నాయి. రానున్న కొద్ది రోజుల్లో బీజేపీ, సంఘ్ పరివార్ సంస్థలు రామమందిర ప్రారంభోత్సవ కార్యక్రమంపై మరింత ఉధృతంగా జనంలోకి వెళతాయనడంలో సందేహం లేదు. భారతదేశం బానిసత్వం నుంచి విముక్తి పొందిందని, మందిర ప్రారంభం రోజు దీపావళి జరుపుకోవాలని పిలుపునిచ్చిన నరేంద్రమోదీ ఈ మొత్తం ప్రచార ఘట్టానికి సారథ్యం వహిస్తున్నారనడంలో సందేహం లేదు. ఈ దిశలో ఆయన ప్రతి కదలికా, ప్రతి ప్రసంగం, ప్రతి చర్యా రికార్డు చేసేందుకు సమాచార దళం ఎప్పుడూ సిద్ధంగానే ఉంటుంది. ప్రాణప్రతిష్ఠకు ముందుమూడు రోజులు మోదీ నేలపై కంబళి కప్పుకుని పడుకుంటారని, కేవలం ఫలాలు మాత్రమే తింటారని వార్తలు వ్యాపిస్తున్నాయి.

నిజానికి మందిర ప్రారంభం సాధారణ కార్యక్రమం కాదు. 2024 ఎన్నికలకు ముందు మోదీ పూరించిన శంఖారావంగానే దీన్ని భావించవచ్చు. కొద్ది రోజుల ముందు వికసిత్ సంకల్ప్ యాత్రను ప్రకటించి లబ్ధిదారుల వద్దకు వెళ్లమని పార్టీ నేతలను ప్రేరేపించిన మోదీ, మరోవైపు మందిర ప్రారంభాన్ని కూడా ప్రజలను బీజేపీ వైపు పూర్తిగా తిప్పుకునేందుకు ఒక అస్త్రంగా ప్రయోగిస్తున్నారనడంలో సందేహం లేదు.

మోదీ విసురుతున్న అస్త్రాలు సామాన్యమైనవి కావని ప్రతిపక్షాలకు తెలుసు. హిందువులను ద్వేషిస్తున్నందువల్లే రామమందిర ప్రారంభోత్సవానికి కాంగ్రెస్ రావడం లేదని బీజేపీ నేతలు ఇప్పటికే విస్తృత ప్రచారం మొదలుపెట్టారు. ఈ రీత్యా రామమందిర భావోద్వేగాలను ఎదుర్కోవడంకోసం ప్రతిపక్షాలు సైద్ధాంతికంగా సమాయత్తం కావల్సివున్నది. ప్రతిపక్షాల ఆరు దశాబ్దాల పాలనలో దేశం పూర్తిగా వెనుకబడి ఉన్నదని, తన పదేళ్ల కాలంలోనే కనీవినీ ఎరుగని అభివృద్ధి జరిగిందని, ప్రజలకు సంక్షేమం పూర్తిగా అందుతోందని కూడా మోదీ టీమ్ విస్తృత ప్రచారం చేస్తోంది. ఈ ప్రచారాన్ని తుత్తునియలు చేసేందుకు కూడా ప్రతిపక్షాలు గణాంక వివరాలతో సిద్ధం కావల్సివున్నది. మూడవది ప్రతిపక్షాలన్నీ అవినీతి భూయిష్ఠమైనవని, వారసత్వ పాలన తప్ప వాటికి మరో లక్ష్యం లేదని మోదీ చేస్తున్న ప్రచారాన్ని ఎలా ఎదుర్కోవాలో తేల్చుకోవాలి. సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడితే దేశంలో అభివృద్ధి వెనుకబడుతుందని, అధికారంలో వాటా కోసం కుమ్ములాటలు జరుగుతాయని కూడా మోదీ ప్రజల్లోకి వెళతారనడంలో సందేహం లేదు.

వీటన్నింటినీ ఎదుర్కోగల అస్త్రాలు ప్రతిపక్షాలకు లేవని చెప్పలేము. మందిర నిర్మాణం ప్రారంభం కాకముందే ప్రాణ ప్రతిష్ఠ చేయడం, అందునా ఆ పవిత్ర కృత్యాన్ని మోదీయే నిర్వహించడం వెనుక రాజకీయం ఉన్నదని శంకరాచార్యులు విమర్శించడం వంటివి ప్రస్తావించడం మాత్రమే సరిపోదు. శ్రీరాముడి గురించి మాట్లాడుతూనే మరో వైపు చేతుల్లో కత్తులు ఝళిపిస్తున్నారని కాంగ్రెస్ నేత మల్లికార్జున ఖర్గే మణిపూర్‌లో విమర్శించారు. 'ప్రతి ఒక్కరికీ మత విశ్వాసాలు ఉంటాయికాని ఓట్ల కోసం ఆ విశ్వాసాలను ఎవరూ ఉపయోగించుకోరు. బీజేపీ ఓట్లకోసం మతాన్ని ఉపయోగించుకుంటోంది' అని ఆయన విమర్శించారు. ఈ ప్రచారం ప్రజల్లోకి ఉధృతంగా వెళ్లనంతవరకూ రామమందిర నిర్మాణం బీజేపీకే అనుకూలంగా ఉంటుంది.



■ ఎ. కృష్ణారావు
ఇండియాగేట్

నిజానికి మతాన్ని రాజకీయాలను కలగలపడంపై ఉన్నతన్యాయస్థానం పలు సందర్భాల్లో పలు రకాలుగా వ్యాఖ్యానించింది. హిందూత్వ అనేది ఒక జీవన విధానమని, దానిపై ఎన్నికల్లో ఓట్లు అడిగినంత మాత్రాన చట్టాన్ని ఉల్లంఘించినట్లు కాదని 1995లో భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ వర్మ నేతృత్వంలోని సుప్రీంకోర్టు బెంచ్ స్పష్టం చేసింది. హిందూ రాష్ట్రం పేరుతో ఓట్లు అడిగినందుకు శివసేన నేత మనోహర్ జోషితో పాటు 9 మందిని అనర్హులుగా ప్రకటిస్తూ బొంబాయి హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీం కొట్టివేసింది. శివసేన అధినేత బాల్ థాకరే ఉద్రేకపూరిత ప్రసంగాలను కూడా సుప్రీం కోర్టు విస్మరించింది. మతాన్ని రాజకీయాలకు ఉపయోగించుకోకూడదని ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 123(3) విధించిన నిబంధనను అది బుట్టదాఖలు చేసింది. ఈ నిబంధన ప్రకారం మతాన్ని రాజకీయాలకు ఉపయోగించుకోవడం కూడా అన్ని విధాలా అవినీతే. సుప్రీంకోర్టు రూలింగ్‌పై పార్లమెంట్ కానీ, ఎన్నికల కమిషన్ కానీ పెద్దగా ప్రతిస్పందించలేదు. సుప్రీంకోర్టు కూడా రెండు దశాబ్దాలు మౌనం పాటించింది. ఒక రకంగా ఈ తీర్పు బీజేపీ ఎదుగుదలకు కారణమైందన్న వ్యాఖ్యలు కూడా ఉన్నాయి.

కాని మతాన్ని రాజకీయాలతో కలగాపులగం చేయడాన్ని రాజ్యాంగమే నిషేధించిందని దాదాపు 20 ఏళ్ల తర్వాత 2017లో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టిఎస్ ఠాకూర్ నేతృత్వంలోని ఏడుగురు సభ్యుల రాజ్యాంగ బెంచ్ స్పష్టంచేసింది. జస్టిస్ మదన్ బి. లోకూర్, జస్టిస్ ఎసఏ బాబ్డే, జస్టిస్ ఎల్ నాగేశ్వరరావు ఈ విషయంలో ఏకీభావం వ్యక్తం చేయగా, ఈ అంశాన్ని పార్లమెంట్‌కు వదిలి వేయాలని న్యాయమూర్తులు ఆదర్శ్ గోయెల్, యుయులలిత్, డివై చంద్రచూడ్ ప్రకటించారు. ఈ తీర్పుపై నాడు అసమ్మతి ప్రకటించిన జస్టిస్ డివై చంద్రచూడ్ ఇప్పుడు సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తి. రామమందిరాన్ని రాజకీయాలకు బీజేపీ ఉపయోగించుకోవడంపై ఎవరైనా మళ్లీ కోర్టుకు వెళితే ప్రస్తుత న్యాయస్థానం ఏమి చెబుతుందో చెప్పలేము. అంతకు ముందు ఎన్నికల కమిషన్ ఆ విషయంలో కలుగచేసుకునే ధైర్యం చూపాలి కదా! మతాన్ని రాజకీయాలకు ఉపయోగించుకోవడం రాజకీయ నాయకులు ఆపనంతవరకూ విద్వేష ప్రసంగాలు ఆగబోవని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జోసెఫ్, జస్టిస్ నాగరత్నమ్మ ఇటీవల వ్యాఖ్యానించారు. ఇలాంటి వ్యాఖ్యల వల్ల ఏమి ఒరుగుతుంది? నిజానికి రాజకీయ నాయకులు ఉపయోగించుకుంటే ఉపయోగపడే ప్రజలు ఉన్నంతకాలం వారు భావోద్వేగాలకు గురవుతూనే ఉంటారు. మతాన్ని రాజకీయాలకు ఉపయోగించుకోవడం ద్వారా తమను మభ్యపెడుతున్నారని ప్రజలు గ్రహించాలి. ఆ గ్రహింపు వచ్చేందుకు వారిని చైతన్యపరచాల్సిన బాధ్యత ప్రతిపక్ష పార్టీలదే. రామమందిరం విషయంలో ఒక స్పష్టమైన సైద్ధాంతిక దృక్పథం ముందుగా రాజకీయ పార్టీలకు ఏర్పడాలి. ఈ పార్టీలే అధికార పార్టీ ఉధృత ప్రచారానికి లోనై ఆత్మరక్షణలో పడితే ఎవరూ ఏమీ చేయలేరు. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, మాటేమిటి? అని ఖర్గే అన్నమాటలు జనం మనసుల్లో కూడా ప్రతిధ్వనింపచేయాలి.

ఈశాన్యం నుంచి కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ యాత్ర ప్రారంభించడం ఒక వ్యూహాత్మక నిర్ణయమే. ఈశాన్య రాష్ట్రాల్లో 25 లోక్‌సభ సీట్లున్నాయి. ఇందులో కేవలం అస్సాంలోనే 14 సీట్లు ఉన్నాయి. ఈ పాతిక సీట్లను రాహుల్ గాంధీ యాత్ర ఎంతో కొంత ప్రభావితం చేయగలదని కాంగ్రెస్ భావిస్తోంది. మణిపూర్‌లో కుకీలు, మైతీలు ఒకర్నొకరు నరుక్కున్న ప్రాంతాల్లోనే రాహుల్ పర్యటించి వారిమధ్య సయోధ్యకు కాంగ్రెస్ కృషి చేస్తుందనే సందేశం పంపారు. సముద్ర స్నానాలు చేసేందుకు సమయం ఉంటుంది కాని మణిపూర్‌లో అడుగు పెట్టేందుకు, జాతుల మధ్య సామరస్యం కుదిర్చేందుకు మోదీకి సమయం లేదని ఆయన విమర్శించారు. మణిపూర్‌లో జాతుల సమస్యను ప్రస్తావిస్తే ఇతర రాష్ట్రాల్లో బీజేపీ మతప్రచారానికి వ్యతిరేకంగా రాహుల్ గాంధీ కులం గురించి ప్రస్తావిస్తున్నారు. కుల జనగణన జరిపిస్తామని హామీలు ఇస్తున్నారు. నిజానికి కుల జనగణన గురించి ఇటీవల మూడు ఉత్తరాది రాష్ట్రాల్లో ఎన్నికల సభల్లో ఎంత మాట్లాడినా కాంగ్రెస్‌కు అంత ప్రయోజనం కలుగలేదు. అంత మాత్రాన భారత రాజకీయాల్లో కులానికి అంత ప్రాధాన్యం లేదని కొట్టి పారేయలేము. ప్రజలు మత ప్రాతిపదికన ఏకం అవుతారని కూడా తీర్మానించలేము. మతం గురించి మాట్లాడుతూనే కులాలను ఉపకులాలుగా చీల్చి ప్రయోజనం పొందేందుకు బీజేపీ తీవ్ర యత్నాలు చేస్తున్న విషయాన్ని కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు విస్మరించరాదు. రాహుల్ గాంధీ భారత్ జోడో న్యాయయాత్రలో ప్రధానమైనది సామాజిక న్యాయం అందించడం. దేశంలో దళితులు, ఆదివాసీలు, వెనుకబడిన వర్గాలకు సామాజిక న్యాయం అందించేందుకు కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు చిత్తశుద్ధితో కృషిచేస్తాయని నమ్మకం కలిగించనంతవరకూ అణగారిన వర్గాలు మతం వెల్లువలో కొట్టుకుపోకుండా ప్రతిపక్షాల వైపు మొగ్గు చూపే అవకాశం లేదు. ఇందుకు ఇండియా కూటమి కనీస ఉమ్మడి ఎజెండాను ఏర్పర్చుకోవాలి. జయప్రకాశ్ నారాయణ్ లాగా వివిధ వర్గాలను, కులాలను సమీకరించగలిగిన శక్తి ప్రతిపక్ష నేతల్లో ఎవరికైనా ఉన్నదా? 2024 ఎన్నికలను మండల్, కమండల్ పోరాటంగా మార్చే సైద్ధాంతిక శక్తి ప్రతిపక్షాలకు ఉన్నదా? అన్నది చర్చించాల్సి ఉన్నది.

వారసత్వం, అవినీతిని బీజేపీ కూడా ప్రోత్సహిస్తున్నందువల్ల ఆ విషయంలో ప్రతిపక్షాలను విమర్శించడంలో పసలేదనే చెప్పాలి. వివిధ రాష్ట్రాల్లో వందలాది వారసులను బీజేపీ అందలం ఎక్కించింది. బీజేపీతో చేతులు కలిపిన అనేకమంది అవినీతిని విస్మరించారు. సంకీర్ణ ప్రభుత్వాల వల్ల దేశం విచ్ఛిన్నమవుతుందని చేస్తున్న ప్రచారాన్ని తిప్పికొట్టడం కూడా అంత కష్టమేమీకాదు. ఐదేళ్ల పాటు నరసింహారావు మైనారిటీ ప్రభుత్వంలోనూ, ఆ తర్వాత వాజపేయి నిర్వహించిన సంకీర్ణ ప్రభుత్వంలోనూ దేశం విచ్ఛిన్నమైందా లేక అభివృద్ధి పథంలో నడిచిందా అన్న ప్రశ్నలు వేసుకుంటే సరైన జవాబులు లభిస్తాయి. పదేళ్ల పాటు యూపీఏ ప్రభుత్వం విజయవంతంగా పాలించిన సమయంలో జరిగిన అభివృద్ధికీ, పదేళ్ల పాటు మోదీ హయాంలో జరిగిన అభివృద్ధికీ మధ్య తేడాపై గణాంక వివరాలతోసహా చర్చించేందుకు వెనుకాడనక్కర్లేదు. పదేళ్ల మన్మోహన్ సింగ్ పాలనలో సగటు అభివృద్ధి రేటు 8.4 శాతం కాగా మోదీ హయాంలో సగటు అభివృద్ధి రేటు 5.4 శాతం మాత్రమేనని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ చేసిన వ్యాఖ్యలు కొట్టిపారేయదగినవి కావు. రామమందిరం మోదీకి బ్రహ్మాస్త్రమే కావచ్చు కాని ప్రతిపక్షాల వద్ద కూడా పాశుపతాస్త్రాలు తక్కువేమీ లేవు.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

ప్రజాస్వామ్యం అపహాస్యం

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చట్టసభలను నిర్వీర్యం చేస్తోంది. పార్లమెంట్‌లో చర్చలు జరగనీయకుండా చేస్తూ ఏకపక్షంగా చట్టాలు చేస్తోంది. ప్రతిపక్ష సభ్యులను పలు సందర్భాల్లో సస్పెండ్ చేసి తమకు ఎదురులేకుండా చేసుకుంటున్నారు. చివరకు పార్లమెంట్ కొత్త భవనంలోకి చొరబడి ఆగంతకులు దాడి చేసిన సంఘటనపై కూడా చర్చకు ప్రభుత్వం సిద్ధపడకపోవడం, కనీసం ఒక ప్రకటన చేయకపోవడం, 146 మంది విపక్ష సభ్యులను బహిష్కరించడం ఈ దుర్నీతికి పరాకాష్ఠ. స్వతంత్ర భారతావనిలో మన ప్రజాస్వామ్య వ్యవస్థ ఈ రకంగా ఎన్నడూ అపహాస్యానికి గురికాలేదు. మణిపూర్ మండిపోతున్నా, అదానీ వ్యవహారం పార్లమెంట్‌ను కుదిపేసినా ప్రధానమంత్రి స్పందించరు. పండిట్ నెహ్రూ, హీరేన్ ముఖర్జీ, పుచ్చలపల్లి సుందరయ్య, మధులిమాయే, రామ్ మనోహర్ లోహియా వంటి అనేకమంది రాజకీయ ఉద్దండులు



ప్రజాసమస్యలకు పార్లమెంట్‌ను వేదికగా చేసుకున్నారు. రాజకీయ విలువలను పాటిస్తూ పార్లమెంట్ హుందాగా నడిచేలా చేశారు. అందుకు భిన్నంగా, బీజేపీ ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరిస్తోంది. అది తెచ్చిన వ్యవసాయ చట్టాల మీద రైతులు సుదీర్ఘకాలం పాటు చారిత్రాత్మక పోరాటం చేశారు. వ్యవసాయ చట్టాల కోసం ఆర్డినెన్స్ తీసుకురావడమే అప్రజాస్వామిక చర్య. చివరకు రైతుల ఆందోళనతో ప్రధానమంత్రి దిగిరాక తప్పలేదు.

సమాఖ్య వ్యవస్థపై దాడి జరుగుతోంది. విద్య, ఆరోగ్యం, సహకారం వంటి రంగాలపై కేంద్రం పెత్తనం చెలాయిస్తోంది. ప్రణాళికా సంఘాన్ని ఏకపక్షంగా రద్దు చేసి దాని స్థానంలో 'నీతి ఆయోగ్'ను ఏర్పాటు చేశారు. ఆర్థిక స్వావలంబన లక్ష్యంగా ఏర్పడ్డ ప్రభుత్వరంగ సంస్థలను అమ్మేయాలని బీజేపీ ప్రభుత్వం నిర్ణయించి, అనేక దశాబ్దాలుగా దేశ ప్రజలకు సేవలందిస్తున్న బ్యాంకింగ్, రైల్వే, రక్షణ, బీమా వంటి కీలక రంగాలను స్వదేశీ, విదేశీ బడా కార్పొరేట్లకు అప్పగిస్తున్నారు. 2008లో ప్రపంచ ఆర్థిక సంక్షోభం తలెత్తినపుడు అమెరికాతో సహా పలు అగ్రదేశాల్లో బ్యాంకింగ్, బీమా, పెన్షన్ వంటి మార్కెట్లు, పలు వ్యవస్థలు దివాళా తీసాయి. అటువంటి క్లిష్ట పరిస్థితుల్లో మన దేశ ఆర్థిక వ్యవస్థను కాపాడింది దేశంలోని ప్రభుత్వరంగ సంస్థలే. నేటికీ సామాజిక రంగాల అభివృద్ధికి ఎల్ఐసి, ప్రభుత్వరంగ బ్యాంకులు సహాయపడుతున్నాయి.

మరోపక్క మానవాభివృద్ధి నివేదిక, ఆక్స్‌ఫామ్ నివేదిక, ఆకలి సూచి, సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ, ఎన్ఎస్ఎస్ఓ, ప్రజాస్వామ్య సూచి తదితర నివేదికలను విశ్లేషిస్తే ఆర్థిక అసమానతలు, నిరుద్యోగం, పేదరికం, ఆకలి, పౌరహక్కుల హననం వంటివి గత దశాబ్ద కాలంలో మరింత తీవ్రమయ్యాయని స్పష్టమవుతోంది. 80శాతానికి పైగా కుటుంబాల ఆదాయపు విలువ పడిపోతే, బడా సంపన్నుల ఆదాయాలు రెట్టింపయ్యాయి. అధిక ధరలతో కోట్లాది మంది ప్రజల జీవనోపాధి, భద్రత ప్రమాదంలో పడుతున్నాయి. ఏడిఆర్ నివేదిక ప్రకారం బీజేపీ ఎలక్టోరల్ బాండ్స్ ద్వారా కోట్లాది రూపాయల విరాళాలు సేకరించింది. ఈ నిధులకు సంబంధించిన వివరాలు ప్రజలకు తెలియవు. ఆ విధానం ఎంత అప్రదిష్టపాలైనా బీజేపీ లెక్కచేయడం లేదు. ఎన్నికల కమిషనర్ల నియామక కమిటీ నుంచి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని సైతం తీసేశారు. ఎన్నికల ఖర్చును తగ్గించేందుకేనంటూ జమిలి ఎన్నికల పల్లవి నెత్తుకుని అందుకు ఒక కమిటీని నియమించారు. ఒకే జాతి– ఒకే సంస్కృతి– ఒకే ఎన్నిక– ఒకే భాష అంటూ మోసపూరిత ప్రచారంతో ప్రజలను మభ్యపెడుతూ విభిన్నమైన, బహుళమైన మన సమాజపు మూలాలను దెబ్బతీసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రజల్లో మత భావాలను ప్రేరేపిస్తూ మన రాజ్యాంగ లక్ష్యాలకు తూట్లు పొడుస్తున్నారు. ప్రజాస్వామ్యవాదులు, జర్నలిస్టులు గళమెత్తినపుడు వారిని అణచివేతలకు గురిచేస్తున్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థను, దాని ద్వారా సంక్రమించిన హక్కులను పరిరక్షించుకోవడం దేశ ప్రజల ముందున్న ప్రధాన కర్తవ్యం.

– వి.వి.కె. సురేష్

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033. మెయిల్: editpage@andhrajyothy.com

రేపటి ఎన్నికలు 'సీమ'కు కీలకం!

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య అంతర్ రాష్ట్ర జల వివాదాలు సామరస్యంగా పరిష్కారం జరిగితే తప్ప రాయలసీమకు చెందిన కీలకమైన సాగునీటి ప్రాజెక్టులకు మోక్షం లభించదు. సిద్దేశ్వరం అలుగు నిర్మాణం జరగాలన్నా గుండ్రేవుల రిజర్వాయర్ నిర్మింపబడాలన్నా తెలంగాణ ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరించాలి. సిద్దేశ్వరం అలుగు నిర్మాణానికి రెండు రాష్ట్రాలు ప్రతిపాదన చేస్తే కేంద్ర జల సంఘం అడ్డు చెప్పే అవకాశం ఉండదు. అలుగు నిర్మాణం ద్వారా నిల్వ ఉండే నీళ్లు రెండు రాష్ట్రాలు నీటి ఎద్దడి రోజుల్లో వాడుకోవచ్చనే భావనకు తెలంగాణ ప్రభుత్వం రావాలి. గుండ్రేవుల రిజర్వాయర్ నిర్మాణంతో తెలంగాణ భూభాగంలో వచ్చే ముంపు ప్రాంతం ఇచ్చేందుకు ఆ రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించాలి. ఇవన్నీ సజావుగా జరగాలంటే రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రుల మధ్య స్నేహ సంబంధాలు వుండి ఇచ్చి పుచ్చుకొనే విధంగా ఒప్పందం జరగాలి. ట్రిబ్యునల్స్ కోర్టులు ఆంధ్రప్రదేశ్‌కు కృష్ణ జలాల వాటాపై అనుకూలంగా తీర్పులు ఇచ్చినా తెలంగాణ ప్రభుత్వం అంగీకరించనిదే రాయలసీమకు చెందిన కీలకమైన ప్రాజెక్టుల నిర్మాణం జరిగే అవకాశమే లేదు. క్షేత్రస్థాయి పరిస్థితి ఒక రకంగా వుంటే కొందరు రాయలసీమ పరిరక్షణ కోసం తపించేవారు కోస్తా జిల్లాల వారిపై అక్కసు వెళ్ళగక్కడం లేదా ప్రత్యేక రాయలసీమతో పరిష్కారమౌతుందని భావించడమే నేటి విషాదం. ఉమ్మడి రాష్ట్రం నాటి పరిస్థితులు వేరు. రాష్ట్ర విభజన తర్వాత పైగా తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పరిస్థితులు వేర్వేరని భావించడం లేదు.

గత అయిదేళ్లుగా జగన్మోహన్ రెడ్డి కేసీఆర్‌తో సఖ్యతగా వున్నా ముఖ్యమంత్రి స్థాయిలో ఎప్పుడూ సీమకు చెందిన వివాదాస్పద ప్రాజెక్టుల గురించి చర్చలు జరపలేదు. కేసీఆర్‌తో సన్నిహితంగా వుంటూ ఇరువురు అలాయ్ బలాయ్ ఆడినా తనకు రాజకీయ జన్మ ఇచ్చి పైగా 2019 ఎన్నికల్లో అఖండ విజయం చేకూర్చిన రాయలసీమ వాసుల కన్నీరు తుడిచేందుకు జగన్మోహన్ రెడ్డి సిద్ధపడలేదు. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ ప్రాధాన్యతల్లో లేకపోవడంతో సువర్ణావకాశం చేజారి పోయింది. టీడీపీ ప్రభుత్వ అయిదేళ్ల కాలంలో కేసీఆర్ చంద్రబాబు నాయుడు మధ్య ఉప్పు నిప్పుగా వున్నందున రాయలసీమ వివాదాస్పద ప్రాజెక్టుల అంశం ముందుకు సాగలేదు. 2016లో జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో కేసీఆర్, చంద్రబాబు నాయుడు మధ్య వాడిగా వేడిగా చర్చలు జరిగాయి. తుదకు అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో కూడా సాధించిందేమీ లేకపోయింది. కాని రెండవ మారు జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో కేసీఆర్ జగన్మోహన్ రెడ్డి ఎంతో సామరస్యంగా వ్యవహరించారు. అయితే అంతిమంగా జరిగిందేమంటే రాయలసీమకే కాదు మొత్తం ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర నష్టం వాటిల్లే విధంగా కొత్త ట్రిబ్యునల్ నియామకంపై చర్చల సమయంలో జగన్మోహన్ రెడ్డి అడ్డు చెప్పలేదు. తత్ఫలితంగా కొత్త ట్రిబ్యునల్ నియమింపబడి నేడు సరిదిద్దలేని నష్టం వాటిల్లింది. ప్రధానంగా రాయలసీమకు అపార నష్టం వాటిల్లనుంది. ఈ అంశంపై సీమ వాసులు మొత్తుకొంటున్నా ఆలకించే దిక్కులేకుండా పోయింది. కనీసం ట్రిబ్యునల్ నియామకంపై సుప్రీంకోర్టులో వేసిన కేసు త్వరగా విచారణకు వచ్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వ చర్యలు లేవు. అందరూ ఎన్నికల హడావుడిలో పడ్డారు. గమనార్హమైన అంశమేమంటే ప్రస్తుతం నియమింపబడిన ట్రిబ్యునల్ రేపు మార్చి లోపు తీర్పు వెలువరించవలసి వుంది.

కేసీఆర్ తొలి నుండి వ్యూహాత్మకంగా పావులు కదిపారు. 2019 ఎన్నికల్లో తిరిగి చంద్రబాబు నాయుడు అధికారంలోనికి వస్తే ప్రధానంగా అంతర్ రాష్ట్ర జల వివాదాల్లో తను ఇబ్బందులు ఎదుర్కోవలసి వుంటుందని 2019 ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డి విజయానికి అన్ని విధాలా సాయపడ్డారు. ఫలితంగా గోదావరి కృష్ణ జలాల వివాదంలో ఎంతో కొంత లబ్ధి పొందారు. ఆంధ్రప్రదేశ్ మాత్రం తీవ్రంగా నష్టపోయింది. మరోవేపు రాయలసీమలో 51 శాసనసభ స్థానాలుంటే 49



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేసీఆర్ లాగా భావోద్వేగాలతో అధికారంలోనికి రాలేదు. కేసీఆర్ లాగా ఆంధ్రోళ్ల బూచి చూపి పరిపాలన సాగించడం లేదు. రేపు ఎన్నికల తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో అధికారం చేపట్టే ముఖ్యమంత్రి ఇచ్చిపుచ్చుకొనే ధోరణిలో వ్యవహరించితే రేవంత్ రెడ్డి కూడా ఒక మెట్టు దిగే అవకాశం లేకపోలేదు.

మందిని గెలిపించి జగన్మోహన్ రెడ్డికి ఏకపక్షంగా అఖండ విజయం చేకూర్చారు. ఇందుకు భిన్నంగా జరిగి వుంటే జగన్మోహన్ రెడ్డి జాగ్రత్తగా వుండేవారేమో. ఇప్పుడు చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకున్నట్లు నేడు రాయలసీమలో తటస్థ వర్గాలే కాకుండా జగన్మోహన్ రెడ్డిని భుజాలపై ఎక్కించుకు తిరిగిన వారు కూడా వగస్తున్నారు. మోసపోయామని మధనపడుతున్నారు. ఇంత అపకారం జరిగినా రాయలసీమలో అసంతృప్తి వెల్లువెత్తుతున్నా జగన్మోహన్ రెడ్డి మాత్రం రాయలసీమలో బలీయంగా వున్న తన సామాజిక వర్గంపై అన్ని ఆశలు పెట్టుకొని ధీమాతో వున్నారు. క్షేత్రస్థాయి పరిస్థితులు భిన్నంగా వున్నాయి. రాయలసీమలో ఇతర ప్రాంతాలు అటుంచి తన స్వంత జిల్లాలో కూడా జగన్మోహన్ రెడ్డి పరదాల మాటున పర్యటనలు సాగిస్తుండగా ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు సభలకు నేల ఈనిందా అన్నట్లు జనం వెల్లువెత్తుతున్నారు. ఎన్నికల ఫలితాలు ఎలా వుంటాయో ఏమో గాని తిరిగి జగన్మోహన్ రెడ్డి అధికారంలోనికి వస్తే తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన పూర్వ రంగంలో రాయలసీమ శాశ్వతంగా ఎడారి కాక తప్పదు.

ఈ నేపథ్యంలో తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోనికి వచ్చింది. తనకు ప్రియమైన నేత కేసీఆర్ ఓడిపోవడాన్ని జగన్మోహన్ రెడ్డి జీర్ణించుకోలేకున్నారు. కనీసం ముందు రెండు రాష్ట్రాల మధ్య సఖ్యతకు నాందిగా జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ప్రభుత్వాల స్థాయిలోనైనా తత్సంబంధాలు కొనసాగించి వుండాలి. పైగా తమను ఓడించేందుకు అన్ని విధాలా జగన్మోహన్ రెడ్డి ప్రయత్నాలు చేశారని రేవంత్ రెడ్డి బహిరంగానే వెల్లడించడం కొసమెరుపు. ఈ అంశంలో వైసీపీ నేత ఎమ్మెల్యే కొడాలి నాని చేసిన వ్యాఖ్య పుండుపై కారం రాసినట్లుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కాలు ఏమైనా విరిగిందా జగన్మోహన్ రెడ్డి వెళ్లి పలకరించడానికి అని అభ్యంతరకరమైన కామెంట్ చేశారు. ముందు తాము అధికారంలోకి వస్తే రాయలసీమ వివాదాస్పద ప్రాజెక్టులు ఎలా గట్టెక్కుతాయనే భావన జగన్మోహన్ రెడ్డిలో లేక పోయింది.

జగన్మోహన్ రెడ్డి అనుమతి లేనిదే కొడాలి నాని అట్టి కామెంట్ చేసి వుండరు. పైగా కేసీఆర్ ఎన్నికల్లో అనుకూలత పొందేందుకు అనువుగా పోలింగ్ ముందు రోజు సాగర్ పైకి పోలీసు బలగాలను పంపడం అగ్నికి ఆజ్యం పోసినట్లయింది. ఒక వేళ జగన్మోహన్ రెడ్డి నీళ్ల కోసమే సాగర్ వద్దకు పోలీసు బలగాలను మోహరించి వుంటే గతంలో తన అధికారులే కాకుండా యాజమాన్య బోర్డుతో పాటు కేంద్ర జల వనరుల శాఖాధికారులు అభ్యంతరం వ్యక్తం చేసినా కేసీఆర్ తెగించి శ్రీశైలం జలాశయం నుండి విద్యుదుత్పత్తి కోసం విలువైన నీళ్లు సముద్రం పాలు చేసి రాయలసీమను ఎండగట్టినపుడు జగన్మోహన్ రెడ్డి ఎందుకు చేతులు ముడుచుకొని వుండిపోయారని సగటు రాయలసీమ వాసి భావించే అవకాశం లేకపోలేదు. తెలంగాణ ప్రభుత్వం యెడల జగన్మోహన్ రెడ్డి వైఖరి అంతిమంగా గొంతెండిపోతున్న రాయలసీమకు అపకారం చేస్తుంది. రేపటి ఎన్నికల్లో కూడా జగన్మోహన్ రెడ్డి తిరిగి అధికారంలోనికి వస్తే గతంలో చంద్రబాబు నాయుడు కేసీఆర్ కాలం నాటి రోజులు పునరావృతమౌతాయి.

ఈ సమయంలో రాయలసీమ అస్తిత్వం కోరే ఎవరైనా సరే మన దీపమని ముద్దు పెట్టుకొంటే మూతి కాల్చుకోవలసి వుంటుంది. కీలకమైన ఈ సమయంలో రాయలసీమ ప్రజలు విజ్ఞత ప్రదర్శించవలసి వుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేసీఆర్ లాగా భావోద్వేగాలతో అధికారంలోనికి రాలేదు. కేసీఆర్ లాగా ఆంధ్రోళ్ల బూచి చూపి పరిపాలన సాగించడం లేదు. రేపు ఎన్నికల తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో అధికారం చేపట్టే ముఖ్యమంత్రి ఇచ్చిపుచ్చుకొనే ధోరణిలో వ్యవహరించితే రేవంత్ రెడ్డి కూడా ఒక మెట్టు దిగే అవకాశం లేకపోలేదు.

• వి. శంకరయ్య
విశ్రాంత పాత్రికేయులు


అంపాపురం బరులు వద్ద భారీగా వాహనాలపార్కింగ్



పందెం @ 900 కోట్లు

ఉమ్మడి కృష్ణాలో రూ.కోట్లలో పందేలు

భోగి రోజు నుంచి మొదలైన సంక్రాంతి సంబరాలు మంగళవారంతో ముగిశాయి. ఈ మూడు రోజులపాటు సంబరాల ముసుగులో పందేలు, జూదాలు భారీగా జరిగాయి. ఈసారి రికార్డు స్థాయిలో బెట్టింగ్‌లు నడిచాయి. ఉమ్మడి కృష్ణా జిల్లాలో గతేడాది రూ.200 కోట్లు వరకు పందేలు నిర్వహిస్తే.. ఈసారి మూడు రోజులపాటు నిర్వహించిన పందేలు, జూదాల్లో రూ.900కోట్ల వరకు బెట్టింగ్‌లు నడిచాయి. సంక్రాంతి, మకర సంక్రాంతి రోజున భారీగా బెట్టింగ్‌లు జరిగినట్టు తెలుస్తోంది.

- పరుగులు తీయించిన పొట్టేళ్ల కొట్లాట
- ఢీకొట్టిన పుంజులు
- గతేడాది కన్నా భారీగా పెరిగిన పందెం
- పందెంలో పురుషులతో పోటీ పడిన మహిళలు

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) : కోడిపందేలు, పొట్టేళ్ల నిర్వహణకు బాపులపాడు మండలం అంపాపురం కేంద్రంగా నిలిచింది. ఉమ్మడి కృష్ణా జిల్లాకు చెంతనే ఉన్న ప్రాంతాల నుంచి పందెం రాయుళ్లు భారీ సంఖ్యలో ఇక్కడికి తరలించారు. ఒక్కో పందేన్ని రూ.5 లక్షలు నుంచి రూ.50 లక్షల వరకు సాగాయి. ఈసారి కోడిపందేల కంటే పొట్టేళ్ల పందేలపై భారీగా బెట్టింగ్‌లు జరగడం గమనార్హం. నంబరింగ్ జూదంలో యువకులు భారీగా పాల్గొని చేతి చమురు వదిలించుకున్నారు. జిల్లాలో కొన్నిచోట్ల సంక్రాంతి రోజున కొత్తగా బరులు వెలిశాయి. ఫ్లడ్ లైట్ల వెలుగుల్లో పందేలను పరుగులు తీయించారు. పొట్టేళ్ల పందేల కోసం హైదరాబాద్, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి పొట్టేళ్లు వచ్చాయి. ఈ పోటీలను తెలంగాణకు చెందిన పందెం రాయుళ్లు నిర్వహించారు. అంపాపురంలో నిర్వాహకుల నుంచి భారీ మొత్తంలో బరులను దక్కించుకున్నట్టు తెలిసింది.

కన్నెత్తిచూడని పోలీసులు

సంక్రాంతి సంబరాల ముసుగులో ఎలాంటి కోడిపందాలు, జూదాలు నిర్వహించకూడదని, నిర్వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికార యంత్రాంగం చేసిన ప్రకటనలు కేవలం మాటలకే పరిమితమయ్యాయి. పోలీసులు ఈ శిబిరాల వైపు కన్నెత్తి చూసిన దాఖలాలు ఎక్కడా కనిపించలేదు. నిర్వాహకులు ముందుగానే వేలాది రూపాయలను చెల్లించి ప్రైవేటు బౌన్సర్లను రక్షణ కోసం

- మిగతా 6లో



పండగ పూటా.. పోరుబాటే..!

పండుగ పూట గరిటలు పట్టి పిండివంటలు చేయాల్సిన చేతులు పిడికిలెత్తి పోరుబాట పట్టాయి. క్షణం తీరికలేకుండా పండుగ పనుల్లో మునిగిపోయే మహిళామణులు ఇల్లూవాకిలి వదిలి రోడ్డెక్కి సర్కారుపై సింహ గర్జన చేశాయి. సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన హామీని అమలు చేయాల్సిందేనని అంగన్వాడీలు చేపట్టిన నిరవధిక దీక్షల్లో భాగంగా 36 రోజు మంగళవారం ధర్నాచౌక్ వద్ద దీక్షా శిబిరంలో నినాదాలతో ముగ్గులు వేసి నిరసన తెలిపారు. - ధర్నాచౌక్

కల్యాణం.. కమనీయం!


వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి కల్యాణోత్సవంలో పవిత్ర మంగళసూత్రాలను భక్తులకు ప్రదర్శిస్తున్న అర్చకులు

దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో వల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి వార్ల లీలా కల్యాణోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రతినెలా షష్టి తిథి రోజున కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తారు. విఘ్నేశ్వరపూజ, వధూవరుల ఆహ్వానం, కంకణధారణ, ఉత్తర ధన్యాల సమర్పణ, కటి సూత్ర సమర్పణ, హారతి తదితర కార్యక్రమాలను భక్తి సమన్వితంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని వారి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ట్రస్ట్‌బోర్డు ఛైర్మన్ కర్నాటి రాంబాబు, పలువురు అధికారులు పాల్గొన్నారు.
- వన్‌టౌన్


దుర్గమ్మను దర్శించుకుంటున్న భక్తులు


విజయవాడ పటమటలోని దర్శిపేటలో

గోదావరి జిల్లాలకు దీటుగా.. కొత్త అల్లుళ్లకు భారీ విందు

- 6లో..

పోరంకిలో మహిళ హత్య

- 24 గంటల్లో కేసు ఛేదించిన పెనమలూరు పోలీసులు

- 6లో..


శరవేగంగా జరుగుతున్న ఏర్పాట్లు

చంద్రబాబు సభకు ఏర్పాట్లు చకచకా..

గుడివాడలో రా.. కదిలిరా సభ ఏర్పాట్లు ముమ్మరం

- స్వచ్ఛందంగా 28 ఎకరాలు ఇచ్చిన రైతులు
- 2 లక్షల మంది వస్తారని అంచనా
- 15 పార్కింగ్ స్థలాల ఏర్పాటు

గుడివాడ : టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఈనెల 18వ తేదీన రాకకు గుడివాడ సర్వాంగ సుందరంగా సిద్ధమవుతోంది. రైతులు స్వచ్ఛందంగా ఇచ్చిన 28 ఎకరాల పంటపొలాల్లో బహిరంగ సభ ఏర్పాట్లు చకచకా సాగుతున్నాయి. గుడివాడ మండలం మల్లాయిపాలెంలో జాతీయ రహదారి వెంబడి అలంకృత ఫంక్షన్ హాల్ ఎదురుగా పంటపొలాల్లో నియోజకవర్గ ఇన్‌చార్జి వెనిగండ్ల రాము ఆధ్వర్యంలో నిర్వహించే రా.. కదిలిరా బహిరంగ సభకు శరవేగంగా ఏర్పాటు జరుగుతున్నాయి. సభా స్థలం వద్దే ప్రత్యేకంగా హెలీప్యాడ్‌ను ఏర్పాటు చేశారు. ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం కలుగకుండా వాహనాల పార్కింగ్ కోసం 15 స్థలాలను సిద్ధంగా చేశారు. సభకు వచ్చే వారికి ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. ముఖ్యంగా కార్యకర్తలు కూర్చునేందుకు వీలుగా గ్యాలరీలను విశాలంగా ఏర్పాటు చేశారు. రహదారులన్నీ పసుపుమయం అవుతున్నాయి. సుమారు 2 లక్షల మంది కార్యకర్తలు, టీడీపీ అభిమానులు తరలిరానున్నట్లు అంచనా వేస్తున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఏర్పాట్లు చేస్తున్నారు.

తరలిరానున్న రాష్ట్ర, జిల్లా నాయకులు

రా...కదిలిరా కార్యక్రమానికి రాష్ట్ర, జిల్లాస్థాయి నాయకులు భారీ ఎత్తున తరలిరానున్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లాతో పాటు పక్కనే ఉన్న గోదావరి జిల్లా నుంచి భారీగా నాయకులు, కార్యకర్తలు తరలిరానున్నారు.

నానికి చెంపపెట్టులా నిర్వహణకు ఏర్పాట్లు

గుడివాడ తన అడ్డాగా చెప్పుకునే కొడాలి నానికి చెంపపెట్టులా భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని టీడీపీ శ్రేణులు పట్టుదలతో ఉన్నారు. ఈ మేరకు భారీ జనసమీకరణపై దృష్టి పెట్టారు. పట్టణ, గ్రామాల్లో ముఖ్య నాయకులు బాధ్యతలను తీసుకున్నారు. సమన్వయంతో ముందుకు కదులుతున్నారు. ఇంటింటికి వెళ్లి ఆహ్వానాలను అందజేస్తున్నారు.

రబీపైనే ఆశ

ఖరీఫ్ కరిగిపోయింది. అన్నదాతలను నిలువునా ముంచింది. మిన్ను విరిగి మీద పడ్డట్టు మిచౌంగ్ తుఫాను దిగుబడులను దెబ్బతీసింది. దాని నుంచి రైతులు ఇప్పటికీ కోలు కోలేకపోతున్నారు. ధైర్యం చేసి ఖరీఫ్‌లో రెండో పంటగా సాగుచేసిన మినుము, పెసర, మొక్కజొన్న పంటలు సక్రమంగా చేతికి అందుతాయనే ఆశతో రైతులు ఉన్నారు. ఇంతలోనే రబీ సీజన్ దగ్గరకొచ్చింది. ఈ సీజన్‌లో అయినా ప్రకృతి తమకు అను కూలంగా ఉంటుందనే ఆశతో రైతులు ముందడుగు వేస్తున్నారు.



నష్టాలతో రైతులను ముంచిన ఖరీఫ్

- రెండో పంటగా 3.50 లక్షల ఎకరాల్లో మినుము సాగు
- ఒక్కతడికైనా సాగునీరు ఇవ్వాలని కోరుతున్నరైతులు
- సమీపిస్తున్న రబీ సీజన్
- 6531 రకం వరి వంగడంపై అన్నదాతల ఆసక్తి

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : ఈ ఏడాది రబీ సీజన్‌లో సాగు నీటిని విడుదల చేయలేమని ప్రభుత్వం చేతులెత్తేసింది. దీంతో ప్రత్యామ్నాయంగా జిల్లాలో 3.50 లక్షల ఎకరాలకుపైగా మినుము సాగు చేశారు. పీఎన్‌బీ-8, ఎల్‌బీజీ, యలమించిలి, నందిని, నందినిగోల్డ్, ఘంటసాల 1, 4 రకాల మినుము విత్తనాలను అధికంగా సాగు చేశారు. ఈ రకాలన్నీ 80 రోజుల్లో కోతకు వచ్చేవే. తిరుపతి రకం మినుము విత్తనాలు 105 రోజుల్లో కోతకు వస్తాయి. ఈ రకాన్ని కొంతమంది రైతులు సాగు చేశారు. ఫిబ్రవరి నెలాఖరు నుంచి అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణశాఖ ఇప్పటికే హెచ్చరికలు జారీ చేసింది. దీంతో మినుము పంట చేతికివచ్చే సమయానికి వాతావరణ పరిస్థితులు ఎంతమేర అనుకూలంగా ఉంటాయనే అంశంపై రైతుల్లో అలజడి నెలకొంది.

సాగునీరు ఇవ్వాల్సిందే..

మినుము పైరు ప్రస్తుతం నెల రోజుల్లోపు వయసులో ఉంది. 25 నుంచి నెలలోపు పైరుకు ఒక తడుపుగా నీరు అందిస్తే పైరుకు కొంతమేర మేలు జరుగుతుంది. కాలువలకు నీరు విడుదల చేస్తే నేరుగా పొలాలకు పెట్టకుండా మోటర్లు, ఆయిల్ ఇంజన్ల ద్వారా పొలం తడపాలని రైతులు చెబుతున్నారు. నేరుగా పొలానికి నీరు పెడితే అధికంగా చేరి మినుము మొక్కలకు ఇబ్బంది కలుగుతుందని పైపుల ద్వారా పెట్టాలని రైతులు అంటున్నారు. నీటి తడుపు ఇచ్చిన తరువాత వారం రోజుల పాటు మినుము మొక్కల ఎదుగుదల కొంతమేర నిలిచి మళ్లీ పుంజుకుంటుందని, 40 రోజులకు పూత దశకు చేరుకుంటుందని రైతులు అంటున్నారు. ఈనెల 25వ తేదీలోగా కాలువలకు నీరు విడుదల చేస్తే మినుము, పెసర పంటలకు తడుపునకు సమయం సరిపోతుందని రైతులు చెబుతున్నారు.

6531 రకం వరి వంగడంపై దృష్టి

రబీ సీజన్‌లో వరిసాగుకు అనుమతులు ఇవ్వకున్నా బోరునీరు అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో రైతులు వరిసాగుకే మొగ్గు చూపారు. ఉంగుటూరు మండలంలోని మానికొండ, నందమూరు, తెలప్రోలు, ఆత్కూరు, కొట్టిపాడు, పెదఅవుటపల్లి, గన్నవరం, కంకిపాడు, ఉయ్యూరు తదితర మండలాల్లో బోరునీటి ఆధారంగా వరిసాగు చేసున్నారు. గుంటూరు జిల్లా రేపల్లె, చల్లపల్లి మండలం నడకుదురు తదితర ప్రాంతాల నుంచి కూలీలు వచ్చి నాట్లు వేస్తున్నారు. ఈ ఏడాది రబీ సీజన్‌లో 1153, 1156 రకం వరి వంగడాలను సాగుచేస్తున్నారు. దీంతోపాటు కంకిపాడు మండలంలో కామారెడ్డి నుంచి తెచ్చిన 6531 రకం వరి వంగడాన్ని రైతులు సాగుచేస్తున్నారు. గత ఖరీఫ్ సీజన్‌లో కంకిపాడు తదితర ప్రాంతాల్లో కామరెడ్డి వెరైటీని ప్రయోగాత్మకంగా సాగు చేయగా 25 సెంట్ల భూమిలో 40 కిలోల చొప్పున 20 టిక్కీల దిగుబడి వచ్చింది. దీంతో రబీ సీజన్‌లో ఈ రకం వంగడాన్ని సాగుచేసి అధిక దిగుబడి వస్తే వచ్చే ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసే ఆలోచనలో రైతులు ఉన్నారు. జిల్లాలో 20 వేల ఎకరాలకుపైగా రబీ సీజన్‌లో వరిసాగు జరుగుతోంది.

ఆఫ్‌లైన్‌ను అమలు చేస్తారా?

ఖరీఫ్ సీజన్‌లో 3.74 లక్షల ఎకరాల్లో వరిసాగు జరిగింది. 10.50 లక్షల టన్నుల ధాన్యం దిగుబడులు వస్తుందని అంచనాగా ఉంది. ఇప్పటివరకు 3.10 లక్షల టన్నులు మాత్రమే కొనుగోలు చేశారు. ఇంకా ప్రభుత్వం 4 లక్షల టన్నులకుపైగా ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంది. ఈ ఏడాది తుఫాను కారణంగా ధాన్యం తడిచి, రంగుమారి నూక శాతం అధికంగా ఉంటోంది. 75 కిలోల బస్తా రూ.1634 మద్దతు ధరగా లభించాల్సి ఉండగా రూ.1300లకే రైతులు విక్రయించాల్సిన స్థితి నెలకొంది. ఇప్పటివరకు ఆఫ్‌లైన్‌లో ధాన్యం కొనుగోలు చేసిన అధికారులు వారం రోజులుగా ఆన్‌లైన్‌లోనే ధాన్యం కొనుగోలు చేస్తామని అంక్షలు పెట్టారు. దీంతో ఎఫ్‌సీఐ నిబంధనల ప్రకారం ధాన్యంలో నాణ్యత చూపేందుకు రైతులు విక్రయించిన ధాన్యంలో కోత పెడుతున్నారు. 120 సారల ధాన్యం రైతులు మిల్లుకు ఇస్తే 100 సారల ధాన్యం మాత్రమే లెక్కల్లో చూపుతున్నారు. ఆఫ్‌లైన్‌లో ధాన్యం విక్రయాలకు అనుమతులు ఇస్తే దగ్గరలోని మిల్లులకు ధాన్యం విక్రయించి మిల్లర్లతో ధాన్యం ధరను తామే నేరుగా మట్లాడుకుంటామని, రవాణా చార్జీలు కలిసి వస్తాయని రైతులు అంటున్నారు.


ఈడుపుగల్లులో భారీ బరులు

కోఢీ..



సంక్రాంతి సంప్రదాయ ముసుగులో కోడి పందేలు, పేకాట, జూదక్రీడలు గత మూడు రోజులగా రేయింబవళ్లు యథేచ్ఛగా సాగాయి. అనుమతులు ఇచ్చే ప్రస్తకే లేదని ఉన్నతాధికారులు పండగకు ముందు హెచ్చరికలు గుప్పించారు. వారి హెచ్చరికలు కోడి పందేల హోరులో కలిసిపోయాయి. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలో పందేలు జోరందుకోగా కోట్లలో నోట్లకట్టలు చేతులు మారాయి. పందేలలో పాల్గొనేందుకు ఇతర రాష్ట్రాల నుంచి కూడా యువత, మహిళలు భారీ సంఖ్యలో తరలి రావడం విశేషం.

- జోరుగా బరులు.. తెగిన నోట్ల కట్టలు!
- మామూళ్ల మత్తులో అధికార యంత్రాంగం
- రాష్ట్రాల నుంచి తరలివచ్చిన జనం..
- రూ. కోట్లలో చేతులుమారిన పైనం
- మూడు రోజులు రెచ్చిపోయిన జూదగాళ్లు
- ట్రాఫిక్ ఇబ్బందులతో ప్రజలకు కష్టాలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జనవరి 16 : సంక్రాంతి వేడుకలకు రాజకీయం తోడవడంతో కోడిపందేలు, జూదం విచ్చలవిడిగా సాగాయి. ఎన్నికల వేళ అధికారపక్షం అండగా నిలవడంతో న్యాయస్థానం హెచ్చరికలు జారీచేసినా రాజకీయ ప్రోద్బలం, ఒత్తిడి ఉండటంతో పోలీసుశాఖ కూడా మిన్నకుండిపోయింది. రాష్ట్రంలోనే పెద్దబరిగా పేరుగాంచిన అంపాపురంలో మూడు రోజులపాటు జోరుగా సాగుతున్న కోడిపందేలు, జూదం చూడటానికి, ఆడేందుకు వచ్చే వారితో ట్రాఫిక్ జామ్ అయింది. జాతీయ రహదారి పక్కనే కావడంతో వివిధ రాష్ట్రాలనుంచి వచ్చిన పందెపురాయుళ్ల కార్లతో సర్వీస్‌రోడ్లు నిండిపోయాయి. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులు గంటలపాటు నిరీక్షించాల్సిన పరిస్థితి. ఎ.సీతారాంపురం నుంచి అంపాపురం కూడలి వద్ద వరకు 3కిలోమీటర్ల మేర కార్లతో నిండిపోయాయి. స్థానికులు తీవ్ర ఇబ్బందులెదుర్కొన్నారు.



అంపాపురం బరి జాతరను తలపిస్తూ కిటకిటలాడింది.

● అంపాపురంలో కేసినో, కోడిపందేల ప్రధానబరిలోకి వెళ్లడానికి రోజుకో రంగుతో ప్రత్యేక పాసులను నిర్వాహకులు ఏర్పాటు చేశారు. గేటు వద్ద ఏర్పాటు చేసిన బౌన్సర్లు పాస ఉంటేనే తప్ప ఇతరులను అనుమతించలేదు. మూడు రోజులుగా సుమారు 100కోట్లకు పైగా చేతులుమారాయి.


గుడ్లవల్లేరులో కోడిపందేలకు వచ్చిన యువత

బాపులపాడు మండలంలో కె.సీతారాంపురంలో మరో పెద్ద బరి, కొత్తపల్లి, వేలేరు, సింగన్నగూడెం తదితర గ్రామాల్లో చిన్నబరులు ఏర్పాటు చేసి భారీగా కోడిపందేలు, గుండాట నిరాటంకంగా నిర్వహించారు. జూదం, కోడిపందేలతో సామాన్య ప్రజల జేబులు ఖాళీ కాగా నిర్వాహకులతో పాటు ప్రజా ప్రతినిధుల ఆర్థికప్రయోజనాలు నెరవేరాయని, జూదాలతో పండుగ సంతోషాన్ని దూరం చేస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

గుడ్లవల్లేరు : సంక్రాంతి సంబరాలు మండలంలో ఘనంగా నిర్వహించారు. డోకిపర్రు, వేమవరం, కూరాడ, గుడ్లవల్లేరు గ్రామాల్లో కోడిపందేలు పెద్దఎత్తున నిర్వహించారు. మహిళలు, యువత అధిక సంఖ్యలో కనిపించారు. పలు ప్రాంతాల నుంచి యువతులు వచ్చి పాల్గొనటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

నందివాడ : సంక్రాంతి పండుగ పేరుతో సంతోషపరిచే దిశగా వైసీపీ నాయకులతో అధికారులు లాలూచి పడ్డారు. కోడిపందేలు, పలు జూద క్రీడలకు నిర్వాహకులు బరి తెగించారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు అటు వైపు కన్నెత్తి చూడకుండా ధర నిర్ణయించారు. కనీసంగా 2 నుంచి 5 లక్షల రూపాయల వరకు చేతులు మారినట్టు సమాచారం. నందివాడ, పుట్టగుంట, తమిరిశ, పొలుకొండ వంటి ఆర్థిక ఎదుగుదల ఉన్న స్థావరాల శిబిరాల నుంచి 4 లక్షల చొప్పున మిగిలిన ప్రాంతాల్లో నిర్వాహకుల స్థితిని బట్టి 3 లేదా 2 లక్షలు అధికారులకు ముట్టచెప్పినట్టు తెలిసింది. నందివాడ, పుట్టగుంట, రామపురం, తమిరిశ, కుదరవల్లి, పొలుకొండ, గొల్లగూడెం గ్రామాల్లో గత మూడు రోజులుగా పందేలు నడుస్తున్నాయి.

తోట్లవల్లూరు : తోట్లవల్లూరులో భద్రిరాజుపాలెం, గరికపర్రు గ్రామాల్లో మూడు రోజుల పాటు వైసీపీ నేతల ఆధ్వర్యంలో కోడిపందేలు, పేకాట యథేచ్ఛగా జరిగాయి. భద్రిరాజుపాలెం బరిలో స్వల్ప ఘర్షణలు జరిగాయి.

పామర్రులో భారీస్థాయిలో చేతుల మారిన నగదు

పామర్రు : పామర్రు బందరు రోడ్డులోని ఏఎంసీ వద్ద రియల్ ఎస్టేట్ భూములతోపాటు, అడ్డాడ సమీపంలోని కొత్త పెదమద్దాలి ఇటుక బట్టీల స్థలాలు, పొలాల్లో బరిల్లో జూదాలు నిర్వహించారు. భారీ స్థాయిలో నగదు చేతుల మరాయి. విచ్చల విడిగా మద్యం, గూట్కాలు అమ్మకాలు కొన సాగాయి. బరుల్లో తినుబండారాలు, పార్కింగ్ ఫీజుల పేరుతో దోపిడీకి పాల్పడ్డారు. బందరురోడ్డులోని బరిలో ఇరువర్గాల మధ్య స్వల్ప ఘర్షణ చోటుచేసుకోగా ఎస్సై ప్రవీణ్‌కుమార్‌రెడ్డి బరులను ధ్వంసం చేశారు.

కూచిపూడి : కూచిపూడి, అయ్యంకి అడ్డరోడ్డు సమీపంలోని బరుల్లో రేయింబవళ్లు కోడిపందేలు యథేచ్ఛగా నిర్వహించారు. అధికార పార్టీ నేతలు దారి పొడవునా బ్యానర్లు ఏర్పాటు చేశారు. మద్యం అమ్మకాలు జోరుగా సాగాయి. బరుల వద్ద తిరునాళ్ల సందడి కనిపించింది. పెదముత్తేవి, కాజ, కోసూరు, కారకంపాడు, నిడుమోలు, మొవ్వ తదితర గ్రామాల్లో కోడిపందేలు, జూద క్రీడలు నిరాటంకంగా సాగాయి.

బంటుమిల్లి: మండలంలో కోడిపందేలు, పేకాట, గుండాటలు జోరుగా సాగాయి. కోట్లాది రూపాయలు చేతులు మారాయి. కాలేజీ ఆవరణలో కార్లు బారులు తీరాయి. కొన్ని గ్రామాల నుంచి బరుల నిర్వాహకులు వైసీపీ ఇన్‌చార్జ్‌ను కలిసి మొరపెట్టుకున్నట్టు తెలుస్తోంది.

బరిలో కోట్లాట.. పలువురికి గాయాలు..

ఉప్పులూరు (కంకిపాడు) : ఉప్పులూరు గ్రామంలో కోడి పందెం బిరిలో మంగళవారం గ్రామానికి చెందిన పలువురు బరిలో పందెం వేస్తుండగా కేసరపల్లి గ్రామానికి చెందిన మరొక వర్గంతో గలాట చోటు చేసుకుంది. ఇరు వర్గాలు పక్కనే ఉన్న రైల్వే ట్రాక్‌పై వెళ్లి కొట్టుకున్నారు. ఉప్పలూరు, కేసరపల్లి గ్రామాలకు చెందిన పలువురికి గాయాలయ్యాయి. వారిని స్థానిక ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అందించి పంపించి వేశారు.



మోపిదేవిలో

మోపిదేవి : మోపిదేవి శివారులో నిర్వహిస్తున్న కోడిపందాల బరిలో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరగ్గా, గుంటూరు ప్రభాకరరావు అనే వ్యక్తి తలకు గాయాలయ్యాయి. రెండు వర్గాల మధ్య ఘర్షణ జరగ్గా, కర్రలు, కుర్చీలతో దాడి చేసుకున్నారు. ప్రభాకర్‌రావు తలకు బలమైన గాయాలు కావటంతో 108 వాహనంలో అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు.



కోస మాంసం.. భలే గిరాకీ

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలంలో రాష్ట్రంలోనే పెద్దబరిగా పేరుగాంచిన అంపాపురంతో పాటు కె.సీతారాంపురం బరుల్లో పందెంలో చనిపోయిన కోడి పుంజులను ఔత్సాహికులు భారీ మొత్తంతో కొనుగోలు చేశారు. కోడిపుంజుధర వేలల్లో పలికింది. ఒక పందెం గెలిచిన కోడి రూ.6వేల నుంచి రూ.15వేల వరకు, రెండు అంతకన్నా ఎక్కువ పందేలు గెలిచిన కోడికి రూ.25వేలకు పైగా ధర పలికింది.





బైక్ గెలిచిన పుంజు

ఆకునూరులో బరిలో ఏడు పందేలకు నాలుగు పందేలు గెలిచిన హైదరాబాద్‌కు చెందిన చదలవాడ నందకిషోర్, చాగంటి శ్రీనివాసరావులు పల్సర్ బైక్ గెలుచుకున్నారు.

గోదావరి జిల్లాలకు దీటుగా..

కొత్త అల్లుళ్లకు భారీ విందు

- కృష్ణాజిల్లాలో 250 రకాల వంటకాలు
- ఎన్టీఆర్‌జిల్లాలో 160 రకాల వంటకాలు

విజయవాడ సిటీలైఫ్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి)/ఘంటసాల : కొత్త అల్లుళ్లను గౌరవించడంలో గోదావరి జిల్లాల స్టైలే వేరు. వంటకాలంటే 100కు వి ఎంచి అంటారు. మర్యాదలో గోదావరి జిల్లా వాసులకు తామేమి తీసిపోలేదని కృష్ణా, ఎన్టీఆర్‌జిల్లావాసులు నిరూపించారు. సంక్రాంతి సందర్భంగా కృష్ణాజిల్లా



ఘంటసాల మండలం చిట్టూర్పులో గుర్ర సాయినాథ్ తన చెల్లి నవ్య, బావ కొచ్చి ఐవోసీ అసిస్టెంట్ మేనేజర్ కాగిత రేవంత్‌లను సంక్రాంతి పండుగకు ఆహ్వానించి ఏకంగా 250 రకాల పిండి వంటలు వడ్డించారు. చిట్టూర్పులో నవ్య మేనమామ లుక్కా శ్రీనివాసరావు ఇంటి వద్ద ఈ వేడుక ఘనంగా జరిగింది.

● విజయవాడ పటమట దర్శిపేటకు చెందిన కొక్కుల వెంకట శేష ఈశ్వరరావు, లక్ష్మీకుమారి దంపతులు ఉపాధ్యాయులు. వారికి ఏకైక కుమార్తె వీణాసాహితిని పొన్నూరుకు చెందిన గోపీచంద్‌కు ఇచ్చి డిసెంబరు 14న వివాహం జరిపించారు. గోపీచంద్, సాహితి బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు. సంక్రాంతికి అత్తింటికి వచ్చిన గోపీచంద్‌కు 160 రకాల వంటకాల రుచి చూపించారు. "యూట్యూబ్‌లో గోదావరి జిల్లాల్లో అల్లుళ్లకు ఇలా చేస్తారని చూశాను. డాడీ 160 రకాలతో విందు ఏర్పాటు చేశారు" అని వీణాసాహితి పేర్కొంది.

వీడియో వైరల్‌పై చర్యలేవీ!

- టీడీపీ నేతలపై కేసుల్లో న్యాయ సలహా తీసుకున్నారా..
- పోలీసులను నిలదీసిన టీడీపీ నేతలు

నందిగామ, జనవరి 16 : ఆధారాలతో ఫిర్యాదు చేసినా నిందితుడిపై చర్యలు తీసుకోని పోలీసులపై టీడీపీ శ్రేణులు భగ్గుమన్నాయి. మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యపై అభ్యంతరకర మీమ్స్ ప్రదర్శించిన షేక్ కరీముల్లా(దుబాయ్)పై కేసు నమోదు చేయడంలో జాప్యంపై నేతలు స్టేషన్ వద్ద బైఠాయించి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల ఆరో వార్డులోని డ్రెయిన్ ప్రారంభ కార్యక్రమంలో జరిగిన సభలో కరీముల్లా (వైసీపీ నేత) తంగిరాల సౌమ్యను అవమానిస్తూ మీమ్స్ వీడియో ప్రదర్శించాడు.


పోలీసులతో వాగ్వివాదం చేస్తున్న కనపర్తి శ్రీనివాసరావు

అనంతరం సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. దీనిపై సౌమ్య స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇప్పటికీ పోలీసులు కేసు నమోదు చేయకపోవడంతో మంగళవారం టీడీపీ ఆధ్వర్యంలో స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టారు. సౌమ్యకు మద్దతుగా నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు, అంగన్వాడీ విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు ఆచంట సునీత, పార్టీశ్రేణులు పెద్దఎత్తున స్టేషన్ వద్ద బైఠాయించి నినాదాలు చేశారు. సీఐ హనీష్ మాట్లాడుతూ, సౌమ్య ఫిర్యాదుపై న్యాయ సలహా తీసుకొని కేసు నమోదు చేస్తామని చెప్పారు. దీంతో నేతలు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. సోషల్ మీడియాలో పోస్టులు పెడితే ఎవరూ ఫిర్యాదు చేయకుండానే కేసులు పెట్టే పోలీసులు మాజీ ఎమ్మెల్యే ఫిర్యాదు చేస్తే న్యాయ సలహా కోరడమేంటని ప్రశ్నించారు. తక్షణం కరీముల్లాను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

అధికార పార్టీకి తొత్తుల్లా కొందరు పోలీసులు..

అధికార పార్టీకి తొత్తుల్లా వ్యవహరించే అధికారులు మూడు నెలల తరువాత మూల్యం చెల్లించుకుంటారని టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు హెచ్చరించారు. సౌమ్యపై అవమానకర మీమ్స్ ప్రదర్శించిన వ్యక్తిపై తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. శాంతియుతంగా కార్యక్రమాలు నిర్వహిస్తుంటే పోలీసులు ఎందుకు తమపై జులం చూపిస్తున్నారని కనపర్తి ప్రశ్నించారు. దీంతో సీఐ నాగేంద్రకుమార్‌తో తీవ్ర వాగ్వివాదం జరిగింది. ఈదశలో జోక్యం చేసుకున్న ఏసీపీ ఇద్దరికి నచ్చజెప్పారు.

పోరంకిలో మహిళ హత్య

- 24 గంటల్లో కేసు ఛేదించిన పోలీసులు

పెనమలూరు, జనవరి16 : ప్రియురాలి భర్తను జైలుకు పంపి విడాకులిప్పించి, వచ్చిన సొమ్ముతో జల్సా చేద్దామనే తలంపుతో అమాయకురాలిని హత్య చేసిన కేసును 24 గంటల్లో పెనమలూరు పోలీసులు ఛేదించారు. గన్నవరం డీఎస్పీ జయసూర్య తెలిపిన వివరాలు.. 16ఏళ్ల క్రితం ఐతాబత్తుల మృదుల, రిషేంద్రలు ప్రేమ వివాహం చేసుకున్నారు. వారికి ఇద్దరు సంతానం. మృదుల, రిషేంద్రలు వేర్వేరు సంస్థల్లో డిప్యూటీ మేనేజరు స్థాయి ఉద్యోగాలు చేస్తున్నారు. మృదులకు కష్టమర్‌గా పొలాసి సాయి ప్రవీణ్ పరిచయమయ్యాడు. ఆ పరిచయం వివాహేతర సంబంధానికి దారి తీసింది. గతేడాది ఇద్దరూ చెన్నైకు పారిపోయారు. భర్త రిషేంద్ర ఫిర్యాదు మేరకు పోలీసులు ఆమెను భర్తకు అప్పగించారు. మృదుల ఇంట్లో ఉన్న విలువైన వస్తువులను తీసుకెళ్లి అమ్ముకొని ప్రియుడితో గడిపేది. భర్తను ఏదో ఒక కేసులో ఇరికించి శాశ్వతంగా అడ్డు తొలిగించుకోవాలనే ప్రణాళిక రచించారు ఇద్దరూ. ఈక్రమంలో సాయిప్రవీణ్ కృష్ణలంకలో పాత పరిచయస్థురాలైన గరిగల నాగమణిని సాయం కోరాడు. ఆమెను మృదుల భర్తకు కొన్ని మాటలు రికార్డు చేసి పంపాలని చెప్పి పోరంకి వందడుగుల రోడ్డులోని వ్యవసాయ క్షేత్రంలోని పంపుసెట్టు వద్దకు తీసుకెళ్లాడు. ఆమెతో మృదుల భర్త రిషేంద్రకు వివిధ సందేశాలు పంపించాడు. అనంతరం ప్రవీణ్ ఆమె చున్నీతో గొంతుకు చుట్టి చంపేశాడు. ప్రవీణ్ ఆ సందేశాలను మృదులకు, తన మిత్రుడు మూర్తి బాబుకు పంపి హత్యకు ఉపయోగించిన చున్నీని, నాగమణి ఫోన్‌ను మూర్తిరాజు ఇంట్లో దాచి ఏమీ ఎరగనట్టు వెళ్లిపోయారు. కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న సీఐ రామారావు విచారణకు ఐదు బృందాలను ఏర్పాటు చేసి ఇరవై నాలుగు గంటలు గడవకముందే అదుపులోకి తీసుకుని మంగళవారం రిమాండుకు తరలించారు.

చంద్రబాబు సభకు తరలిరండి

- మాజీ మంత్రులు పుల్లారావు, మాగంటి, దేవినేని

గుడివాడ/పామర్రు, జనవరి 16 : ఈ నెల 18న గుడివాడ నియోజకవర్గంలో చంద్రబాబు 'రా కదిలిరా' బహిరంగసభను విజయవంతం చేయాలని మాజీమంత్రులు దేవినేని ఉమామహేశ్వరరావు, పత్తిపాటి పుల్లారావు, మాగంటి బాబులు పిలుపునిచ్చారు. మంగళవారం మల్లాయిపాలెంలోని అలంకృత ఫంక్షన్ హాల్ ఎదురుగా సభాప్రాంగణాన్ని నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెనిగండ్ల రాము, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అన్న ఎన్టీఆర్ వర్ధంతి రోజున లక్షలాది ప్రజలతో గుడివాడలో చంద్రబాబు సభ చరిత్ర సృష్టిస్తుందన్నారు. గుడివాడలో జనసేన, టీడీపీ ఉమ్మడి అభ్యర్థి ఘన విజయం సాధించడం ఖాయమన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ కదిలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు పిల్లి మాణ్యికాలరావు, వర్ల కుమార్‌రాజా, బూరగడ్డ వేదవ్యాస్, వీరంకి గురుమూర్తి, యలవర్తి శ్రీనివాసరావు, శాయన పుష్పావతి తదితరులు పాల్గొన్నారు.

నిమ్మకూరులో ఏర్పాట్ల పరిశీలన..

చంద్రబాబునాయుడు పర్యటనలో భాగంగా నిమ్మకూరు గ్రామాన్ని దేవినేని ఉమా, కొల్లు రవీంద్ర, వర్ల కుమార్‌రాజాతో కలిసి హెలిప్యాడ్ ప్రాంతాన్ని మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ, చంద్రబాబు సతీసమేతంగా ఈనెల 18వ తేదీ మధ్యాహ్నం నిమ్మకూరులో ఎన్టీఆర్ బసవతారకం విగ్రహాలకు నివాళులర్పిస్తారని తెలిపారు. అనంతరం గ్రామస్థులతో ముచ్చటించనున్నారన్నారు. కార్యక్రమంలో బీసీ సాధికార సమితి ప్రధాన కార్యదర్శి వీరంకి వెంకట గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న మాజీ మంత్రులు పుల్లారావు, మాగంటి తదితరులు

అభివృద్ధి చేతకాక సొల్లు కబుర్లా..

- కొడాలి నానిపై దేవినేని ఉమా ఫైర్

అధికార పార్టీ ఎమ్మెల్యే గుట్కా నానికి అభివృద్ధి ఎలా చేయాలో చేతకాదని, అందుకే ప్రజల దృష్టి మరల్చేందుకు సొల్లు కబుర్లు చెబుతున్నాడని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, గుడివాడలో గుట్కా నాని చేసిన అభివృద్ధి శూన్యమని, చంద్రబాబు కుటుంబాన్ని, ప్రతిపక్షాలపై చేసిన వ్యాఖ్యలకు గట్టిగా సమాధానం చెబుతామని హెచ్చరించారు. బూతుల మంత్రికి పట్టిసీమ, పోలవరం గురించి ఏమి తెలుస్తుందని ప్రశ్నించారు. మంచినీరు, డ్రెయినేజీ సదుపాయం లేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారన్నారు. కనీసం వీధి దీపాలను సైతం వేయలేక నాని తన చేతకానితనాన్ని చూపించాడన్నారు.

ఘనంగా ముగిసిన జోసఫ్ తంబి తిరునాళ్ల

ఉంగుటూరు, జనవరి 16 : ఉంగుటూరుమండలం, పెదఅవుటపల్లిలో మూడురోజులుగా అత్యంత వైభవంగా జరుగుతున్న బ్రదర్ జోసఫ్ తంబి 79వ వర్ధంతి మహోత్సవాలు(తిరునాళ్ల)సోమవారం ఘనంగా ముగిశాయి. ఉదయం 7గంటలకు విజయవాడ పీఠాధిపతులు(బిషప్) తెలగతోటి జోసఫ్ రాజారావు సమిష్టి దివ్యపూజాబలిని సమర్పించి, దివ్యసందేశాన్ని అందించారు. ఈసందర్భంగా తంబి పేరిట నిర్వహించిన బైబిల్ క్విజ్ పోటీల్లో పాల్గొన్న వారికి ఆయన ప్రశంసాపత్రాలను అందజేశారు. తంబి పుణ్యక్షేత్రం రెక్టర్ రెవ.ఫాదర్ పాలడుగు జోసఫ్ నేతృత్వంలో పెదఅవుటపల్లి గురువులు కృతజ్ఞతా సమిష్టి దివ్యపూజాబలిని సమర్పించారు. తిరునాళ్లలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు, అసౌకర్యం కలుగకుండా తమ సేవలను అందించిన వివిధ విభాగాలకు చెందిన ప్రభుత్వ అధికారులను క్షేత్రం రెక్టర్ ఫాదర్ పాలడుగు జోసఫ్ పుష్పగుచ్ఛాలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం అర్థరాత్రి వరకు పలు సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగాయి.



పందెం @ 900 కోట్లు

(5వ పేజీ తరువాయి)

ఏర్పాటు చేసుకున్నారు. పుంజులు, పొట్టేళ్ల యజమానుల కాసుకున్న పందేలతోపాటు బయట వారు పెట్టిన పందేలూ భారీగానే జరిగాయి. గుండాట, నంబరింగ్, లోపల - బయట ఆటలు నిర్వహించడానికి అందులో నైపుణ్యం ఉన్న వారిని నియమించుకున్నారు. ఒక్కొక్కరికి వేలాది రూపాయలను వేతనంగా ఇచ్చారు. కొన్నిచోట్ల ఈ ఆటలు నిర్వహించే ప్రదేశాలను కొంతమందికి వేలం రూపంలో కట్టబెట్టారు. తద్వారా నిర్వాహకులు లక్షలాది రూపాయలను వెనుకేసుకున్నారు.

● **బరుల వద్ద అగ్రిమెంట్లు**

లక్షల్లో జరిగిన బెట్టింగ్‌లకు రెండు పార్టీల మధ్య అగ్రిమెంట్లు చేయడానికి కొంతమందిని ప్రత్యేకంగా నియమించుకున్నారు. మధ్యవర్తుల సమక్షంలో అగ్రిమెంట్లు రాసుకున్నారు. ఈ వ్యవహారం చాలా రహస్యంగా నిర్వహించారు. ఈ పందేలు, జూదాల నుంచి అధికార పార్టీ ప్రజాప్రతినిధులకు భారీ మొత్తంలో వాటాలు వెళ్లినట్టు వినవస్తోంది. ఈడుపుగల్లు, ఉయ్యూరు ప్రాంతాల్లో నిర్వహించిన కోడిపందేలను వీక్షించడానికి మహిళలు అధికసంఖ్యలో వచ్చారు. కొత్త దంపతుల సరదాలు బరుల వద్ద కనిపించాయి. జీవితంలోకి వచ్చిన భాగస్వాముల అదృష్టాన్ని పరీక్షించడానికి వారితో పందేలు కట్టించారు.

● **కృష్ణా జిల్లాలో జోరుగా పందేలు**

గుడివాడలోని లింగవరంలోని కే కన్వెన్షన్ హాలులో కోడిపందేలు, పేకాట శిబిరాలు మూడురోజులపాటు జోరుగా సాగాయి. యలమర్రు, గుడ్లవల్లేరు, వేమవరంలలోని కొండాలమ్మగుడి ఎదురుగా కోడిపందేలుపేకాటలు జోరుగా కొనసాగాయి. మచిలీపట్నంలోని మేకావానిపాలెం, గోపువానిపాలెం, శ్రీనివాసనగర్, గోకవరం, రుద్రవరం, తదితర ప్రాంతాల్లో బరులను ఏర్పాటు చేసి కోడిందేలు నిర్వహించడంతో పాటు పేకాట శిబిరాలు జోరుగా కొనసాగాయి. పెడన నియోజకవర్గంలోని బంటుమిల్లి, అర్తమూరు. పెందుర్రు, ములపర్రు, నాగేశ్వరరావుపేట, లంకగ్రామాల్లో జోరుగా కోడిపందేలు నిర్వహించారు. కృతివెన్నుమండలం లక్ష్మీపురం గరిసపూడి, పల్లెపాలెంలలో పేకాటను జోరుగా కొనసాగించారు.

కోడిపందేల బరులవద్ద కొట్లాటలు చోటుసుకున్నాయి. మచిలీపట్నం మండలం రుద్రవరంలో ఏర్పాటు చేసిన బరివద్ద మంగళవారం కోడిపందేలు ముగిసే సమయంలో పోలాటితిప్ప, కోనగ్రామస్తుల మధ్య కొట్లాట జరిగింది. షామియానా కర్రలు లాగి మరీ రెండు గ్రామాలకు చెందిన వారు కొట్టుకున్నారు.

● ఎస్ఎన్ గొల్లపాలెం వద్ద ఏర్పాటు చేసిన పేకాట శిబిరం వద్ద సోమవారం రాత్రి పేకాటరాయుళ్లు ఘర్షణకు దిగారు. ఈ రెండు సంఘటనలు జరిగినా పోలీసులు ఆవైపునకు కన్నెత్తి చూడలేదు.


అంగన్వాడీల సమ్మెకు సంఘీభావం తెలుపుతున్న కొల్లు నీలిమ

36వ రోజుకు అంగన్వాడీల సమ్మె

- ఆమరణ నిరాహారదీక్షలకు దిగుతాం..

అంగన్వాడీ జిల్లా సంఘ కార్యదర్శి రమాదేవి

మచిలీపట్నం టౌన్, జనవరి 16 : అంగన్వాడీ కార్యకర్తల న్యాయమైన కోర్కెలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలుగు మహిళలు డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ ధర్నాచౌక్ వద్ద అంగన్వాడీ కార్యకర్తలు నిర్వహిస్తున్న సమ్మె 36వరోజుకు చేరింది. శిబిరాన్ని కొల్లు రవీంద్ర సతీమణి కొల్లు నీలిమతో పాటు టీడీపీ మచిలీపట్నం నియోజక వర్గ తెలుగుమహిళ అధ్యక్షురాలు లంకిశెట్టి నీరజ, తెలుగు మహిళలు కరెడ్ల సుశీల, పద్మ, వసంతకుమారి, టీడీపీ కార్పొరేటర్లు మరకాని సమతా కీర్తి, దేవరపల్లి అనితలు సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కొల్లు నీలిమ మాట్లాడుతూ, సీఎం జగన్‌రెడ్డికి మహిళల ఉసురు తగులుతుందన్నారు. జగన్‌రెడ్డి కక్ష సాధింపు చర్యలకు అన్ని వర్గాల వారు బలవుతున్నారన్నారు. టీడీపీ, జనసేన కూటమి అధికారంలోకి వచ్చాక అంగన్వాడీ కార్యకర్తల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రమాదేవి మాట్లాడుతూ, , ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని, త్వరలో ఆమరణ దీక్షలకు దిగుతామన్నారు. రిజినా రాణి మాట్లాడుతూ, ఎస్మాకు భయపడేది లేదని, నిరవధిక సమ్మె కొనసాగిస్తామన్నారు. శిబిరంలో సంఘ నాయకులు నాంచారమ్మ, సీఐటీయూ నేతలు మాట్లాడారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మండలి బుద్ధప్రసాద్

'దీని తస్సాదియా.. తెనుగె తెనుగు' శతకం ఆవిష్కరణ

అవనిగడ్డ, జనవరి 16 : తెలుగు అనగానే ఆగ్రహించే పాలనా వ్యవస్థ నడుస్తున్న ఆ 'కానికాలం'లో, ఈ 'కొరగానికాలం'లో, ఈ 'కలికాలం'లో తెలుగు దివ్వె వెలిగించేలా తెలుగు శతకాన్ని వెలువరించిన గుడిసేవ విష్ణుప్రసాద్‌ని అభినందిస్తున్నట్టు మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ప్రముఖ కవి గుడిసేవ విష్ణుప్రసాద్ రచించిన 'దీని తస్సాదీయ్యా.. తెనుగె తెనుగు' శతకాన్ని బుద్ధప్రసాద్ ఆవిష్కరించి ప్రవాసాంధ్రులు, పుస్తక ప్రియులు దండమూరి రాజేంద్ర ప్రసాద్‌కు అంకితమిచ్చారు. ఈ సందర్భంగా బుద్ధప్రసాద్ మాట్లాడుతూ, విష్ణుప్రసాద్ వ్రాసిన పద్యాలు ప్రశంసనీయమన్నారు. దివిసీమ ముద్దుబిడ్డ, విదేశాంధ్ర ప్రముఖుడు, తెలుగు భాషాభిమాని దండమూడి రాజేంద్రప్రసాద్‌కు శతకాన్ని అంకితమివ్వటం సంతోషాన్నిచ్చిందన్నారు. కార్యక్రమంలో పరుచూరి సుభాష్ చంద్రబోస్, తాడేపల్లి మాజీ సర్పంచ్ దండమూడి శివనాగేశ్వరరావు పాల్గొన్నారు.









బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	110, 118, 129
చికెన్ విత్ స్కిన్	208
చికెన్ స్కిన్‌లెస్	218

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.30

పేకాటరాయుళ్ల అరెస్ట్

పాయకాపురం, జనవరి 16 : పేకాట ఆడుతున్న తొమ్మిది మంది వ్యక్తులను సోమవారం నున్న రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల ప్రకారం 63వ డివిజన్ వడ్డెర కాలనీలో పేకాట జరుగుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పేకాట ఆడుతున్న తొమ్మిది మంది వ్యక్తులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ. 28 వేలు స్వాధీనం చేసుకున్నారు.





విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి యామిని శర్మ తదితరులు

ముగ్గులు వేస్తున్న చిన్నారులు, మహిళలు

ముగ్గులను పరిశీలిస్తున్న చెన్నుపాటి ఉష, రాంబాబు

అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు

భవానీపురం, జనవరి 16 : నగరంలో సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి. మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా ముగ్గుల పోటీల్లో పాల్గొన్నారు. 43వ డివిజన్‌లోని ఊర్మిళానగర్‌లో టీడీపీ సీనియర్ నాయకుడు కేశినేని శివనాథ్(చిన్ని), సీనియర్ నాయకులు బుద్దా వెంకన్న, నాగుల్ మీరా, బొమ్మసాని సుబ్బారావుల ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు చెన్నుపాటి ఉష, ఆర్గనైజింగ్ సెక్రటరీ ముప్పా విజయలు హాజరయ్యారు. విజేతలకు బహుమతుల ప్రదానోత్సవంలో టీడీపీ సీనియర్ నాయకులు మోరబోయిన రాంబాబు హాజరై అందించారు.

జోజినగర్‌లో సీపీఐ ఆధ్వర్యంలో... 45వ డివిజన్ జోజినగర్‌లో సీపీఐ ఆధ్వర్యంలో సోమ వారం నిర్వహించిన ముగ్గుల పోటీలను సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు ప్రారంభించారు. మన సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించేవి ముగ్గులన్నారు. సీపీఐ డివిజన్ నాయకులు ఎర్రసాని జోసెఫ్, రాంబాబు, వీవీ కిషోర్‌లు పాల్గొని విజేతలకు బహుమతులను అందించారు.

భారతీనగర్: పటమట దర్శిపేటలోని శ్రీ రాజరాజేశ్వరి లలితా పరమేశ్వరి అమ్మవార్ల ఆలయం ప్రాంగణంలో సోమవారం ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో 24వ సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. చిన్నారులకు, మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి యామిని శర్మ జడ్జిగా విచ్చేశారు. ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. బీజేపి సీనియర్ నాయకులు కిలారి దిలీప్, అధ్యక్షుడు ఆవుల నాసరయ్య, కోశాధికారి శివన్నారాయణ, ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు, కార్యదర్శులు కాలవ ప్రసాద్, కొఠారి భాస్కర్, ఉపాధ్యక్షులు వీరయ్య, తాండవ రంగలక్ష్మి, రాజరాజేశ్వరి మహిళ మండలి సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాబూరావు

అంగన్వాడీలకు జీతాలు పెంచాల్సిందే

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు

పాయకాపురం, జనవరి 16 : అంగన్వాడీ వర్కర్లకు జీతాలు పెంచాల్సిందే అని వారి పోరాటాలకు సీపీఎం అండగా నిలుస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు తెలిపారు. అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన జగనన్నకు చెబుదాం కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా సోమవారం 63, 64వ డివిజన్లలో ఆయన పర్యటించి స్థానికులతో మాట్లాడి సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ ఇప్పటికైనా ప్రభుత్వం అంగన్వాడీ యూనియన్ నేతలతో చర్చించి వారి న్యాయమైన కోర్కెలను తీర్చాలని డిమాండ్ చేశారు. దోనేపూడి కాశీనాథ్, కె. దుర్గారావు, రమణారావు, శ్రీదేవి పాల్గొన్నారు.



దివ్య బలిపూజ నిర్వహిస్తున్న మత గురువులు

ఘనంగా లూర్ధు మాత రజతోత్సవం

భవానీపురం, జనవరి 16 : 44వ డివిజన్ నాలుగు స్థంభాల సెంటర్‌లోని లూర్థు మాత దేవాలయం రజతోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. జోజినగర్ విచారణ గురువులు ఫాదర్ మెరుగుమాల చిన్నప్ప ఆధ్వర్యంలో కుమ్మరిపాలం సంఘస్తులు ఈ పండుగను నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మోన్ సిగ్నూర్ మువ్వల ప్రసాద్, జోజినగర్ విచారణ సహాయక గురువులు రాజేష్, మరియదాసు, వన్‌టౌన్ విచారణకర్తలు దామాల విజయ్‌కుమార్ పాల్గొని సమష్టి బలిపూజ నిర్వహించారు. వనం బత్తిన ప్రవీణ్, చెక్క పితాకుమార్, జక్కి రమేష్, చలపతిరావులు పాల్గొన్నారు.

కార్మికుడి కుటుంబానికి న్యాయం చేయండి

సీపీఎం నేతల డిమాండ్

అజిత్‌సింగ్‌నగర్, జనవరి 16 : కృష్ణలంక ప్రాంతంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కార్మికుడి కుటుంబానికి న్యాయం చేయాలని సీపీఎం నేతలు డిమాండ్ చేశారు. వివరాల ప్రకారం వైఎస్సార్ జక్కంపూడి కాలనీలో ఉంటున్న కాటూరి బాలయ్య 21వ డివిజన్ కృష్ణలంకలో మున్సిపల్ కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం తెల్లవారుజామున ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. కృష్ణలంక నేషనల్ హైవే వద్దకు వచ్చే సరికి గుర్తు తెలియని వాహనం బాలయ్యను ఢీకొంది. ఈ ఘటనలో కార్మికుడు అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావుతో పాటుగా ఆ పార్టీ నేతలు కార్మికుడి కుటుంబానికి రూ. 25 లక్షలు ఎక్స్‌గ్రేషియో, ఇల్లు, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు సిద్ధమయ్యారు.

దీనిపై స్పందించిన అధికారులు మృతుడి కుటుంబానికి రూ. 7 లక్షలు ఎక్స్‌గ్రేషియో, ఇల్లు, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఆర్థిక సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం నేతలు మృతుడి ఇంటి వద్దకు చేరుకుని నివాళులు అర్పించారు. నివాళులు అర్పించిన వారిలో దోనేపూడి కాశీనాథ్, యూనియన్ నేతలు ఉన్నారు.



పోతిన సమక్షంలో జనసేనలో చేరిన బొంతు గంగాధర్

జనసేనలో చేరిన బొంతు గంగాధర్

వన్‌టౌన్, జనవరి 16: పశ్చిమలో సీనియర్ రాజకీయ నాయకుడు బొంతు గంగాధర్ అలియాస్ కరీముల్లా మంగళవారం జనసేన అధికార ప్రతినిధి పశ్చిమ ఇన్‌చార్జి పోతిన మహేశ్ సమక్షంలో జనసేనలో చేరారు. ఈ సందర్భంగా కరీముల్లాకు త్వరలోనే బాధ్యతలు అప్పగిస్తామని,సముచిత స్థానం కల్పిస్తామని తెలిపారు. రానున్న ఎన్నికల్లో జనసేన గెలుపు కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు. పార్టీ నాయకులు కొరగంజి వెంకట రమణ, బొట్టా సాయికుమార్, సిటీ వైడ్ చిరంజీవి యువత అధ్యక్షుడు పులిచేరి రమేష్, పల్లి తేజ , సాబిన్కర్ నరేష్, బందెచోడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

169 తెలంగాణా మద్యం సీసాలు స్వాధీనం

జగ్గయ్యపేట రూరల్, జనవరి 16 : మండలంలోని బూదవాడలో అక్రమంగా నిల్వ ఉంచిన 169 తెలంగాణా మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చిల్లకల్లు ఎస్ఐ కృష్ణబాబు తెలిపారు. గ్రామంలో సోదాలు చేస్తుండగా గుగులోతు చెన్నయ్య వద్ద సీసాలు గుర్తించి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

నున్న మ్యాంగో మార్కెట్‌లో అగ్నిప్రమాదం

విజయవాడ రూరల్, జనవరి 16 : నున్న మ్యాంగో మార్కెట్‌లో సోమవారం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. నగరంలోని కేదారేశ్వరరావుపేటకు చెందిన శ్రీనివాసరెడ్డికి మ్యాంగో మార్కెట్‌లో దుకాణం ఉంది. సోమవారం మధ్యాహ్నం అకస్మాత్తుగా దుకాణంలో మంటలు చెలరేగాయి. మంటల్లో ప్లాస్టిక్ ట్రేలు, జనరేటర్, ఇతర సామాగ్రి దగ్ధమయ్యాయి. మార్కెట్ వాచ్‌మెన్ ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చాడు. ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేసిన ఫైర్ సిబ్బంది షార్ట్ సర్క్యూట్ వలన ప్రమాదం జరిగినట్లు నిర్ధారించారు.





భారతీనగర్ నాల్గవ రోడ్డు, కనకదుర్గ గెజిటెడ్ ఆఫీసర్స్ కాలనీలో పేరుకున్న చెట్లకొమ్మలు, గురునానక్ కాలనీ వీఎంసీ స్విమ్మింగ్‌పూల్ రోడ్డులో చెత్త

అంతర్గత రోడ్లు అధ్వానం

● రోజుల తరబడి పేరుకుపోయిన చెత్త నిల్వలు
● ప్రమాదకరంగా మారిన ఎండిన చెట్టుకొమ్మలు

భారతీనగర్, జనవరి 16: కాలనీ అంతర్గత రోడ్లలో పేరుకుపోయిన చెత్త, ఎండిన చెట్ల కొమ్మలతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 4వ డివిజన్‌లో భారతీనగర్, గురునానక్ కాలనీ, సుబ్బారావు కాలనీ, కనకదుర్గ గెజిటెడ్ ఆఫీసర్స్ కాలనీ అంతర్గత రోడ్లలో చెత్త తొలగించకపోవడంతో చెత్తకుప్పలతో దర్శనమిస్తున్నాయి. వాటికి తోడు ఇటీవల విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ తీగల మరమ్మతుల కారణంగా లైన్‌లకు అడ్డుగా ఉన్న కొమ్మలను తొలగించి రోడ్డు మార్జిన్‌లో వేశారు. వారం రోజుల కావస్తున్నా వాటిని తొలగించకపోవడంతో ప్రస్తుతం ఎండిపోయి ప్రమాదకరంగా మారాయి. కాలనీ అంతర్గత రోడ్డులో రోజుల తరబడి చెత్త నిల్వ ఉండడంతో వీటి నుంచి దుర్వాసన వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మానికొండ పురవీధుల్లో తంబి తేరు ప్రదక్షిణ

ఉంగుటూరు, జనవరి 16 : బ్రదర్ జోసఫ్ తంబి నడయాడిన పుణ్యస్థలాల్లో మానికొండ ఒకటని పూజ్య గురువులు రెవ.ఫాదర్ చింతగుంట సురేష్‌బాబు అన్నారు. బ్రదర్ జోసఫ్ తంబి వర్ధంతి వేడుకలు మానికొండలో ఆర్సీఎం సంఘస్థుల ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఫాదర్ సురేష్‌బాబు, గురువులు మార్టిన్, రసారియోతో కలిసి సమిష్టి దివ్యబలి పూజ సమర్పించి, దివ్యసత్ప్రసాదాన్ని భక్తులకు అందించారు. అనంతరం సురేష్ బాబు మాట్లాడుతూ, పెదఅవుటపల్లిలో స్థిరపడిన తంబి చుట్టు ప్రక్కల ఎన్నో ప్రాంతాల్లో తన బోధనలు విస్తృతం చేశారని వివరించారు. ఉప్పులూరు విచారణ గురువు రెవ.ఫాదర్ రత్నకిషోర్ మాట్లాడుతూ, క్రీస్తు మార్గాన్ని అనుసరించిన మహోన్నత వ్యక్తి తంబి అని, ఆయన చూపిన మార్గం ప్రతిఒక్కరికీ అనుసరణీయమని ఉద్బోధించారు. అనంతరం తంబి చర్చి ప్రాంగణంలో భక్తులకు అన్నసంతర్పణ నిర్వహించారు. సాయంత్రం తంబి చిత్రపటంతో కూడిన దివ్య తేరు ప్రదక్షిణ మానికొండ పురవీధుల్లో వైభవంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఉపదేశి ఇట్టా జోసఫ్, మరియదళ సభ్యులు, సంఘపెద్దలు పాల్గొన్నారు.

లారీ ఢీకొని విరిగిన సీసీ కెమెరా స్తంభం

వన్‌టౌన్, జనవరి 16: లారీ ఢీ కొని కెనాల్ రోడ్డు మధ్యలో ఉన్న సీసీ కెమెరా స్తంభం విరిగిపడినట్లు మంగళవారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. వన్‌టౌన్ కెనాల్ రోడ్డులో మ్యాట్రిక్ సంస్థ సీసీ కెమెరాలను రోడ్డు మధ్యలో ఉన్న స్తంభాలకు ఏర్పాటు చేసింది. ఈ నెల 15 రాత్రి 11.30 గంటలకు వినాయకుడి గుడి సమీపంలోని రోడ్డు మధ్యలో ఉన్న సీసీ కెమెరా స్తంభాన్ని లారీ ఢీకొంది. ఈ సమయంలో సీసీ కెమెరాలు ధ్వంసమై స్తంభం విరిగిపడింది. విషయం తెలుసుకున్న మ్యాట్రిక్ సంస్థ టెక్నికల్ ఎగ్జిక్యూటివ్ జి.శివప్రసాద్ ఘటనా ప్రాంతానికి వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.








ఆంధ్రజ్యోతి
నవ్య చిత్రజ్యోతి
బుధవారం • 17 జనవరి 2024
cinema@andhrajyothy.com



వచ్చే సంక్రాంతికి మెగా ధమాకా

చిరంజీవి అభిమానులకు సంక్రాంతి సందర్భంగా డబుల్ ధమాకా ఇచ్చారు. 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ దర్శకత్వంలో చిరంజీవి కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం (మెగా 156-వర్కింగ్ టైటిల్) టైటిల్, రిలీజ్ డేట్ ఖరారయ్యాయి. ఈ చిత్రానికి 'విశ్వంభర' అనే టైటిల్‌ను చిత్రబృందం ఖరారు చేసింది. వచ్చే ఏడాది సంక్రాంతికి ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు యూనిట్ ప్రకటించింది. ఈ సందర్భంగా సోమవారం విడుదల చేసిన ప్రత్యేక వీడియో అభిమానులను ఆకట్టుకుంటోంది. ఫాంటసీ అడ్వంచర్‌గా వశిష్ఠ ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. యూవీ క్రియేషన్స్ పతాకంపై విక్రమ్, వంశీ, ప్రమోద్ ఈ చిత్రాన్ని భారీ హంగులతో నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతోంది. ఎంఎం కీరవాణి సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: ఛోటా కె

వింటేజ్ లుక్‌తో రాజా సాబ్



ప్రభాస్ హీరోగా దర్శకుడు మారుతి రూపొందిస్తున్న చిత్రానికి 'రాజా సాబ్' అనే పేరు నిర్ణయించారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ ఈ సినిమా నిర్మిస్తున్నారు. వివేక్ కూచిభొట్ల సహ నిర్మాత. ప్రభాస్ ఇప్పటిదాకా చేయని రొమాంటిక్ హారర్ జానర్‌లో 'రాజా సాబ్' చిత్రాన్ని దర్శకుడు మారుతి రూపొందిస్తుండడంతో సినిమా మీద అందరిలోనూ ఆసక్తి నెలకొంది.

సంక్రాంతి సందర్భంగా ఈ చిత్రం ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. వింటేజ్ లుక్‌లో లుంగీ కట్టుకున్న ప్రభాస్ అందర్నీ ఆకట్టుకుంటున్నారు. సరదాగా, రొమాంటిక్‌గా సాగే క్యారెక్టర్ లుక్‌లో 'డార్లింగ్' ప్రభాస్‌ను చూడడంతో అభిమానులతో పాటు సినిమా లవర్స్ అందరికీ ఫ్రెష్ ఫీల్ కలుగుతోంది. ఫస్ట్ లుక్ పోస్టర్‌లోనే ఒక కలర్‌ఫుల్ సినిమా చూడబోతున్న భావనని మారుతి కలిగించారు.

తెలుగుతో పాటు తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో 'రాజా సాబ్' ప్రేక్షకుల ముందుకు రానున్నాడు. షూటింగ్ జరుపుకొంటున్న ఈ చిత్రానికి కార్తీక్ పళని సినిమాటోగ్రఫీని, తమన్ సంగీతాన్ని అందిస్తున్నారు. 'మగధీర', 'బాహుబలి' చిత్రాలకు వి.ఎఫ్.ఎక్స్ అందించిన కమల్ కన్నన్ ఈ సినిమాను వర్క్ చేస్తున్నారు.

అయోధ్యలో స్థలం కొన్న అమితాబ్



అయోధ్యలో రామమందిర ప్రారంభోత్సవం ఈ నెల 22న జరుగుతుంది. దేశ, విదేశాలలో ఉన్న వారంతా ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న కార్యక్రమం ఇది. రామమందిరం ఏర్పాటుతో అయోధ్య పరిసర ప్రాంతాల రూపురేఖలు వేగంగా మారిపోతున్నాయి. రామమందిరం ప్రారంభోత్సవం రోజునే సరయూ నది ప్రాంతంలో 45 ఎకరాల్లో 'సరయు ప్రాజెక్ట్' పేరుతో రియల్ ఎస్టేట్ సంస్థ హౌస్ ఆఫ్ అభినందన్ లోధా కొత్త వెంచర్ ప్రారంభిస్తోంది. సరయు నది ఒడ్డున ఓ ఫైవ్ స్టార్ హోటల్ కూడా నిర్మించడానికి ఇప్పటికే లీలా ప్యాలెస్ గ్రూప్‌తో ఒప్పందం చేసుకుందీ సంస్థ. ఈ నేపథ్యంలో అమితాబ్ బచ్చన్ ఈ సంస్థలో పది వేల చదరపు అడుగుల స్థలం కొనడం ప్రాధాన్యం సంతరించుకుంది. దీని విలువ ఎంతో తెలుసా? రూ. 14 కోట్ల 50 లక్షలు. 'ఈ ఆధ్యాత్మిక నగరంలో ఇల్లు కట్టుకోవాలన్నది నా కోరిక. అందుకే ఈ స్థలం కొన్నాను' అని అమితాబ్ పేర్కొన్నారు. అయోధ్యలో అమితాబ్ స్థలం కొనడంతో అక్కడి రియల్ ఎస్టేట్ వ్యాపారుల్లో జోష్ పెరగడం ఖాయం!

కాలం ఏదైనా మార్మోగే పేరు
కంగువ

సూర్య కథానాయకుడిగా రూపొందుతున్న చిత్రం 'కంగువ'. స్టూడియో గ్రీన్, యూవీ క్రియేషన్స్ ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నాయి. దిశాపటానీ కథానాయిక. శివ దర్శకుడు. మొత్తం పదికి పైగా భాషల్లో విడుదల చేస్తున్నారు. త్రీడీ లోనూ ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. సంక్రాంతి సందర్భంగా చిత్రబృందం 'కంగువ' సెకండ్ లుక్‌ను రిలీజ్ చేసింది. చారిత్రక నేపథ్యంలో కాల్పనిక గాథతో తెరకెక్కుతోన్న చిత్రం కావడంతో సూర్య యుద్ధ వీరుని లుక్‌లో మెరిశారు. 'గతం, వర్తమానం, భవిష్యత్... కాలం ఏదైనా నలుదిక్కులా మార్మోగే పేరు ఒక్కటే 'కంగువ'... అంటూ సూర్య లుక్‌కు మేకర్స్ ఇచ్చిన క్యాప్షన్‌ను బట్టి సూర్య పాత్ర ఇందులో ఎంత శక్తిమంతంగా ఉండబోతోందో తెలుస్తోంది. బాబీ డియోల్, యోగిబాబు ఈ చిత్రంలో కీలకపాత్రలు పోషిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: వెట్రి పళనిస్వామి



గాయని చిత్రకు సైబర్ సెగ



సీనియర్ గాయని చిత్రపై సోషల్ మీడియాలో దాడి మొదలైంది. అయితే ఈ విషయంలో అన్ని రాజకీయ పార్టీలు.. కేరళలో అధికారంలో ఉన్న సీపీఐ (ఎం) పార్టీతో సహా చిత్రకు మద్దతుగా నిలిచాయి. ఆమె గురించి సోషల్ మీడియాలో జరుగుతున్న వ్యతిరేక ప్రచారాన్ని దుయ్యబడుతూ, మనసులో మాట చెప్పే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందనీ, ఇందులో వ్యక్తిగత విమర్శలు చేసి చిత్ర వ్యక్తిత్వాన్ని దెబ్బతీయాలని చూడడం సబబు కాదనీ ఆ పార్టీలు అంటున్నాయి. అసలు ఏం జరిగింది? కొందరు నెటిజన్ల దృష్టిలో చిత్ర చేసిన తప్పు ఏమిటి? అయోధ్యలో రామమందిరం ఈ నెల 22న ప్రారంభం కానున్న సంగతి విదితమే. ప్రారంభోత్సవ కార్యక్రమం జరుగుతున్న సమయంలో ప్రతి ఒక్కరూ 'శ్రీ రామ.. జయ రామ.. జయ జయ రామ' అనాలనీ చిత్ర ఇటీవల విడుదల చేసిన ఓ వీడియోలో కోరారు. అంతే కాకుండా అదే రోజు సాయంత్రం తమ ఇంట్లో ఐదు దీపాలను వెలిగించాలని కూడా ఆమె ఆ వీడియోలో విజ్ఞప్తి చేశారు. అయితే చిత్ర ఇలా కోరడం ఓ వర్గం నెటిజన్లకు నచ్చలేదు. రామ మందిరం గురించి ఆమె అలా చెప్పడం బాగోలేదని కొందరంటే, రాజకీయ ప్రయోజనం ఆశించి చిత్ర అలా మాట్లాడుతున్నారని మరి కొందరు నెటిజన్లు కామెంట్ చేస్తున్నారు. ప్రతి ఒక్కరికీ భావ ప్రకటనా స్వేచ్ఛ ఉంటుందనీ, ఆ విషయంలో చిత్రను తప్పు పట్టడం సరికాదని మరికొందరు ఆమెను సమర్థిస్తూ కామెంట్లు పెడుతున్నారు. ఈ వివాదం ఏ మలుపు తిరుగుతుందో వేచి చూడాలి.

వచ్చే సంక్రాంతికి శతమానం భవతి సీక్వెల్



వచ్చే సంక్రాంతికి కోసం పన్నెండు నెలలు ముందుగానే బెర్త్ రిజర్వ్ చేసుకున్నారు నిర్మాత దిల్ రాజు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బేనరుపై 2017లో శర్వానంద్, అనుపమ పరమేశ్వరన్ జంటగా 'శతమానం భవతి' చిత్రాన్ని ఆయన నిర్మించారు. సతీశ్ వేగేశ్న దర్శకత్వంలో రూపుదిద్దుకొన్న ఈ చిత్రం భారీ సినిమాల పోటీని తట్టుకుని నిలబడి తిరుగులేని విజయం సొంతం చేసుకుంది. అంతే కాదు జాతీయ ఉత్తమ చిత్రంగా అవార్డ్ సాధించి తెలుగు చిత్ర పరిశ్రమ గొప్పతనం చాటింది. ఇప్పుడు ఈ సినిమాకు సీక్వెల్‌గా 'శతమానం భవతి నెక్స్ పేజ్'ను రూపొందిస్తున్నట్లు దిల్ రాజు ప్రకటించారు. సినిమా పూర్తి వివరాలు త్వరలో ప్రకటిస్తామనీ, అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి 2025 సంక్రాంతికి సినిమా విడుదల చేస్తామనీ ఆయన వెల్లడించారు.

ఫైటర్ హంగామా

హృతిక్ రోషన్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'ఫైటర్'. సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ నెల 25న విడుదలవుతోంది. 2019 నాటి పుల్వామా ఘటన నేపథ్యంలో ఈ సినిమా తెరకెక్కుతోంది. సంక్రాంతి సందర్భంగా చిత్రబృందం 'ఫైటర్' ట్రైలర్‌ను విడుదల చేసింది. దేశభక్తి, యాక్షన్, ఎమోషన్ అంశాల కలబోతగా చిత్రం రూపొందినట్టు ట్రైలర్‌ను బట్టి తెలుస్తోంది. ఇందులో హృతిక్ పాత్రను షంషేర్ పఠానియాగా పరిచయం చేశారు. ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో ఎయిర్ డ్రాగన్స్ అనే విభాగానికి ఆయన లీడర్‌గా కనిపించారు. ఎయిర్‌ఫోర్స్ యూనిఫాంలో హృతిక్ ఆకట్టుకున్నారు.



రిలీజ్‌కు కృష్ణ చివరి చిత్రం

సూపర్‌స్టార్ కృష్ణ నటించిన చివరి చిత్రం 'కృష్ణ విజయం' త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. అంబుజా మూవీస్ పతాకంపై రూపొందిన ఈ చిత్రానికి మధుసూదన్ హవల్దార్ దర్శకత్వం వహించారు. నాగబాబు, సుహాసినీ, గీతాసింగ్ ముఖ్య పాత్రలు పోషించారు. త్వరలో విడుదల చేసేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది. ఇటీవలే ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను హైదరాబాద్‌లో నిర్వహించారు.



ఈ సందర్భంగా కృష్ణ, మహేశ్‌బాబు అభిమానులకు ప్రత్యేక షో వేశారు. పలువురు సినీ ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కృష్ణగారి సినిమాకు దర్శకత్వం వహించడం తనకు దక్కిన అదృష్టమని దర్శకుడు తెలిపారు. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తామని ఆయన చెప్పారు. ఈ చిత్రానికి శ్రీలేఖ సంగీతం అందించారు.

ఎవరు హీరో?, ఎవరు విలన్?



మార్కెటింగ్ స్కామ్ అనే పాయింట్ చుట్టూ అల్లుకున్న ఆసక్తికర కథతో తెరకెక్కిన చిత్రం 'గ్యాంగ్‌స్టర్'. ప్రజిన్ పద్మనాభన్, జీవా, విజయ్ విశ్వ, సాయి ధన్య షాలిని ముఖ్య తారాగణం. రామ్ ప్రభ దర్శకత్వంలో వ్యాపారవేత్త వేల్ మురుగన్ నిర్మించారు. తెలుగు, తమిళ, హిందీ భాషల్లో తెరకెక్కిన ఈ చిత్రాన్ని మార్చిలో విడుదల చేస్తున్నట్లు నిర్మాత తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఇప్పటివరకూ ఇలాంటి పాయింట్‌తో సినిమాలు రాలేదు. ఇందులో ఎవరు హీరో?, ఎవరు విలన్? అనేది క్లైమాక్స్ వరకూ తెలియదు. సినిమాను దర్శకుడు అద్భుతంగా తెరకెక్కించాడు' అన్నారు. ఈ చిత్రానికి మనోజ్ కుమార్ బాబు సంగీతం అందించారు. సినిమాటోగ్రఫీ: సురేశ్‌కుమార్, సుందరం.

హంగులతో వస్తున్న రాజావారు

'గుర్తుందా శీతాకాలం' చిత్రంతో నిర్మాతగా తనదైన అభిరుచిని చాటుకున్నారు చింతపల్లి రామారావు. ఇప్పుడాయన నిర్మాణంలో రూపుదిద్దుకుంటున్న చిత్రం 'శ్రీశ్రీశ్రీ రాజావారు'. జూనియర్ ఎన్టీఆర్ బావమరిది నార్నే నితిన్ హీరోగా దర్శకుడు వేగేశ్న సతీష్ రూపొందిస్తున్నారు. సంక్రాంతి సందర్భంగా నిర్మాత సినిమా విశేషాలను పాత్రికేయులతో పంచుకున్నారు. వాణిజ్య హంగులతో శ్రీశ్రీశ్రీ రాజావారు' చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ నెల్లో తొలి కాపీ సిద్ధమవుతుందని తెలిపారు. ఇక నుంచి ఏటా మూడు సినిమాలు నిర్మించేందుకు ప్లాన్ చేస్తున్నట్లు చెప్పారు. తెలుగు, కన్నడ అగ్రహీరోలతో భారీ సినిమాలు చేస్తున్నట్లు ప్రకటించారు. వాణిజ్యహంగులతో పాటు సమాజానికి మంచి సందేశం ఉండేలా సినిమాలు చేస్తానని ఆయన తెలిపారు.



నిర్మాతే హీరోయిన్!



ఒక తెలుగు యువతి సినిమాలో హీరోయిన్‌గా నటించడం, ఆ చిత్రానికి ఆమే నిర్మాత కావడం, కథను కూడా అందించడం అరుదుగా జరిగే విషయం. అలా మల్టీ టాలెంటెడ్‌గా సుమయా రెడ్డి 'డియర్ ఉమ' చిత్రంతో అందరినీ ఆకట్టుకోనున్నారు. సుమ చిత్ర ఆర్ట్స్ సంస్థ పతాకంపై ఆమె నిర్మిస్తున్న ఈ చిత్రంలో పృథ్వీ అంబర్ హీరోగా నటిస్తున్నారు. సాయి రాజేశ్ మహదేవ్ దర్శకుడు. ఈ సినిమా గురించి సుమయా రెడ్డి మాట్లాడుతూ 'చిత్రం షూటింగ్ పూర్తయింది. పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు పూర్తి చేసి త్వరలోనే విడుదల చేస్తాం. ఫీల్ గుడ్ లవ్ స్టోరీతో పాటే చక్కని సందేశం అందిస్తున్నాం. త్వరలో టీజర్ విడుదల చేస్తాం' అని చెప్పారు. హై టెక్నికల్ స్టాండర్డ్స్‌తో నిర్మాత ఎక్కడా రాజీ పడకుండా సినిమా తీశారని, సినిమాలో లవ్, ఫ్యామిలీ సెంటిమెంట్, యాక్షన్ అంశాలు ఉన్నాయనీ దర్శకుడు తెలిపారు. కమల్ కామరాజ్, సప్తగిరి, అజయ్ ఘోష్, ఆమని, రాజీవ్ కనకాల, పృథ్వీరాజ్, రూపలక్ష్మి తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం! రధన్, ఛాయాగ్రహణం:రాజ్ తోట.



స్వశక్తి

'జబ్బులకు పరిష్కారం మందులు కాదు. మందులు ఇవ్వడమే వైద్యమూ కాదు. మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే ఊరు, మట్టి, చెట్టూ చేమా ఆరోగ్యంగా ఉండాలి. మందుల మీద కాదు... ప్రతిదీ మనం తినే ఆహారంపైనే ఆధారపడి ఉంటుంది' అంటున్నారు కేంద్ర ప్రభుత్వ సంస్థ 'బైరాక్' (బయోటెక్నాలజీ ఇండస్ట్రీ రీసెర్చ్ అసిస్టెన్స్ కౌన్సిల్) ఇండిపెండెంట్ డైరెక్టర్... తిరుపతి వైద్యురాలు... పెన్నా కృష్ణప్రశాంతి. తెలుగు రాష్ట్రాల నుంచి 'బైరాక్'కు ఎంపికైన తొలి ప్రతినిధిగా చరిత్ర సృష్టించిన ఆమె... తన అనుభవాలను 'నవ్య'తో పంచుకున్నారు.

నవతరం ఆరోగ్యంగా లేదు

"బయోటెక్నాలజీ, వ్యవసాయం, వైద్యం, ఆహారం, పశు, మత్స్య రంగాల్లో ఆధునిక ఆవిష్కరణలకు 'బైరాక్' ఊతమిస్తోంది. ఈ రంగాల్లో పరిశోధనలకు ఆర్థిక సాయం చేస్తోంది. దీనికింద పదేళ్లలో దేశంలో దాదాపు 350 ఆవిష్కరణలు జరిగాయి. వీటిలో 'కొవిషీల్డ్ వ్యాక్సిన్' ఒకటి. అత్యంత చవగ్గా, పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో ఎంఆర్ఐ స్కానింగ్ యంత్రానికి ఒక పరిశోధక బృందం రూపకల్పన చేసింది. గ్రామీణ శాస్త్రవేత్తలు మొదలు... ఐఐటీల దాకా 'బైరాక్' సేవలను వినియోగించుకోవచ్చు. దురదృష్టం ఏంటంటే 'బైరాక్' అనేది ఒకటుందనే విషయమే మనలో చాలామందికి తెలియకపోవడం. డిగ్రీ కాలేజీ స్థాయి నుంచే పరిశోధక ప్రాజెక్టులకు దీని నుంచి ఆర్థిక సాయం అందుకునే వీలుంది. కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి 'బైరాక్' దగ్గర వందల కోట్ల నిధులున్నాయి. తమిళనాడు, మహారాష్ట్ర, ఒడిశా, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలు దీన్ని వినియోగించుకుంటున్నట్టుగా ఏపీ వాడుకోవడంలేదు. అవగాహన లేకపోవడమే ఇందుకు కారణం. 'కేంద్ర శాస్త్ర సాంకేతిక మంత్రిత్వ శాఖ' బయోటెక్నాలజీ కార్యదర్శి రాజేష్ ఎస్ గోఖలే చైర్మన్‌గా ఉండే బైరాక్‌లో శాస్త్రవేత్తలు, అత్యున్నత విద్యావేత్తలు అయిన ఆరుగురు డైరెక్టర్లుంటారు. వీరు రెండు నెలలకోసారి సమావేశం అవుతారు. నూతన ఆవిష్కరణల కోసం వచ్చే ప్రతిపాదనలను పరిశీలించి, చర్చించి నిధులు కేటాయిస్తారు. ఇంత బాధ్యతాయుతమైన, ప్రతిష్ఠాత్మకమైన డైరెక్టర్ పదవి, ఒక స్వతంత్ర తెలుగు వైద్యురాలిని వెతుక్కుంటూ రావడమే విశేషం.

కర్రకు బల్బు వేలాడదీసి...

మా నాన్న పెన్నా ప్రభాకరరెడ్డి నీటి పారుదల శాఖలో ఇంజనీర్. మా అమ్మ కోకిలా సరోజమ్మ డాక్టర్. నాన్నకు తరచూ బదిలీలవల్ల మేం ఎక్కడా కుదురుగా లేము. గైనకాలజిస్టుగా అమ్మకు క్షణం తీరిక ఉండేది కాదు. ఆమెది వామపక్ష భావజాలం. నాన్న సంప్రదాయవాది. ఆయన వాకిట్లో కర్రకు బల్బు వేలాడదీసి, తనూ మేల్కొని రాత్రంతా నన్ను చదివించేవారు. నేను కాలు బయటపెట్టాల్సిన అవసరం లేకుండా ప్రతిదీ సిద్ధం చేసేవారు. దాంతో నాకు చదవడం తప్ప నలుగురితో కలవడం, మాట్లాడడం తెలీదు. 'పొట్టిగున్నావు, నల్లగున్నావు, లావుగున్నావు, నీకు పెళ్లి కాదు'... అని అందరూ జాలిపడుతూ ఉంటే నాలోకి నేను పారిపోయేదాన్ని. సమాజం చూపే ఈ తేడా నాలో కసిని పెంచింది. దాంతో చదువుపై పూర్తి శ్రద్ధ పెట్టాను. ప్రతి తరగతిలోనూ ఫస్ట్. ఏడులో ఖమ్మం జిల్లా టాపర్‌ని. టెన్త్‌లో స్టేట్ ఐదో ర్యాంకర్‌ని. ఇంటర్‌లో స్టేట్ సెకండ్. అదే ఊపులో ఎంసెట్ రాసి 121వ ర్యాంకుతో తిరుపతి 'ఎస్వీ మెడికల్ కాలేజీ'లో చేరాను. మెడిసిన్‌లోనూ పలు సబ్జక్టుల్లో గోల్డ్ మెడల్స్ సాధించాను.



ప్రత్యేక గుర్తింపు...

ఆలిండియా రేడియోలో ఉపన్యాసాలు, బడి పిల్లలతో సంభాషణలు, ప్రతివారం అవగాహనా కార్యక్రమాలు... ఇవన్నీ నన్ను మాటకారిగా మలిచాయి. 'ఐఎంఏ, ఫిజీషియన్ల సంఘం, డయాబెటిక్ పరిశోధనా మండలి'లో నా పాత్ర, ప్రసంగాలు జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు తెచ్చాయి. అవి ఉత్తర భారత వైద్య ప్రపంచం చూపును దక్షిణాది వైపు కాస్త మళ్లించగలిగాయి. నా కృషికి 'ఏపీజే అబ్దుల్ కలామ్ ఎక్సలెన్స్' అవార్డు దక్కింది. ఈ ప్రయాణమే నేడు నన్ను 'బైరాక్' డైరెక్టర్‌ను చేసింది.

రాష్ట్రంలోని వైద్య కళాశాలలన్నిటిలోనూ ప్రథమ స్థానంలో నిలిచి 'డాక్టర్ ఎన్ఆర్‌కె రావు' గోల్డ్ మెడల్‌ను నాటి గవర్నర్ కృష్ణకాంత్ చేతుల మీదుగా అందుకున్నాను.

చులకన చేసినవారే...

నేను డాక్టర్ అయ్యాక కూడా ఈ పరుగు ఆగలేదు. రాష్ట్ర స్థాయిలో 16వ ర్యాంకుతో కర్నూలులో పీజీలో చేరాను. 'అమ్మాయిలు ఇంట్లో అంట్లు తోముకోవాలి గానీ... జనరల్ మెడిసిన్‌కి ఎందుకు వస్తారు' అని తొలి క్లాస్‌లోనే ఒక ప్రొఫెసర్ అన్నారు. ఎప్పటిలాగే నోరు మెదపలేదు. చదువుతోనే వాళ్లకు సమాధానం చెప్పాలనుకున్నాను. ఆరు నెలల తరువాత ఆ ప్రొఫెసరే పిలిచి... 'జిల్లా కలెక్టర్ భార్యకు ఆరోగ్యం బాలేదట. వెళ్లి చూసిరా' అని అంతమంది మగ డాక్టర్లున్నా నన్నే పంపించారు.

మౌనాన్ని బద్దలు చేసింది...

పీజీ చదువుతుండగానే నా పెళ్లి అయింది. చదువు, చంకలో బిడ్డ, రెండు గదుల ఇరుకు ఇంట్లో కాపురం. మావారు హరినాథరెడ్డి సర్జన్. ఆయనకు చాలీచాలని జీతం. వేల రూపాయల ఖరీదు చేసే మెడికల్ పుస్తకాలు కొనలేని పరిస్థితి. ఆయన మద్రాసు మూర్ మార్కెట్‌కి వెళ్లి చవగ్గా పాత పుస్తకాలు కొనుక్కునేవారు. ఇరువైపుల కుటుంబాల మధ్య పెరిగిన పంతాలు గొడవలుగా మారి పెద్దవాళ్ల ఆసరా కూడా కరువైంది. ఆ సంఘర్షణే నాలో గడ్డకట్టిన మౌనాన్ని బద్దలు చేసింది. ఆ ధిక్కారం స్వతంత్ర బాటలోకి నడిపించింది. పీజీలోనూ కర్నూలు కాలేజీ ఫస్ట్ సాధించాను. తరువాత తిరుపతిలో ప్రాక్టీస్ ప్రారంభించాను. వేలూరు సీఎంసీలో డయాబెటాలజీలో ఫెలోషిప్ చేశాను. డయాబెటిక్ ఫుట్ మీద అధ్యయనం జరిపి, సమర్పించిన పరిశోధనా వ్యాసానికి జాతీయ స్థాయిలో ఉత్తమ పరిశోధక అవార్డు లభించింది. డయాబెటాలజీలో చేసిన పరిశోధక కృషి... 7 దేశాల్లో ఈ అంశంపై ప్రసంగించే అవకాశం కల్పించింది.

వాళ్లే నేర్పించారు...

కాలేజీలో చదువుకున్న దానికన్నా ఎక్కువ పాఠాలు వైద్యం కోసం వచ్చే ప్రజల నుంచి నేర్చుకున్నాను. జబ్బులకు మందులు మాత్రమే సరిపోవని అర్థం చేసుకున్నాను. మాటలు అవసరం అయ్యాయి. ఆ మాటలను నాకు రోగులే నేర్పించారు. ఎదిగే వయసులో అనారోగ్యంతో వచ్చే ఆడపిల్లల్ని చూస్తే దిగులేసేది. చిన్న సమస్యలే వారి మనసును మెలిపెట్టేసేవి. డబ్బులున్న, చదువుకున్న తల్లులైతే సరే... డాక్టర్ దగ్గరకన్నా తీసుకువస్తారు. మరి పేద గ్రామీణ పిల్లల పరిస్థితి ఏమిటి? ఈ ప్రశ్నే నన్ను ప్రభుత్వ బడులకు, సాంఘిక సంక్షేమ హాస్టళ్లకు నడిపించింది. పీరియడ్స్ సమయంలో వచ్చే నొప్పిని అమ్మతో పంచుకుంటారు గానీ, అదనంగా పెరిగే వెంట్రుకలు, బ్రెస్ట్ సైజుపై సందేహాలు, పింపుల్స్ వంటివి ఆ వయసు ఆడపిల్లల్ని తీవ్రంగా కలచివేసే అంశాలు. ఎవరితోనూ మాట్లాడలేరు. వీటి గురించి వారికి అర్థమయ్యేలా చెప్పగలిగితే చాలు... సగం ఆరోగ్యం లభించినట్టే. ఇదే వయసు మగపిల్లలతో మాట్లాడాక నాకు ఒక విషయం అర్థమైంది. ఆడపిల్లలకన్నా మగపిల్లలే ఎక్కువగా సిగ్గుపడతారని. ఆడపిల్లల్లానే వాళ్లనీ శరీరంలోని మార్పులు తీవ్రంగా ఆందోళన పెడతాయని.

అధ్యయనాలు పెరగాలి...

అయినా ప్రజారోగ్యం పట్ల ఆందోళన, అసంతృప్తిని ఇవేవీ తగ్గించలేకపోతున్నాయి. నేడు నవతరం ఆరోగ్యంగా లేదు. రేపటి తరం ఆరోగ్యం కోసం గట్టి ప్రయత్నాలు మొదలవ్వాలి. పిల్లల్లో ఒబెసిటీ, పీసీఓడీ ఇప్పుడున్నంత ఎక్కువగా పదేళ్ల కిందట లేవు. కొవిడ్ తర్వాత చాలా మార్పులు వచ్చాయి. అధ్యయనాలు పెరగాలి. ప్రాచీన సంస్కృత ఆయుర్వేద గ్రంథాలను అనువదించుకోవాలి. అందులో పేర్కొన్న అంశాల మీద ఆధునిక పరిశోధనలు జరగాలి. ఫలానా పండు తింటే ఫలానా రోగం తగ్గుతుందనో, ఫలానా జబ్బుకి ఫలానా ఆకు లేదా వేరు పరిష్కారం అనో చెప్పడం కాదు. అది ఎలానో పరిశోధనలో నిగ్గు తేల్చాలి. దేశంలోని ఔత్సాహికులనూ, పరిశోధనా సంస్థలనూ ఈ దిశగా మళ్లించగలగాలి. అందుకు అవసరమైన అవగాహన కలిగించేందుకు, కావలసిన ఆర్థిక వనరులు సమకూర్చేందుకు 'బైరాక్' సిద్ధంగా ఉంది. దాన్ని అందరూ వినియోగించుకోవాలి. విశ్వవిద్యాలయాలు, ఐఐటీలు, కళాశాలలను సంప్రతిస్తూ ఆ దిశగా నా ప్రయత్నం కొనసాగిస్తున్నాను."

• పి.నరేంద్ర, తిరుపతి

ఫ్యాషన్

కళ్లు చెదిరే కాంతల్లా...

కుందనపు బొమ్మల్లా వెలిగిపోవాలంటే కంచిపట్టు చీరల్లో కాంతులీనాలి. బంగారు, వెండి జరీ ధగధగలు, కలనేతల కళాకాంతులు మీ సొంతం చేసుకోవాలనుకుంటే ఇదిగో ఇలాంటి సంప్రదాయ కట్టుబొట్టును అనుసరించండి!



2 తెల్ల పట్టుచీర హుందాతనమే వేరు. ప్రింటెడ్ డిజైన్ మోడర్న్ లుక్‌ని తెచ్చిపెడితే, కాంట్రాస్ట్ జరీ బార్డరు చీర మొత్తానికే వన్నె తెస్తుంది.



1 చామంతులు, కనకాంబరాలు కలిపి కట్టిన పూమాలలా కనిపించాలంటే పవిట చెంగు, కుచ్చిళ్లు ఒక రంగులో, చీర మొత్తం మరో రంగులో ఉండాలి. అలాంటి కాంట్రాస్ట్ రంగుల్లోనే చీర భారీగా కనిపించి కనువిందు చేస్తుంది.



3 వెండి వెలుగులు విరజిమ్మాలంటే వెండి జరీలో ధగధగలాడాలి. నలుగురిలో ప్రత్యేకంగా కనిపించాలనుకుంటే వెండి జరీ చీరను ఎంచుకుంటే సరి!



4 కుచ్చిళ్ల దగ్గర జరీ బార్డరు మోకాళ్ల వరకూ ఉండడం తాజా ఫ్యాషన్! ఈ స్టయిల్ చీరకు వినూత్న ఆకర్షణను తెచ్చిపెడుతుంది. ఆ జరీ మీద కనిపించీ, కనిపించకుండా ఉండే సెల్ఫ్ డిజైన్ ఈ చీరకున్న మరో ప్రత్యేకత.

ఉసిరితో... శిరోజాల సిరి!

విటమిన్-సి అధికంగా ఉండే ఉసిరితో హెయిర్‌ప్యాక్స్ వేసుకుంటే చక్కని ఫలితం ఉంటుంది. సులువుగా ఇంట్లోనే తయారు చేసుకునే హెయిర్‌ప్యాక్స్ ఇవే..

- బౌల్‌లో ఒక టేబుల్ స్పూన్ ఉసిరికాయల పొడి, శుభ్రపరచిన మూడు మందార పూల పేస్ట్, మూడు టేబుల్ స్పూన్‌ల కొబ్బరినూనెను తీసుకుని బాగా కలపాలి. ఈ పేస్ట్‌ను జుట్టుకు పట్టించి ఆరిన తర్వాత కడిగేయాలి. ఇలా తరచూ చేస్తుంటే జుట్టు స్మూత్‌గా తయారవుతుంది.
- గుప్పెడు తులసి ఆకులను శుభ్రపరచి పేస్ట్ చేసుకోవాలి. ఆ తర్వాత బౌల్‌లో టేబుల్‌స్పూన్ ఉసిరికాయల పొడిని తీసుకుని తగినన్ని నీటిచుక్కలు వేసి పేస్ట్ చేసుకోవాలి. ఆ తర్వాత ఇందులో తులసి ఆకుల పేస్ట్ వేసి అరగంట తర్వాత మంచి నీటితో శుభ్రం చేసుకోవాలి. ఇలా చేస్తే చుండ్రు కనపడదు.
- బౌల్‌లో రెండు టేబుల్ స్పూన్ల కుంకుడుకాయల చూర్ణానికి... రెండు టేబుల్ స్పూన్ల ఉసిరిపొడిని కలిపి నీటితో లేదా కొబ్బరినూనెతో పేస్ట్‌లా చేసుకోవాలి. ఈ చూర్ణాన్ని పట్టిస్తే జుట్టు రాలదు.
- మూడు టేబుల్ స్పూన్ల ఆమ్ల పౌడర్‌ను బౌల్‌లో తీసుకోవాలి. ఇందులోకి రెండు టీస్పూన్‌ల నిమ్మరసం కలపాలి. ఈ మిశ్రమాన్ని మాడును తాకేట్టు అప్లై చేయాలి. గంట తర్వాత మైల్డ్ షాంపూతో కడిగేయాలి. ఇలా తరచూ చేస్తుండే జుట్టులో పల ఉండే బాక్టీరియా పోతుంది. డాండ్రఫ్ దరి చేరదు.
- రెండు టేబుల్ స్పూన్ల పెరుగులోకి, రెండు టేబుల్ స్పూన్ల ఉసిరికాయల పొడి వేసి మెత్తగా చూర్ణం చేసి జుట్టుకు పట్టించి ఆరిన తర్వాత జుట్టును శుభ్రపరచాలి. ఇలా తరచూ చేస్తుంటే.. తల చల్లగా ఉంటుంది. జుట్టు పెరుగుదల కనపడుతుంది.
- మూడు టేబుల్‌స్పూన్ల మెంతులను రాత్రంతా నానబెట్టాలి. దీన్ని పేస్ట్ చేసి పెట్టుకోవాలి. ఈ మిశ్రమంలోకి రెండు టేబుల్ స్పూన్ల ఉసిరి పొడను కలిపి మెత్తగా చూర్ణం చేసి జుట్టుకు పట్టించాలి. ఆరిన తర్వాత గోరు వెచ్చని నీటితో శుభ్రపరచుకోవాలి. ఇలా చేస్తే కుదుళ్లు గట్టిగా తయారవుతాయి.
- ఇలా హెయిర్‌ప్యాక్స్ వేసుకోవటంతో పాటు శారీరక శ్రమ, మంచి నిద్ర అవసరం. అప్పుడే జుట్టు మరింత ఆరోగ్యంగా ఉంటుంది.



సిద్ధించిన సంకల్పం

స్వావలంబన

పథకాలు ప్రజలకు దగ్గరకు చేరినప్పుడే, ప్రభుత్వ ఆశయాలు నెరవేరతాయి. కానీ ఆ పథకాల గురించి అవగాహన లేక, వాటిని సద్వినియోగం చేసుకోలేని మారుమూల గ్రామస్థుల పరిస్థితి ఏంటి? ఈ దిశగా ఆలోచించిన కేంద్ర ప్రభుత్వం, పథకాలను ప్రజల దగ్గరకు తీసుకువెళ్లి, ప్రయోజనాలను సద్వినియోగం చేసుకునే వెసులుబాటు కల్పిస్తోంది. ఆ కార్యక్రమమే 'వికసిత్ భారత్ సంకల్ప యాత్ర'. హరియాణాలో వైభవంగా సాగుతున్న ఈ యాత్రకు హాజరైన లబ్ధిదారులు 'నవ్య'తో పంచుకున్న విశేషాలివి.



రేఖ, ఆశా యాదవ్, మధు

సురక్షితమైన శానిటరీ ప్యాడ్స్‌తో...

నా పేరు మధు. మా స్వయం సహాయక సంఘం పేరు జన్ కళ్యాణ్. మొదట్లో కొంత తడబడినా మహిళా బృందాన్ని నడిపించడం మీద పట్టు సాధించాను. ఒక్కరి సంపాదనతోనే కుటుంబాన్ని నడిపే రోజులు పోయాయి. ఏ లోటు లేకుండా పిల్లా పాపలతో కుటుంబం సజావుగా సాగాలంటే ఇంటి ఇల్లాలు కూడా ఎంతో కొంత సంపాదించడం అవసరం. ప్రస్తుతం స్వయం సహాయక బృందానికి లీడర్‌గా నేను నాతో పాటు సాటి మహిళలను కూడా స్వయం స్వావలంబన వైపు నడిపించగలుగుతున్నాను. ప్రస్తుతం నేను శానిటరీ ప్యాడ్స్ విక్రయిస్తున్నాను. గ్రామీణ మహిళలు నెలసరి సమయంలో అనుసరించే విధానాలతో ఎన్నో చర్మ సమస్యలు, ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నాను. ఈ సురక్షితమైన, ఆరోగ్యకరమైన ప్యాడ్స్ వాడకంతో ఈ సమస్యలను రూపుమాపవచ్చని అవగాహన కల్పించి, వీటిని కొనుగోలు చేసేలా ప్రోత్సహించడంతో పాటు, స్వీయ సంపాదన కోరుకునే మహిళలను జన్ కళ్యాణ్ గ్రూపులో సభ్యులుగా చేర్చగలిగాను. మేం విక్రయించే శానిటరీ ప్యాడ్స్‌లో ప్లాస్టిక్ ఉండదు. ఇవి పూర్తి కాటన్‌తో తయారవుతాయి. కాబట్టి ఇవి పూర్తిగా సురక్షితమైనవి.

జూట్, పేపర్ బ్యాగ్స్‌తో...

నా పేరు రేఖ. మాకడోలా మా గ్రామం. మా గ్రూపు పేరు 'నయా ఆశా'! మా గ్రామ సంఘటన్ పేరు కిరణ్ మహిళా గ్రామ సంఘటన్! ఇలాంటివి మా దగ్గర 13 గ్రూపులున్నాయి. వీటిలో 10 గ్రూపులు మా గ్రామ సంఘటన్‌తో అనుసంధానమై పని చేస్తున్నాయి. మా గ్రూపులన్నీ, కాగితపు సంచులు, జూట్ సంచులు, మిల్లెట్ ఉత్పత్తులను తయారుచేస్తాయి. ఇందు కోసం మాకు ప్రభుత్వం నుంచి 10 వేల రివాల్వింగ్ ఫండ్లు దొరికాయి. అలాగే గ్రామ సంఘటన్ నుంచి 5 లక్షల నిధులు అందాయి.

ప్రస్తుతానికి సంచులన్నిటినీ అరువు తెచ్చుకున్న కుట్టు మిషన్లతోనే కుడుతున్నాం. భవిష్యత్తులో ప్రభుత్వం నుంచి లోన్ అందితే సొంత కుట్టు మిషన్లను ఉపయోగించి, ఉత్పత్తులను తయారుచేసుకుంటాం! బ్యాంకులు కూడా మాకు లోన్లు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాయి. మా పట్ల ప్రభుత్వం ప్రతిస్పందన ఎంతో బాగుంది. బ్యాంకులు కూడా పూర్తి విశ్వాసాన్ని కలిగి ఉన్నాయి. మేం లోను తీసుకున్న తర్వాత క్రమం తప్పకుండా తీర్చేస్తున్నాం. కాబట్టి ప్రభుత్వం కూడా మా పట్ల సానుకూలంగా వ్యవహరిస్తూ, అవసరమైనంత లోనుకు అనుమతిస్తోంది. ఇందుకోసం మేం వేటినీ తాకట్టు పెట్టవలసిన అవసరం లేదు. ఇదంతా 'నేషనల్ రూరల్ లైవ్లీహుడ్స్ మిషన్'తో అనుసంధానవడం మూలంగా మాకు ఈ ప్రయోజనాలన్నీ దక్కుతున్నాయి. ఇంతకు ముందు మేం సాధారణ గృహిణులుగా ఇళ్లకే పరిమితమై ఉండే వాళ్లం. జాతీయ గ్రామీణ్ జీవితా మిషన్‌తో అనుసంధానమైన తర్వాత, మాకంటూ ఒక గుర్తింపు పొందగలిగాం! ప్రస్తుతం 200 మంది మహిళలం ఒక గ్రూపుగా ఏర్పడి, ఒక కుటుంబంగా కలిసి పని చేస్తున్నాం! మా అవసరాలను, ఇబ్బందులను కలిసి పంచుకుంటూ, ఎవరెవరు ఎలాంటి ఆసక్తిని కలిగి ఉన్నారో, జీవనోపాధికి అవసరమైన ఎలాంటి శిక్షణ అవసరత ఉందో మేం ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి, ప్రభుత్వం అందించే శిక్షణను సద్వినియోగం చేసుకోగలుగుతున్నాం. ఇలా మాలో కుట్టుపని నేర్చుకున్న కొందరు మహిళలు సొంత బొటిక్స్ మొదలుపెట్టారు. కొంతమంది టైలర్లుగా స్థిరపడ్డారు. కొందరు లోను ద్వారా ఉపాధి లేక ఇంటికే పరిమితమైన తమ భర్తల కోసం ఇ-రిక్షా లాంటి ట్రాన్స్‌పోర్ట్ వాహనాలను కూడా పొందారు. స్వయం సహాయక సంఘాల నుంచి లోన్ పొందిన కొందరు మహిళలు తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించగలుగుతున్నారు.

పచ్చళ్లు, మిల్లెట్ ఉత్పత్తులతో...

నా పేరు ఆశా యాదవ్. నేను మా గ్రామంలో పది గ్రూపులు ఏర్పాటు చేశాను. నాతో పాటు 150 నుంచి 200 మంది మహిళలు, 2019లో ఎన్ఆర్ఎల్ఎమ్‌తో అనుసంధానమయ్యాం. ప్రారంభంలో నాలుగు గ్రూపులతో మొదలైన మేం ప్రస్తుతం పది గ్రూపులకు పెరిగాం. స్వయం సహాయక సంఘాల్లోని మహిళలందరినీ సంప్రతించి, మెరుగైన జీవనానికి అవసరమైన వనరులు, అవసరతలు, వాటితో సాధించగలిగే వీలున్న స్వయం స్వావలంబనల గురించి చర్చించాం. ఆ విధంగా ఎన్ఆర్ఎల్ఎమ్ నుంచి పచ్చళ్ల తయారీలో మేం శిక్షణ పొందాం. అలా పది మంది మహిళా బృందంతో కలిసి పచ్చళ్ల తయారీ పని మొదలు పెట్టాం. నేను నా పచ్చళ్ల గురించి మార్కెటింగ్ చేసినప్పుడు, దాని ద్వారా ఎంతో మంది మహిళలకు ప్రభుత్వ పథకాలు, శిక్షణా కార్యక్రమాల గురించి అవగాహన ఏర్పడింది. అలాగే 2023 ప్రారంభంలో మిల్లెట్ పదార్థాల తయారీలో కూడా మేం శిక్షణ పొందాం! మా ఉత్పత్తులకు మంచి స్పందన దక్కుతోంది. మేం ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుంటూ ప్రభుత్వ సహాయంతోనే స్వయం స్వావలంబన సాధించగలుగుతున్నాం. ఈ పథకాల గురించి అవగాహన లేని మహిళలు ఇంతకుముందు కూలీ పనులకు వెళ్లేవాళ్లు. శారీరక శ్రమతో కూడిన ఆ పనులతో వాళ్లు ఎన్నో ఇబ్బందులు పడుతూ ఉండేవాళ్లు. కానీ ఇప్పుడు మా అందరి జీవితాలు మారాయి. ఇంటి పట్టునే మేం ఉపాధిని పొందగలుగుతున్నాం. సంపాదన కోసం పుట్టింటి మీదా, అత్తింటి మీదా ఆధారపడే అవసరం లేకుండా, స్వయంకృషి మీదే ఆధారపడడం మాకెంతో గర్వకారణంగా ఉంది. ఈ అవకాశాన్ని కల్పించి, మా జీవితాలను వెలుగులోకి నడిపించిన కేంద్ర ప్రభుత్వానికి మేం రుణపడి ఉంటాం!

• గోగుమళ్ల కవిత

46 ఫోర్లు, 3 సిక్స్‌లతో 404 నాటౌట్

- కూచ్ బెహార్ ట్రోఫీ ఫైనల్లో చతుర్వేది మారథాన్ ఇన్నింగ్స్
- యువీ రికార్డు బద్దలు కొట్టిన కర్ణాటక కుర్రాడు


ప్రఖర్ చతుర్వేది

శివమొగ్గ (కర్ణాటక): కర్ణాటక యువ క్రికెటర్ ప్రఖర్ చతుర్వేది మారథాన్ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. అండర్-19 కూచ్ బెహార్ ట్రోఫీ ఫైనల్లో ఏకంగా 404 పరుగులు చేసి వారెవ్వా అనిపించాడు. ముంబై జట్టుతో జరిగిన తుదిపోరులో 18 ఏళ్ల ప్రఖర్ చతుర్వేది (638 బంతుల్లో 46 ఫోర్లు, 3 సిక్స్‌లతో 404 నాటౌట్) రికార్డు క్వాడ్రపుల్ సెంచరీ కొల్లగొట్టాడు. ఈ క్రమంలో ఈ టోర్నీ ఫైనల్లో 24 ఏళ్ల క్రితం మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్ (358) నెలకొల్పిన అత్యధిక స్కోరు రికార్డును చతుర్వేది బద్దలుకొట్టాడు. ఓవరాల్‌గా 2011-12లో అసోంతో మ్యాచ్‌లో మహారాష్ట్ర ఆటగాడు విజయ్ జోల్ (451 నాటౌట్) అత్యధిక స్కోరు నమోదు చేయగా.. తాజా ఇన్నింగ్స్‌తో చతుర్వేది రెండో స్థానంలో నిలిచాడు. చతుర్వేది రికార్డు ఫీట్‌తో తొలి ఇన్నింగ్స్‌లో 890/8 స్కోరు చేసిన కర్ణాటక.. ముంబైతో ఫైనల్‌ను డ్రాగా ముగించింది. కానీ, మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యంతో కర్ణాటక టైటిల్ దక్కించుకొంది. తొలి ఇన్నింగ్స్‌లో ముంబై 380 పరుగులకు కుప్పకూలింది.

చదువుల కుటుంబం నుంచి వచ్చి..: చదువులకే అధిక ప్రాధాన్యతనిచ్చే కుటుంబం నుంచి వచ్చిన ప్రఖర్ చతుర్వేది క్రికెట్‌లో విశేషంగా రాణిస్తున్నాడు. చతుర్వేది తండ్రి సంజయ్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కాగా.. తల్లి రూప డీఆర్‌డీవోలో టెక్నికల్ అడ్వైజర్. అయితే, క్రికెట్ పట్ల తమ కుమారుడికి ఉన్న ఆసక్తిని గమనించి ఆ దిశగా ప్రోత్సహించారు.



సెమీస్‌కు భారత్

చిత్తుగా ఓడిన ఇటలీ
ఒలింపిక్ క్వాలిఫయర్స్

రాంచీ: ఒలింపిక్ బెర్త్ ఆశిస్తున్న భారత మహిళల హాకీ జట్టు ఆ దిశగా మరింత ముందడుగు వేసింది. హాకీ ఒలింపిక్ క్వాలిఫయర్స్ టోర్నీ పూల్ 'బి'లో మంగళవారం ఇటలీతో జరిగిన చివరి మ్యాచ్‌లో 5-1తో ఘనవిజయం సాధించింది. తద్వారా మహిళల హాకీ ఒలింపిక్ క్వాలిఫయర్ సెమీస్‌లో చోటు దక్కించుకుంది. గురువారం జరిగే నాకౌట్ పోరులో భారత జట్టు జర్మనీతో తలపడనుంది. ఈ మ్యాచ్‌కంటే ముందు తమకు పోటీగా ఉన్న న్యూజిలాండ్ 0-1తో అమెరికా చేతిలో ఓడడం భారత్‌కు కలిసివచ్చింది. దీంతో నాకౌట్‌లో చోటు కోసం ఇటలీతో మ్యాచ్‌ను డ్రాగా ముగించినా సరిపోయేది. కానీ విజయమే లక్ష్యంగా దూసుకెళ్లి ఆట ఆరంభమైన తొలి నిమిషంలోనే ఉదిత గోల్‌తో భారత్ బోణీ చేసింది. ఆ తర్వాత రెండు, మూడో క్వార్టర్లు హోరాహోరీగా సాగినా, ఆట మాత్రం ఎక్కువగా భారత్ ఆధీనంలోనే కొనసాగింది. మూడో క్వార్టర్‌లో భారత్‌కు లభించిన పెనాల్టీ స్ట్రోక్‌ను దీపిక గోల్‌గా మలచగా.. ఆ వెంటనే సలీమా ఫీల్డ్‌గోల్‌తో భారత్ 3-0తో తిరుగులేని ఆధిక్యం అందుకుంది. ఆఖరి క్వార్టర్స్‌లో నవ్‌నీత్, ఉదిత గోల్స్‌తో జట్టు గెలుపును ఖాయం చేశారు. ఇతర మ్యాచ్‌ల్లో జపాన్ 2-0తో చిలీపై, జర్మనీ 10-0తో చెక్ రిపబ్లిక్‌పై నెగ్గి సెమీస్ చేరాయి. గురువారం జరిగే సెమీఫైనల్స్‌లో జర్మనీతో భారత్, అమెరికాతో జపాన్ తలపడనున్నాయి.

10 వికెట్లతో ఆంధ్ర ఓటమి

ముంబై: స్పిన్నర్ ములానీ 10 వికెట్లతో చెలరేగడంతో.. ఎలైట్ గ్రూప్-బిలో ముంబైతో రంజీ మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు 10 వికెట్ల తేడాతో ఓడింది. ఫాలో ఆన్‌లో పడిన ఆంధ్ర రెండో ఇన్నింగ్స్‌లో 244 పరుగులకు ఆలౌటైంది. ప్రత్యర్థి ముందు 34 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని మాత్రమే ఉంచింది. దీన్ని 8.4 ఓవర్లలోనే ఛేదించిన ముంబై బోనస్ పాయింట్‌ను కూడా దక్కించుకొంది. తొలి ఇన్నింగ్స్‌లో ముంబై 395 పరుగులు చేయగా.. ఆంధ్ర 184 రన్స్‌కు ఆలౌటైంది.

సుమిత్ సూపర్

ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో సంచలన ప్రదర్శన
తొలిరౌండ్లో 27వ ర్యాంకర్ అలెగ్జాండర్‌కు షాక్


అలెగ్జాండర్ బబ్లిక్

గ్రాండ్‌స్లామ్‌లో సీడెడ్‌పై గెలిచిన రెండో భారత ఆటగాడిగా రికార్డు

మెల్‌బోర్న్: భారత టెన్నిస్ ఆటగాడు సుమిత్ నగల్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో సంచలనం సృష్టించాడు. క్వాలిఫయర్‌గా మెయిన్ డ్రాకు అర్హత సాధించిన 26 ఏళ్ల నగల్ తన కంటే ఎన్నో రెట్లు మెరుగైన, ప్రపంచ 27వ ర్యాంకర్ అలెగ్జాండర్ బబ్లిక్ (కజకిస్థాన్)కు షాకిచ్చాడు. మంగళవారం జరిగిన పురుషుల సింగిల్స్ ఆరంభ రౌండ్లో 137వ ర్యాంకరైన సుమిత్ 6-4, 6-2, 7-6(5)తో 31వ సీడ్ అలెగ్జాండర్‌ను వరుససెట్లలో చిత్తుచేసి కెరీర్‌లో తొలిసారి మెల్‌బోర్న్ పార్క్‌లో రెండో రౌండ్ చేరాడు. ఈ క్రమంలో 35 ఏళ్ల తర్వాత ఓ గ్రాండ్‌స్లామ్ మెయిన్ డ్రాలో సీడెడ్ ఆటగాడిని ఓడించిన తొలి భారత క్రీడాకారునిగా సుమిత్ చరిత్ర సృష్టించాడు. అంతకుముందు.. 1989 ఆస్ట్రేలియన్ ఓపెన్ రెండోరౌండ్లో భారత్ తరఫున రమేశ్ కృష్ణన్ నాటి డిఫెండింగ్ చాంపియన్, నెంబర్‌వన్ మాట్స్ విలాండర్ (స్వీడన్)ను ఓడించాడు.

ఆరంభంలో అలవోకగా..: 2 గంటల 37 నిమిషాలపాటు సాగిన పోరులో నగల్ అద్భుత ఆటను ప్రదర్శించాడు. ఆరంభంలోనే ఒకరి సర్వీస్‌లను ఒకరు బ్రేక్ చేసుకొని 1-1తో సమంగా నిలిచినా.. ఆ తర్వాత వరుసగా మూడు గేమ్‌లు గెలిచిన నగల్ 4-1తో ముందంజ వేశాడు. అయితే, క్రమంగా పుంజుకొన్న బబ్లిక్ 4-5తో సమం చేసే ప్రయత్నం చేసినా.. 10వ గేమ్‌లో సర్వీస్‌ను నిలబెట్టుకొన్న సుమిత్ 6-4తో ఆ సెట్ నెగ్గాడు. రెండో సెట్‌లో రెండుసార్లు ప్రత్యర్థి సర్వీస్‌ను బ్రేక్ చేసిన నగల్ 6-2తో సులువుగా దక్కించుకొన్నాడు. అయితే మూడో సెట్‌లో ఇద్దరూ 6-6తో సమంగా నిలవడంతో.. సెట్ ఫలితం టైబ్రేక్‌కు మళ్లింది. ఇందులో సుమిత్ 6-3తో మ్యాచ్ పాయింట్‌పై నిలిచినా.. పోరాడిన బబ్లిక్ 5-6తో సమం చేసే విధంగా కనిపించాడు. కానీ, 7-5తో నగల్ సెట్‌తోపాటు మ్యాచ్‌ను సొంతం చేసుకొన్నాడు. రెండో రౌండ్‌లో 140వ ర్యాంకర్ జుచెంగ్ షాంగ్ (చైనా)తో నగల్ తలపడనున్నాడు.

స్వియటెక్ కష్టపడి..

ఆస్ట్రేలియన్ ఓపెన్ పురుషుల సింగిల్స్‌లో టైటిల్ ఫేవరెట్ అల్కరాజ్ 7-6(5), 6-1, 6-2తో రిచర్డ్ గాస్కెట్‌పై, ఆరో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్ 4-6, 6-3, 7-6(3), 6-3తో డొమినిక్ కోఫర్‌పై, 11వ సీడ్ కాస్పర్ రూడ్ 6-1, 6-3, 6-1 అల్బర్ట్ రమోస్‌పై గెలిచి రెండోరౌండ్లో ప్రవేశించారు. మహిళల సింగిల్స్‌లో టాప్‌సీడ్ ఇగా స్వియటెక్ 7-6(2), 6-2తో మాజీ చాంపియన్ సోఫియా కెనిన్‌ను, రిబకినా 7-6(6), 6-4తో ప్లిస్కోవాను, 5వ సీడ్ జెస్సికా పెగుల 6-2, 6-4తో రెబెక్కాను, కొలిన్స్ 6-2, 3-6, 6-1తో కెర్బర్‌ను, అజరెంకా 6-1, 4-6, 6-3తో కమిల గోర్గిని ఓడించి రెండో రౌండ్‌కు చేరుకొన్నారు. పురుషుల డబుల్స్‌లో భారత ఆటగాడు యుకీ భాంబ్రి-రాబిన్ హస్సేన్ (నెదర్లాండ్స్) జంట 6-1, 6-7(8), 6-7(7)తో రఫెల్ మటోస్-నికోలస్ చేతిలో ఓడింది.

ఐటా వైల్డ్‌కార్డ్ నిరాకరించినా..

హరియాణాలోని జజ్జార్‌కు చెందిన సుమిత్ ఈసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ ఆడేందుకు చాలా కష్టపడ్డాడు. డేవిస్‌కప్‌లో ఆడేందుకు విముఖత చూపాడన్న కారణంతో సుమిత్‌ను రీజనల్ వైల్డ్‌కార్డ్‌తో ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఆడించేందుకు అఖిల భారత టెన్నిస్ సమాఖ్య (ఐటా) నిరాకరించింది. వాస్తవానికి భారత్ నుంచి సింగిల్స్‌లో అత్యుత్తమ ర్యాంక్ ప్రకారం ఎంపిక చేయాలనుకుంటే సుమిత్‌నే మెల్‌బోర్న్ పంపాలి. కానీ, డేవిస్‌కప్‌కు దూరమై నిబంధనలు ఉల్లంఘించాడన్న కారణంతో అతడి ఎంట్రీని ఐటా పంపలేదు. దీంతో క్వాలిఫయింగ్ రౌండ్లలో సత్తాచాటిన సుమిత్ ఆస్ట్రేలియన్ ఓపెన్ మెయిన్ డ్రాకు అర్హత సాధించాడు. ఇప్పుడు ఏకంగా తొలిరౌండ్లో సంచలన ప్రదర్శనతో తన సత్తా చాటాడు. సుమిత్ చివరిగా 2021లో ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఆడినా, అప్పుడు తొలిరౌండ్లోనే ఓడాడు. 2019లో యూఎస్ ఓపెన్‌తో గ్రాండ్‌స్లామ్ అరంగేట్రం చేసిన సుమిత్.. ఆనాడు స్విస్ దిగ్గజం రోజర్ ఫెడరర్‌తో తలపడ్డాడు. ఈ మ్యాచ్‌లో 6-4, 1-6, 2-6, 4-6తో ఫెడెక్స్ చేతిలో ఓడినా.. ఒక సెట్ నెగ్గడం పెద్ద సంచలనమే అయింది. 2020 యూఎస్ ఓపెన్‌లో బ్రాడ్లీ కల్హన్ (అమెరికా)పై గెలిచిన నగల్.. సోమ్‌దేవ్ దేవ్‌వర్మన్ (2013లో) తర్వాత గ్రాండ్‌స్లామ్ సింగిల్స్‌లో మ్యాచ్ నెగ్గిన ఆటగాడిగా రికార్డులకెక్కాడు.


సీఈవో నియామకంలో.. ఉష ఒత్తిడి చేసింది

ఈసీ సభ్యుల ఆరోపణ

న్యూఢిల్లీ: భారత ఒలింపిక్ సంఘం (ఐవోఏ) సీఈవోగా రఘు అయ్యర్ నియామకం వివాదాస్పదమైంది. అతడి విషయంలో ఐవోఏ అధ్యక్షురాలు పీటీ ఉష.. తమపై ఒత్తిడి తీసుకువచ్చిందని 12 మంది ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (ఈసీ) సభ్యులు ఆరోపించారు. ఈనెల 6న అయ్యర్ నియామకంపై ఉష అధికారిక ప్రకటన చేసింది. కానీ, దీన్ని తాము ఆమోదించలేదని ఈసీ సభ్యులు చెప్పారు. ఈ మేరకు ఐవోఏ అధ్యక్షురాలికి వీరంతా లేఖ రాశారు. జీతం విషయంలోనూ నిబంధనలను పాటించలేదన్నారు. అయితే, వీరివి సిగ్గుపడాల్సిన ఆరోపణలని ఉష వ్యాఖ్యానించింది. అత్యవసర సమావేశంలో చర్చించిన తర్వాతనే నియామకాన్ని ఖరారు చేసినట్టు పేర్కొంది. అయ్యర్ గతంలో ఐపీఎల్ జట్టు రైజింగ్ పుణె సూపర్‌జెయింట్స్ సీఈవోగా పని చేశాడు.

సేన్‌కు రజావత్ షాక్

- ఇండియా ఓపెన్‌లో ప్రణయ్ ముందంజ


రజావత్

న్యూఢిల్లీ: భారత యువ షట్లర్ ప్రియాన్షు రజావత్ ఇండియా ఓపెన్‌లో అదరగొట్టాడు. మంగళవారం మొదలైన ఈ సూపర్ 750 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో రజావత్ తనకంటే సీనియర్, స్టార్ షట్లర్ లక్ష్యసేన్‌కు షాకిచ్చాడు. పురుషుల సింగిల్స్ తొలిరౌండ్లో ప్రపంచ 30వ ర్యాంకర్ రజావత్ 16-21, 21-16, 21-13తో ప్రపంచ 19వ ర్యాంకర్ లక్ష్యసేన్‌ను చిత్తుచేశాడు. వరుసగా రెండో టోర్నీలోనూ మొదటిరౌండ్లోనే ఓడిన సేన్.. ఒలింపిక్‌కు అర్హత సాధించే అవకాశాలను సంక్లిష్టం చేసుకున్నాడు. ఇక వెటరన్ స్టార్ హెచ్‌ఎస్ ప్రణయ్ 21-6, 21-19తో 13వ ర్యాంకర్ చో తిన్ చెన్ (చైనీస్ తైపీ)ని కంగుతినిపించి రెండోరౌండ్లో ప్రియాన్షు రజావత్‌తో పోరుకు సిద్ధమయ్యాడు. మహిళల డబుల్స్‌లో గాయత్రి గోపీచంద్-ట్రీసా జాలీ, రీతూపర్ణ పండా-శ్వేతాపర్ణ పండా జోడీలు ఆరంభ రౌండ్లోనే ఓటమిపాలయ్యారు.

బంగ్లా క్రికెటర్ నాసిర్ హుస్సేన్‌పై నిషేధం

దుబాయ్: బంగ్లాదేశ్ ఆల్‌రౌండర్ నాసిర్ హుస్సేన్‌పై రెండేళ్లపాటు ఎలాంటి క్రికెట్ ఆడకుండా ఐసీసీ నిషేధం విధించింది. 2021, అబుదాబి టీ10 లీగ్‌లో నసీర్‌తో పాటు ఇతర ఆటగాళ్లు, అధికారులు, టీమ్ యజమానులతో సహా ఏడుగురు అవినీతికి పాల్పడ్డారని గతేడాది సెప్టెంబరులో ఐసీసీ ఆరోపించింది. తాజాగా తనపై ఆరోపణలను 32 ఏళ్ల హుస్సేన్ అంగీకరించడంతో నాసిర్‌పై వేటు పడింది. 2011-2018 మధ్య కాలంలో బంగ్లా తరఫున నాసిర్ మూడు ఫార్మాట్లలో కలిపి 115 మ్యాచ్‌లాడాడు.

టార్గెట్.. క్లీన్‌స్వీప్

అఫ్ఘాన్‌తో భారత్ ఆఖరి టీ20 నేడు
రాత్రి 7 గం. నుంచి స్పోర్ట్స్18లో..


టీమిండియా ప్రాక్టీస్ సెషన్‌లో కోహ్లీ, రింకూతో పంత్

బెంగళూరు: వరుసగా రెండు ఏకపక్ష విజయాలతో ఇప్పటికే సిరీస్ దక్కించుకున్న టీమిండియా ఇక క్లీన్‌స్వీప్‌పై దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో బుధవారం అఫ్ఘానిస్థాన్‌తో ఆఖరి, మూడో టీ20లో తలపడనుంది. జూన్‌లో జరిగే టీ20 వరల్డ్‌కప్‌నకు ముందు భారత జట్టుకిదే ఆఖరి మ్యాచ్. తొలి రెండు మ్యాచ్‌ల తరహాలోనే చివరిదైన మూడో టీ20లోనూ రోహిత్ సేన ఆరంభం నుంచే దూకుడుగా ఆడాలని భావిస్తోంది. మొహాలీలో 17.3 ఓవర్లలో 159, ఇండోర్‌లో 15.4 ఓవర్లలోనే 173 పరుగులను జట్టు ఛేదించగలిగింది. వెటరన్ కోహ్లీ సైతం ఇదే ఫార్ములాతో 16 బంతుల్లోనే 29 రన్స్‌తో టీమ్ మేనేజ్‌మెంట్ వ్యూహాన్ని అనుసరించాడు. ఇక శివమ్ దూబే, జైస్వాల్‌ల మెరుపు ఇన్నింగ్స్ సిరీస్‌కు హైలైట్‌గా నిలుస్తోంది. కానీ కెప్టెన్ రోహిత్ శర్మ మాత్రం ఇప్పటివరకు పరుగుల ఖాతానే తెరువకపోవడం గమనార్హం. ఈ మ్యాచ్‌లో సంజూ శాంసన్‌తో పాటు స్పిన్నర్ కుల్దీప్, పేసర్ అవేశ్‌లకు చోటు దక్కవచ్చు. అటు సిరీస్‌లో ఓదార్పు విజయం కోసం అఫ్ఘాన్ తపిస్తోంది. చిన్నస్వామి స్టేడియంలో ఓపెనర్ గుర్బాజ్ జట్టుకు భారీ స్కోరు అందించడంతో పాటు ఛేదించడంలోనూ కీలకం కానున్నాడు. స్పిన్నర్ ముజీబ్ ధారాళంగా పరుగులిచ్చుకున్నా భారత ఎడమచేతి బ్యాటర్లను దృష్టిలో ఉంచుకుని అతడినే కొనసాగించవచ్చు.

డీప్‌ఫేక్ బారిన సచిన్

న్యూఢిల్లీ: వివిధ రంగాల్లో ప్రముఖులను లక్ష్యంగా చేసుకుంటూ డీప్‌ఫేక్ మార్ఫింగ్ వీడియోలు ఇటీవలి కాలంలో నెట్టింట హల్‌చల్ చేస్తున్నాయి. తాజాగా బ్యాటింగ్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ కూడా వీటి బారినపడ్డాడు. ఓ గేమింగ్ యాప్‌ను తాను ప్రమోట్ చేస్తున్నట్టు సోషల్ మీడియాలో ఓ వీడియో వైరల్ అవుతోంది. ఇది సచిన్ దృష్టికి రావడంతో ఆ వీడియోలో ఉన్నది తాను కాదని, ప్రభుత్వం ఈ విషయంలో చర్య తీసుకోవాలని సచిన్ కోరాడు.

బిజినెస్

తదుపరి తరం కొవిడ్ వ్యాక్సిన్ అభివృద్ధిపై బీఈ కసరత్తు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): బయోలాజికల్-ఈ (బీఈ) తదుపరి తరం కొవిడ్-19 వ్యాక్సిన్ అభివృద్ధిపై కృషి చేస్తోంది. సార్స్-కొవ్-2 వైరస్ ఎక్స్‌బీబీ1.5 వేరియంట్‌కు సంబంధించిన వ్యాక్సిన్ అభివృద్ధి చేస్తున్నట్లు బీఈ వెల్లడించింది. ప్రీ క్లినికల్ అధ్యయనాలు పూర్తయ్యాయి. ప్రస్తుతం ఉన్న వేరియంట్ల నుంచి ఈ వ్యాక్సిన్ రక్షణ కల్పిస్తుందని బీఈ మేనేజింగ్ డైరెక్టర్ మహిమ దాట్ల తెలిపారు. భారత్‌లో క్లినికల్ ట్రయల్స్‌కు ఇటీవల సీడీఎస్‌సీఓ నుంచి బీఈ తుది అనుమతి తీసుకుంది. త్వరలో క్లినికల్ ట్రయల్స్‌ను కంపెనీ ప్రారంభించనుంది. కాగా, బీఈ చెందిన కొవిడ్ వ్యాక్సిన్ కోర్బెవ్యాక్స్‌'ను ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) ఎమర్జెన్సీ యూజ్ లిస్టింగ్‌లో చేర్చింది.

ఎయిర్ ట్యాక్సీలపై మారుత్ డ్రోన్స్, స్కైడ్రైవ్ ఒప్పందం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): దేశంలో ఎయిర్ ట్యాక్సీల (ఎలక్ట్రిక్ వర్టికల్ టేకాఫ్ అండ్ లాండింగ్-ఈవీటీఓఎల్) ద్వారా రవాణా సేవలు అందించడానికి మారుత్ డ్రోన్స్, జపాన్‌కు చెందిన స్కైడ్రైవ్ అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఒప్పందం ప్రకారం మారుత్ డ్రోన్స్ ట్యాక్సీ విమానాల మార్గాలను గుర్తించడం, స్కైడ్రైవ్ కోసం నెట్‌వర్క్‌లను అభివృద్ధి చేయడం చేస్తుంది. వీటితో పాటు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, భాగస్వాములను సమకూర్చడం, ప్రభుత్వంతో సంప్రదించడం తద్వారా దేశంలో ట్యాక్సీ విమాన సేవలను అందించడానికి అవసరమైన చర్యలు చేపడుతుంది. స్కైడ్రైవ్ ఈవీటీఓఎల్‌లను ఫ్లైయింగ్ కార్లుగా వ్యవహరిస్తారు. బ్యాటరీతో పని చేసే ఎయిర్ ట్యాక్సీలను తక్కువ దూరం ప్రయాణానికి వినియోగిస్తారు. హెలికాప్టర్ సామర్థ్యాలను కలిగి ఉంటాయి. ఫిక్స్‌డ్ వింగ్ ఎయిర్‌క్రాఫ్ట్ తరహాలో పని చేస్తాయి.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	63,330 ▲	58,050 ▲	78,100 ▲
ముంబై	62,608 ▲	57,349 ▲	71,666 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



16వ తేదీ		విజయవాడ	530
హైదరాబాద్	520	విశాఖపట్నం	564
17 జనవరి		వరంగల్	522
చిత్తూరు	563	దజను గుడ్లు రూ.72	
గోదావరి	530		

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	107	గోదావరి	106
వరంగల్	107	విజయవాడ	106
కరీంనగర్	107	గుంటూరు	107
మహబూబ్‌నగర్	107	ఒంగోలు	107
కర్నూలు	107	చిత్తూరు	113
విశాఖపట్నం	101		

వచ్చే పదేళ్లలో ట్రిలియనీర్

గడిచిన మూడేళ్లలో ఐదుగురు ప్రపంచ కుబేరుల సంపద రెట్టింపు

- 500 కోట్ల మంది పేదరికంలోకి..
- ప్రపంచంలో ఆర్థిక అసమానతలపై డబ్ల్యూఈఎఫ్‌లో ఆక్స్‌ఫామ్ నివేదిక



దావోస్: ప్రపంచ టాప్ టెన్ కుబేరుల్లో ఐదుగురి సంపద గత మూడేళ్లలో రెట్టింపైందని.. ప్రస్తుత బిలియనీర్ల ప్రపంచం పదేళ్లలో తొలి ట్రిలియనీర్‌నూ చూడనుందని అంతర్జాతీయ చారిటీ సంస్థ ఆక్స్‌ఫామ్ తాజా నివేదిక పేర్కొంది. పెరుగుతున్న ఆర్థిక అసమానతలు, కార్పొరేట్ల అర్థ బలంపై వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ (డబ్ల్యూఈఎఫ్) వార్షిక సమావేశాల్లో ఈ రిపోర్టును విడుదల చేసింది. టెస్లా చీఫ్ ఎలాన్ మస్క్, ఎల్‌వీఎంహెచ్ గ్రూప్ అధిపతి బెర్నార్డ్ అర్నో, అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్, ఒరాకిల్ ఫౌండర్ ల్యారీ ఎల్లిసన్, బెర్క్‌షైర్ హాత్‌వే చైర్మన్ వారెన్ బఫెట్‌ల మొత్తం సంపద 2020 మార్చిలో 40,500 కోట్ల డాలర్లుగా ఉండగా.. 2023 నవంబరు నాటికి 86,900 కోట్ల డాలర్లకు పెరిగిందని నివేదిక తెలిపింది. అంటే.. వీరి మొత్తం సంపద గంటకు 1.4 కోట్ల డాలర్ల చొప్పున పెరిగింది. కాగా, ఆర్థిక అంతరాలు వేగంగా పెరుగుతున్న ఈ దశాబ్దంలో దాదాపు 500 కోట్ల మంది పేదరికంలోకి జారుకున్నారని రిపోర్టు తెలిపింది. ప్రస్తుత ట్రెండ్‌ను బట్టి చూస్తే, వచ్చే దశాబ్ద కాలంలో ఎవరో ఒకరు ట్రిలియన్ డాలర్ల (లక్ష కోట్ల డాలర్లు) అధిపతిగా అవతరించవచ్చని.. ప్రపంచంలో పేదరిక నిర్మూలనకు మరో 229 ఏళ్ల పట్టవచ్చని ఆక్స్‌ఫామ్ అంటోంది. ప్రపంచంలో నం.1 ధనికుడు ఎలాన్ మస్క్ ప్రస్తుత సంపద 20,600 కోట్ల డాలర్లుగా ఉంది.

నివేదికలోని మరిన్ని విషయాలు..

ప్రపంచంలోని టాప్ టెన్ కంపెనీల్లో ఏడింటి సీఈఓ లేదా ప్రధాన షేర్‌హోల్డర్ బిలియనీర్ (కనీసం 100 కోట్ల డాలర్ల ఆస్తి కలిగిన వారు)గా ఉన్నారు. ఈ కంపెనీల మొత్తం విలువ 10.2 లక్షల కోట్ల డాలర్లు. అనగా ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలన్నింటి జీడీపీ కంటే అధికం.

ప్రపంచంలోని 148 అతిపెద్ద కార్పొరేట్ కంపెనీలు మొత్తం 1.8 లక్షల కోట్ల డాలర్ల లాభాలు ఆర్జించాయి. వీటి లాభాల మూడేళ్ల సగటు 52 శాతం పెరిగింది. ఈ కంపెనీలు తమ వాటాదారులకు భారీగా రిటర్నులు పంచిపెట్టాయి. కానీ, ప్రపంచంలో కోట్లాది మంది ఉద్యోగుల జీతాలు మాత్రం పెరిగిన ధరలు, వ్యయ భారాలకు అనుగుణంగా పెరగలేదు.

ప్రపంచ జనాభాలో కేవలం 21 శాతం కలిగిన ఉత్తర ధనిక దేశాల చేతుల్లోనే 69 శాతం సంపద ఉంది. ప్రపంచ బిలియనీర్లలో 74 శాతం ఈ దేశాలకు చెందినవారే.

వడ్డీలపై నిషేధం

ఏప్రిల్ 1 నుంచి బ్యాంకుల జరిమానా

ముంబై: బ్యాంకులు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీలు (ఎన్‌బీఎఫ్‌సీలు) ఆదాయం పెంచుకునేందుకు రుణగ్రహీతలపై జరిమానా వడ్డీలు విధించకుండా ఆర్‌బీఐ నిషేధం విధించింది. రుణ చెల్లింపుల్లో విఫలమైన వారి నుంచి సముచిత స్థాయిలో జరిమానా రుసుము వసూలు చేసేందుకు మాత్రం అవకాశమిచ్చింది. ఈ ఏడాది జనవరి 1 నుంచి కొత్త నిబంధనల అమలు చేయాలని తొలుత ఆదేశించిన ఆర్‌బీఐ.. తాజాగా మరో మూడు నెలల గడువిచ్చింది. అంటే ఈ ఏప్రిల్ 1 నుంచి కొత్త నిబంధనలు అమల్లోకి రానున్నాయి. "రుణ కాంట్రాక్టు షరతులు, నియమావళికి రుణగ్రహీత కట్టుబడని పక్షంలో విధించే పెనాల్టీని జరిమానా రుసుముగా పరిగణించాలి. అంతేతప్ప ఆ రుణం వడ్డీ రేటుకు జత చేసే జరిమానా వడ్డీ రూపంలో విధించకూడద"ని గత ఏడాది ఆగస్టు 18న విడుదల చేసిన సవరించిన నిబంధనల నోటిఫికేషన్‌లో ఆర్‌బీఐ స్పష్టం చేసింది. "జరిమానా రుసుము కూడా సహేతుకంగా, పాటించని నిబంధనకు అనుగుణ స్థాయిలో, నిష్పక్షపాతంగా ఉండాలి. అంతేకాదు, ఈ రుసుము ఆదాయం పెంచుకునే మార్గం కాకూడదు. ఆ చార్జీపై వడ్డీ విధించకూడదని" కూడా పేర్కొంది. అయితే, క్రెడిట్ కార్డులు, విదేశీ కరెన్సీలో జారీ చేసే వాణిజ్య రుణాలు (ఈసీబీ), ట్రేడ్ క్రెడిట్స్, స్ట్రక్చర్డ్ ఆబ్లిగేషన్స్‌కు మాత్రం ఈ ఆదేశాలు వర్తించవని ఆర్‌బీఐ వెల్లడించింది.

బీఓఎం లాభం 1,036 కోట్లు


న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర (బీఓఎం).. డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో రూ.1,036 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. అంతకుముందు ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంతో పోల్చితే లాభం 34 శాతం (రూ.775 కోట్లు) వృద్ధి చెందింది. వడ్డీ ఆదాయం పెరగటం, మొండి బకాయిలు (ఎన్‌పీఏ) తగ్గుముఖం పట్టడం ఎంతగానో కలిసివచ్చిందని పేర్కొంది. కాగా త్రైమాసిక సమీక్షా కాలంలో మొత్తం ఆదాయం కూడా రూ.4,770 కోట్ల నుంచి రూ.5,851 కోట్లకు పెరిగింది. ఈ కాలంలో నికర వడ్డీ ఆదాయం (ఎన్‌ఐఐ) రూ.1,980 కోట్ల నుంచి రూ.2,466 కోట్లకు పెరిగింది.

మారుతి కార్ల ధరలు పెంపు

న్యూఢిల్లీ : తమ కార్ల ధరలు సగటున 0.45 శాతం పెంచినట్టు మారుతి సుజుకీ ప్రకటించింది. ఈ పెంపు తక్షణం అమలులోకి వచ్చింది. రూ.3.54 లక్షల విలువ గల ఆల్టో నుంచి రూ.28.42 లక్షల విలువ గల ఇన్విక్టో వరకు పలు మోడల్ కార్లను మారుతి విక్రయిస్తోంది.

ఈ ఏడాది అమ్మకాల్లో 65%ఎస్‌యూవీలే

హ్యుండయ్ మోటార్స్ అంచనా
మార్కెట్లోకి సరికొత్త క్రెటా
ప్రారంభ ధర రూ.10.99 లక్షలు



న్యూఢిల్లీ: హ్యుండయ్ మోటార్స్ ఈ ఏడాది అమ్మకాల్లో 65 శాతం ఎస్‌యూవీలే ఉంటాయని భావిస్తోంది. అలాగే 2030 నాటికి మొత్తం విక్రయాల్లో విద్యుత్ కార్ల వాటా 20 శాతం సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. 2023లో మొత్తం అమ్మకాల్లో ఎస్‌యూవీ విక్రయాలు 60 శాతానికి చేరాయని కంపెనీ సీఓఓ తరుణ్ గార్గ్.. మిడ్‌సైజ్ ఎస్‌యూవీ క్రెటా కొత్త వెర్షన్‌ను మార్కెట్లో విడుదల చేసిన సందర్భంగా మంగళవారం చెప్పారు. ఎస్‌యూవీ క్రెటా కొత్త వెర్షన్ కారు ధర రూ.10.99 లక్షల నుంచి రూ.19.99 లక్షల (ఎక్స్‌షోరూమ్) మధ్యన ఉన్నాయి. కాగా హ్యుండయ్ మోటార్స్ మహారాష్ట్రలోని తాలేగావ్ ప్లాంట్‌లో రూ.7000 కోట్లు పెట్టుబడులు పెడుతుందన్న వ్యాఖ్యలపై స్పందించడానికి గార్గ్ నిరాకరించారు.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ లాభంలో 34% వృద్ధి

ముంబై: హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్.. డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన నికర లాభం 34 శాతం వృద్ధి చెంది రూ.16,373 కోట్లుగా నమోదైంది. 2022-23 ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో లాభం రూ.12,259 కోట్లుగా ఉంది. త్రైమాసిక సమీక్షా కాలంలో మొత్తం ఆదాయం కూడా రూ.51,208 కోట్ల నుంచి రూ.81,720 కోట్లకు పెరిగింది. ఈ కాలంలో బ్యాంక్ స్థూల ఎన్‌పీఏలు 1.23 శాతం నుంచి 1.26 శాతానికి పెరగగా నికర ఎన్‌పీఏలు కూడా 0.33 శాతం నుంచి 0.31 శాతానికి తగ్గాయి.

తగ్గినా.. 73,000 పైనే సెన్సెక్స్

మార్కెట్లో 5 రోజుల ర్యాలీకి తెర.. సరికొత్త రికార్డు స్థాయిల నుంచి నష్టాల్లోకి ఈక్విటీ సూచీలు

ముంబై: భారత స్టాక్ మార్కెట్లో ఐదు రోజుల వరుస ర్యాలీకి తెరపడింది. మంగళవారం ఆరంభ నష్టాల నుంచి తేరుకుని సరికొత్త ఉన్నత శిఖరాలను అధిరోహించిన ప్రామాణిక సూచీలు.. మధ్యాహ్నం నుంచి మళ్లీ నష్టాల్లోకి మళ్లాయి. అంతర్జాతీయ మార్కెట్ల బలహీన సంకేతాల నేపథ్యంలో మదుపరులు ఐటీ, ఆయిల్ రంగ షేర్లలో లాభాల స్వీకరణకు పాల్పడటం ఇందుకు కారణమైంది. ఒక దశలో సెన్సెక్స్ 73,427.59 వద్ద, నిఫ్టీ 22,124.15 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డులను నమోదు చేయగలిగినప్పటికీ.. ట్రేడింగ్ ముగిసేసరికి సెన్సెక్స్ 199.17 పాయింట్ల నష్టంతో 73,128.77 వద్ద, నిఫ్టీ 65.15 పాయింట్లు కోల్పోయి 22,032.30 వద్ద స్థిరపడ్డాయి.

కాగా, సోమవారం నాటి ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 760 పాయింట్ల వృద్ధితో 73,000, నిఫ్టీ 203 పాయింట్ల లాభంతో 22,000 స్థాయిలను తొలిసారిగా అధిగమించాయి.

జ్యోతి సీఎన్‌సీ లిస్టింగ్ హిట్: గతవారంలో ఐపీఓ ముగించుకున్న జ్యోతి సీఎన్‌సీ ఆటోమేషన్ మంగళవారం షేర్లను స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు చేసింది. ఐపీఓ ధర రూ.331తో పోలిస్తే, బీఎస్ఈలో కంపెనీ షేరు 12.38 శాతం ప్రీమియంతో రూ.372 వద్ద లిస్టయింది. ఇంట్రాడేలో మరింత ఎగబాకిన షేరు తొలిరోజు ట్రేడింగ్ ముగిసేసరికి 30.86 శాతం లాభంతో రూ.433.15 వద్ద స్థిరపడింది.

యూబీఐ.. రూ.లక్ష కోట్లు: ప్రభుత్వ రంగానికి చెందిన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ) షేరు మంగళవారం 1.34 శాతం ఎగబాకి రూ.135.90 వద్దకు చేరుకుంది. దాంతో యూబీఐ మార్కెట్ విలువ తొలిసారిగా రూ.లక్ష కోట్ల మైలురాయిని దాటింది. తద్వారా యూబీఐ రూ.లక్ష కోట్ల మార్కెట్ క్యాప్ కలిగిన నాలుగో ప్రభుత్వ రంగ బ్యాంకుగా అవతరించింది.

19 నుంచి ఈప్యాక్ డ్యూరబుల్స్ ఐపీఓ: ఈప్యాక్ డ్యూరబుల్ లిమిటెడ్ తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) ఈ నెల 19న ప్రారంభమై 23న ముగియనుంది. ఇష్యూ ధర శ్రేణిని కంపెనీ రూ.218-230గా నిర్ణయించింది.

ఎల్‌ఐసీ షేరు @ రూ.900

ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం ఎల్‌ఐసీ షేరు ఇంట్రాడేలో 5.30% పెరిగి రూ.900 స్థాయి వద్ద సరికొత్త ఏడాది గరిష్ఠాన్ని నమోదు చేసింది. 2022 మే 17న కంపెనీ షేరు స్టాక్ మార్కెట్లో లిస్టయ్యాక రూ.900 స్థాయికి చేరడం ఇదే తొలిసారి. ఐపీఓ ధర రూ.949తో పోలిస్తే.. బాగా తక్కువ స్థాయిలో రూ.875.25 వద్ద లిస్టయిన షేరు.. ఆ తర్వాత రోజుల్లో మరింత క్షీణిస్తూ వచ్చింది. 2023 మార్చిలో ఆల్‌టైం కనిష్ఠ స్థాయి రూ.530 వద్దకు పతనమైంది. కానీ, ఆ తర్వాత నుంచి షేరు ధర క్రమంగా పుంజుకుంది. గత నవంబరులో 12.83%, డిసెంబరులో 22% పైగా వృద్ధి చెందింది. గడిచిన రెండున్నర నెలల్లో మార్కెట్ విలువ రూ.1.84 లక్షల కోట్లు పెరిగి ప్రస్తుతం రూ.5.64 లక్షల కోట్ల స్థాయికి చేరుకుంది.



'విశాఖ ఉక్కు'పై మరో కుట్ర

- 1500 మంది ఉద్యోగుల తొలగింపునకు ప్లాన్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం స్టీల్‌ప్లాంటుకు ఏమీ కాదని, దానిని బలోపేతం చేసే దిశగా చర్యలు చేపట్టామని చెబుతున్న కేంద్రం ఇప్పుడు ఉద్యోగుల సంఖ్యను తగ్గించడానికి కొత్త ప్రణాళికను సిద్ధం చేస్తోంది. కనీసం 1,500మందిని పలు కారణాలతో బయటకు పంపాలని చూస్తోంది. వారికి ఎలాంటి ఆర్థిక ప్రయోజనాలు ఇవ్వకుండా గెంటేసే దిశగా తక్షణ చర్యలు చేపట్టాలని కేంద్ర ఉక్కు శాఖ ఒత్తిడి పెడుతోంది. కొద్దిరోజుల కిందట జరిగిన స్టీల్‌ప్లాంటు బోర్డు సమావేశంలో దీనిపై చర్చించారు. వీరి ప్రణాళికను అమలు చేయడానికి కొత్తగా 'వలంటరీ సెపరేషన్ స్కీమ్'(వీఎస్ఎస్)ను తీసుకురావాలని నిర్ణయించారు. దీనికిగాను ప్రత్యేకంగా ఒక కమిటీని నియమించి, ఫిబ్రవరి 2గా అమలుకు విధి విధానాలు రూపొందించాలని ఆదేశించారు. ఆ తరువాత జరిగే బోర్డు మీటింగ్‌లో దీనిని అమలుకు చర్యలు చేపట్టనున్నారు.

వీఆర్ఎస్‌కు బదులుగా వీఎస్ఎస్

ఏదైనా ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థలు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పుడు ఉద్యోగుల సంఖ్యను తగ్గించుకోవాలనుకుంటే వలంటరీ రిటైర్‌మెంట్ స్కీమ్ (వీఆర్ఎస్) అమలు చేస్తారు. 30ఏళ్ల సర్వీసు దాటిన వారికి దీన్ని వర్తింపజేసి, వారికి ఇంకా మిగిలిన సర్వీసుకు బేసిక్ పే+డీఏ మొత్తం ఎన్ని నెలలైతే అంత ఇచ్చి పంపిస్తారు. దీనినే కొన్ని సంస్థలు 'గోల్డెన్ షేక్ హ్యాండ్'గా పేర్కొంటాయి. ఈ విధానంలో వెళ్లిపోయే ఉద్యోగికి పనిచేయకుండానే మిగిలిన సర్వీసుకు కొంత మొత్తం చేతికి వస్తుంది. ఇది ఉభయులకు లాభదాయకం కాబట్టి దీనిపై ఉద్యోగులు పెద్దగా వ్యతిరేకత వ్యక్తం చేయడం లేదు. విశాఖపట్నం స్టీల్‌ప్లాంటు ఆర్థిక ఇబ్బందుల్లో ఉండడంతో 2021లోనే వీఆర్ఎస్ అమలు చేశారు. ఇప్పుడు కూడా ఉక్కుశాఖ ఉద్యోగులను తగ్గించాలని అనుకుంటోంది. ఈ నేపథ్యంలో మరోసారి వీఆర్ఎస్ అమలుచేయాలి. కానీ దానికి భిన్నంగా వీఎస్ఎస్‌ని అమలు చేయడానికి ప్రణాళిక సిద్ధం చేశారు.

ఏమిటీ వీఎస్ఎస్?

వలంటరీ సెపరేషన్ స్కీమ్(వీఎస్ఎస్)లో ఉద్యోగులకు ఎలాంటి ఆర్థిక ప్రయోజనాలు ఇవ్వరు. అంటే మిగిలిన సర్వీసుకు బేసిక్ పే, డీఏలు లెక్కించరు. కేవలం పదవీ విరమణ తర్వాత బీమా సదుపాయం, ఉచిత వైద్యం పొందే అవకాశం మాత్రమే కల్పిస్తారు. ఈ విధంగా ఆరోగ్యం బాగాలేని 700 మందిని, వీఎస్ఎస్ ద్వారా మరో 800మందిని కలిపి మొత్తంగా 1,500 మంది తగ్గించాలని నిర్ణయించినట్టు తెలిసింది. సీనియర్ ఉద్యోగుల్లో అనారోగ్యంగా ఉన్నవారిని తొలుత గుర్తిస్తారు. మీరు పనిచేయని స్థితిలో ఉన్నారు రాజీనామా చేసి వెళ్లిపోవాలని చెబుతారు. లేదంటే.. ఎక్కువగా శ్రమించాల్సిన బ్లాస్ ఫర్నేస్, కోక్ ఓవెన్, సింటర్ ప్లాంటులకు బదిలీ చేస్తామని భయపెడతారు. దానికీ లొంగకపోతే అక్కడ పనితీరు సరిగ్గా బాలేదని చార్జిమెమోలు ఇస్తారు. సక్రమంగా పనిచేయడంలేదని ముద్రవేసి బయటకు పంపిస్తారు. వీరికి బీమా, వైద్య సదుపాయం కూడా రావు. ఏది కావాలో తేల్చుకోవాలని చెబుతారు. వీఎస్ఎస్‌పై అధికార, కార్మిక సంఘాల్లో చర్చలు జరుగుతున్నాయి. వీఆర్ఎస్ అయితే వెళ్లడానికి కొందరు సుముఖంగా ఉన్నారు. వీఎస్ఎస్ వల్ల రూపాయి రానప్పుడు ఎలా వెళతారని నాయకులు ప్రశ్నిస్తున్నారు. దీనిపై కమిటీ అభిప్రాయాలు అడిగితే ఇదే విషయం చెబుతామని, వీఎస్ఎస్‌ను వ్యతిరేకిస్తామని అంటున్నారు.

పీసీసీ పగ్గాలు షర్మిలకే

(మొదటి పేజీ తరువాయి)

నియమితులైన తర్వాత ట్విట్టర్ (ఎక్స్) వేదికగా షర్మిల స్పందించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పునర్నిర్మాణానికి, పూర్వ వైభవానికి కృషి చేస్తానని ప్రకటించారు. తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర కాంగ్రెస్ బాధ్యతలు అప్పగించినందుకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే , సోనియాగాంధీ, రాహుల్ గాంధీకి కృతజ్ఞతలు తెలిపారు. క్షేత్రస్థాయిలో కార్యకర్తలతోనూ, నాయకులతోనూ కలసిమెలసి కాంగ్రెస్ పార్టీ వృద్ధికి, బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ఇప్పటివరకూ పీసీసీ అధ్యక్షుడుగా ఉన్న గిడుగు రుద్రరాజును కాంగ్రెస్ వర్కింగ్ కమిటీకి ప్రత్యేక ఆహ్వానితునిగా నియమించారు. కాగా, గిడుగు రుద్రరాజు సోమవారం తన పదవికి రాజీనామా చేశారు. షర్మిల నియామకం ఖరారైనందువల్ల తనను రాజీనామా చేయమని అధిష్ఠానం కోరిందని వెల్లడించారు. షర్మిల నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ పటిష్ఠమవుతుందనే విశ్వాసం తనకున్నదని ఆయన తెలిపారు. షర్మిల నియామకంపై కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్యం ఠాకూర్ హర్షం వ్యక్తంచేశారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ బలోపేతమయినట్లే , షర్మిల కూడా పార్టీని బలోపేతం చేస్తారని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు.



కాంగ్రెస్‌లోకి షర్మిల చేరికపై 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనాలు

షర్మిల.. కొత్త చరిత్ర

ఏపీసీసీకి తొలి మహిళా చీఫ్

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) 27వ అధ్యక్షురాలిగా నియమితులైన వైఎస్ షర్మిల పలు రాజకీయాంశాల్లో కొత్త చరిత్ర సృష్టించారు. ఆ పార్టీ రాష్ట్ర చరిత్రలో చాలా విషయాల్లో ఆమే ప్రథమురాలు. ఆంధ్రప్రదేశ్ ఆవిర్భావించిన నాటినుంచీ మహిళలు ఏపీ కాంగ్రెస్ పగ్గాలను ఇంతవరకు చేపట్టలేదు. ఈ అరుదైన ఘనత షర్మిల దక్కించుకున్నారు. ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవిని చేపట్టిన నేతల వారసులెవరూ ఆ పదవిని దక్కించుకోలేకపోయారు. వైఎస్ రాజశేఖరరెడ్డి కుమార్తెగా ఈ క్రెడిట్‌ను ఆమె సొంతం చేసుకున్నారు. వైఎస్ 1983-85లోనూ.. 1998-2000లోనూ పీసీసీ అధ్యక్షుడిగా పనిచేశారు. హేమాహేమీలైన నేతలు ఉండే కాంగ్రెస్ పార్టీ పగ్గాలు చేపట్టాలంటే .. రాజకీయంగా బలమైన పూర్వానుభవం ఉండాలి. ప్రత్యక్ష రాజకీయాల్లోనూ, ఎన్నికల గోదాలోనూ దిగి సత్తా చాటిన చరిత్ర ఉండాలి. కానీ.. కాంగ్రెస్ పార్టీలో ఏ పదవీని చేపట్టకుండా, ఎన్నికల గోదాలోకి దిగకుండానే పీసీసీ పగ్గాలు షర్మిల చేపడుతుండటం మరో ఆసక్తికర అంశం. షర్మిల పేరును ఏఐసీసీ ధ్రువీకరించడంతో మరో చరిత్ర కూడా నమోదయింది. ఏపీలోని రెండు జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్‌కు అతివలే అధ్యక్షత వహించిన అరుదైన ఘట్టం అవిష్కృతం అవుతోంది. బీజేపీ రాష్ట్ర శాఖను నందమూరి తారక రామారావు కుమార్తె పురందేశ్వరి నడిపిస్తుండగా.. కాంగ్రెస్ రాష్ట్ర యూనిట్‌ను త్వరలోనే షర్మిల తన చేతుల్లోకి తీసుకోనున్నారు. పురందేశ్వరి, షర్మిల తండ్రులు ఎన్టీరామారావు, వైఎస్ మాజీ ముఖ్యమంత్రులు కావడం మరో విశేషం. ఇక.. ఒకే రాజకీయ కుటుంబం నుంచి వచ్చిన ఇద్దరు రెండు రాజకీయ పార్టీలకు అధ్యక్షులుగా ఉండటం గమనార్హం. వైఎస్ కుమారుడు జగన్ వైసీపీ అధినేత కాగా, కుమార్తె షర్మిల ఏపీ పీసీసీ సారథ్యం స్వీకరించనున్నారు.

బాణంలా దూసుకొచ్చి..

రాష్ట్ర రాజకీయాల్లోకి షర్మిల బాణంలా దూసుకొచ్చారు. అన్న జగన్ స్థాపించిన వైసీపీలో క్రియాశీలంగా వ్యవహరించారు. అక్రమాస్తుల కేసులో జగన్ జైలుకు వెళ్లగా, ఆ పార్టీనీ తానే అన్ని అయి నడిపించారు. జగన్ వదిలిన బాణంగా ప్రజల్లోకి వెళ్లి పాదయాత్ర చేశారు. తదనంతరం జగన్‌తో విభేదించి.. తెలంగాణ వైసీపీని స్థాపించారు. ఎన్నికల సమయంలో పోటీనుంచి తప్పుకొని.. కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చారు. ఎన్నికల తర్వాత తన పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేశారు. ప్రత్యక్ష ఎన్నికల్లో ఇప్పటిదాకా షర్మిల పోటీచేయలేదు. వైసీపీలో క్రియాశీలకంగా వ్యవహరించినా, అక్కడా ఏ పదవినీ చేపట్టలేదు. స్వచ్ఛందంగా వైసీపీ కోసం పని చేశారు. ఇప్పుడు ఏకంగా జాతీయ కాంగ్రెస్ ఆంధ్రప్రదేశ్ శాఖకు అధ్యక్షురాలు అయ్యారు. ఏఐసీసీ కార్యాలయంలో ఇటీవల జరిగిన కార్యక్రమంలో ఖర్గే ఆమెకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఆ క్షణంలోనే.. షర్మిలకు ఏపీసీసీ పగ్గాలు అప్పగిస్తానని రాహుల్ భరోసా ఇచ్చారు. అన్నట్టుగానే ఏపీసీసీ అధ్యక్షురాలిగా షర్మిలను నియమిస్తూ ఏఐసీసీ ప్రకటన విడుదల చేసింది.

తండ్రికి వారసురాలు.. అన్నకు ప్రత్యర్థి..

- రాష్ట్ర కాంగ్రెస్ పగ్గాలను ఒక మహిళ చేపడుతుండటం ఆంధ్రప్రదేశ్ చరిత్రలోనే తొలిసారి.
- ఎన్నికల అనుభవం లేని మహిళ ఏపీసీసీ పగ్గాలు స్వీకరిస్తుండటం ఇదే ప్రథమం
- ఏపీసీసీ అధ్యక్షులుగా పనిచేసిన నేతల వారసుల్లో ఆ పదవి చేపడుతున్న తొలి వ్యక్తి షర్మిల..
- రెండు జాతీయ పార్టీలు బీజేపీ, కాంగ్రెస్‌లకు ఇద్దరూ మహిళలే సారథులు కావడం రాష్ట్ర చరిత్రలో ఇదే తొలిసారి.
- బీజేపీ రాష్ట్రశాఖ అధ్యక్షురాలు పురందేశ్వరి, ఏపీసీసీ చీఫ్‌గా నియమితులైన షర్మిల.. ఇద్దరూ మాజీ ముఖ్యమంత్రులు ఎన్టీ రామారావు, వైఎస్ రాజశేఖరరెడ్డిల కుమార్తెలు..
- ఒకే కుటుంబం నుంచి వచ్చిన తోబుట్టువులు వేర్వేరు పార్టీల్లో కొనసాగడం కొత్తకాదు. కానీ, వేర్వేరు పార్టీలను వారు నడిపించడం మాత్రం కొత్తసంగతే.
- వైఎస్ కుమారుడు జగన్ వైసీపీ అధ్యక్షుడు కాగా, కుమార్తె షర్మిల నిన్నటిదాకా టీ-వైసీపీని నడిపించి..ఇప్పుడు ఏపీసీసీ పగ్గాలు చేపట్టనున్నారు.
- అన్నవి అధికార రాజకీయాలు.. చెల్లివి విపక్ష బాధ్యతలు

ఇక జగన్‌పై ప్రత్యక్ష దాడి!

- షర్మిలే ఆలంబనగా కాంగ్రెస్ పోరాటం!!
- వైఎస్ అభిమానులను సొంత గూటికి తీసుకురావడమే లక్ష్యం
- అసంతుష్టులకు ప్రత్యామ్నాయంగా షర్మిల

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పై ప్రత్యక్ష దాడికి కాంగ్రెస్ సిద్ధమైంది. ఇందుకు ఆయన సోదరి వైఎస్ షర్మిలనే అస్త్రంగా ప్రయోగిస్తోంది. 'జగనన్న వదిలిన బాణం' ఇప్పుడు అన్నపై నేరుగా రాజకీయ ఎదురుదాడికి సమాయత్తమవడం రాష్ట్ర రాజకీయాల్లో సంచలనం సృష్టిస్తోంది. తెలంగాణలో గెలిచి నూతనోత్సాహంతో ఉన్న కాంగ్రెస్.. పార్టీకి దూరమైన వైఎస్ అభిమానులను తిరిగి సొంత గూటికి తీసుకురావడంపై ప్రధానంగా దృష్టి సారించింది. షర్మిలకు పీసీసీ పగ్గాలు అప్పగించడం ద్వారా ఇది సాకారమవుతుందని విశ్వసిస్తోంది. రాష్ట్ర విభజన తర్వాత ఆ పార్టీలో ఉన్న ముఖ్య నాయకులు, వైఎస్ అభిమానులు పార్టీని వీడారు. వారిలో ఎక్కువ మంది జగన్ స్థాపించిన వైసీపీలో చేరారు. 2014 నుంచి ఇప్పటిదాకా వారంతా మరో ప్రత్యామ్నాయం లేకపోవడంతో... రాజకీయ భవిష్యత్‌పై ఆశతో జగన్ వెంటే నడిచారు. వైఎస్ మాదిరిగా ఈయనా తమకు ప్రాధాన్యమిస్తారని ఆశించారు. కానీ ఆయన నైజం కొద్దికాలానికే అర్థమైపోయింది. బయటకు రావాలంటే రాలేని పరిస్థితి. టీడీపీ తప్ప ప్రత్యామ్నాయం కనిపించలేదు. టీడీపీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీతో విభేదించినందున అందులో ఇమడలేమని భావించారు. ఈ నాలుగున్నరేళ్ల పాలన భరించలేక జగన్‌పై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత పెల్లుబకడంతో.. వచ్చే ఎన్నికల్లో వైసీపీ పరిస్థితి ఏమంత బాగోలేదన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. ఈ తరుణంలో షర్మిల అనూహ్యంగా తన వైఎస్ఆర్‌టీపీని కాంగ్రెస్‌లో విలీనం చేయడం.. ఏపీ కాంగ్రెస్ సారథ్యం చేపట్టడంతో కాంగ్రెస్ మాజీ నేతల్లో ఆశలు చిగురించాయి. రాజశేఖరరెడ్డి కుమార్తె రూపంలో తమకు రాజకీయ ప్రత్యామ్నాయం దొరికిందని వారు భావిస్తున్నారు.

కాంగ్రెస్‌పై జనాగ్రహం..

రాష్ట్రాన్ని నిలువునా చీల్చి తమకు అన్యాయం చేసిన కాంగ్రెస్‌పై జనాగ్రహం ఏ మాత్రం చల్లారలేదు. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలను పక్కనపెడితే చివరకు స్థానిక ఎన్నికల్లోనూ ఆ పార్టీకి అభ్యర్థులు దొరకలేదు. ఒకవేళ ఎవరైనా పోటీచేసినా డిపాజిట్లు దక్కలేదు. ఇప్పుడు షర్మిల రాకతో తమ దశ తిరుగుతుందని, వైఎస్ బిడ్డగా ఆమె కాంగ్రెస్‌ను బలోపేతం చేయగలరన్న విశ్వాసం ఏఐసీసీ పెద్దల్లో కనిపిస్తోంది. ఇప్పుడు రాష్ట్ర కాంగ్రెస్‌లో పరస్పరం కొట్లాడుకునేందుకు నేతలే లేరు. కొందరు నాయకులున్నా.. కార్యకర్తలు కరువయ్యారు. దాదాపు మృతప్రాయంగా ఉన్న పార్టీకి జీవం పోయాలంటే.. గతంలో పార్టీని వీడిన నేతలందరినీ వెనక్కి తీసుకురావలసి ఉంటుందని అధిష్ఠానం భావిస్తోంది.

పూర్వవైభవంపై ఢిల్లీ పెద్దల్లో ఆశలు..

కాంగ్రెస్‌తో వైఎస్‌కు ఉన్న దృఢబంధం కారణంగా.. ఆయన కుమార్తె రంగంలోకి దిగితే పార్టీకి పూర్వవైభవం వస్తుందని ఏఐసీసీ పెద్దలు నమ్ముతున్నారు. ప్రధానంగా రాహుల్‌గాంధీ అయితే.. షర్మిలకు పార్టీని ముందుకు నడిపే సత్తా ఉందని విశ్వసిస్తున్నారు. ఇందుకు బలమైన కారణమే ఉందని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. వైఎస్ మరణం తర్వాత రాష్ట్ర విభజన జరగడం.. తమ అభిప్రాయాలను కాంగ్రెస్ అధిష్ఠానం ఏమాత్రం పరిగణనలోకి తీసుకోకపోవడం.. సొంత పార్టీ ఎంపీలపైనే సభలో దాడి చేయించి.. బయటకు గెంటేసి.. విభజన బిల్లును ఆమోదింపజేసిన వైనాన్ని ఆంధ్రులు మరచిపోలేదు. ఇన్నాళ్లూ తాను తెలంగాణకే పరిమితమవుతానని చెప్పిన షర్మిల.. ఎప్పుడైతే ఆంధ్రలోనూ పార్టీ తరఫున కీలక పాత్ర పోషించేందుకు సిద్ధమనడంతో.. సమీకరణలు మారిపోయాయి. జగన్‌కు అత్యంత సన్నిహితుడైన మంగళగిరి వైసీపీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి.. ఆమె వెంటే నడుస్తానని ప్రకటించారు. ఆయనతో మొదలైన 'బైబై జగన్' నినాదం.. మున్ముందు మరి కొందరు నేతల గమ్యాన్ని కాంగ్రెస్ వైపు మార్చగలదని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. వైసీపీ టికెట్లు రాని పలువురు నేతలు సొంతగూటికి తిరిగొచ్చేందుకు మక్కువ చూపుతున్నట్లు తెలుస్తోంది. షర్మిల బాధ్యతలు చేపట్టేనాటికి వీరిలో కొందరైనా చేరిపోతారని కాంగ్రెస్ అధిష్ఠానం అంచనా వేస్తోంది.



అనంతపురం కలెక్టరేట్ వద్ద మూకుడులో మట్టి గడ్డలు పెట్టుకుని నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

మట్టి తిని బతకాలా జగన్?

- అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాల ఆగ్రహం
- 36వ రోజూ కొనసాగిన సమ్మె.. నేటి నుంచి నిరవధిక దీక్షలు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

రాష్ట్రంలో 36 రోజులుగా సమ్మె చేస్తున్నా ముఖ్యమంత్రి జగన్ వేతనాలు పెంచడం లేదని, తమ సమస్యలు పరిష్కరించకుంటే మట్టి తిని బతకాలా.. అని అంగన్వాడీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కనుమ పండుగ రోజూ రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీలు సమ్మె కొనసాగించారు. అనంతపురం కలెక్టరేట్ వద్ద మూకట్లు, ప్లేట్లలో మట్టి పెట్టుకుని నిరసన తెలిపారు. ప్రభుత్వం స్పందించే వరకూ సమ్మె కొనసాగిస్తామన్నారు. జగన్ ప్రభుత్వానికి కళ్లు, చెవులు, నోరు లేవంటూ.. బెళుగుప్పలో అంగన్వాడీలు కళ్లు, చెవులు, నోరు మూసుకుని నిరసన తెలిపారు. గార్లదిన్నెలో ప్లకార్డులను ప్రదర్శించారు. శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలో సీఎం జగన్‌కు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ చేపట్టారు. అనంతపురం కలెక్టరేట్ వద్ద అంగన్వాడీల దీక్షా శిబిరానికి మంగళవారం తెల్లవారుజామున దుండగులు నిప్పు పెట్టారు. షామియానా తగులబడుతుండగా స్థానికులు గుర్తించి మంటలను ఆర్పివేశారు. సమ్మె గిట్టని వారే ఈ దుశ్చర్యకు పాల్పడి ఉంటారని అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు ఆరోపించారు. నెల్లూరు నగరంలో అంగన్వాడీలు రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్, విజయా డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డిలను కలసి వినతిపత్రాలు అందించారు. పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టరేట్ వద్ద అంగన్వాడీలు వంటలు చేసుకుని నిరసన తెలిపారు. పాలకొండలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ముగ్గులు వేసి.. ఎద్దులకు దండాలు పెట్టి నిరసన తెలిపారు. కొమరాడలో గోమాతలకు పూజలు చేశారు. సాలూరులో అంగన్వాడీ కార్యకర్తలు గుంజీలు తీసి వినూత్నంగా నిరసన తెలిపారు. తమ డిమాండ్లు నెరవేర్చాలని ఉపముఖ్యమంత్రి రాజన్నదొరకు వినతిపత్రం ఇచ్చారు. తమ న్యాయమైన కోర్కెలు నెరవేరే వరకు సమ్మెను కొనసాగించాలని అంగన్వాడీల యూనియన్లు నిర్ణయించాయి. ధర్నా చౌక్‌లలో ఈనెల 17వ తేదీ ఉదయం 11 గంటల నుంచి నిరవధిక నిరాహార దీక్షలను చేపట్టాలని యూనియన్ల నేతలు పిలుపునిచ్చారు. 36 రోజుల నుంచి సమ్మెచేస్తున్నా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. తాడోపేడో తేల్చుకోవడానికి అంగన్వాడీలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఆరుసార్లు చర్చలు జరిగినా జీతాలు పెంచబోమంటూ ప్రభుత్వం మొండివైఖరి ప్రదర్శిస్తోందన్నారు.

అమెరికాలో ఇద్దరు తెలుగు విద్యార్థులు మృతి

- గదిలో గ్యాస్ లీక్ కావడంతో నిద్రలోనే దుర్మరణం
- ఒకరు పాలకొండ వాసి.. మరొకరు తెలంగాణ విద్యార్థి

పాలకొండ: అమెరికాలో విషాదం చోటుచేసుకుంది. ఉన్నత చదువుల కోసం 17 రోజుల క్రితమే అమెరికాకు వెళ్లిన పాలకొండ విద్యార్థితోపాటు తెలంగాణకు చెందిన మరో విద్యార్థి కూడా అక్కడ గ్యాస్ లీక్ కావడంతో నిద్రలోనే దుర్మరణం పాలయ్యారు. పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండకు చెందిన రాకోటి వెంకటరమణ, ఆదిలక్ష్మిల కుమారుడు రాకోటి సాయి నికేశ్ (21) తాడేపల్లి గూడెంలో బీటెక్ పూర్తిచేశారు. అమెరికాలోని హర్ట్‌ఫోర్డ్ సిటీలో సేక్రెడ్ హార్ట్ వర్సిటీలో మాస్టర్స్ చేసేందుకు 17 రోజుల క్రితమే అక్కడకు వెళ్లారు. అక్కడ మరో ఇద్దరు తెలుగువారితో కలిసి ఓ అపార్ట్‌మెంట్‌లో ఉంటూ.. చదువుకొంటున్నారు. ఈ క్రమంలో రూమ్‌లో ఉంటున్న గుంటూరు విద్యార్థి.. సోమవారం రాత్రి వేరే ఫ్రెండ్ రూమ్‌కు వెళ్లగా.. సాయినికేశ్, తెలంగాణలోని మహబూబ్‌నగర్‌కు చెందిన మరో విద్యార్థి కలిసి ఒక రూమ్‌లో నిద్రపోయారు. అయితే రూమ్‌లో లిక్విడ్ గ్యాస్ లీకవడంతో వారిద్దరూ అపస్మారక స్థితిలోకి చేరుకొన్నారు. మంగళవారం ఉదయం 10 గంటలకు గుంటూరుకు చెందిన విద్యార్థి రూమ్‌కు వచ్చి చూడగా ఇద్దరూ విగతజీవులుగా పడిఉన్నారు.

తాడేపల్లిలో రాహు కేతు పూజలు?

- ప్రత్యేకంగా వేద పండితుడి నియామకం కూడా...
- ముక్కంటి ఆలయ అధికారుల తీరుపై విమర్శలు

శ్రీకాళహస్తి జనవరి 16: తిరుపతి జిల్లాలో దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన శ్రీకాళహస్తీశ్వరాలయ అధికారులు తీసుకుంటున్న నిర్ణయాలు వివాదాస్పదంగా మారుతున్నాయి. తాజాగా గుంటూరు జిల్లా తాడేపల్లిలో రాహు కేతు పూజలు నిర్వహించేందుకు అధికారులు సన్నద్ధమవడంపై సర్వత్రా అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. రాహు కేతు పూజలకు ప్రసిద్ధి చెందిన శ్రీకాళహస్తి క్షేత్రంలో పరమశివుడు నవగ్రహాలను కవచంగా ధరించి ఉంటాడు. ఆయనను దర్శించుకుంటే గ్రహపీడలు తొలగిపోతాయని భక్తుల నమ్మకం. గ్రహణ సమయంలో అన్ని ఆలయాలను మూసివేసి, విడుపు తరువాత తిరిగి భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తారు. అయితే శ్రీకాళహస్తిలో మాత్రం అందుకు భిన్నంగా గ్రహణ కాలంలో ప్రత్యేక పూజలతో దర్శనం లభిస్తుంది. ముఖ్యంగా పాప గ్రహాలైన రాహు, కేతు, సర్పదోష నివారణ పూజలు జరిపించుకోవడానికి విదేశాల నుంచి సైతం భక్తులు ఇక్కడకు వస్తుంటారు. ఇప్పటివరకూ ముక్కంటి ఆలయ అర్చకులు ఇతర ప్రదేశాల్లో ఎక్కడా రాహు కేతు పూజలు జరిపించిన సందర్భాలు లేవు. ప్రస్తుతం ముక్కంటి ఆలయ ధర్మప్రచార రథం ద్వారా తాడేపల్లిలో ఈ నెల 17 నుంచి 21 వరకు శోభాయాత్ర నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. అందుకోసం కొంతమంది ఆలయ ఉద్యోగులకు ప్రత్యేక విధులు కేటాయించారు. ఇందులో భాగంగా 20న తాడేపల్లిలో రాహు కేతు పూజలు కూడా జరిపించనున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు. అందుకోసం ఏకంగా ఒక వేద పండితుడిని కూడా నియమించడం చర్చనీయాంశంగా మారింది. అయితే రాహు కేతు పూజలను ఆలయం ద్వారా నిర్వహించడం లేదని.. ఒక వేద పండితుడి సలహాలతో అధికార పార్టీ నేత ప్రైవేటుగా జరిపించుకుంటున్నారని ఆలయ అధికారులు వెల్లడించారు.

సుప్రీం తీర్పునకు వైసీపీ వక్ర భాష్యం: టీడీపీ

అమరావతి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): రాజకీయ ప్రయోజనాల కోసం వైసీపీ సుప్రీం కోర్టు తీర్పునకు కూడా వక్ర భాష్యం చెబుతోందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు మంగళవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. స్కిల్ కేసులో సుప్రీం కోర్టు న్యాయమూర్తులు వెలిబుచ్చిన అభిప్రాయాలను వక్రీకరించి మా పార్టీ అధినేత చంద్రబాబుపై వైసీపీ నేతలు విషం చిమ్ముతున్నారని ఆయన ధ్వజమెత్తారు. 'వైసీపీ దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతోంది. స్కిల్ కేసులో సుప్రీం కోర్టు న్యాయమూర్తులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసి దానిని చీఫ్ జస్టిస్‌కు నివేదించారు. ఈ కేసులో 17 ఏ సెక్షన్ వర్తింపుపై న్యాయమూర్తులు తమ అభిప్రాయం చెప్పారు. వారిచ్చిన తీర్పులు కేవలం 17ఏ సెక్షన్ వర్తింపునకు సంబంధించినవి మాత్రమే. కానీ జగన్ మీడియా దానిని వక్రీకరించి ప్రచారం చేస్తోంది. వైసీపీ తమకు అలవాటైన తప్పుడు ప్రచారాలకు దిగింది' అని అచ్చెన్నాయుడు విమర్శించారు. కాగా, చంద్రబాబుపై మోపిన కేసులకు సంబంధించి సుప్రీం కోర్టులో ప్రస్తుతానికి తమ పార్టీకి పాక్షిక విజయం లభించిందని, రాబోయే రోజుల్లో పూర్తి న్యాయం లభిస్తుందని మాజీ మంత్రి నక్కా ఆనందబాబు అన్నారు. చంద్రబాబు క్వాష్ పిటిషన్‌లో సుప్రీం తీర్పుపై వైసీపీ మంత్రులు చేసిన వ్యాఖ్యలపై టీడీపీ నేతలు మండిపడ్డారు. మంత్రులు, అంబటి రాంబాబు, గుడివాడ అమర్నాథ్‌ల వ్యాఖ్యలకు మాజీ మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఎన్ అమర్నాథ్‌రెడ్డి మంగళవారం ఎక్స్ వేదికగా కౌంటర్ ఇచ్చారు. 'అదెంటో మా సంబరాల (అంబటి) రాంబాబు అప్పుడప్పుడూ నిజాలే చెబుతాడు. 32 కేసులు, 16 నెలల జైలు జీవితం, పదేళ్ల బెయిల్.. ఇవన్నీ తప్పించులేక పోయారుగా..! అని సోమిరెడ్డి వ్యాఖ్యానించారు. జగన్ తనకు సీటు ఇస్తాడేమో అనే ఒక గుడ్డి నమ్మకంతో ప్రయత్నం చేస్తున్నాడు గుడివాడ అమర్నాథ్ అని ఎద్దేవా చేశారు.

ఇది రాజకీయ జోక్యమే..!: నారాయణ

హైదరాబాద్(ఆంధ్రజ్యోతి), నగరి, జనవరి 16: 'మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో 17ఏ పై సుప్రీంకోర్టు న్యాయమూర్తుల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేయడమంటే రాజకీయ జోక్యం చోటు చేసుకుందని అర్థం' అని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ వ్యాఖ్యానించారు. బీజేపీకి అనుకూలురైతే వాళ్లపై కేసులుండవని, బీజేపీకి వ్యతిరేకంగా ఉన్న రాజకీయ పార్టీలు, రాజకీయ నాయకులమీద ఎప్పుడూ కత్తులు వేలాడుతూనే ఉంటాయని అన్నారు. ఇందులో న్యాయవ్యవస్థ సైతం ఒక రకమైన గేమ్ ఆడుతుందని నారాయణ అభిప్రాయపడ్డారు. ఇది ఒక రకమైన రాజకీయ బెదిరింపు... ఒత్తిడి తప్ప మరోటి కాదని వ్యాఖ్యానించారు.

వచ్చే ఎన్నికల్లో బీజేపీకి వ్యతిరేకంగా పనిచేస్తాం: సీపీఎం

ఒంగోలు, జనవరి 16: వచ్చే ఎన్నికల్లో బీజేపీకి వ్యతిరేకంగా పనిచేస్తామని సీపీఎం స్పష్టం చేసింది. ఒంగోలులో విలేకరుల సమావేశంలో ఆ పార్టీ నేతలు మాట్లాడారు. 'అంగన్‌వాడీలు గత 36 రోజులుగా సమ్మె చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోకుండా ఎస్మాను ప్రయోగించడం దుర్మార్గం. ఇప్పటికైనా సానుకూల నిర్ణయం తీసుకోనిపక్షంలో తగినమూల్యం చెల్లించక తప్పదు' అని సీపీఎం హెచ్చరించింది.

17ఏ పై చెరోమాట!

(మొదటి పేజీ తరువాయి)

న్యాయమూర్తులు ఏకాభిప్రాయానికి రాలేకపోయారు. చంద్రబాబుపై దాఖలైన కేసుకు సెక్షన్ 17(ఏ)ను అన్వయించడంపై వేర్వేరుగా తీర్పులు వెలువరించారు.

17ఏ వర్తిస్తుంది, కేసు చెల్లదు: జస్టిస్ బోస్

1988 అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 13(1)(సి), 13(1)డి, 13(2) కింద చంద్రబాబుపై చర్యలు తీసుకోవడం సరైంది కాదని జస్టిస్ అనిరుద్ధ బోస్ స్పష్టం చేశారు. సవరించిన చట్టంలోని 17ఏ సెక్షన్ ప్రకారం 'పబ్లిక్ సర్వెంట్లపై కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించేందుకు సంబంధిత 'అథారిటీ' అనుమతి అవసరం' అని తెలిపారు. అలా అనుమతి లేకుండా విచారణ చేపడితే... అది అక్రమమే అవుతుందన్నారు. అదే సమయంలో... ఇప్పుడైనా రాష్ట్ర ప్రభుత్వం అనుమతి తీసుకోవచ్చునని అభిప్రాయపడ్డారు.

17ఏ వర్తించదు: జస్టిస్ బేలా త్రివేది

స్కిల్ డెవలప్‌మెంట్ అంశంలో చంద్రబాబుపై కేసు నమోదుకు 17ఏ సెక్షన్ వర్తించదని జస్టిస్ బేలా త్రివేది తన తీర్పులో పేర్కొన్నారు. 17ఏ సెక్షన్ అమలులోకి వచ్చిన తర్వాత చోటు చేసుకున్న నేరాలకు మాత్రమే ఇది వర్తిస్తుందని, అంతకు ముందు జరిగిన వాటికి (రెట్రాస్పెక్టివ్) కాదని, చట్టం ఉద్దేశం అదేనని అభిప్రాయపడ్డారు. అవినీతి నిరోధక చట్టానికి 2019లో సవరణలు జరిగిన విషయాన్ని గుర్తు చేశారు. 17ఏ సెక్షన్‌ను పాత కేసులకు కూడా వర్తింపచేస్తే పెండింగ్‌లో ఉన్న ఎన్నో దర్యాప్తులకు నష్టం జరుగుతుందని ఆమె చెప్పారు. అలాగే.. ఐపీసీలోని ఇతర సెక్షన్ల కింద కూడా కేసు నమోదైనట్లయితే, కేవలం 17ఏ కింద అనుమతి తీసుకోనంత మాత్రాన కేసు కొట్టివేయడం కుదరదని తెలిపారు. ఈ కేసులో చంద్రబాబు తరఫున హరీష్ సాల్వే, సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపించారు. అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 17ఏ ప్రకారం పోలీసులు సంబంధిత అథారిటీ అనుమతి లేకుండా చంద్రబాబును నిందితుడిగా చేర్చడం సరైంది కాదని తెలిపారు. అయితే... అవినీతి నిరోధక చట్టానికి 2018లో జరిగిన సవరణలో సెక్షన్ 17ఏ చేర్చారని... స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్ అంతకుముందే చోటు చేసుకుందని ఏపీ ప్రభుత్వం తరఫున ముకుల్ రోహత్గీ వాదించారు. అందువల్ల ఈ కేసుకు 17ఏ వర్తించదని తెలిపారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ఇద్దరిలో ఒకరు చంద్రబాబు తరపు న్యాయవాది వాదనను సమర్థించగా, మరొకరు రాష్ట్ర ప్రభుత్వం తరపు న్యాయవాది వాదనను అంగీకరించడం గమనార్హం.

విషయం సీజే ముందుకు...

"ఈ సెక్షన్‌కు అన్వయం, పిటిషనర్ (చంద్రబాబు)కు దీనిని వర్తింపచేయడంపై మా మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనందున... దీనిపై తగిన నిర్ణయం తీసుకోవాలని ఈ అంశాన్ని ప్రధాన న్యాయమూర్తికి నివేదిస్తున్నాం" అని జస్టిస్ అనిరుద్ధ బోస్ తెలిపారు. ఈ కేసులో చంద్రబాబుకు 52 రోజుల రిమాండ్ అనంతరం బెయిల్ లభించిన సంగతి తెలిసిందే. రిమాండ్ ఆర్డర్ జోలికి పోకూడదని న్యాయమూర్తులు నిర్ణయించారు. అవినీతి నిరోధక చట్టంతో పాటు ఐపీసీలోని సెక్షన్ల కింద కూడా కేసు నమోదు చేసినందున... రిమాండ్ ఆర్డర్‌లో లోపాలు లేవని వారు భావించారు. అవినీతి నిరోధక చట్టంలోని 17ఏ సెక్షన్‌కు భాష్యం చెప్పడంలో ఇరువురు న్యాయమూర్తుల మధ్య భిన్నాభిప్రాయం వ్యక్తం కావడంతో... ఈ అంశాన్ని విస్తృత ధర్మాసనానికి నివేదించే అవకాశముంది. దీంతో మొత్తం కేసు విచారణ మళ్లీ మొదటి నుంచి జరగవచ్చని, అది తేలేందుకు సమయం పట్టవచ్చునని న్యాయ నిపుణులు భావిస్తున్నారు. బుధవారం జరగాల్సిన ఫైబర్ నెట్ కేసు విచారణపైనా ఈ తీర్పు ప్రభావం చూపించవచ్చునని అభిప్రాయపడుతున్నారు.

ఇప్పటికైతే ఇబ్బందుల్లేవు!

- ఇంకొంత కాలం యథాతథ స్థితే!!
- ఎన్నికలు ముగిసేదాకా ఇంతే?
- బాబు కేసులపై టీడీపీ నేతల మనోగతం
- నేటి ఫైబర్‌నెట్ తీర్పుపై ఉత్కంఠ

అమరావతి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): తమ అధినేత చంద్రబాబుపై జగన్ ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులకు సంబంధించి ఇంకొంత కాలం యథాతథ స్థితే కొనసాగుతుందని టీడీపీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఈ కేసుల విషయంలో ఇప్పటికిప్పుడు వచ్చిన సమస్యలు ఏమీ లేవని, ఎన్నికలు ముగిసేవరకూ ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉందని అంటున్నాయి. చంద్రబాబుపై ఈ ప్రభుత్వం మొత్తం 5 కేసులు నమోదు చేసింది. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అరెస్టు చేసింది. కొంతకాలం జైల్లో ఉన్న తర్వాత ఆయనకు ఆ కేసులో బెయిల్ లభించింది. మరో మూడు కేసుల్లో హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరుచేసింది. ఫైబర్ నెట్ కేసులోముందస్తు బెయిల్ దరఖాస్తును హైకోర్టు తిరస్కరించింది. దానిపై చంద్రబాబు తరఫు న్యాయవాదులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. 17ఏ సెక్షన్ వర్తింపుపై తీర్పు వెలువడేవరకూ ఆయన్ను అరెస్టు చేయొద్దని అప్పట్లో సుప్రీం ఆదేశించింది. మంగళవారం తీర్పు వెలువడినా అందులో ఏమీ తేలలేదు. ఇద్దరు న్యాయమూర్తులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేయడంతో దానిని మరో ధర్మాసనానికి పంపాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఏ ధర్మాసనం ముందుకు పంపాలో ప్రధాన న్యాయమూర్తి నిర్ణయిస్తారు. ఆ ధర్మాసనం ముందు మరోసారి వాదనలు జరగాల్సి ఉంటుంది. ఆ తర్వాత తుది నిర్ణయం వెలువడుతుంది. దీనికి కొన్ని నెలలు పట్టే అవకాశం ఉంది. ఫైబర్ నెట్ కేసులో బెయిల్ కోసం చంద్రబాబు దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీం కోర్టు బుధవారం నిర్ణయం వెలువరించే అవకాశం ఉంది. 17ఏ సెక్షన్ వర్తింపుపై పిటిషన్ మరో బెంచ్ ముందుకు వెళ్తున్నందున.. అప్పటివరకూ అరెస్టు వద్దని ఆదేశాలిస్తారా.. లేక ముందస్తు బెయిల్ ఇస్తారా లేక మరేదైనా ఆదేశాలు వస్తాయా అన్నది ఉత్కంఠగా మారింది. ఈ కేసు తప్ప మిగిలిన కేసుల్లో ఇప్పటికే బెయిల్ వచ్చినందువల్ల ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకూ చంద్రబాబు తన రాజకీయ కార్యకలాపాలు కొనసాగించడానికి ఆటంకాలు ఉండవని టీడీపీ వర్గాలు భావిస్తున్నాయి. ఈ కేసులపై మాట్లాడవద్దని మినహా మరే ఆంక్షలూ కోర్టులు విధించలేదు. 17ఏ వర్తింపుపై తీర్పు వెలువడడం అంత తేలికైన వ్యవహారం కాదని టీడీపీ కేసులు చూస్తున్న న్యాయకోవిదులు చెబుతూనే ఉన్నారు. దీనిపై సుప్రీం ఇచ్చే తీర్పు.. దేశవ్యాప్తంగా అన్నిరాష్ట్రాల్లో ప్రభావం చూపే అవకాశం ఉన్నందున మరింత లోతుగా పరిశీలన జరిపిన తర్వాతే కోర్టు నిర్ణయం వెలువడే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు. ఆ అభిప్రాయానికి బలం చేకూరుస్తూ విస్తృత ధర్మాసనానికి స్కిల్ కేసు బదిలీ కాబోతోంది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు మంగళవారం వెలువరించిన భిన్నాభిప్రాయాలు రాజకీయంగా రాష్ట్రంలో చూపే ప్రభావంపై రాజకీయ వర్గాల్లో తర్జనభర్జనలు జరుగుతున్నాయి. ఎవరికీ అనుకూలం.. ఎవరికీ వ్యతిరేకం కాకపోవడంతో ప్రధాన రాజకీయ పక్షాలు వైసీపీ, టీడీపీ కొన్నిరోజులు పరస్పరం విమర్శలు చేసుకునే అవకాశం ఉంది. అలాగే ఈ తీర్పు బీజేపీ భావి రాజకీయ సంబంధాలను ఎలా ప్రభావితం చేసే అవకాశముందన్నది కూడా రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. టీడీపీ-జనసేన కూటమితో రాష్ట్రంలో బీజేపీకి పొత్తు కుదిరే అవకాశముందని కొన్నివర్గాలు మొదట్లో అంచనా వేశాయి. ఇప్పుడా వాదనకు బలం తగ్గినట్లు కనిపిస్తోంది. ఏం జరుగుతుందో కొన్నిరోజులు వేచిచూడాల్సి ఉంటుందని ఈ వర్గాలు చెబుతున్నాయి.

మా ఊర్లో జగనన్న శూన్యం..!

- గ్రామంలో ఒక్క రూపాయి పనైనా చేసినాడా..?
- జగనన్న ఇల్లూ లేదు.. సెంటు స్థలమూ ఇవ్వలేదు
- శ్మశానాల్లో కాపురం చేయమన్నట్టుంది జగన్ అభివృద్ధి
- ఈ వైసీపీ ఉంటుందో.. ఊడిపోతుందో అర్థం కావట్లేదు
- ఐప్యాక్ టీం సర్వేలో వైసీపీ నేత రాజన్న ఘాటు సమాధానం

కర్నూలు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): 'జగన్ ప్రభుత్వం వచ్చాక మా ఊర్లో ఒక్క రూపాయి అభివృద్ధి కూడా జరగలేదు.. మీటరు సీసీ రోడ్డూ వేయలేదప్పా.. జగనన్న ఇల్లు లేదు.. సెంటు స్థలం కూడా ఇవ్వలేదు. నేను బటన్ నొక్కుతున్నా అంటున్నాడు..! ఎవరికి నొక్కుతున్నాడు.. ఎవరు అడిగారు డబ్బులు..? రేపు ఎన్ని ఓట్లు వేయించుకుంటాడో ఈ జగన్మోహన్‌రెడ్డి.. ఈ వైసీపీ ఉంటుందో.. ఊడిపోతుందో..? అర్థం కావడం లేదు...' ఐప్యాక్ టీం సర్వే సందర్భంగా.. కర్నూలు జిల్లా పాణ్యం నియోజకవర్గం ఓర్వకల్లు మండలం పుడిచెర్ల గ్రామానికి చెందిన వైసీపీ సీనియర్ నాయకుడు రాజన్న అన్న మాటలివి. ఇటీవల ప్రజల నుంచి సర్వే పూర్తి చేసిన ఐప్యాక్ టీం తాజాగా వైసీపీ నేతలతో నేరుగా మాట్లాడుతోంది. అందులో భాగంగా కర్నూలు జిల్లాలో ఓ సంభాషణ ఆడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఐప్యాక్ టీం మోహన్, వైసీపీ నేత రాజన్న మధ్య ఫోన్ సంభాషణ సాగిందిలా...

ఐప్యాక్ మోహన్: నమస్తే సార్.. రాజన్న గారా..? నా పేరు మోహన్.. ఐప్యాక్ టీం నుంచి ఫోన్ చేస్తున్నాను

రాజన్న: అవును రాజన్ననే.. చెప్పండప్పా..

ఐప్యాక్ మోహన్: అభివృద్ధి కార్యక్రమాలు చెప్పినవి చెప్పినట్టు చేశామా..? ఏమైనా పెండింగ్‌లో ఉన్నాయా?

రాజన్న: అభివృద్ధి అంటే.. మా ఊర్లో జరిగిన అభివృద్ధి ఇండియాలో ఎక్కడా జరిగి ఉండదప్పా (హేళనగా)... జగనన్న కాలనీలో ఏ ఒక్కరికీ ఒక్క షెడ్డు కూడా ఇవ్వలేదు. ఎమ్మెల్యే గెలిచినప్పటి నుంచి ఓ గంప కంకర.. సిమెంట్ రోడ్డు వేయలేదు.

ఐప్యాక్ మోహన్: ఏ అభివృద్ధీ జరగలేదా..?

రాజన్న: ఏడిది లేదప్పా.. అభివృద్ధి అనేది అంతా శూన్యం..! రూపాయి పని కూడా జరగలే..

ఐప్యాక్ మోహన్: ఎందుకని సార్...?

రాజన్న: ఎందుకంటే.. ఏమని చెప్పాలప్పా! జగనన్న ఫండ్స్ ఒక్క రూపాయి ఇవ్వలేదు. జగనన్న పార్టీలో ఉండామంటే అట్లే ఉన్నాం.. ఈదుకుంటూ సస్తున్నాం.. సొంత ఖర్చులు పెట్టుకొని.. అభివృద్ధి అనేది చెప్పకూడదు ఈ ఊర్లా!

ఐప్యాక్ మోహన్: గడప గడప కార్యక్రమాలు కంప్లీట్ చేశారా..?

రాజన్న: పార్టీలో ఉన్నాం కాబట్టి చేయకతప్పదు కదా..?

ఐప్యాక్ మోహన్: గడప గడప ఫండ్స్ వస్తాయి కదా.. వాటితో కూడా ఏమీ చేయలేదా?

రాజన్న: రూపాయి పని చేయలేదు.. గడప గడప అయిపోయి ఎన్నో దినాలైంది.. ఈపొద్దుకి ఒక రూపాయి పని లేదు.. జగన్ ఏమిస్తాడో ఏమో గాని మాకేమి తెలియదు. మా ఊరికైతే ఒక్క రూపాయి ఫండ్స్ రాలేదు. అన్ని ఊళ్లలో అయితే జగనన్న కాలనీలు అంటారు..? మా ఊర్లో జగనన్న కాలనీ లేదు.. జగనన్న శూన్యం తప్ప అభివృద్ధి ఏదీలేదు... మా పుడిచెర్లకు ఏదీ లేదు..?

ఐప్యాక్ మోహన్: మిమ్మల్ని చిన్న చూపు చూస్తున్నారని మీ కులంలో ఉంటుందా?

రాజన్న: మేం బోయోళ్లం కాబట్టి మేం తక్కువ అనేకాటికి ఉంది ఈ పార్టీలో.. నియోజకవర్గం (పాణ్యం) అంతా ఇదే కంప ఉంది. మొన్న బలమైన లీడర్లు టీడీపీలోకి పోయినారు. సుధాకర్‌రెడ్డి, కేవీ సుబ్బారెడ్డి (కేవీ సుబ్బారెడ్డి విద్యా సంస్థల అధినేత, ఆయన కుటుంబం), కర్నూలులో కార్పొరేటర్లు పోయారు. వారం పది రోజులు ఇంకా దండిగా పోయెవాళ్లుండారు.

ఐప్యాక్ మోహన్: ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, ఇండిపెండెంట్‌గా చేసిన వ్యక్తులమధ్య వర్గ పోరా..?

రాజన్న: మేం మొదటి నుంచీ భూపాల్‌రెడ్డి వెంటే ఉన్నాం. వైసీపీలోనే రెండు మూడు వర్గాలున్నాయి. ఎమ్మెల్యేను కలసి రెండు మూడు వర్గాలు వద్దు రెడ్డీ.. రేపొద్దున ఇబ్బందులుంటాయి.. వీళ్లు చేస్తారని వాళ్లు.. వాళ్లు చేస్తారని వీళ్లు అని చెప్పాను. భూపాల్‌రెడ్డినే విలేకరులు అడిగితే ఇద్దరూ నా మనుషులే కాదా అని ఆయనే చెప్పాడు. ఏమో అర్థం కావడం లేదు. ఈ వైఎస్‌ఆర్ పార్టీ ఉంటుందా..? ఊడిపోతుందా..? అని.

ఐప్యాక్ మోహన్: వచ్చే ఎన్నికల్లో మెజార్టీ రాదంటారా..?

రాజన్న: ఒక్క రూపాయి పనికూడా చేయలేదయ్యా.. ఏ పనీ చేయలేదని నీవు ఎమ్మెల్యేను అడిగినా బాధలేదు.. మెజార్టీ వస్తుందో.. ఊడిపోతుందో అర్థం కాకుంది.. జగన్ మళ్లీ గెలిస్తే ఊర్లు వదిలి గట్టున ఉండమంటాడేమో..?రాష్ట్రం విడిచి వేరే రాష్ట్రానికి పొమ్మంటాడేమో..? కొళాయి విరిగిపోయిందంటే కొత్తది వేయించేందుకు లేదు.. ఇదా అభివృద్ధి. శ్మశానంలో కాపురం చేయమన్నట్టుంది ఆయన అభివృద్ధి. మహానుభావుడు చల్లగా నూరేళ్లు బతకనీ.. ఇలాంటి నాయకుడు మనకు దొరకడు.. ఉంటా..!



వైసీపీ మూకల దాడిలో గాయపడిన టీడీపీ నాయకుడు అక్బర్‌బాషా

టీడీపీ నేతలపై వైసీపీ దాడి

- పల్నాడు జిల్లా వినుకొండలో దారుణం

వినుకొండ టౌన్, జనవరి 16: పాతకక్షల నేపథ్యంలో పథకం ప్రకారం వైసీపీ నాయకులు కాపుకాసి టీడీపీ నాయకులపై దాడి చేశారు. పల్నాడు జిల్లా వినుకొండలో మంగళవారం ఈ దారుణం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నరసరావుపేట వరవకట్టకు చెందిన టీడీపీ నాయకుడు ఇమ్రాన్‌ఖాన్‌కు, వినుకొండకు చెందిన కొందరు వైసీపీ నాయకుల మధ్య ఆరు నెలల క్రితం వినుకొండలో ఘర్షణ జరిగింది. ఇరువర్గాలపై కేసులు నమోదైన నేపథ్యంలో ఇమ్రాన్‌ఖాన్‌ను మంగళవారం రాజీ చర్చలకు పిలిపించారు. వినుకొండ పెద్దమసీదు వద్దకు చేరుకున్న ఇమ్రాన్‌ఖాన్‌పై వైసీపీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అనుచరుడు పీఎస్ ఖాన్ మరికొందరితో కలిసి దాడి చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి షమీమ్, వినుకొండ పట్టణ అధ్యక్షుడు ఆయూబ్‌ఖాన్, అక్బర్‌బాషా, అలీ, కరిముల్లా, బాజీ తదితరులు వచ్చి ఇమ్రాన్‌ఖాన్‌ను ఆస్పత్రికి తరలిస్తుండగా, పథకం ప్రకారం అక్కడ కాపుకాసిన వైసీపీ నాయకులు వారిపై కర్రలు, రాళ్లతో దాడులకు తెగబడ్డారు. ఈ దాడిలో షమీమ్, అక్బర్‌బాషాలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అనుచరులు గంజాయి మత్తులో కర్రలు, రాళ్లతో తమపై దాడి చేశారని టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఆయూబ్‌ఖాన్ ఆరోపించారు. పోలీసులు టీడీపీ వారిని చెదరగొడుతూ, వైసీపీ కార్యకర్తలకు అండగా నిలిచారని వాపోయారు. ముస్లింలు పెద్దసంఖ్యలో ఆస్పత్రికి చేరుకొని షమీమ్, అక్బర్‌బాషా తదితరులను పరామర్శించారు. ఈ దాడిని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తీవ్రంగా ఖండించారు.

పట్నంలో అశాంతి

(మొదటి పేజీ తరువాయి)

చెల్లిస్తేనే ఎమ్మెల్యేను కలవనిస్తారు. లేకుంటే ఎవరైనా వెనుదిరగాల్సిందే. ఉత్తరాంధ్రలో ఓ మహిళా ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో ఇదీ పరిస్థితి.

సొంత పార్టీలోనే వ్యతిరేకత



నియోజకవర్గంలో సొంత పార్టీలోనే వర్గ పోరు తీవ్రంగా ఉంది. ఆమె ఇవేవీ పట్టనట్లుగా ఉంటారు. ముఖ్యమైన విషయాల్లో నిర్ణయాలు తీసుకోవాల్సిన సమయంలోనూ ఇదే వైఖరి. ప్రతి అంశంలో పీఏల జోక్యం ఉంటోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాల్లో పాల్గొన్నప్పుడు సొంత పార్టీ నేతల నుంచే నిరసనలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు ఉండగానే ఓ కార్యక్రమం నుంచి వెనుదిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందంటే.. ఇక్కడ ఎమ్మెల్యేపై ఎంతటి వ్యతిరేకత ఉందో అర్థమవుతుంది. అటు ప్రజలకు, ఇటు సొంత పార్టీ కార్యకర్తలు, నాయకులకు అందుబాటులో లేకపోవడంతో తీవ్ర వ్యతిరేకత మూటగట్టుకున్నారు. వచ్చే ఎన్నికల్లో అభ్యర్థిని మార్చాలని, స్థానికులకే టికెట్ ఇవ్వాలంటూ ఏడాది నుంచి తిరుగుబాట్లు కూడా మొదలయ్యాయి. పైగా ఈ నియోజకవర్గంలో వంశధార నిర్వాసితులు సైతం తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారు.

పీఏల వసూళ్లలో వాటాలు

రెండేళ్ల క్రితం అనారోగ్యంతో ఎమ్మెల్యే భర్త మృతి చెందిన తర్వాత నియోజకవర్గంలో పీఏల జోక్యం మరింత పెరిగిపోయింది. వారి అక్రమాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. వారి అక్రమ సంపాదనలో ఎమ్మెల్యేకూ ముడుపులు అందుతున్నట్టు ఆరోపణలున్నాయి. నియోజకవర్గ అభివృద్ధి, ఇతర పనులు చేసేందుకు వైసీపీ కార్యకర్తలు, నాయకులకు ఎమ్మెల్యే సిఫారసు లేఖ ఇవ్వాలన్నా, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు, ఇతర పనులకు సంబంధించి ప్రజలకు సిఫారసు లేఖలు ఇవ్వాలన్నా పీఏలకు ముడుపులు ఇవ్వాల్సిందే. ఫలానా పనికి ఫలానా రేటు కట్టి పీఏలు ముక్కుపిండి వసూలు చేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. సొమ్మిలిచ్చి సిఫారసు లేఖలు తీసుకున్నామని కొందరు చెబుతున్నారు. ప్రజలకు, పార్టీ కేడర్‌కు ఎమ్మెల్యే దూరంగా ఉండటంతో పీఏల హవా సాగుతోంది. వారి అవినీతి పెరిగిపోయిందని తీవ్ర ఆరోపణలు వస్తున్నా, నేరుగా సీఎంవోకు ఫిర్యాదు వెళ్లినా వారిని మార్చకుండా వెనకేసుకొస్తున్నట్టు తెలుస్తోంది.

ఇసుకలో కాసుల పంట..

వంశధార నది నుంచి ఇసుకను ఇష్టానుసారంగా తవ్వి ఒడిసా రాష్ట్రానికి తరలిస్తున్నారు. ఇసుకాసురులకు ఎమ్మెల్యే పరోక్షంగా సహకరిస్తూ భారీగా ముడుపులు అందుకుంటున్నారు. గతంలో ఒడిసాలో కాశీనగర్ నుంచి పర్లాకిమిడి, గజపతి, గంజాం జిల్లాలకు ఇసుక సరఫరా అయ్యేది. అయితే రెండేళ్ల నుంచీ పర్లాకిమిడిలో ఒడిసా మైనింగ్ కార్యాలయం ఏర్పాటైంది. దీంతో అక్కడ అక్రమ ఇసుక రవాణా కట్టడైంది. దీంతో ఆ రాష్ట్ర ఇసుక వ్యాపారుల కన్ను సరిహద్దులో ఉన్న ఈ నియోజకవర్గంపై పడింది. ఇక్కడి ఇసుక వనరులను దోచుకునేందుకు ఎమ్మెల్యే పీఏలతో డీల్ కుదుర్చుకున్నట్టు తెలుస్తోంది. ఎమ్మెల్యే కూడా అడ్డుచెప్పకపోవడంతో వంశధార నదీ తీరం నుంచి ఇసుకను లారీలలో ఒడిసాకు తరలిస్తున్నారు.

పనులన్నీ బంధువర్గానికే..

నియోజకవర్గంలో కాంట్రాక్టులన్నీ ఎమ్మెల్యే బంధువర్గానికే దక్కుతున్నాయి. ఎమ్మెల్యేగా గెలిచాక తొలి రెండేళ్లు పలు అభివృద్ధి పనులను బినామీ పేర్లతో మంజూరు చేయించుకుని, కాంట్రాక్టులను తన బంధువులకే అప్పగించారని ఆరోపణలు వచ్చాయి. పనుల్లో నాణ్యత లేకపోయినా ప్రత్యేక శ్రద్ధ తీసుకుని మరీ బిల్లులను మంజూరు చేయించినట్టు తెలుస్తోంది. ఐటీడీఏ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో రోడ్డు కాంట్రాక్టు పనులు ఎమ్మెల్యే బంధువర్గమే చేసింది. దీనిపై సొంత పార్టీ వారే బహిరంగంగానే ఆరోపణలు చేస్తున్నారు. గిరిజన ప్రాంతం గల ఓ మండలంలో చేపట్టిన రోడ్డు పనుల్లో అవినీతి జరిగినట్లు అప్పట్లో దుమారం రేగింది. పలు కాంట్రాక్టులను ఎవరు ఎక్కువ కమీషన్ ఇస్తారో వారికే కేటాయించేలా ఎమ్మెల్యేను ఒప్పించి పీఏలు మామూళ్లు దండుకున్నట్టు ఆరోపణలు వచ్చాయి.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

ప్రయాణికులకు దూరంగా..!

- ఇతరుల వాహనాలతో ఆటోనగర్ బస్టాండ్‌ఫుల్
- కార్గో బుకింగ్‌కు వచ్చిన వాహనాలతో ఇబ్బందులు
- త్వరలో ఇబ్బందులు తొలిగిస్తాం: డీఎం

ఆటోనగర్ (పెనమలూరు): నిత్య వందలాది బస్సుల రాకపోకలతో బిజీగా ఉండే ప్రతిష్టాత్మక ఆటోనగర్ బస్ టెర్మినల్ బస్టాండు వసతుల లేమితో క్రమేణా ప్రయాణికులకు దూరంగా జరుగుతోంది. బస్టాండులో ఉండాల్సిన కనీస వసతులు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. పైగా వందలాది మోటారు వాహనాలు టెర్మినల్‌లోనే పార్కింగ్ చేస్తుండడంతో బస్టాండులో బస్సులు ఎక్కాల్సిన ప్రయాణికులు పలు ఇబ్బందుల పాలవుతున్నారు. పార్సిల్ బుకింగ్‌కు వచ్చిన కష్టమర్ల వాహనాలకు పార్కింగ్‌కు ప్రత్యేక స్థలం లేకపోవడంతో బస్టాండు నిండిపోయి వచ్చే పోయే వాహనాలకు తరచూ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అధికారుల స్పందించి ప్రయాణికుల ఇబ్బందులను తొలగించి బస్టాండును పూర్తిస్థాయిలో ప్రయాణికులకు అందుబాటులో ఉంచాలని స్థానికులు సుంకాని వెంకట త్రినాథ్ కోరుతున్నారు.

ప్రయాణికుల ఇబ్బందులు తొలగిస్తాం: డిపో మేనేజర్

కార్గో బుకింగు కోసం వచ్చే కష్టమర్ల వాహనాలు బస్టాండులోనే పార్కింగ్ చేయడంతో ఇబ్బందులు తలెత్తుత్తున్నట్టు తన దృష్టికి వచ్చిందని, ప్రయాణికులకు మంచినీటి సౌకర్యంతో పాటు వాష్‌రూంలను త్వరలోనే ఏర్పాటు చేస్తామని డిపో మేనేజరు ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

18, 19న దుర్గగుడిలో హుండీల లెక్కింపు

వన్‌టౌన్, జనవరి 16: దుర్గగుడిలో ఈ నెల 18,19న భక్తులు హుండీల ద్వారా సమర్పించుకున్న కానుకలను లెక్కించనున్నారు. దుర్గగుడిలో ఈ నెల 3నుంచి 7వరకు భవానీ దీక్షల విరమణ జరిగింది. ఈ సందర్భంగా భవానీ, సాధారణ భక్తులు పెద్ద ఎత్తున వచ్చి అమ్మవారిని దర్శించుకుని కానుకలు సమర్పించారు. ప్రస్తుతం కానుకల మూటలను అధికారులు స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచారు. ఈ నెల 18, 19న మహామండపం 6వ అంతస్తులో ఈవో కేఎస్ రామారావు పర్యవేక్షణలో ఉద్యోగులు, సేవకులు, పర్యవేక్షణ సిబ్బంది ఆధ్వర్యంలో లెక్కించనున్నారు.



దాతలకు దుర్గమ్మ చిత్రపటం ఇస్తున్న ఈవో రామారావు

నిత్యాన్నదానానికి రూ.1,11,207 విరాళం..

నగరానికి చెందిన ఏపూరి బిందుప్రియ, ఆమె కుటుంబ సభ్యులు ఆలయానికి విచ్చేసి ఈవో రామారావుకు నిత్యాన్నదానానికి రూ.1,11,207 విరాళం అందజేశారు. అమ్మవారి దర్శనానంతరం దాతకు ప్రసాదం, శేషవస్త్రం, ఆశీస్సులు అందజేశారు.

టీడీపీలో చేరాలని బొప్పనకు ఆహ్వానం

వన్‌టౌన్, జనవరి 16: గరంలోని వైసీపీ అర్బన్ అధ్యక్షుడు బొప్పన భవకుమార్‌ను టీడీపీలోకి చేరాలని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ఆహ్వానించారు. మంగళవారం భవకుమార్ నివాసానికి గద్దె వెళ్లారు. ఇటీవల భవకుమార్ పార్టీ మారతారన్న ప్రచారం జరగడంతో తాజాగా గద్దె రామ్మోహన్ ఆయన నివాసానికి వెళ్లడం పార్టీలోకి రమ్మని ఆహ్వానించడం చర్చనీయాంశమైంది. కాగా వంగవీటి రాధాకృష్ణ కూడా ఇటీవల బొప్పన భవకుమార్‌ను కలిశారు.

శిథిలావస్థలో ఇందాద్‌ఘర్

- నెలకు రూ.ఐదున్నర లక్షల అద్దెలు వస్తున్నా మరమ్మతులు లేవు
- అద్దె వ్యాపారుల ఆందోళన.. పర్యవేక్షణ కరువు



వన్‌టౌన్: నగరంలోని ప్రముఖ ఐకాన్లలో ఒకటైన కాశేశ్వరరావు మార్కెట్ పక్కనున్న ఇందాద్‌ఘర్ శిథిలావస్థకు చేరుకుంది. 1975లో నాటి ఎంపీ, మంత్రి కేఎల్ రావు అధ్యక్షతన ఏర్పడిన నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మక ఇందాద్‌ఘర్ నిర్మాణం జరిగింది. దీనికి నిర్మాణానికి కేఎల్ రావు స్వయంగా డిజైన్ రూపొందించారు. జీ+6 భవన నిర్మాణం పూర్తి కావడానికి సుమారు పదేళ్ల పట్టింది. నాటి పరిస్థితులు, అందుబాటులోని నిర్మాణ సామగ్రితో భవనాన్ని గట్టిగానే నిర్మించారు. ఇందాద్‌ఘర్ సరాయి మసీదు పేరిట ప్రాచుర్యంలో ఉంది. ఈ భవనంలో సెల్లార్ పార్కింగ్ కూడా ఉంది. గ్రౌండ్‌ఫ్లోర్‌లో షాపులు, మొదటి అంతస్తులో ఇండియన్ బ్యాంక్, మరికొన్ని షాపులు రెండు, మూడు అంతస్తుల్లో షాపులు, నాలుగో అంతస్తులో ఏపీ వక్ఫ్ బోర్డు కార్యాలయం, ఐదంతస్తులో కొంతభాగం వక్ఫ్‌బోర్డు వాడుకుంటుండగా, మిగతా భాగంలో దూదేకుల ఫెడరేషన్ కార్యాలయం, ఆరో అంతస్తులో కొంత భాగంలో వస్త్రవ్యాపారం ఉండగా, మిగతా అంతా ఖాళీగానే ఉంది. మొత్తంగా అన్ని షాపుల నుంచి నెలకు సుమారు రూ.5.50 లక్షల ఆదాయం వస్తుంది. కానీ మెయింటెనెన్స్ లేదు. భవన పర్యవేక్షణ, అద్దెలు వసూలుకు సంబంధించి ఒక మేనేజర్ ఉంటారు. అయితే ఆయన డిపార్ట్‌మెంట్ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. భవనంలో చాలా చోట్ల పగుళ్ల ఏర్పడ్డాయి. పెచ్చులు ఊడి పడుతున్నాయి. పక్కనున్న ఖాళీస్థలంలోకి పెచ్చులూడి పడుతున్న వైనం బహిరంగంగానే కనిపిస్తోంది. మరోవైపు భవనానికి ఇరువైపులా పెద్దఎత్తున హాకర్లు కిక్కిరిసి ఉంటారు. భవనానికి కుడివైపు ఖాళీస్థలం ఉండగా, పటమట వైపుషాపులు అనుకుని ఉంటాయి భవనానికి అనుసంధానంగా మసీదు ఉంది.

కేవలం నిర్వహణలోపం కారణంగానే భవనం శిథిలావస్థకు చేరుకుంటున్న పరిస్థితి ఉంది. భవనం ప్రత్యేకతత దృష్ట్యా అధికారులు వెంటనే దృష్టి సారించి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



లీజు వ్యవహారంలో అవకతవకలు

- ఐజీఎంసీ స్టేడియం షాపులకు యమా డిమాండ్
- వైసీపీ నేతలతో అధికారుల కుమ్మక్కు!
- తమ వారికి కట్టబెట్టేందుకు తూతూమంత్రపు ఆక్షన్

లబ్బీపేట: నగరం నడిబొడ్డున ఉన్న ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం కాంప్లెక్స్‌లో ఉన్న షాపులకు వీఎంసీ నిర్వహించిన లీజు వ్యవహారం లో అవకతవకలు జరిగినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈట్ స్ట్రీట్ ఫుడ్‌కోర్టు పెట్టాక ఈ దుకాణాల సముదాయానికి విరీతమైన డిమాండ్ ఏర్పడింది. ఖాళీగా ఉన్న షాపుల కోసం ఎంతోమంది ఎదురుచూస్తున్నా అధికారులు మాత్రం వాటిని తమవారికి కట్టబెట్టిందుకు తుతూమంత్రపు లీజు వ్యవహారాన్ని నడిపారనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ షాపుల ఆక్షన్ కోసం ఎదురుచూస్తున్న కొందరు తమకు సమాచారం లేకుండానే ఆక్షన్ నిర్వహించారని దానిపై నిజాలు నిగ్గుతేల్చాలని స్పందనలో ఫిర్యాదు చేశారు. షాపులకున్న డిమాండ్ దృష్ట్యా భారీగా ఆదాయం వచ్చే అవకాశం ఉన్నా అధికారులు, కొందరు వైసీపీ నేతలు కుమ్మక్కు. వ్యవహారంతో వీఎంసీకి భారీగా ఆదాయానికి గండి పడిందని, రూ.లక్షలు కొందరి జేబుల్లోకి వెళ్లినట్టు ఆరోపణలున్నాయి. ఈ కుమ్మక్కు వ్యవహారంలో ఉన్న వైసీపీ నేతలు, అధికారులు ఎవరని తెలుసుకునేందుకు కొందరు ప్రయత్నిస్తున్నట్టు తెలిసింది. దీంతో కొందరు అధికారులు వారిని బుజ్జగించే ప్రయత్నాన్ని అధికార పార్టీ కార్పొరేటర్లకి అప్పజెప్పగా వారు తమ ప్రయత్నాలను ప్రారంభించినట్టు సమాచారం. లీజు వ్యవహారంలో నిర్ణయించిన మొత్తానికి ఆక్షన్‌లో షాపులు కేటాయించిన మొత్తాన్ని పరిశీలిస్తే ఇది పూర్తిగా అధికారులు, వైసీపీ నేతల చేతివాటంగా సులువుగానే అర్థమవుతుందని వారు ఆరోపిస్తున్నారు. నిర్ణయించిన మొత్తానికి అదనంగా కేవలం రూ.20 నుంచి రూ.30 వేలకు షాపులు కేటాయించడమే ఆశ్చర్యాన్ని కలిగిస్తుందని, సామాన్యులకు కూడా ఈ ప్రాంతంలో షాపులకు ఎంత డిమాండ్ ఉందో తెలుసని కానీ అధికారులకు ఎందుకు తెలియలేదనే ప్రశ్నలు వస్తున్నాయి. మున్సిపల్ కమినర్ విచారణ జరిపి నిజాలు నిగ్గు తేల్చాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

పూర్వీకులతో పండుగ జరుపుకోవడం
ఆనందంగా ఉంది

- హైకోర్టు జడ్జి మండవ (కనపర్తి) కిరణ్మయి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జనవరి 16: తాతగారి స్నేహితులు, పూర్వీకులతో కలిసి సంక్రాంతి పండుగ జరుపుకోవడం, బంధుమిత్రులను కలవడం ఆనందంగా ఉందని హైకోర్టు జడ్జి మండవ (కనపర్తి) కిరణ్మయి అన్నారు. ఓగిరాలలో మంగళవారం ఓగిరాల చారిటబుల్ ట్రస్ట్ నిర్వహించిన ఆత్మీయకలయికలో హైకోర్టు జడ్జి కిరణ్మయి తన కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. తల్లీ, సోదరీమణుల కుటుంబాలతో కలిసి వారి కుటుంబ సభ్యులైన బండి రాంబాబు, రేణుక ఇంటికి వచ్చిన హైకోర్టు జడ్జి కిరణ్మయి తండ్రి స్నేహితుడైన ఆలూరి అప్పారావును యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ తోబుట్టువులతో కలిసి గ్రామంలో తిరుగుతూ ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. సంప్రదాయ పిండివంటలతో ఏర్పాటు చేసిన విందులో గ్రామస్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. అనంతరం కిరణ్మయి, కృష్ణ దంపతులను ఘనంగా సత్కరించారు. ఆలూరి అప్పారావు, మేడికొండ రాయుడు, మేడికొండ రామకృష్ణ, చెరుకూరి రామకృష్ణ, ఆలూరి శ్రీనివాసరావు, కొండపావులూరి కృష్ణప్రసాద్, సర్పంచ్ కగ్గా పద్మావతి డేవిడ్ పాల్గొన్నారు.



హైకోర్టు జడ్జి మండవ కిరణ్మయి దంపతులను సత్కరిస్తున్న ఓగిరాల చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు మేడికొండ రామకృష్ణ, మేడకొండ రాయుడు, చెరుకూరి రామకృష్ణ, సర్పంచ్ కగ్గా పద్మావతి డేవిడ్









సంక్రాంతి సందర్భంగా ఈడుపుగల్లు, అంపాపురం పరిసర ప్రాంతాల్లో నిర్వహించిన కోడి పందేలను చూసేందుకు యువతులు, మహిళలు భారీగా తరలివచ్చారు. ఆయా బరుల్లో కోడిపందేలు నిర్వహిస్తుండగా చప్పట్లతో తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. కొంతమంది మహిళలు స్వయంగా పందేల్లో పాల్గొనడం విశేషం. పలు చోట్ల మహిళలు, యువతులు, చిన్నారులు అక్కడున్న కోళ్లను తమ చేతుల్లోకి తీసుకుని మురిసిపోతూ ఫొటోలకు ఫోజులిచ్చారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న హేతువాద సంఘనేతలు

త్రిపురనేని హేతువాద ఉద్యమం కొనసాగిస్తాం: వక్తలు

గవర్నర్‌పేట, జనవరి 16: హేతువాద ఉద్యమ వ్యాప్తిలో, మూఢ నమ్మకాల నిర్మూలనలో త్రిపురనేని రామస్వామి కృషి మరువలేనిదని పలువురు వక్తలు పేర్కొన్నారు. కవిరాజు త్రిపురనేని రామస్వామి జయంతిని పురస్కరించుకుని అభ్యుదయ రచయిత సంఘం (అరసం) ఆధ్వర్యంలో మంగళవారం తుమ్మలపల్లి వారి కళాక్షేత్రం ఆవరణలోని త్రిపురనేని విగ్రహం వద్ద నివాళి జరిగింది. రామస్వామి పోరాటాలకు సంబంధించిన వివరాలను తెలిపే పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రముఖ సాహితీవేత్త గోళ్ల నారాయణరావు, అరసం ప్రధాన కార్యదర్శి పరుచూరి అజయ్‌కుమార్, ఎక్స్‌రే సాహితీ సంస్థ కార్యదర్శి బోడి ఆంజనేయరాజు, హేతువాదులు మోతుకూరి అరుణ్‌కుమార్ డి. భాస్కరావు, ఎస్ రాఘవరావు, లంకె సాయికుమార్ పాల్గొన్నారు.




ఎంపికైన తైక్వాండో క్రీడాకారులతో అంకమ్మరావు

జాతీయ తైక్వాండోకు ఉమ్మడి కృష్ణా క్రీడాకారులు

విజయవాడ స్పోర్ట్సు, జనవరి 16: రాజస్థాన్‌లో ఈ నెల 19 నుంచి 21 వరకు జరిగే జాతీయస్థాయి జూనియర్స్, సీనియర్స్ తైక్వాండో చాంపియన్‌షిప్‌లో పాల్గొనే ఉమ్మడి కృష్ణా జిల్లా క్రీడాకారుల ఎంపిక చేపట్టినట్టు జిల్లా అసోసియేషన్ సెక్రటరీ ఎం.అంకమ్మరావు, శాప్ కోచ్ పి.గౌరీ శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్స్ బాలికల విభాగంలో ఎస్.పావని, వై.చంద్రిక, కె.దైవకుమారి, బాలుర విభాగంలో ఎం.యోనా, తాన్య శివబాలాజీ, సీనియర్ బాలుర విభాగంలో షేక్ ఛాన్ బాషా, పి.విక్టర్ ఆదిత్య, కె.కృష్ణవంశీ, పి.దుర్గాప్రసాద్, సీనియర్ బాలికల విభాగంలో ఎస్.సంజన ఎంపికయ్యారన్నారు.

వేదాద్రి ఈవోగా హేమలతాదేవికి పోస్టింగ్



వన్‌టౌన్, జనవరి 16: స్థానిక భ్రమరాంబ మల్లేశ్వరాలయం (పాత శివాలయం) ఈవోగా పనిచేస్తూ అనేక ఆర్థిక అవకతవకలకు పాల్పడినందుకు సస్పెండ్‌కు గురైన హేమలతాదేవికి తాజాగా పోస్టింగ్ ఇచ్చారు. వార్షిక ఆదాయం రూ.కోటి ఉన్న వేదాద్రిలో పోస్టింగ్ ఇవ్వడంపై చర్చకు దారితీసింది. ఆమె పాతశివాలయంలో ఈవోగా ఉంటూ ఎదుర్కొన్న ఆరోపణలపై విచారణ జరిగింది. ఈ విచారణలో ఆరోపణలన్నీ ప్రాథమికంగా రుజువు కావడంతో దేవదాయ కమిషనర్ ఆమెను సస్పెండ్ చేశారు. అయితే సమగ్ర విచారణకు దుర్గగుడి ఈవోగా పనిచేసి ప్రస్తుతం హెడ్ ఆఫీస్‌లో ఉన్న దర్భముళ్ల భ్రమరాంబను నియమించారు. అయితే హేమలతాదేవి తన అత్తకు, అమ్మకు ఆరోగ్యం బాలేదంటూ పెట్టుకున్న రిక్వెస్ట్ మేరకు ఆమెను ఉద్యోగంలో తిరిగి నియమించుకోవడానికి కమిషనర్ ఉత్తర్వులిచ్చారు. ప్రస్తుతం ఇన్‌చార్జి ఈవోగా పనిచేస్తున్న జగ్గయ్యపేట టెంపుల్ గ్రూప్ ఈవో జయప్రకాష్ బాబు సెలవుపై ఉండడంతో ఆమె ఇంకా వేదాద్రి దేవస్థానం ఈవో బాధ్యతలు చేపట్టలేదని తెలిసింది.

కాంగ్రెస్ కార్యాలయం వద్ద సంబరాలు



గవర్నర్‌పేట, జనవరి 16: గిడుగు రుద్రరాజును సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడిగా, వైఎస్ షర్మిలను ఏపీసీసీ అధ్యక్షురాలిగా నియమించడంపై కాంగ్రెస్ రాష్ట్ర కార్యాలయం ఆంధ్రరత్న భవన్ వద్ద మంగళవారం కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ, సిటీ కాంగ్రెస్ ఆధ్వర్యంలో టపాసులు కాల్చి, మిఠాయిలు పంచుతూ నినాదాలు చేశారు. సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు నరహరిశెట్టి నరసింహారావు మాట్లాడుతూ గిడుగు రుద్రరాజును సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడిగా నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. మాజీ సీఎం వైఎస్ఆర్ కుమార్తె షర్మిల పీసీసీ అధ్యక్షురాలుగా నియమితులవడం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కావాలని పార్టీ శ్రేణులు ఆకాంక్షిస్తున్నాయని, వైఎస్ షర్మిల వల్ల ఇది సాధ్యమౌతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. పీసీసీ ఉపాధ్యక్షుడు వి.గుర్నాథం, ప్రధాన కార్యదర్శులు మేడా సురేష్, ఏసుదాసు, అన్సారీ, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల శ్రీనివాస్, కాంగ్రెస్ సీనియర్ నేతలు ఖుర్షీదా, గౌస్‌బేగ్, జగన్ పాల్గొన్నారు.



తమ కుటుంబ సభ్యులతో ఫొటో దిగుతున్న వినియోగదారులు

ఐవోసీ బంకు వద్ద ఫొటోల సందడి..!

విజయవాడ, జనవరి 16: వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడంలో ముందుండే ఇండియల్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐవోసీ) సంక్రాంతి సందర్భంగా స్థానిక ఎంజీ రోడ్‌లోని పైలెట్ సర్వీస్ స్టేషన్ పెట్రోల్ బంకులో సోమవారం నిర్వహించిన కాలెండర్ పండుగకు విశేష స్పందన లభించింది. ఉదయం నుంచి రాత్రి వరకు జరిగిన ఈ వేడుకలో దాదాపు 800 మంది వినియోగదారులు తమ కుటుంబ సభ్యులతో వచ్చి నిర్వాహకులు ఏర్పాటు చేసిన హరిదాసులు, గంగిరెద్దులతో ఉత్సాహంగా ఫొటోలు దిగి ఆ ఫొటోలతో తయారు చేసిన 2024 కాలెండర్ ఉచితంగా తీసుకుని వెళ్లారు. బంకు అధిపతి ఎంవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ తొమ్మిదేళ్లుగా కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. సీనియర్ జర్నలిస్ట్, టెలికం సలహా కమిటీ ఉమ్మడి గుంటూరు జిల్లా సభ్యులు సభ్యులు నిమ్మరాజు చలపతిరావు, జిల్లా సేల్స్ ఆఫీసర్ కె. వరప్రసాద్, మేనేజర్ కె.వెంకటప్పయ్య, చీఫ్ డివిజినల్ రిటైర్డ్ హెడ్ అనిల్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

19న అంబేడ్కర్ విగ్రహం, స్మృతివనం ప్రారంభం

- హాజరు కానున్న ముఖ్యమంత్రి
- 20 నుంచి అందరికీ ప్రవేశం

కృష్ణలంక, జనవరి 16: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అనే దార్శనికుడు భారతదేశంలో పుట్టి ఉండకపోతే స్వాతంత్ర్యం వచ్చిన 75 ఏళ్ల తర్వాత కూడా దేశంలో కుల, వర్ణ వివక్ష ఇప్పటికీ కొనసాగుతూ ఉండేదని రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి అన్నారు. స్వరాజ్యమైదానంలో సామాజిక న్యాయ మహాశిల్పం పేరుతో నిర్మిస్తున్న బీఆర్ అంబేడ్కర్ విగ్రహ నిర్మాణం పనులను, ఇందిరాగాంధీ స్టేడియంలో నిర్వహించనున్న బహిరంగ సభ ఏర్పాట్లను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈనెల 19న సాయంత్రం 4 గంటలకు స్టేడియంలో నిర్వహించే బహిరంగ సభలో వర్చువల్ విధానం ద్వారా సీఎం వైఎస్ జగన్ విగ్రహావిష్కరణ చేస్తారన్నారు. మంత్రి మేరుగ నాగార్జున, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి, సీఎం కార్యక్రమాల పర్యవేక్షకుడు తలశిల రఘురాం, సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ టి.విజయకుమార్‌రెడ్డి, కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, సీపీ కాంతిరాణా, ఎంపీ కేశినేని శ్రీనివాస్, ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, వెల్లంపల్లి శ్రీనివాస్, దళిత సంఘాల నేతలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



కలెక్టర్, సీపీతో ఏర్పాట్లపై సమీక్షిస్తున్న విజయసాయిరెడ్డి



జమ్మూకశ్మీర్‌లోని అనంత్‌నాగ్‌జిల్లాలో మంచులో పర్యాటకులు

గడ్డకట్టిన ఉత్తరాది!

▸ పలు చోట్ల -1.6 డిగ్రీల ఉష్ణోగ్రత.. మరో 5రోజులు ఇంతే

న్యూఢిల్లీ/శంషాబాద్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): ఉత్తరాది గడ్డకట్టింది..! ముఖ్యంగా హిమాలయాల శివాలిక్ శ్రేణులు, గంగానది పరీవాహకాల్లో మైనస్ డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. భారత వాతావరణశాఖ ఈ ప్రాంతాలకు రానున్న ఐదు రోజులు దట్టమైన పొగమంచు, అతి శీతల పవనాల హెచ్చరికలను జారీచేసింది. పంజాబ్, తూర్పు మధ్యప్రదేశ్, వాయవ్య రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ పశ్చిమ ప్రాంతాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు మైనస్ 1.6 నుంచి 3డిగ్రీలుగా నమోదయ్యాయి. వీటితోపాటు.. ఢిల్లీ, హరియాణా, చండీగఢ్, జమ్మూకశ్మీర్, లద్దాఖ్, బాల్టిస్థాన్, ముజఫరాబాద్ ప్రాంతాల్లో దట్టమైన పొగమంచు నుంచి అతిదట్టమైన పొగమంచు ప్రభావం ఉందని, రానున్న ఐదు రోజులు ఈ ప్రాంతాల్లో శీతల, అతిశీతల పవనాలు వీస్తాయని హెచ్చరించింది. కర్ణాటక, ఏపీల్లోనూ ఉదయం వేళ పొగమంచు ప్రభావం ఉన్నట్లు వివరించింది.

ఎడ్‌సెట్ కౌన్సెలింగ్‌కు ఆదేశాలు ఇవ్వండి

▸ పిల్ దాఖలు చేసిన పీడీఎస్‌యూ

అమరావతి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): బీఎడ్ కౌన్సెలింగ్‌ను సకాలంలో జరపకపోవడాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. ప్రోగ్రెసివ్ డెమోక్రాటిక్ స్టూడెంట్ యూనియన్(పీడీఎస్‌యూ) నేషనల్ కన్వీనర్ ఎం.రామకృష్ణ ఈ పిల్ దాఖలు చేశారు. విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి, ఉన్నత విద్యామండలి చైర్మన్, ఏపీ ఎడ్‌సెట్ కన్వీనర్‌ను వ్యాజ్యంలో ప్రతివాదులుగా చేర్చారు. 'ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(ఎడ్‌సెట్) పరీక్షను 2023 జూన్‌లో నిర్వహించారు. జూలైలో ఫలితాలు ప్రకటించారు. ఈ ప్రవేశ పరీక్షలో మొత్తం 10,908 మంది ఉత్తీర్ణులు అయ్యారు. ఫలితాలు ప్రకటించి ఆరు నెలలు గడచినా ఇప్పటివరకు కౌన్సెలింగ్ నిర్వహించలేదు. ప్రవేశపరీక్షలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు విద్యా సంవత్సరం కోల్పోయే ప్రమాదం ఏర్పడింది. ఫీజుల నియంత్రణ పర్యవేక్షణ కమిటీ కళాశాలల ఫీజు ఖరారు చేసింది. విద్యా సంవత్సరం సైతం చివరి దశకు చేరుకుంది. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకొని తక్షణం కౌన్సెలింగ్ నిర్వహించేలా ఆదేశాలు ఇవ్వండి' అని పిటిషన్‌లో కోరారు.

ఆరు మెట్రో విమానాశ్రయాల్లో వార్ రూమ్స్

వాతావరణ సమస్యలతో విమానాల రాకపోకల ఆలస్యం నేపథ్యంలో పౌర విమానయాన శాఖ రంగంలోకి దిగింది. దేశవ్యాప్తంగా ఆరు విమానాశ్రయాల్లో ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి వార్ రూమ్స్ ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి జ్యోతిరాదిత్య సింధియా మంగళవారం తెలిపారు. ఢిల్లీ, ముంబై, హైదరాబాద్, బెంగళూరు, కోల్‌కతా, చెన్నై విమానాశ్రయాల్లో వార్ రూమ్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ఎక్స్‌లో పేర్కొన్నారు.

శబరిమలలో వైభవోపేతంగా మకరవిళక్కు

తిరువనంతపురం/న్యూఢిల్లీ, జనవరి 16: శబరిమల అయ్యప్ప సన్నిధిలో వైభవోపేతంగా మకరవిళక్కు వేడుకలు జరిగాయి. సోమవారం సాయంత్రం 6.45 సమయంలో సన్నిధానానికి 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న పొన్నంబలమేడుపై అయ్యప్పస్వామి జ్యోతిరూపంలో దర్శనమిచ్చారు. గంగానది బంగాళాఖాతంలో కలిసే ప్రదేశమైన పశ్చిమబెంగాల్‌లోని 'గంగాసాగర్' ప్రాంతానికి భక్తులు పోటెత్తుతారు. సోమవారం రికార్డు స్థాయిలో కోటి మందికి పైగా భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారని అధికారులు తెలిపారు.

ఒక వాహనానికి ఒక ఫాస్ట్ ట్యాగ్

▸ కేవైసీ లేకపోతే ఈ నెల 31 తరువాత పనిచేయవు: కేంద్రం

న్యూఢిల్లీ, జనవరి 16: ఒక ఫాస్ట్‌ట్యాగ్‌ను పలు వాహనాలకు ఉపయోగించినా, ఒక వాహనానికి పలు ఫాస్ట్‌ట్యాగులు వినియోగించినా ఇకపై చెల్లదు. ఏ వాహనానికి ఆ ఫాస్ట్ ట్యాగునే వాడాలి. అందుకోసం ఫాస్ట్‌ట్యాగ్‌ను కొనుగోలు చేసినప్పుడు నో యువర్ కస్టమర్(కేవైసీ) ప్రక్రియను వినియోగదారులు పూర్తి చేయాల్సి ఉంటుంది. కేవైసీ చేయించని ఫాస్టాగ్‌లు ఈ నెల 31వ తేదీ తర్వాత పనిచేయవు. తాజాగా తీసుకున్న ఫాస్ట్‌ట్యాగ్ మాత్రమే యాక్టివ్‌గా ఉంటుందని, ఈ నెల 31 తరువాత మిగిలినవన్నీ డీయాక్టివేట్/బ్లాక్ లిస్టులోకి వెళ్లిపోతాయని స్పష్టం చేసింది.

భార్య ఐదో పెళ్లి చేసుకుందని నాలుగో భర్త ఆత్మహత్య!

ఇండోర్, జనవరి 16: తన భార్య ఐదో పెళ్లి చేసుకుందన్న మనస్తాపంతో.. ఆమె నాలుగో భర్త తన ఒంటిపై పెట్రోల్ పోసుకుని, నిప్పంటించుకుని చనిపోయాడు.మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌కు చెందిన సునీల్ లోహనీ 2018లో రీనా అలియాస్ సోనీని పెళ్లి చేసుకున్నాడు. పాకిస్థాన్ నుంచి వలసవచ్చి భారత్‌లో స్థిరపడ్డ ఆమెకు అప్పటికే మూడు పెళ్లిళ్లు అయ్యి, విడాకులు తీసుకుంది. సునీల్ లోహన్‌తో కూడా ఆమె కాపురం సజావుగా సాగలేదు. దీంతో గత ఏడాది ఆమె అతణ్ని వదిలి పుట్టింటికి వెళ్లిపోయి, వరకట్న వేధింపుల కేసు కూడా పెట్టింది. ఇదిలా ఉండగా.. 2023 డిసెంబరు 30న ఆమె సునీల్ సచ్‌దేవ అనే వ్యక్తిని వివాహంచేసుకుంది. దీంతో సునీల్ ఆత్మహత్య చేసుకున్నాడు

అమెరికా అధ్యక్ష రేసు నుంచి వివేక్ అవుట్

▸ అయోవా కాకస్‌లో గెలిచిన డొనాల్డ్ ట్రంప్‌కు మద్దతు

వాషింగ్టన్, జనవరి 16: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిత్వం కోసం పోటీపడిన భారత సంతతి ప్రముఖుడు, పారిశ్రామికవేత్త వివేక్ రామస్వామి ఆ రేసు నుంచి వైదొలిగారు. సోమవారం అయోవా రాష్ట్ర కాకస్ ప్రైమరీ ఎన్నికల్లో మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గెలిచారు. ఆయన 56,160 ఓట్లు(51%), 20మంది ప్రతినిధులను గెలుచుకున్నారు. వివేక్ 7.7% ఓట్లు, ముగ్గురు ప్రతినిధులను మాత్రమే సాధించారు. మరో అభ్యర్థి రాన్ డిశాంటిస్ 21.2% ఓట్లతో 8 మంది ప్రతినిధులను, భారత సంతతికే చెందిన నిక్కీ హేలీ 19.1 శాతం ఓట్లతో ఏడుగురు ప్రతినిధులను గెలుచుకున్నారు. తన అభ్యర్థిత్వాన్ని మెజారిటీ రిపబ్లికన్లు అంగీకరించకపోవడంతో.. రేసు నుంచి వైదొలగిన వివేక్.. ట్రంప్‌కు మద్దతు ప్రకటించారు.

గంజాయి, గుట్కా కుటుంబం వద్దు

▸ గుంటూరు తూర్పు వైసీపీ ఎమ్మెల్యేపై తీవ్ర వ్యతిరేకత

▸ ముస్తఫా ఫ్యామిలీ నుంచి ఎవరినీ అంగీకరించం

▸ వేరే ఎవరికి ఇచ్చినా అభ్యంతరం లేదు

▸ గుంటూరులో సమావేశమయిన మైనార్టీ పెద్దలు, రాజకీయ ప్రముఖులు

గుంటూరు, జనవరి 16: తన సామాజిక వర్గంలో తిరుగులేని నేతగా ఎదిగిన గుంటూరు తూర్పు వైసీపీ ఎమ్మెల్యే ముస్తఫా తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొంటున్నారు. అతనితోపాటు అతని కుటుంబ సభ్యులను కూడా తమ ప్రతినిధిగా అంగీకరించలేని పరిస్థితులు నెలకొన్నాయి. వివిధ సందర్భాల్లో ముస్తఫా కుటుంబ సభ్యులంతా గుట్కా, గంజాయి వంటి మత్తు పదార్థాలను తరలిస్తూ పోలీసులకు నేరుగా చిక్కారు. ఇది ముస్లిం సామాజిక వర్గంలో తీవ్ర తక్షణ వ్యతిరేకతకు కారణంగా మారింది. ఈ నేపథ్యంలో ఇటీవల సీఎం జగన్... తూర్పు నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్తగా ముస్తఫా కుమార్తె నూరి ఫాతిమాను నియమించారు. జగన్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఇప్పటికే పలు సందర్భాల్లో బహిరంగంగా తమ అభిప్రాయాలను వెల్లడించిన ముస్లిం నేతలు ఇప్పుడు ఏకంగా సమావేశం పెట్టారు. తిరుగుబాటు బావుటా ఎగరేశారు. మంగళవారం రాత్రి గుంటూరు మాయాబజార్‌లోని ఓ హోటల్‌లో ముస్లిం మతపెద్దలు, రాజకీయ ప్రముఖులు సమావేశమయ్యారు. ఎమ్మెల్యే ముస్తఫా కుటుంబానికి వ్యతిరేకంగా తీర్మానం చేశారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ ఎమ్మెల్యే ముస్తఫా కుటుంబాన్ని దూరంగా పెట్టకపోతే మైనార్టీల నుంచి తీవ్ర వ్యతిరేకతను చవిచూడాల్సి వస్తుందని వారు హెచ్చరించారు. గుంటూరు తూర్పు మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్ వలి, అంజుమన్ మాజీ అధ్యక్షుడు మొయినుద్దీన్, పీసీసీ ప్రధాన కార్యదర్శి పర్వేజ్, వైసీపీ నాయకులు షేక్ షౌకత్, గులాం రసూల్, గఫూర్, అట్లాస్ రహమతుల్లా తదితర ముఖ్య నేతలు సమావేశమయ్యారు. ఎమ్మెల్యే ముస్తఫా ఒంటెద్దు పోకడలు, గత పదేళ్లుగా తన సామాజిక వర్గానికి పనికివచ్చే ఏ ఒక్క పనీ చేయని తీరు, కుటుంబ సభ్యులు గంజాయి, డ్రగ్స్ రవాణా కేసుల్లో ఇరుక్కోవడం వంటి అంశాలను సమావేశం చర్చించింది. వైసీపీ అధినాయకత్వానికి విస్పష్టంగా తమ వ్యతిరేకతను చెప్పడానికి సమాయత్తమవుతున్నారు.



హరిదాసు వేషంలో గ్రామంలో తిరుగుతున్న కాట్రపాడు సర్పంచ్ శివశంకర్

హరిదాసుగా మారిన సర్పంచ్

▸ పండుగ రోజు ఇంటింటికీ తిరిగి జోలెపట్టిన ప్రజాప్రతినిధి

▸ హరిలో రంగ హరీ.. పంచాయతీ నిధులు హరీ అంటూ నినాదాలు

గుంటూరు సిటీ, జనవరి 16: సీఎం జగన్ దెబ్బకు సర్పంచులు రోడ్డున పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల నిధులను దారి మళ్లిస్తుండడంతో గ్రామ సర్పంచ్ పండుగ పూట హరిదాసు వేషం కట్టి వినూత్న నిరసనకు దిగారు. గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలం కాట్రపాడు సర్పంచ్ శివశంకర్ హరిదాసు వేషం ధరించి సంక్రాంతి రోజు భిక్షాటన చేశారు. 'హరిలో రంగ హరి.. పంచాయతీ నిధులు హరీ' అంటూ నినదించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం పంచాయతీ నిధులు దారి మళ్లించిందని, అందుకే ఊరికి, ప్రజలకు ఏమీ చేయలేకపోతున్నానని ఆవేదన వ్యక్తంచేశారు. కరెంటు, మంచినీళ్లు, మురుగు కాల్వలు కూడా బాగుచేయించలేక పోతున్నానని వివరించారు. సీఎం జగన్‌కు ఎక్కడెక్కడి డబ్బులూ సరిపోక పంచాయతీల నిధులు కూడా మింగేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ శివశంకర్ మాట్లాడుతూ.. ఊరిలో పనులు చేయడం లేదని ప్రజలు తనను విమర్శిస్తున్నారని, కానీ, ప్రభుత్వం ఆర్థిక సంఘం నిధులను ఖాతాలో జమకాకముందే లాగేసుకుంటోందని తెలిపారు. పంచాయతీలను బలోపేతం చేస్తానని చెప్పి అధికారంలోకి వచ్చిన జగన్ మాట తప్పారని ధ్వజమెత్తారు. పంచాయతీలను నిర్వీర్యం చేసి, సర్పంచ్‌లను ఉత్సవ విగ్రహాలుగా మార్చారని విమర్శించారు. ఇప్పటికైనా పంచాయతీల నిధులు విడుదల చేయాలని ప్రభుత్వానికి విన్నవించారు. గ్రామంలో తలెత్తుకోలేని పరిస్థితి ఉందన్నారు. కనీసం మురుగు కాల్వలు కూడా తీయించలేని దుస్థితిలో సర్పంచ్‌లు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

12 మంది ఎస్పీల బదిలీ?

ఎన్నికల ముంగిట జగన్ సర్కారు కసరత్తు.. సీఎంవోకు చేరిన జాబితా.. నిర్ణయం వెలువడడమే తరువాయి!

▸ చిత్తూరు, అనంత, నంద్యాల, పల్నాడు ఎస్పీలు ఏకపక్షం?

▸ ప్రకాశం, గుంటూరు, విజయనగరంలో సుదీర్ఘం

▸ తిరుపతి, నెల్లూరు, బెజవాడ సిటీలపై ఈసీ ప్రభావం

▸ అనంత, విశాఖ రేంజ్ డీఐజీల మార్పు?

▸ సీఎం సిగ్నలివ్వగానే ఉత్తర్వులు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

మరి కొన్ని వారాల్లో ఎన్నికలు జరుగుతోన్న తరుణంలో ఐపీఎస్ అధికారుల బదిలీపై ప్రభుత్వం కసరత్తు చేసింది. మొత్తం 26 పోలీసు యూనిట్లకు గానూ 12 జిల్లాల ఎస్పీలు మారే అవకాశం ఉన్నట్లు పోలీసు ఉన్నత స్థాయి వర్గాల్లో చర్చ జరుగుతోంది. చిత్తూరు నుంచి విజయనగరం వరకూ పలు జిల్లాల ఎస్పీల బదిలీ తప్పదని తెలుస్తోంది. డీజీపీ నేతృత్వంలోని ఉన్నత స్థాయి కమిటీ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు జాబితా సిద్ధం చేసి ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపింది. అయితే అధికార పక్షం ఎన్నికల్లో తమకు అనుకూలంగా ఉండే వారినే జిల్లాల ఎస్పీలుగా నియమించుకునేందుకు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం.

బదిలీ అయ్యేది వీరే!

చిత్తూరు జిల్లా ఎస్పీ రిశాంత్‌రెడ్డి స్థానిక ఎన్నికల పోలింగ్ సమయంలో కుప్పంలో వ్యవహరించిన తీరు బాగా వివాదాస్పదమైంది. వైసీపీకి అనుకూలంగా వ్యవహరించే ఎస్పీల్లో ఆయన్ను మించిన వారు రాష్ట్రంలోనే లేరని పోలీసు, రాజకీయ వర్గాల్లో వినిపిస్తూనే ఉంది. ఆయన ఎక్కడెక్కడ ఏకపక్షంగా వ్యవహరించారో ప్రతిపక్షాలు ఆధారాలతో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయబోతున్నాయి. దీంతో ఆయన్ను ఎట్టి పరిస్థితుల్లోనూ అక్కడ ఉంచే అవకాశం లేదని సమాచారం. తిరుపతి ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి గతంలో సీఎం జగన్ వద్ద చీఫ్ సెక్యూరిటీ అధికారిగా పనిచేశారు. తిరుపతి పార్లమెంటు ఉప ఎన్నికలో నమోదైన కేసుల దర్యాప్తు విషయంలో ఇటీవల ఆయనకు ఈసీ క్లాస్ తీసుకుంది. కమిషన్ అంటే లెక్కలేదా.. కేసులు దర్యాప్తు చేసి ఎందుకు చార్జిషీట్ వేయలేదని గట్టిగా ప్రశ్నించింది. ఉల్లంఘనకు పాల్పడిన వారందరూ దాదాపు వైసీపీ వాళ్లే కావడంతో దర్యాప్తు అడుగు ముందుకు పడలేదు. ఈ విషయాన్ని గ్రహించిన ఈసీ మీరు రాజకీయ పార్టీలకు వత్తాసు పలకాలనుకుంటే ఇప్పుడు వెళ్లిపోయి.. ఎన్నికల తర్వాత చూసుకోండని అనడం చర్చనీయాంశమైంది. ఈ వ్యాఖ్యల్ని సీరియస్‌గా తీసుకున్న డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి మరుసటి రోజే తిరుపతి ఉప ఎన్నిక సందర్భంగా నమోదైన కేసుల వివరాలు తెప్పించుకుని ఎస్పీతో పాటు సంబంధిత స్టేషన్ల ఎస్‌హెచ్‌వోలతో సమీక్షించారు. ఈ ప్రభావం పరమేశ్వర్‌రెడ్డి బదిలీపై తప్పక చూపుతుందని పోలీసు వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి.

అన్బురాజన్ బదిలీ ఖాయం!

అనంతపురం ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పనితీరుపైనా ఈసీ అసంతృప్తి వ్యక్తం చేసింది. పొరుగు రాష్ట్రం నుంచి విచ్చలవిడిగా మద్యం వస్తుంటే అరికట్టకుండా ఏం చేస్తున్నారని ప్రశ్నించింది. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ మధ్య లిక్కర్ ధరల్లో వ్యత్యాసం లేదని ఆయన బదులివ్వగా.. ఆ మాత్రం మాకు తెలీదనుకుంటున్నారా అని ఆగ్రహం వ్యక్తం చేసింది. రాష్ట్ర చరిత్రలోనే కడప జిల్లా ఎస్పీగా దాదాపు నాలుగేళ్లు పనిచేసిన అన్బురాజన్ ఏకంగా సీబీఐ అధికారులపై కేసు పెట్టడం జాతీయ స్థాయిలో చర్చనీయాంశమైంది. మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో అనుమానితుడిని ప్రశ్నించేందుకు సీబీఐ అదుపులోకి తీసుకోవడంతో కిడ్నాప్ కేసు పెట్టి దర్యాప్తు అధికారులను ఇబ్బందికి గురిచేశారు. కడప జిల్లాలో అధికార పార్టీ ఆదేశాలే చట్టాలు, పోలీసు మాన్యువల్ అనేలా ఏకపక్షంగా వ్యవహరించారనే ఆరోపణలు ఆయనపై ఉన్నాయి. దీంతో అనంతపురం వచ్చి కొన్ని నెలలే అయినా ఎన్నికల సమయంలో అన్బురాజన్‌కు బదిలీ తప్పదని తెలుస్తోంది.

- కర్నూలు ఎస్పీ కృష్ణకాంత్ కొన్ని నెలల క్రితమే బదిలీపై వచ్చినప్పటికీ మాజీ మంత్రి వివేకా హత్యకేసులో నిందితుడైన కడప ఎంపీ అవినాశ్‌రెడ్డిని అరెస్టు చేసేందుకు సీబీఐకి ఏ మాత్రం సహకరించలేదు. పైగా ఆయన్ను అదుపులోకి తీసుకుంటే శాంతి భద్రతలు అదుపు చేయలేమని చెప్పడం.. అవినాశ్ తల్లి వైద్యం చేయించుకున్న ఆస్పత్రి ప్రాంతంలో కడప నుంచి వచ్చిన ఆయన అనుచరుల బీభత్సం.. ఎస్పీ సామర్థ్యంపై ప్రశ్నలు లేవనెత్తాయి. ఫ్యాక్షన్ జిల్లా కావడంతో ఇటువంటి ఎస్పీ ఎన్నికల సమయంలో పని చేయలేరన్న నివేదిక ఈసీకి చేరినట్లు తెలుస్తోంది.
- నంద్యాల ఎస్పీ రఘువీరారెడ్డి అధికార వైసీపీకి అనుకూలంగా ఉంటారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రతిపక్షంపై కఠినంగా ఉంటారని, చంద్రబాబును సీఐడీ అరెస్టు చేసేందుకు పూర్తిగా సహకరించారని పేరుంది. పొరుగు జిల్లాలో ఒక ఎంపీని అరెస్టు చేస్తే వచ్చే ఇబ్బంది.. ఇక్కడ మాజీ ముఖ్యమంత్రిని అరెస్టు చేస్తే రాదనకపోవడం.. ఆయన ఏకపక్ష వైఖరిపై ఆధారాలతో ఈసీకి ఫిర్యాదులు అందాయని, బదిలీ ఖాయమని అంటున్నారు. నెల్లూరు ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డికి సమర్థ అధికారిగా పేరున్నప్పటికీ ఇటీవల ఎన్నికల కమిషన్ అక్షింతలు పడడంతో ఆయన బదిలీ ఉంటుందా.. లేదంటే ఈసీ ఆదేశాల తర్వాత చేయాల్సి వస్తే ఇబ్బంది పడతామా.. అనే చర్చ సీఎంవోలో జరుగుతోంది. ప్రకాశం జిల్లా ఎస్పీ మల్లికా గార్గ్ సమర్థ అధికారిణి. ఆ జిల్లాలో 30 నెలలకు పైగా ఆమె ఉంటున్నారు. దీంతో ఆమెను మరో జిల్లాకు మార్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. పొరుగు జిల్లా బాపట్ల ఎస్పీ వకుల్ జిందాల్ బదిలీపైనా చర్చ జరుగుతోంది. మల్లికా గార్గ్‌ను బదిలీ చేస్తే స్వాప్ ఆప్షన్ కింద ఆయనకూ బదిలీ ఉండొచ్చంటున్నారు.
- పల్నాడు ఎస్పీ రవిశంకర్ రెడ్డిపై వైసీపీ నాయకుడు అనే రీతిలో ఆరోపణలు ఉన్నాయి. టీడీపీ నేతల ఇళ్లపై దాడులు, హత్యలు, వైసీపీ నేతల అరాచకాలు రాష్ట్రంలో ఏ జిల్లాలోనూ నమోదు కానన్ని ఇక్కడే జరిగాయి. ఇవే ఆయన బదిలీకి ప్రధాన కారణాలుగా పోలీసు వర్గాలు చెబుతున్నాయి.
- గుంటూరు ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ 2021 జూన్ నుంచి అక్కడే ఉంటున్నారు. సుదీర్ఘంగా ఉండడంతో బదిలీ తప్పదంటున్నారు.
- విజయవాడ పోలీస్ కమిషనర్ క్రాంతి రాణా టాటాపై ఇటీవల ఈసీ సీరియస్ అయింది. పొరుగు రాష్ట్రమైన తెలంగాణ నుంచి వచ్చే మద్యాన్ని అరికట్టలేక పోతున్నారని పెదవి విరిచింది. ఈ ప్రభావం పడితే బదిలీ ఉండొచ్చని లేదంటే కొనసాగించే అవకాశం ఉందంటున్నారు.
- కృష్ణా జిల్లా ఎస్పీ జాషువా పనితీరుపై పోలీస్ బాస్ పలుమార్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. వైసీపీ నాయకులను ఆయన తన కారులోనే కూర్చోబెట్టుకుని జిల్లాలో బహిరంగంగానే తిరుగుతారు. వీటికన్నా ముఖ్యంగా సొంత జిల్లా గనుక పని చేయడానికి ఈసీ అంగీకరించదు.
- విజయవాడకు చెందిన జాషువా కృష్ణా జిల్లా ఎస్పీగా ఉన్నప్పటికీ ఉమ్మడి రెవెన్యూ జిల్లాలనే ఈసీ పరిగణనలోకి తీసుకుంటోంది. దీంతో జాషువా బందరు నుంచి బయటకు వెళ్లక తప్పదు.
- పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ రవిప్రకాశ్ మరికొన్ని నెలల్లో పదవీ విరమణ చేయనున్నారు. నిబంధనల మేరకు అటువంటి అధికారులు ఎన్నికల డ్యూటీ చేయడానికి కుదరదు. దీంతో ఆ జిల్లాకు రవిప్రకాశ్ స్థానంలో మరో ఎస్పీని ప్రభుత్వం నియమిస్తుంది.
- విజయనగరం జిల్లా ఎస్పీ దీపిక ఎం పాటిల్ సమర్థ అధికారిగా పేరు తెచ్చుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన 'దిశ' మొదట్లో ప్రారంభమై మహిళల్లోకి బాగా వెళ్లింది ఆమె నేతృత్వంలోనే. అయితే జూలై 2021 నుంచి అక్కడ పనిచేస్తున్నందున ఆమె స్థానంలో మరొకరిని నియమించే అవకాశం ఉంది. వీరితో పాటు అనంతపురం, విశాఖపట్నం రేంజ్ డీఐజీల బదిలీ ఉండొచ్చని పోలీసు వర్గాలు చెబుతున్నాయి. జాబితా ముఖ్యమంత్రి ముందు ఉందని, మార్పులు చేర్పులు ఆయన సూచించిన వెంటనే జీవో వస్తుందని సమాచారం.

తిరుగు ప్రయాణమెలా..?

▸ 500 ప్రత్యేక బస్సులు నడపాలని ఆర్టీసీ యోచన

▸ ఉచితప్రయాణం వల్ల స్పెషల్స్‌కు టీఎస్‌ఆర్టీసీ దూరం

▸ ఈ సారి భారమంతా ఏపీఎస్‌ఆర్టీసీపైనే

▸ బెజవాడ నుంచి హైదరాబాద్‌కు 400 బస్సులు

▸ ఇతర ప్రాంతాలకు మరో 100 ప్రత్యేక బస్సులు

▸ ఇవి ఏ మాత్రం సరిపోవనే విమర్శలు

▸ చాలామంది కార్లు, ప్రైవేటు వాహనాలవైపు మొగ్గు

(ఆంధ్రజ్యోతి - విజయవాడ)

సంక్రాంతి సంబరాలు ముగిశాయి. పండగకు సొంతూళ్లకు వచ్చిన వారంతా నేటి నుంచి తిరుగు ప్రయాణమవుతున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ అధికారులు 500కిపైగా ప్రత్యేక బస్సులు నడపాలని నిర్ణయించారు. తెలంగాణకు చెందిన టీఎస్‌ఆర్టీసీ మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తున్న నేపథ్యంలో ఈసారి ప్రత్యేక బస్సులు నడపలేకపోతోంది. దీంతో ఈ సారి ఏపీఎస్‌ఆర్టీసీ మీద అధిక భారం పడింది. 500కిపైగా స్పెషల్ బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులు భావించినప్పటికీ.. అవికూడా సరిపోక ప్రయాణికులు కార్లు, క్యాబ్‌లు, ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది.

బస్సులన్నీ హౌస్‌ఫుల్..

సంక్రాంతి పండుగకు ఊరెళ్లిన వారి తిరుగు ప్రయాణానికి సంబంధించి ఇప్పటికే విజయవాడ నుంచి ఆర్టీసీ షెడ్యూల్ చేసిన బస్సులన్నీ హౌస్‌ఫుల్ అయ్యాయి. ఆర్టీసీ అధికారులు హైదరాబాద్‌కు భారీగా స్పెషల్స్ నడపక తప్పని పరిస్థితి ఏర్పడింది. దీంతో హైదరాబాద్ మార్గంలో ముందుగా 400 ప్రత్యేక బస్సులు నడపాలని నిర్ణయించారు. రెండు రోజులపాటు ఈ బస్సులు నడపనున్నారు. హైదరాబాద్ మార్గానికి ఇంకా ప్రయాణికులు పోటెత్తితే తప్పనిసరి పరిస్థితుల్లో సిటీ బస్సులను కూడా నడపాలని ఆర్టీసీ అధికారులు ప్లాన్ చేస్తున్నారు. ఈ క్రమంలో వారికి ఒక సమస్య కూడా వచ్చింది. విజయవాడ నుంచి దూర ప్రాంతాలకు వెళ్లేవారు కాకుండా.. విశాఖపట్నం, రావులపాలెం, అమలాపురం, కాకినాడ, రాజమండ్రి, ఏలూరు.. నుంచి కూడా పెద్ద సంఖ్యలో విజయవాడకు వస్తుంటారు. వీరికి కూడా ప్రత్యేక బస్సులు వేయాల్సిన అవసరం ఉంది. అందుకే ఈ ప్రాంతాలకు 100 స్పెషల్ బస్సులు నడపాలని నిర్ణయించారు. కానీ అవి సరిపోవని భావిస్తున్నారు. పండగ ముందు రోజుల్లో ఈ ప్రాంతాలకు దాదాపు 300 వరకు స్పెషల్ బస్సులు వేశారు. దీంతో అంతే సంఖ్యలో ఇప్పుడు కూడా నడపాల్సి ఉంటుంది. హైదరాబాద్‌కు 400 బస్సులు, విజయవాడకు వచ్చే వారి కోసం 300 బస్సులు, ఇవి కాకుండా బెంగళూరు, చెన్నై, భద్రాచలం, రాయలసీమ జిల్లాలకు 25 బస్సులు వేస్తే మొత్తంగా 725 స్పెషల్ బస్సులు నడపాల్సి ఉంటుంది. విజయవాడ నుంచి జిల్లాలోని వెయ్యి బస్సుల ఫ్లీట్‌లో మూడొంతులు స్పెషల్స్ ప్రాతిపదికనే నడపాల్సి ఉంటుంది. ఇదే జరిగితే సిటీ బస్సులకు కొరత ఏర్పడే అవకాశాలున్నాయి. దీంతో అద్దె బస్సులను కూడా స్పెషల్స్‌గా రంగంలోకి దించాలని ఆర్టీసీ అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే కొన్ని అద్దె బస్సులను స్పెషల్స్‌గా వేశారు.

దేవదాయంలో పదోన్నతుల హడావుడి!

▸ ఏసీలతో అధికారులు వరుస సమావేశాలు

▸ నేడు మరోసారి వారితో స్పెషల్ సీఎస్ భేటీ

అమరావతి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): దేవదాయ శాఖలో డిప్యూటీ కమిషనర్(డీసీ) పదోన్నతుల ప్రక్రియలో అధికారులు స్పీడ్ పెంచారు. గతంలో ఇచ్చిన తప్పుడు పదోన్నతులను ఆమోదిస్తూ... తాజాగా సరికొత్త సీనియార్టీ లిస్ట్‌ను సిద్ధం చేశారు. అక్రమ పదోన్నతులపై గతంలో కోర్టుల్లో వేసిన కేసుల్ని బలవంతంగా వెనక్కి తీసుకునేలా ఒత్తిడి తీసుకువస్తున్నారు. గట్టిగా ప్రశ్నించే అసిస్టెంట్ కమిషనర్లను బతిమాలడం, బుజ్జగించడం... వినకుంటే భయపెట్టడం వంటివి చేస్తున్నారు. పదోన్నతుల్లో అక్రమాలను అరికట్టాల్సిన అధికారులే అక్రమ పదోన్నతులకు తెరతీస్తూ దేవదాయశాఖ ప్రతిష్ఠను దిగజార్చుతున్నారు. అసిస్టెంట్ కమిషనర్ సీనియార్టీ లిస్ట్‌లో అనేక తప్పులున్నాయని, దీన్ని సవాల్ చేస్తూ కొన్నేళ్ల క్రితం కొంతమంది ఏసీ కేడర్ అధికారులు కోర్టును ఆశ్రయించారు. ఈ అంశం కోర్టులో ఉన్న తరుణంలో మంత్రి, దేవదాయశాఖ ఉన్నతాధికారులు గట్టిగా పట్టుబట్టి మరీ అసిస్టెంట్ కమిషనర్ నుంచి డిప్యూటీ కమిషనర్‌కు పదోన్నతి కల్పించేందుకు గట్టి ప్రయత్నాలే చేస్తున్నారు. ఇప్పటికే అనేక సార్లు ఏసీలతో సమావేశాలు ఏర్పాటు చేశారు. కోర్టుల్లో కేసులు వేసిన వారితో మాట్లాడి వాటిని వెనక్కు తీసుకునేలా ఒత్తిడి తీసుకువచ్చేందుకు ఓ కమిటీని కూడా వేశారు. బుధవారం దేవదాయ శాఖ స్పెషల్ సీఎస్, ఉన్నతాధికారులు ఏసీలతో మరోసారి సమావేశం కానున్నారు. ఇంత హడావుడిగా డీసీల పదోన్నతులకు మంత్రి, ఉన్నతాధికారులు ఎందుకింతగా ప్రయత్నిస్తున్నారో, దీని వల్ల వారికివచ్చే ప్రయోజనం ఏమిటో..? ఎంత వ్యాపారం జరుగుతుందో...? తెలియడం లేదు. కానీ పదోన్నతుల కోసం తీవ్ర కసరత్తే జరుగుతోంది. గతంలో ఏసీల పదోన్నతుల్లో అనేక అక్రమాలు జరిగాయి. అర్హతలేని వారికి, ప్రొబేషన్ డిక్లరేషన్ కానివారికి, ఒక ఆలయం నుంచి మరో ఆలయానికి బదిలీ అయిన వారికి... ఇలా ఇష్టారాజ్యంగా పదోన్నతులు కల్పించారు. దీనిపై కొందరు కోర్టును ఆశ్రయించారు. దీంతో పదేళ్ల నుంచి ఏసీ నుంచి డీసీగా పదోన్నతులు నిలిచిపోయాయి. ఇప్పుడు ఆగమేఘాల మీద ఈ ప్రక్రియ పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. పదోన్నతులు ఇవ్వడం మంచిదే కానీ... ఈ ప్రక్రియలో నిబంధనలు పాటిస్తారా..? లేదా..? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఏసీల నుంచి డీసీలకు పదోన్నతులు కల్పించడం అంత సులభం కాదు. సీనియార్టీని ఫిక్స్ చేయడంలో చాలా గందరగోళం ఏర్పడుతుంది. ఇప్పటికే ఒక సీనియార్టీ లిస్ట్‌ను విడుదల చేయగా.. అనేకమంది ఏసీలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. బుధవారం జరిగే సమావేశంలోనూ అభ్యంతరాలు స్వీకరిస్తారు. ఈ క్రమంలో ఇంకెంతమంది తమ అభ్యంతరాలు చెబుతారో చూడాలి. మరోవైపు గ్రేడ్-1 ఈవోల నుంచి ఏసీలుగా పదోన్నతులు పొందినవారిలో చాలా మంది అడ్డగోలుగా ప్రమోషన్ పొందారు. రెగ్యులర్ పద్ధతిలో ఏసీగా నియమించిన వారిని కాదని, ఆలయాల్లో గ్రేడ్-1 ఈవోలుగా పదోన్నతులు పొందినవారిని సీనియర్లుగా పరిగణిస్తున్నారు. సీనియార్టీ విషయంలో ఇలా అనేక సమస్యలున్నప్పటికీ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. గతంలో అక్రమ పదోన్నతులు పొందినవారికి రివర్షన్ ఇచ్చి, ఆ తర్వాత నిబంధనల ప్రకారం రెగ్యులర్ పదోన్నతులు కల్పించే అవకాశం ఉంది. కానీ అధికారులు ఆ దిశగా ప్రయత్నాలు చేయకుండా హడావుడి చేస్తున్నారు. గతంలో జేఎస్వీ ప్రసాద్ ఇచ్చిన జీవో 888ను పక్కన పడేశారు. అక్రమంగా పదోన్నతులు పొందినవారిపై, పదోన్నతులు కల్పించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన ఇచ్చిన ఆర్డర్‌లో పేర్కొన్నారు. మరోవైపు సీనియార్టీ ఆధారంగానే పదోన్నతులు కల్పించాలని, అడ్డదారుల్లో పదోన్నతులు పొందినవారికి రివర్షన్ ఇవ్వాలని పొందుపరిచారు. ఈ మెమో ఆధారంగానే కొంతమంది ఏసీలు కోర్టును ఆశ్రయించారు. కోర్టు కూడా అడ్డదారుల్లో పదోన్నతులు పొందిన వారికి వెంటనే రివర్షన్ ఇవ్వాలని ఆదేశించింది. కానీ, దేవదాయ శాఖ అధికారులు ఇప్పటివరకూ కోర్టు ఆదేశాలను అమలు చేయకపోగా, ఉన్నతాధికారులే అక్రమ పదోన్నతులు కల్పించేందుకు ప్రయత్నిస్తున్నారు. బుధవారం జరిగే సమావేశంలో దీనిపై ఎవరెవరు అభ్యంతరాలు వ్యక్తం చేస్తారో చూడాలి.



విజయసాయిరెడ్డి, కేశినేని శ్రీనివాస్‌లు కలిసి ఉన్న ఫొటోలు

ఇంత బతుకూ బతికి...

▸ ఎంపీ కేశినేనిపై బుద్దా వెంకన్న ఫైర్

విజయవాడ, జనవరి 16: విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్‌ను (నాని) ఉద్దేశించి ఎక్స్ వేదికగా బుద్దా వెంకన్న మండిపడ్డారు. "అయ్యా కేశినేని నాని... ఒకప్పుడు నన్ను ఉద్దేశించి 'ఇప్పటి వరకూ చంద్రబాబు కాళ్లు... రేపటి నుంచి విజయసాయిరెడ్డి కాళ్లు' అని ట్వీట్ చేశావు. దానికి... 'విజయసాయిరెడ్డి, వైసీపీ మీద పోరాడేది నేనో, నువ్వో ప్రజలకు తెలుసు' అని ట్వీట్ చేశా. ఇప్పుడు ప్రజలకు అర్థమయింది ఎవరేంటో అని. టీడీపీలో ఓ వెలుగు వెలిగిన నిన్ను కోవర్ట్‌గా పనిచేసిన వెలంపల్లికి, మా బాస్ మీద ఎపుడూ విషం గక్కే సాయిరెడ్డికి మధ్యలో చూస్తుంటే... ఇంత బతుకూ బతికి ఇంటెనక సచ్చినట్టు ఉంది నీ బతుకు..' అని ఎక్స్‌లో వ్యాఖ్యానించారు.

పిచ్చి మొక్కను పీకేద్దాం

▸ బీజేపీ, జనసేన నేతలు కామినేని, నాదెండ్ల పిలుపు

తెనాలి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): 'తెలిసో తెలియకో ఒక మొక్కను మనమే నాటాం. అది మంచికాయలు కాయలేదు. పిచ్చిమొక్కయింది. మళ్లీ తెలిసి అదే విత్తనాన్ని నాటితే మనల్ని ఆ దేవుడు కూడా క్షమించడు. నాటిన పిచ్చిమొక్కను మనమే పీకేద్దాం' అని బీజేపీ నేత, మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్, జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ పిలుపునిచ్చారు. గుంటూరు జిల్లా తెనాలిలో వారిద్దరూ మంగళవారం తెలుగుదేశం సీనియర్ నేత యడ్లపాటి వెంకట్రావు నివాసంలో కలిశారు. ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. తర్వాత వారిని కలిసేందుకు వచ్చిన బీజేపీ, జనసేన, టీడీపీ నాయకులు, అభిమానులతో మాట్లాడారు. 'ఈ మా కలయికలో రాజకీయాలు లేవు. ఇది కేవలం ఆత్మీయ కలయికే. త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ప్రజలకు కొన్ని విషయాలు చెప్పాలి. ముఖ్యంగా మన పిల్లల రేపటి భవిష్యత్ కోసం. మనం నాటిన పిచ్చి మొక్క విత్తుల నుంచి మరో 151 పిచ్చి మొక్కలు మొలిచి రాష్ట్రాన్ని నాశనం చేశాయి. వాటిని సమూలంగా తీసేయడానికి ప్రతి ఒక్కరూ ముందడుగు వెయ్యాల్సిన అవసరం ఆసన్నమైంది' అని కామినేని అన్నారు. నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ... 'రాష్ట్రంలో ప్రస్తుతమున్న పరిస్థితులు చూశాకే జనసేన ఒక కీలక నిర్ణయం తీసుకుంది. దుర్మార్గాన్ని అంతమొందించడానికి కలసి అడుగులు వేయడం చారిత్రక అవసరం అని పవన్ ఇప్పటికే చెప్పారు. అందరూ తెలివైన నిర్ణయం తీసుకోవలసిన అవసరం ఉంది' అని అన్నారు.

విజయ్‌కు ఎంపీ సీటు అడిగా: అయ్యన్న

నర్సీపట్నం, జనవరి 16: 'నా పెద్ద కుమారుడు విజయ్‌కు అనకాపల్లి ఎంపీ సీటు ఇవ్వాలంటూ దరఖాస్తు చేశా' అని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. అనకాపల్లి జిల్లా నర్సీపట్నం ఎన్టీఆర్ మినీ స్టేడియంలో సోమవారం సాయంత్రం మకరజ్యోతి ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 'నా కొడుకుగా కాదు... అతనిలో టాలెంట్ ఉందా? లేదా? చూసి టికెట్ ఇవ్వాలని పెద్దాయన్ని అడిగాను. పార్లమెంటులో ఇంగ్లీషు, హిందీ, తెలుగులో బ్రహ్మాండంగా మాట్లాడి మన పేరు నిలబెడతాడు, అవకాశం ఇవ్వండి అని కోరాను' అని చెప్పారు.

చంద్రబాబు రాకకు గుడివాడ సిద్ధం

గుడివాడ, జనవరి 16: టీడీపీ అధినేత చంద్రబాబు గురువారం నిర్వహించనున్న 'రా కదలిరా' కార్యక్రమానికి గుడివాడ వేదిక సిద్ధమవుతోంది. 28 ఎకరాలను రైతులు స్వచ్ఛందంగా యిచ్చారు. కృష్ణాజిల్లా, గుడివాడ మండలం మల్లాయిపాలెంలో అలంకృత ఫంక్షన్ హాల్ ఎదురుగా పొలాల్లో నిర్వహించే బహిరంగ సభకు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. సుమారు 2 లక్షల కార్యకర్తలు, అభిమానులు తరలిరానున్నట్టు అంచనా.

ఐఐటీ ఖరగ్‌పూర్‌లో లా ప్రోగ్రామ్‌లు



ఖరగ్‌పూర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ కేజీపీ) ఆధ్వర్యంలోని రాజీవ్ గాంధీ స్కూల్ ఆఫ్ ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ లా - ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

ఎల్ఎల్‌బీ: ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఇందులో ఆరు సెమిస్టర్లు ఉంటాయి. ఇది ఫుల్ టైం రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. దీనిని సైన్స్, టెక్నాలజీ విభాగాల అభ్యర్థులకు ప్రత్యేకించారు.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఇంజనీరింగ్/టెక్నాలజీ/మెడిసిన్ విభాగాల్లో డిగ్రీ ఉత్తీర్ణులు; సైన్స్, ఫార్మసీ విభాగాల్లో పీజీ పూర్తిచేసినవారు; వీటిలో ఒక డిగ్రీతోపాటు ఎంబీఏ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రథమ శ్రేణి మార్కులు తప్పనిసరి.

సీబీటీ వివరాలు: ఇందులో రెండు పార్ట్‌లు ఉంటాయి. మొదటి పార్ట్ 36 మార్కులకు ఉంటుంది. ఇందులో మేథ్స్ ఆప్టిట్యూడ్ నుంచి 8, సైన్స్ ఆప్టిట్యూడ్ నుంచి 10 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. రెండో పార్ట్ 164 మార్కులకు ఉంటుంది. ఇందులో ఇంగ్లీష్ నుంచి 35, లాజికల్ రీజనింగ్ నుంచి 12, లీగల్ ఆప్టిట్యూడ్ నుంచి 35 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు రెండు మార్కులు కేటాయించారు. నెగెటివ్ మార్కులు లేవు. పరీక్ష సమయం రెండు గంటలు.

ఎల్ఎల్ఎం: ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి.

స్పెషలైజేషన్‌లు: ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ లా, ఇంటర్నేషనల్ లా, క్రిమినల్ లా

సీట్లు: ఒక్కో స్పెషలైజేషన్‌లో 20 సీట్లు ఉన్నాయి.

అర్హత: కనీసం 60 శాతం మార్కులతో అయిదేళ్ల ఎల్ఎల్‌బీ/బీఎల్ ప్రోగ్రామ్ ఉత్తీర్ణులు; హ్యూమానిటీస్, సైన్స్, కామర్స్ విభాగాల్లో డిగ్రీతోపాటు మూడేళ్ల ఎల్ఎల్‌బీ/బీఎల్ పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. సంస్థ అందిస్తున్న ఎల్ఎల్‌బీ ఆనర్స్(ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ లా) ప్రోగ్రామ్‌ను కనీసం 8.5 సీజీపీఏతో పూర్తిచేసినవారికి నేరుగా ప్రవేశం కల్పిస్తారు.

సీబీటీ వివరాలు: బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిర్దేశించిన ఎల్ఎల్‌బీ సిలబస్ నుంచి 120 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. నెగెటివ్ మార్కులు లేవు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.3,000; మహిళలు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జనవరి 31
- **అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** ఫిబ్రవరి 17 నుంచి
- **తెలుగు రాష్ట్రాల అభ్యర్థులకు పరీక్ష కేంద్రం:** వరంగల్
- **సీబీటీ తేదీ:** మార్చి 17
- **వెబ్‌సైట్:** iitkgp.ac.in

ఐఐఎం బోధ్‌గయలో డాక్టోరల్ ప్రోగ్రామ్

బోధ్‌గయలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం) - డాక్టోరల్ (పీహెచ్‌డీ) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది ఫుల్ టైం రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. కోర్సు వ్యవధి నాలుగేళ్లు. అకడమిక్ ప్రతిభ, జాతీయ పరీక్ష స్కోర్, ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.



స్పెషలైజేషన్‌లు: మార్కెటింగ్, ఎకనామిక్స్, ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్, స్ట్రాటజీ అండ్ ఆంత్రప్రెన్యూర్‌షిప్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సిస్టమ్స్ అండ్ అనలిటిక్స్, ఆర్గనైజేషనల్ బిహేవియర్ అండ్ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్ అండ్ క్వాంటిటేటివ్ టెక్నిక్స్, హ్యూమానిటీస్ అండ్ లిబరల్ ఆర్ట్స్(బిజినెస్ కమ్యూనికేషన్)

అర్హత: ప్రథమ శ్రేణి మార్కులతో మాస్టర్స్ డిగ్రీ లేదా అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసినవారు; సీఏ/ఐసీడబ్ల్యుఏఐ/సీఎస్ ఉత్తీర్ణులు; కనీసం 65 శాతం మార్కులతో బీఈ/బీటెక్/బీఆర్క్ పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమవుతూ 2024 జూన్ 30 నాటికి పై కోర్సులు పూర్తయ్యే అభ్యర్థులు కూడా అర్హులే. క్యాట్ 2021/2022/2023 లేదా జీఆర్ఈ/జీమ్యాట్/గేట్ వ్యాలిడ్ స్కోర్ లేదా జేఆర్ఎఫ్(యూజీసీ/సీఎస్ఐఆర్) అర్హత ఉండాలి. ఐఐఎంల నుంచి రెండేళ్ల ఫుల్ టైం పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్(పీజీపీ) ఉత్తీర్ణులకు ఈ స్కోర్ అవసరం లేదు. వీరికి నేరుగా అడ్మిషన్ ఇస్తారు. అభ్యర్థుల వయసు 2024 జూన్ 1 నాటికి 40 ఏళ్లు మించకూడదు.

వెయిటేజీ: క్యాట్, జీమ్యాట్ పరీక్షల్లో ఓవరాల్‌గా 80 శాతం, సెక్షనల్‌గా 70 శాతం స్కోర్ ఉండాలి. జీఆర్ఈలో సెక్షనల్‌గా 70 శాతం స్కోర్ ఉండాలి. జేఆర్ఎఫ్, గేట్ అర్హత పొందితే చాలు. పర్సనల్ ఇంటర్వ్యూలో సాధించిన మార్కులకు 60 శాతం; అనుభవానికి 15 శాతం; పదోతరగతి, ఇంటర్ మార్కులకు ఒక్కోదానికి 5 శాతం; డిగ్రీ మార్కులకు 10 శాతం(బీఈ/ బీటెక్ మార్కులకు 15 శాతం); పీజీ మార్కులకు 5 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ఫైనాన్షియల్ అసిస్టెన్స్: కాంప్రహెన్సివ్ ఎగ్జామ్ వరకు నెలకు రూ.32,800; ఆ తరవాత నెలకు రూ.35,400; థీసిస్ పేపర్ అప్రూవ్ అయిన తరవాత నెలకు రూ.39,300ల స్టయిపెండ్ ఇస్తారు. కంటింజెన్సీ గ్రాంట్ కింద ఏడాదికి రూ.25,000; లాప్‌టాప్ గ్రాంట్ కింద రూ.50,000; కాన్ఫరెన్స్ గ్రాంట్ కింద రూ.1,75,000 చెల్లిస్తారు.

ముఖ్యసమాచారం

- **దరఖాస్తుకు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.500; మహిళలు, దివ్యాంగులు, ఈడబ్ల్యుఎస్, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.250
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 29
- **వెబ్‌సైట్:** iimbg.ac.in

లిటిల్స్



పిల్లి మెడకు గంట కట్టేదెవరూ?


ఒక ఊరిలో నక్షత్రకుడు అనే వ్యాపారి ఉండేవాడు. అతను పట్టిందే బంగారం. ఏ వ్యాపారం చేసినా కలిసొచ్చేది. కిరాణా సామాన్లకు సంబంధించిన వ్యాపారాలు చేసి ధనం గడించాడు. అతనికి తీపి పదార్థాలుండే దుకాణం పెట్టాలని ఎప్పటినుంచో కోరిక ఉండేది. తన వృద్ధాప్యంలో తీపి పదార్థాల దుకాణం పెట్టాడు. ఆ వ్యాపారం బాగా సాగుతోంది. ముఖ్యంగా నేతి మిఠాయిలు, నేతి లడ్డూలు.. లాంటి తీపి పదార్థాలకు ఆ దుకాణం పేరుగాంచింది.

ఒక రోజు దుకాణం మూసేసేటప్పుడు ఎలుకల చప్పుడు వినిపించింది వ్యాపారికి. పెద్దగా పట్టించుకోలేదు. ఆ తర్వాత నాలుగైదు రోజులకు ఎలుకల గుంపు ఎక్కువయి కొట్టులో ఉండే తిండిని అంతా పాడుచేస్తున్నాయి. ఏమి చేయాలో పాలు పోక ఆ వ్యాపారి తన మిత్రుడికి మొరపెట్టుకున్నాడు. 'పిల్లి తీసుకువస్తే సరి' అన్నాడు తన మిత్రుడు. ఓ గండు పిల్లిని తీసుకొచ్చాడు వ్యాపారి. ఆ పిల్లి అరుపులతో ఎలుకలు కనపడకుండా పోయాయి.


ఆ తర్వాత ఎలుకలను చంపి పడేసేది పిల్లి. చూస్తుండగానే ఎలుకలన్నీ దాదాపు కనుమరుగయ్యాయి. ఎక్కడ ఉన్నా ఎలుకను పట్టుకునేది పిల్లి. బయటికి రాలేక ఆకలితో లోపలే ఉండిపోయేవి. బయటికి వస్తే మాత్రం ప్రాణాలు పోగొట్టుకునేవి. ఇక చావు తప్పదా? అంటూ కొన్ని ఎలుకలు సమావేశాన్ని ఏర్పాటు చేసుకున్నాయి. ఎవరి బాధ వారిది. ఆ పిల్లిని తరిమి కొట్టాలి లేదా అది వస్తోందని మనకు ముందే తెలియాలి.. మార్గం ఉంటే చెప్పమని మాట్లాడుకున్నాయి. వాటిలో ముసలి ఎలుక వచ్చి ఇలా అన్నది.. 'ఆ పిల్లి భయపడదు. దాన్ని గెంటేయలేం. అయితే దాని రాకను పసిగట్టొచ్చు. మాయదారి పీడనుంచి మనం రక్షించుకోవచ్చు' అన్నది. 'ఏమి చేయాలని?' ఉత్సాహంతో అడిగాయి ఎలుకలు. 'ఆ పిల్లి మెడకు గంట కడితే సరి. అది వచ్చేప్పుడు శబ్దం వినపడుతుంది' అన్నది పెద్ద ఎలుక. అంతలో పిల్లి వచ్చింది. ముసలి ఎలుక వేగంగా వెళ్లి బొరియలో దాక్కుంది. మిగతా ఎలుకలూ మాయమయ్యాయి. పిల్లి మెడకు గంట కట్టాలనే ఆలోచన ఉన్నా.. ఎవరూ ముందుకు రాలేదు. అలా ఆ కొట్టులో ఎలుకల జాడ మాయమైంది.




దారి కనుక్కోండి



10 తేడాలు గుర్తించండి



చుక్కలు కలపండి



సరైన నీడ ఏది?



డైలీ సుడోకు - 205

					1		3	
	5	4	3		2			
			5	7		2	4	
				9				5
8								4
2				8				
	4	7		1	3			
			4		6	8	7	
	3		7					

సుడోకు - 204 సమాధానం


8	9	4	2	1	3	6	5	7
5	2	3	7	9	6	1	4	8
7	6	1	8	4	5	2	3	9
4	7	5	1	2	9	3	8	6
9	1	8	6	3	4	7	2	5
2	3	6	5	8	7	9	1	4
3	5	7	4	6	1	8	9	2
6	8	9	3	5	2	4	7	1
1	4	2	9	7	8	5	6	3

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.

భారత రాజ్యాంగం - ముఖ్య చట్టాలు

పోటీ పరీక్షల ప్రత్యేకం

ఇండియన్ పాలిటీ



పోటీ పరీక్షలు రాసే అభ్యర్థులు 'భారత రాజ్యాంగ చారిత్రక నేపథ్యం', 'రాజ్యాంగ పరిషత్' అంశాలను చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. తొలుత రాజ్యాంగంలోని అన్ని అంశాలను అర్థం చేసుకోవాలి. ఆ తరవాత భారత రాజ్యాంగ చారిత్రక నేపథ్యం, రాజ్యాంగ పరిషత్ అనే అంశాలను ప్రత్యేకంగా అధ్యయనం చేయాలి.

1858 చట్టానికి పూర్వం భారతదేశంలో బ్రిటిష్ ప్రతినిధిని గవర్నర్ జనరల్ అని పిలిచేవారు(బ్రిటిష్ ఇండియాలో). 1858 చట్టం తరవాత వైశ్రాయ్ అనే పదం వ్యవహారంలోకి వచ్చింది. కానీ వ్యవహారికంలో బ్రిటిష్ ప్రతినిధిని బ్రిటిష్ పాలిత రాష్ట్రాల్లో గవర్నర్ జనరల్‌గా, స్వదేశీ సంస్థానాల్లో వైశ్రాయ్‌గా పిలిచేవారు. 1858 చట్టం ఫలితంగా, 1784 చట్టం ద్వారా ప్రవేశపెట్టిన బోర్డ్ ఆఫ్ కంట్రోల్, కోర్ట్ ఆఫ్ డైరెక్టర్స్ అనే పదవులు రద్దయ్యాయి. 1858 భారత ప్రభుత్వ చట్టంతోనే భారత రాజ్యాంగ చరిత్ర ప్రారంభమైందని రాజ్యాంగ విశ్లేషకుడు డి.డి.బసు పేర్కొన్నాడు.

కౌన్సిల్ చట్టం-1861: ఈ చట్టం ద్వారా వికేంద్రీకృత పాలనను తిరిగి పునరుద్ధరించినట్లయింది. 1773 చట్టం ద్వారా రద్దు చేసిన బొంబే, మద్రాస్ శాసనాధికారాలను పునరుద్ధరించారు. కొత్తగా పంజాబ్, బెంగాల్ నార్త్ ఈస్టర్న్ ఫ్రాంటెయిర్‌ల్లో నూతన లెజిస్లేటివ్ కౌన్సిల్‌ను ఏర్పాటుచేశారు.

- భారతదేశంలో మొదటిసారిగా బ్రిటిష్ పాలిత రాష్ట్రాల్లో 'శాసన మండళ్లు' ఏర్పాటుచేశారు. రాజ్యాంగ నిర్మాణంలో భారతీయ రాజులకు, జమీందారులకు అవకాశాన్ని కల్పించారు.
- పోర్టుఫోలియో విధానాన్ని మొదటిసారిగా 1859లో ప్రవేశపెట్టారు. ఈ చట్టం ద్వారా 1862లో కలకత్తా, బొంబే, మద్రాస్‌ల్లో మొదటగా హైకోర్టులను ఏర్పాటు చేశారు. గవర్నర్ జనరల్‌కు ఆర్డినెన్స్‌లను జారీచేసే అధికారాన్ని కల్పించారు. కేంద్ర లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో మొదటిసారిగా భారతీయులకు ప్రాతినిధ్యాన్ని కల్పించారు. అలా ప్రాతినిధ్యం పొందివారు 1. నాగేంద్రసింగ్(పాటియాలా మహారాజు) 2. నారాయణ్‌సింగ్(బెనారస్ మహారాజు) 3. సర్ దినకర్‌రావు.

కౌన్సిల్ చట్టం-1892: 1885లో భారత జాతీయ కాంగ్రెస్ ఏర్పాటవడం, ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న వివిధ స్వాతంత్ర్య ఉద్యమాలపై భారతీయులు అవగాహన పెంపొందించుకోవడం, బ్రిటిష్ పాలనలో లోపాలను అవగాహన గల భారతీయులు సమాజంలో ప్రచారం చేయడం ఫలితంగా ఈ చట్టాన్ని రూపొందించారు.

- దేశంలో శాసనమండలికి తొలిసారి పరోక్ష ఎన్నికలు జరిగాయి. ఈ చట్టం ద్వారా కేంద్ర శాసనసభలో భారతీయుల ప్రాతినిధ్యాన్ని ఆరుగురికి పెంచారు. ఈ చట్టం ద్వారా శాసనసభలో సభ్యత్వాన్ని పొందినవారు- 1) సురేంద్రనాథ్ బెనర్జీ 2) గోపాలకృష్ణ గోఖలే 3) దాదాబాయ్ నౌరోజీ 4) రాస్ బిహారి ఘోష్ 5) బిల్‌గ్రామి 6) ఫిరోజ్ షా మెహతా

మింటో మార్లే సంస్కరణలు-1909: వైశ్రాయ్‌గా మింటో, రాజ్య కార్యదర్శిగా మార్లే ఉన్నారు. ముస్లింలకు ప్రత్యేక నియోజకవర్గాలు ఏర్పాటు చేశారు. ప్రత్యక్ష ఎన్నికల విధానాన్ని పరిమిత ప్రాతిపదికన ప్రవేశపెట్టారు. అలాగే కేంద్ర శాసనశాఖ సభ్యుల సంఖ్యను 60 మందికి పెంచారు.

- వ్యాపారులకు ప్రత్యేక నియోజకవర్గాలను కేటాయించారు. విద్య, సంపద, పన్ను చెల్లింపుల ఆధారంగా పరిమిత ఓటుహక్కును కల్పించారు. కేంద్ర శాసనశాఖ దేశ బడ్జెట్‌ను చర్చించవచ్చు. అదేవిధంగా గవర్నర్ జనరల్ కమిటీలో ఎంపికకు భారతీయులకు అవకాశాన్ని కల్పించారు. కేంద్ర శాసనసభలో బడ్జెట్‌తో సహా అన్ని అంశాలపై ప్రశ్నించే అవకాశాన్ని, తీర్మానాలు ప్రవేశపెట్టే అవకాశాలను కల్పించారు.

గమనిక: 1) గవర్నర్ జనరల్ కమిటీకి నియమితులైన మొదటి భారతీయుడు సత్యేంద్రసిన్హా.
2) మింటోను మత నియోజకవర్గాల పితామహుడిగా పిలుస్తారు.
3) ఈ చట్టమే దేశం ఇండియా-పాకిస్థాన్‌లుగా విడిపోవడానికి కారణమని విశ్లేషకుల అభిప్రాయం.

మాంటేగ్-ఛేమ్స్‌ఫర్డ్ చట్టం-1919: ఈ చట్టం ద్వారా భారతదేశంలో పార్లమెంటరీ తరహా విధానాన్ని ఏర్పాటుచేశారు.(బాధ్యతాయుత ప్రభుత్వం). అప్పటికీ బ్రిటిష్ ఇండియాలో ప్రావిన్స్‌లు(రాష్ట్రాలు) ఉండటం వల్ల కేంద్ర జాబితా, రాష్ట్ర జాబితాలు రూపొందించారు. కేంద్ర జాబితా 47, రాష్ట్ర జాబితా 51 పాలనా అంశాలుండేవి. వైశ్రాయ్‌గా ఛేమ్స్‌ఫర్డ్, రాజ్య కార్యదర్శిగా మాంటెగ్ వ్యవహరించారు.

- భారత హైకమిషనరేట్‌ను ఏర్పాటు చేశారు. దీని కార్యాలయం లండన్‌లో ఉంది.
- బాధ్యతాయుత ప్రభుత్వాన్ని ఏర్పాటుచేశారు. రాష్ట్రాల్లో ద్వంద్వపాలనా విధానాన్ని ప్రవేశపెట్టారు. (ద్వంద్వ పాలనకు విలియం డ్యూక్ పునాది వేశారు).
- ద్వంద్వపాలన అంటే కొన్ని పాలనా అంశాలు(కీలకమైనవి) బ్రిటిష్‌వారి ఆధీనంలో పెట్టుకొని, మరికొన్ని అంశాలను భారతీయులకు అప్పగించడం.

1. రిజర్వ్‌డ్ అంశాలు: దీనిలో 28 పాలనాంశాలు ఉంటాయి. ఉదాహరణకు భూమి శిస్తు, ఆర్థిక, న్యాయ, జైళ్లు, నీటిపారుదల మొదలైనవి.

2. ట్రాన్స్‌ఫర్డ్ అంశాలు: దీలో 22 పాలనాంశాలుంటాయి. ఉదాహరణకు విద్య, వైద్యం, ప్రజారోగ్యం, వ్యవసాయం, స్థానిక సంస్థలు, రోడ్డు రవాణ కేంద్రంలో ద్విసభా విధానాన్ని ప్రవేశపెట్టారు.

1. కౌన్సిల్ ఆఫ్ స్టేట్స్: ఇది ఎగువ సభ. దీనిలో 60 మంది సభ్యులుంటారు.(ఎన్నికైనవారు 36 మంది, నామినేటెడ్ 24 మంది). సభ పదవీకాలం అయిదు సంవత్సరాలు. దీని తొలి ఛైర్మన్ ఫెడరిక్ వైట్.

2. లెజిస్లేటివ్ అసెంబ్లీ: ఇది దిగువసభ. దీనిలో సభ్యులు 144 మంది ఉంటారు. (ఎన్నికైనవారు 103, నామినేటెడ్ 41). సభ పదవీకాలం మూడు సంవత్సరాలు. దీనికి తొలి అధ్యక్షునిగా విఠల్‌బాయ్ జె.పటేల్, తొలి ఉపాధ్యక్షునిగా సచ్చిదానంద సిన్హా ఉన్నారు.

- సిక్కులకు, భారతీయ క్రైస్తవులకు, ఆంగ్లో-ఇండియన్లకు, యురోపియన్లకు ప్రత్యేక నియోజకవర్గాలను ఏర్పాటుచేశారు. లీ కమిషన్(1923-24) ఆధారంగా 1926లో పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఏర్పాటు చేశారు. దీనికి తొలి ఛైర్మన్‌గా రాస్ బార్కర్.
- కేంద్ర బడ్జెట్ నుంచి రాష్ట్ర బడ్జెట్‌ను వేరుచేశారు. 1921లో ప్రభుత్వ ఖాతాల సంఘాన్ని ఏర్పాటుచేశారు. అలాగే సాధారణ బడ్జెట్ నుంచి రైల్వే బడ్జెట్‌ను వేరు చేశారు. ఆడిటర్ జనరల్‌ను కూడా ఏర్పాటుచేశారు.
- గవర్నర్ జనరల్ కమిటీలోని ఆరుగురు సభ్యులకుగాను ముగ్గురు భారతీయులకు స్థానం లభించింది. ఈ చట్టాన్ని పది సంవత్సరాల తరవాత సమీక్షించడానికి ఒక కమిటీని ఏర్పాటు చేయాలని తీర్మానించారు. 1921 నుంచి ఈ చట్టాన్ని అమలుపరిచారు.

విమర్శ: జాతీయోద్యమ నాయకులు ఈ చట్టాన్ని కిందివిధంగా విమర్శించారు.

1. మాంటెంగ్-ఛేమ్స్‌ఫర్డ్ సంస్కరణలు 'బ్రిటిష్ ప్రభుత్వం ప్రకటించాల్సింది కాదు, భారతీయులు స్వీకరించడం సరికాదు' - **అనిబిసెంట్**
2. ఈ సంస్కరణలు భారతీయులకు నిరాశను కల్గించడమే కాక, అసంతృప్తినీ మిగిల్చాయి. సూర్యుడు లేని ఉదయం లాంటివి - **బాలగంగాధర్ తిలక్.**
3. 'నేరమే అధికారమై నేరం చేస్తుంటే చూస్తూ ఊరుకున్న ప్రతి ఒక్కడూ నేరస్థుడే'. - **మహాత్మా గాంధీ**



వి.చైతన్యదేవ్,
పోటీ పరీక్షల నిపుణులు

JN Tata Endowment Loan Scholarship for Fall 2024 to Spring 2025

Description: The J N Tata Endowment invites loan scholarship applications from Indian students who wish to pursue higher studies overseas. Students who are selected for the loan scholarship may be recommended for a partial 'Travel Grant' and a 'Gift Award' which is linked to their academic performance in their overseas studies at the sole discretion of the Trustees of the concerned Trusts.

Eligibility: Open for Indian citizens who have completed at least one undergraduate degree OR students who are in the final year of any undergraduate programme at a recognised university/ college/ institution in India.

- Candidates must be interested to pursue Postgraduate/ Doctoral/ Postdoctoral studies abroad.
- Candidates who are at the end of the 1st year and entering into the second year of their overseas studies (Fall 2024 – Spring 2025) are also eligible to apply. This is applicable only if the minimum duration of the course is 2 years and there is at least one full academic year remaining to complete at the time of award of the loan scholarship, which is normally by July of any calendar year.
- Candidates must have scored at least 60% marks on average in their undergraduate or postgraduate studies.
- Candidates must not be older than 45 years as on June 30, 2024.

Prizes & Rewards: Loan scholarship of up to Rs. 10 lakhs


Last Date to Apply: 15-03-2024 ***Application:*** Online only

Short Url: www.b4s.in/aj/JNT8

SCHOLARSHIP ALERT

V Able - Vidyadhan Disability Scholarship for Graduates

Description: V Able - Vidyadhan Disability Scholarship for Graduates 2023-24 is an opportunity offered by the Sarojini Damodaran Foundation (SDF), a non-profit organisation based in India, to Class 12 passed students facing disability.



Eligibility: Open for disabled students who have completed Class 12 and enrolled in a degree course in the year 2022, with at least 60% marks or a CGPA of 6 in their HSC examination. Students' annual family income must be below 4,00,000.

Prizes & Rewards: Up to 60,000 per annum

Last Date to Apply: 31-01-2024

Application: Online only

Short Url: www.b4s.in/aj/VVDS2

Tata Innovation Fellowship 2023-24

Description: Tata Innovation Fellowship 2023-24 is an opportunity offered by the Department of Biotechnology, Ministry of Science & Technology, Government of India, to recognise and reward scientists in the fields of Biology and Biotechnology.

Eligibility: Open for Indian nationals under 55 years of age with a Ph.D. degree in Life Sciences, Agriculture, Veterinary Science, or a Master's degree in Medical Sciences, Engineering, or a closely related field.

- Applicants must have at least 5 years of postdoctoral research experience at a renowned national lab, university, or institute.
- Students should demonstrate an exceptional record of publications in peer-reviewed journals.
- Candidates must have made significant contributions to developing technologies or products.

Prizes & Rewards: A monthly fellowship of 25,000 and an annual contingency grant.

Last Date to Apply: 05-02-2024

Application mode : Online only

Short Url: www.b4s.in/aj/TIF1

buddy4study.com